ముహూర్తం

శ్రీ విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, చైత్ర మాసం, తిథి: శుద్ధ తదియ సా 5.06 వరకు అనంతరం చవితి; నక్షత్రం: అశ్వని రా. 8.09 వరకు, అనంతరం భరణి; అమృతకాలం: మ. 1.00 నుండి 2.35 వరకు; వర్జ్యం: సా. 4.12 నుండి 5.47 వరకు; దుర్ముహూర్తం: ఉ. 8.24 నుండి 9.12 వరకు, రా. 10.48 నుండి 11.36 వరకు; రాహుకాలం: మ. 3.00 నుండి 4.30 వరకు; యమగండం: ఉ. 9.00 నుండి 10.30 వరకు;

Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

సంపుటి:56 • సంచిక: 338 • మంగళవారం 20 మార్చి 2018 • హైదరాబాద్ ✻ పేజీలు:12+4 • వెల: 5.00 • Published from:Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad



నాలుగో కేసులోనూ

లాలూ దోషే

మరో 18మంది అదే బాటలో

జగన్నాథ్ మిశ్రా నిర్దోషి

21న సీబీఐ కోర్టు శిక్ష ఖరారు

10 లో



అరవింద్ కేజ్రీవాల్

మళ్లీ సారీ..!

33 కేసులు... మూడు సారీలు

తాజాగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి, అమిత్ సిబల్‌కు క్షమాపణలు

11



శ్రీమాన్ నరేంద్ర మోడీజీ

2 కోట్ల ఉద్యోగాలేవి?

అచ్చేదిన్ ఏవీ.. ఎక్కడ?

ప్రపంచమంతా కోడై కూసినా

మోడీ నసేమిరా: రాహుల్

10 లో

తొలి అడుగు



కోల్‌కతాలో మమతా బెనర్జీతో సీఎం కేసీఆర్, ఎంపీ కవిత

మాది పార్టీల ఫ్రంట్ కాదు.. ప్రజాఫ్రంట్

మున్ముందు మాదే అతిపెద్ద కూటమి

ప్రత్యామ్నాయానికై దేశం ఎదురుచూస్తోంది

భావసారూప్యత ఉన్న అన్ని పార్టీలను కలుపుకుని వెళతాం. ఫెడరల్ ఫ్రంట్ కోసం సకల యత్నాలు చేస్తాం. దేశానికి ప్రస్తుత తరుణంలో ఈ ఫ్రంట్ ఎంతైనా అవసరం. వివిధ పార్టీల నాయకులతో సంప్రదింపులు జరుపుతాం. చాలామంది మాతో చేతులు కలుపుతారు. ఇది రొటీన్ ఫ్రంట్ కాదు. భిన్నమైన మోడల్ ఫ్రంట్.

– కోల్‌కతలో మమతతో చర్చల తర్వాత సీఎం కేసీఆర్



కేసీఆర్-మమత ముఖాముఖి చర్చలు

కేసీఆర్‌తో ఏకీభవిస్తున్నా

త్వరలో మిగతా పార్టీలతో చర్చిస్తాం

మమతా బెనర్జీ వెల్లడి

టెన్త్ ఇంగ్లీష్ పేపర్-1 లీక్..!

లీక్ కాలేదు.. గంట తర్వాత ప్రశ్నాపత్రం బయటికొచ్చిందన్న కమిషనర్ కిషన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో సోమవారం జరిగిన ఎస్ఎస్‌సి ఇంగ్లీష్ పేపర్-1 ప్రశ్నాపత్రం లీకైంది. పరీక్ష ఉదయం 9.30 గంటలకు ప్రారంభం కాగా 10.30 గంటలకే ప్రశ్నాపత్రం సోషల్ మీడియా అయిన వాట్సాప్‌లో ప్రత్యక్షమైంది. ప్రశ్నాపత్రం రెండు జిల్లాల్లో లీకైంది. ఆదిలాబాద్ జిల్లాతోపాటు, మహాబూబ్ నగర్ జిల్లాలో కూడా లీకైంది. ఇందులో ఆదిలాబాద్ జిల్లా తాడిహదపనూర్‌లోని జడ్‌పిఎస్ఎస్ స్కూల్‌లో అయితే ఇన్విజిలేటరే ప్రశ్నాపత్రాన్ని స్వయంగా ఫోటో తీసి పంపించిన ఫోటోలు బయటికి వచ్చాయి. మరో ఘటనలో మహబూబ్ నగర్ జిల్లా మరికల్‌లోని జిల్లా పరిషత్ బాలికల ➪ 9వ పేజీలో...



కల్యాణ లక్ష్మి సాయాన్ని పెంచినందుకు సీఎం కేసీఆర్‌కు మహిళా సభ్యుల అభినందనలు

కల్యాణలక్ష్మీ వర్ధిల్లు!

రూ. 1,00,116

కల్యాణలక్ష్మి.. షాదీ ముబారక్ ఆర్థిక సాయం పెంపు

అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ప్రకటన

2 లో

మాది సమష్టి సారథ్యం

కోల్‌కత, ఆంధ్రప్రభ: మాది పార్టీల ఫ్రంట్ కాదు.. ప్రజల ఫ్రంట్. దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పు తీసుకొచ్చేందుకు ఇది తొలి అడుగు.. అని టిఆర్ఎస్ అధినేత, తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు అన్నారు. సోమవారం పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీని కలిసిన కెసిఆర్ ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుపై రెండుగంటలకు పైగా చర్చించారు. అనంతరం మమతాబెనర్జీతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఫెడరల్ ఫ్రంట్ కోసం భావసారూప్యత ఉన్న అన్నిపార్టీలను కలుపుకుని వెళ్తాం. దేశానికి ఫెడరల్ ఫ్రంట్ అవసరం ఎంతైనా ఉంది. ఆ దిశగానే అందరినీ ఒక్కతాటిపైకి తెచ్చే యత్నాలు ప్రారంభించాం. ఇది ఆరంభమే. ముందుముందు భావసారూప్యం గల మరిన్ని పార్టీలను, నాయకులను సంప్రదిస్తాం అని కెసిఆర్ ప్రకటించారు. 70ఏళ్ళ కాంగ్రెస్, బిజెపి పాలనలో ఏం జరిగిందో అందరికీ తెలుసు. దేశంలో ఎన్ని సహజవనరులున్నా ప్రజలకు జరిగింది శూన్యం. అందుకే ఈ రెండు పార్టీలకు భిన్నంగా ప్రజలు ప్రత్యామ్నాయం కోరుకుంటున్నారు. చైనాలాంటి దేశాలతో మనం ఎందుకు పోటీపడలేకపోతున్నాం. సిలికాన్ వ్యాలీలో 60శాతంకు పైగా భారతీయులే ఉన్నారు. దేశ యువతలో ఎంతో ప్రతిభదాగుంది.. దానిని వినియోగించుకోకపోవడం వల్లే మేధోవలస జరుగుతోంది అని అన్నారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలోనే తమ ఫ్రంట్ ఆలోచన పుట్టుకొచ్చిందని, ఇందుకు సంబంధించి మరికొందరితో చర్చించాల్సి ఉందన్నారు. చాలా మంది మిత్రులు తమతో కలిసి వస్తారని ఆశిస్తున్నామని చెప్పారు. తమది రొటీన్ ఫ్రంట్ కాదని.. భిన్నమైన మోడల్ ఫ్రంట్ అని.. ప్రజల అవసరాలే తమ అజెండాగా ఉంటుందన్నారు. దేశ రాజకీయాల్లో మార్పు విషయంలో ఈ భేటీ తొలి అడుగుమాత్రమేనని.. 2019ఎన్నికలకు ముందు ఫెడరల్ ఫ్రంట్ రావాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నారన్నారు. ఏదో కొద్దిపార్టీల కూటమిగా ఇది ఉండదని, ప్రజల కోసమే ఏర్పాటు చేస్తున్న ఫ్రంట్ ఇదన్నారు. భవిష్యత్తులో తమదే అతిపెద్ద కూటమిగా అవతరించబోతోందని ధీమా వ్యక్తం చేశారు.

పరిస్థితులను బట్టి నాయకులు పుట్టుకొస్తారని, ఫెడరల్ ఫ్రంట్‌కు నాయకత్వం అనేది సమస్యకాదని ఈ సందర్భంగా కెసిఆర్ చెప్పారు. ఫెడరల్ ఫ్రంట్‌కు సమిష్టినాయకత్వం ➪ 3వ పేజీలో...



సోమవారం లోక్‌సభ స్పీకర్ సీటు దగ్గర పరిస్థితి ఇది...

లోక్‌సభలో మళ్లీ అదే సీన్

అవిశ్వాసం గాలికి

అవిశ్వాసంపై చర్చకు మేం సిద్ధం: హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ • తీర్మానానికి మద్దతుగా నిలిచిన కాంగ్రెస్, టీఎంసీ, వామపక్షాలు • మళ్లీ నోటీసిచ్చిన వైకాపా

వివరాలు 11లో...



దూకుడు పెంచిన తెరాస

• పార్లమెంట్ ప్రధాన ద్వారం వద్ద ఎంపీల ఆందోళన • మా అజెండా మాది.. మా పోరాటం మాది: జితేందర్

కోమటిరెడ్డి, సంపత్‌లకు హైకోర్టులో ఊరట

6వారాల పాటు ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వరాదు

కేంద్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశం

వీడియో ఫుటేజీ సమర్పించండి

తెలంగాణ సర్కారుకు హైకోర్టు స్పష్టీకరణ

8 లో

పెట్టుబడికి పట్టా చాలు...

వడపోతకు బ్రేక్

నిబంధనలు సరళం చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ సూచన

జిల్లాలకు మార్గదర్శకాల పంపిణీ

ఏప్రిల్ 20 నుంచి చెక్కుల పంపిణీకి రంగం సిద్ధం



రైతులకు పెట్టుబడిసాయంపై సీఎస్ సమీక్షా సమావేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పెట్టుబడి మద్దతు పథకం అర్హులను ఎంపిక చేయడంలో అధికార యంత్రాంగం సూక్ష్మశోధనకు ప్రభుత్వం బ్రేక్ వేసింది. ఈ పథకంలో ప్రోత్సాహకాన్ని అందించడంలో సంకుచితం అవసరం లేదని, రైతు కుటుంబాల పట్ల సానుకూల వైఖరితో ఉండాలన్న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు సూచనల మేరకు ఉన్నతాధికారులు మార్గదర్శకాలు జారీ చేశారు. పట్టాదారు పాస్‌బుక్కు ఉంటే చాలు పంట పెట్టుబడి చెక్కులు ఇవ్వాలన్న విశాల దృక్పదంతో ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా అధికారిక లెక్కల ప్రకారం కోటి 65 లక్షల ఎకరాలకు నిర్ణయించిన ప్రోత్సాహక మొత్తాన్ని అందిస్తున్న నేపథ్యంలో సాగుయోగ్యం కాని భూమి 2 నుంచి 3 లక్షల ఎకరాలు మాత్రమే ఉంటుందని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఇదే విషయాన్ని మంత్రివర్గ ఉపసంఘం కూడా తేల్చి చెప్పింది. ఈ అంశాన్ని స్వయంగా పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి భూ ప్రక్షాళన కార్యక్రమంలో తేల్చిన లెక్కల ప్రకారం పట్టాదారుడైన ప్రతి రైతుకూ ఈ పథకాన్ని వర్తింపజేయాలని నిర్ణయించారు. త్వరలో ప్రారంభమయ్యే ఖరీఫ్ నుంచి ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న "పెట్టుబడి మద్దతు" పథకంపై జిల్లా అధికారులు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. బేరర్ చెక్కుల రూపంలో ఎకరాకు రూ.4వేల చొప్పున ఏప్రిల్ 20 నుంచి పంపిణీ చేసేందుకు వ్యవసాయశాఖ యంత్రాంగం సిద్ధమవుతోంది. ఈ పథకానికి ప్రతిపాదించిన అంచనాల ప్రకారం రూ.6వేల కోట్ల నగదును సమకూర్చుకోవడంలో కొంత ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నప్పటికీ సమస్యను అధిగమిస్తామని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఇందుకు సంబంధించిన నిధులను సమకూర్చుకునేందుకు, ప్రత్యామ్నాయ ➪ 9వ పేజీలో...



చిన్నారులను చిదిమేసిన చెరువు

తీరిన రుణం.. తెగిన బంధం

ఈతకెళ్లి చెరువులో మునిగి నలుగురు విద్యార్థులు మృతి

8 లో

ఔరా..!



టీడీపీ అవినీతిపై కేంద్రం

విచారణ జరపాలి

నేను సొంతదారిలో వెళుతున్నా

చంద్రబాబుకు 2.5 మార్కులు



కేసీఆర్‌కు 6 మార్కులు

నా వెనుక ప్రజలు ఉన్నారు • పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు

3 లో



కమలాన్ని వదిలారు కంగ్రాట్స్

ఏపీ సీఎంకు ముస్లిం నేతల అభినందనలు

పవన్ నాలుగేళ్లు బాగానే ఉండి...

ఇప్పుడీ విమర్శలేమిటి?!

కుట్ర రాజకీయాలొద్దు • రాష్ట్రాన్ని బలహీనపర్చొద్దు

• బీజేపీ నమ్మించి అన్యాయం చేసింది

• నేనెవ్వరికీ భయపడను: చంద్రబాబు

3 లో



అసెంబ్లీ సమావేశాలు



మంత్రులు సభలోనే ఉండాలి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : శాసనమండలికి కేటాయించిన మంత్రులంతా సభ ముగిసేంత వరకు ఇక్కడే ఉండాలని, అలాగే సభ్యుల హాజరు పెరగాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మండలి చైర్మన్ స్వామి గౌడ్ ఆదేశించారు. సోమవారం మండలిలో బడ్జెట్‌పై చర్చ జరుగుతున్న సమయంలో డిప్యూటీ ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, రాష్ట్ర అటవి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగురామన్నలు మాత్రమే సభలో ఉండడం....సభ్యుల హాజరు సంఖ్య కూడా నామమాత్రంగా ఉంది. దీంతో బడ్జెట్‌పై చర్చ ముగియగానే చైర్మన్ స్వామిగౌడ్ మాట్లాడుతూ, మండలికి కేటాయించిన మంత్రులు సాధ్యమైనంత వరకు సభలో ఉండేవిధంగా చూడాలని రాష్ట్ర ప్రభుత్వ విప్‌ను ఆదేశించారు. శాసనసభలో సదరు మంత్రులు సమాధానం చెప్పాల్సి వచ్చినప్పుడు మాత్రమే ఆసభలో ఉండాల ని.తదనంతరం తిరిగి మండలికి వచ్చే విధంగా చూడాలని సూచించారు.

బడ్జెట్ సూపర్

- మైనారిటీలకు ఇంత నిధులు దేశంలో ఎక్కడా కేటాయించలేదు
- ముస్లింలు అండగా ఉంటారు
- బడ్జెట్‌పై చర్చలో అక్బరుద్దీన్ ఓవైసీ

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రాష్ట్ర ప్రభుత్వం 2018 -19కి సంబంధించి రూ. 1,74,454 కోట్ల బడ్జెట్‌ను శాసనసభకు సమర్పించడాన్ని ఎంఐఎం పార్టీ సమర్థించింది. పలు పద్దులకు కేటాయించిన నిధులు సూపర్‌గా ప్రశంసనీయంగా ఉన్నాయని ఎంఐఎం పక్ష నాయకుడు అక్బరుద్దీన్ ఓవైసీ అన్నారు. మైనారిటీలకు కేటాయించిన నిధులు దేశంలో మరే రాష్ట్రంలో కేటాయించలేదని చెప్పారు. ముస్లింలు సీఎం కె చంద్రశేఖరరావుకు అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. శాసనసభలో సోమవారం బడ్జెట్‌పై జరిగిన చర్చలో అక్బరుద్దీన్ ఓవైసీ పాల్గొన్నారు. దాదాపు గంట పాటు ఆయన ప్రసంగించారు. ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు చేపడుతున్న పరిపాలనా సంస్కరణల మూలంగా రాష్ట్ర వృద్ధిరేటు పెరిగిందని, అదే విధంగా ఏపీ వృద్ధి రేటు కూడా ఎక్కువగా నమోదు చేసిందని చెప్పారు. పలు పద్దులకు నిధులు కేటాయింపులు బాగున్నాయని ప్రభుత్వాన్ని ప్రశంసిస్తూనే , మైనారిటీ పద్దులకు గడచిన మూడేళ్లుగా కేటాయింపులు బాగున్నప్పటికీ నిధులు విడుదల సరిగా లేదని మండిపడ్డారు. మైనారిటీ వర్గాలైన ముస్లిం, క్రిస్టియన్, సిక్కుల సంక్షేమానికి 2017-18 బడ్జెట్‌లో రూ. 1249.66 కోట్లు కేటాయించగా,ఈ బడ్జెట్‌లో ఏకంగా రూ.2,000 కోట్లు ప్రతిపాదించడం అభినందనీయమన్నారు. కేటాయింపులతో పాటు నిధులు కూడా విడుదల చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. 2016-17 లో రూ.1204.44 కోట్లు కేటాయించగా, కేవలం రూ. 842.05 కోట్లు మాత్రమే విడుదల చేశారని, ప్రస్తుత బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో కేవలం రూ.819 కోట్లు మాత్రమే విడుదల చేశారని విమర్శించారు. గత బడ్జెట్ కంటె కనీసం ఒక్క రూపాయి అయినా ఎక్కువ నిధులు విడుదల చేయాలని సూచించారు.

ఎస్టీల మధ్య గొడవలను పరిష్కరించండి

ఎస్టీ సామాజిక వర్గాలైన గోండులు, ఎరుకలు, కోయ, లంబాడీల మధ్య ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణ గొడవలు మొదలయ్యాయని, అవి తీవ్ర స్థాయికి చేరకముందే పరిష్కరించాలని అక్బరుద్దీన్ సూచించారు. బ్రాహ్మణ సామాజిక వర్గానికి రూ. 100 కోట్లు కేటాయించడాన్ని సమర్థించారు. అర్చకుల కుటుంబాలను ఆదుకనేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ రూ.1,00,116 భేష్

ఆడబిడ్డల పెళ్లిళ్లకు సంబంధించిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా అందించే మొత్తాన్ని రూ. 1,16,000 లక్షలకు పెంచడాన్ని భేష్ అని అక్బరుద్దీన్ వ్యాఖ్యానించారు. ఈ విషయంలో కేసీఆర్ సాబ్‌కు...బోత్.బోత్ ముబారక్‌దేతాహూ అంటూ వ్యాఖ్యానించారు.

మేము మీ దోస్తులము..

మేము మీ దోస్తులము... మైనారిటీలకు 2017 -19 లో రూ. 1249 .66 కోట్లు కేటాయించి కేవలం రూ. 819 కోట్లు మాత్రమే విడుదల చేయడంపై విమర్శలు వస్తున్నాయని చెప్పారు....మీరు ప్రభుత్వంతో బాగున్నారు కదా .. ప్రతి విషయానికి మద్దతు ఇస్తున్నారు,మరి... నిధులెందుకు విడుదల చేయడం లేదని ప్రజలు తమను ప్రశ్నిస్తున్నారని,ఇంకా చెప్పాలంటే తమకు సిగ్గుగా ఉందని అక్బరుద్దీన్ వ్యాఖ్యానించారు. గత బడ్జెట్ కంటె నిధులు ఎక్కువ కేటాయించి అంత కంటె తక్కువగా విడుదల చేయడం పట్ల ఆయన అభ్యంతరం చెప్పారు. కనీసం రూ. 100 కోట్లయినా విడుదల చేసేందుకు వెంటనే ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ ఆస్తులను పరిరక్షించాలని, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అవసరమైన నిధులు విడుదల చేయాలని కోరారు. మైనారిటీ సంక్షేమ శాఖకు ప్రభుత్వం నిధులు విడుదల చేసినా వాటిని అమలు చేసేందుకు సిబ్బంది లేరని చెప్పారు. ఉర్దూ భాష పరిరక్షణకై చర్యలు చేపడుతామని ప్రకటించినప్పటికీ అమలులో ఎదురవుతు న్నఅవ రోధాలను పరిరక్షించాలని విజ్ఞప్తిచేశారు.



పాత బస్తీకి రూ. 5,000 కోట్ల ప్యాకేజీ

పాతబస్తీ అభివృద్ధికై రూ. 5,000 కోట్ల ప్యాకేజీని ప్రకటించాలని అక్బరుద్దీన్ డిమాండ్ చేశారు. అదే విధంగా పాతబస్తీ నుంచి మహేశ్వరం వరకు ఐటీ లేదా ఫార్మా కారిడార్‌ను ఏర్పాటు చేయాలని దీనివల్ల నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. ఓల్డ్ సిటీలో ఉన్న యునానీ ఆస్పత్రి చస్తోందని బతికించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. చార్మినార్ పరిసర ప్రాంగణం అభివృద్ధిలో భాగంగా వ్యాపారులు దెబ్బతిన్న వారికి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు నిర్వహించాలన్న కేసీఆర్ తపన అభినందనీయమని, అయితే , ఆరోగ్య శ్రీ పథకం ద్వారా లబ్ది పొందుతున్న కార్పోరేట్ ఆస్పత్రులు కూడా ఈ పరీక్షలు నిర్వహించడం బాధ్యతగా ఆదేశాలు జారీ చేయాలన్నారు. 2019 లోగా ఉద్యోగులకు పీఆర్‌సీ మంజూరు చేయాలని కోరారు. కాళేశ్వరం తదితర ప్రాజెక్టుల సత్వర పూర్తికి చేపడుతున్న చర్యలు అభినందనీయమన్నారు.

కళ్యాణలక్ష్మీ వర్ధిల్లు!

రూ.1,00,116



హైదరాబాద్, ఆంధ్రప్రభ : కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ ఆర్థిక సహాయం పెంచారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు శాసనసభలో ప్రకటన చేశారు. ఇక మీదట కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ ఆర్థిక సహాయాన్ని రూ. 1,00,116కు పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి సభ్యుల హర్షధ్వానాల మధ్యన ప్రకటించారు. పథకం ప్రారంభంలో రూ. 51 వేలు, ఆ తర్వాత రూ. 75వేలకు పెంచారు. ఈ పథకం కింద ఇప్పటి వరకు 3 లక్షల 60 వేల మంది లబ్ది పొందారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. పేదరికం మనుషులను అనేక రకాలుగా వేధిస్తుంది. కొన్ని సార్లు సాంప్రదాయాలు కూడా భారంగా పరిణమిస్తున్నాయి. సమాజంలో పెండ్లి అనేది చాలా ఖర్చుతో కూడుకున్న అంశం. అందులో ఆడపిల్ల పెండ్లి మరింత భారంగా పరిణమించింది. ఈ భారం వల్లనే చాలా మంది తల్లిదండ్రులు తమ ఇంటి మహాలక్ష్మిగా గౌరవించేఆడపిల్లని గుండెల మీద కుంపటిగా భావించి మానసికస్థితికి గురవుతున్నారు. పెండ్లి కోసం ఖర్చును ఊహించి భ్రూణహత్యలకు పాల్పడుతున్నారు. పెళ్లిళ్లు కాకుండా చాలా మంది యువతులు అలాగే ఉండిపోతున్నారు. పరిపాలనలో అడుగడుగున మానవీయ విలువలు ప్రతిబింభించాలని భావించి, పేద ఆడపిల్లల పెళ్లికి ఆర్థికంగా అండదండగా నిలవాలని కల్యాణలక్ష్మీ పథకం ప్రవేశపెట్టాం. ఆడపిల్లల కన్నీరు తుడిచి వారి తలపై కల్యాణాక్షతలు చల్లిన ఈ పథకం తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టను పెంచింది. ఈ పథకం వ్యక్తిగతంగా తన హృదయానికి దగ్గరైన పథకం. జనం మెచ్చిన పథకం, ఆడపిల్లల కండ్లల్లో ఆనందం నింపిన పథకం. సామాజిక వర్గంతో నిమిత్తం లేకుండా రాష్ట్రంలోని నిరుపేదలందరికీ వర్తింపచేస్తున్నాము. కల్యాణలక్ష్మి చెక్కులు తీసుకుంటున్న సమయంలో తమకందిన సహాయానికి సంతోషిస్తూ ఆడ పిల్లల తల్లులు ఆనంద భాష్పాలతో ప్రభుత్వాన్ని దీవిస్తున్నారు. పథకం అమలుతో బాల్య వివాహాలు తగ్గాయి. కల్యాణలక్ష్మి సహాయం అందుకున్న వివాహాలకు ప్రభుత్వ గుర్తింపుతో పాటు చట్టబద్ధత లభిస్తుంది.

నీరాపై అధ్యయనం: మంత్రి పద్మారావు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: నీరా ఉత్పత్తి, వినియోగంపైన శ్రీలంక, కాంబోడియాలో అధ్య యనం చేయబోతు న్నామని ఎక్సైజ్ శాఖ మంత్రి పద్మారావుతెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో వి. శ్రీనివాస్ గైడ్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. తెలంగాణలో నీరాకు ఉన్న డిమాండ్ మేరకు వివిధ రాష్ట్రాల నుండి వివరాలను సేకరించడం జరుగుతుందన్నారు. నీరా పరిశ్రమ ఏర్పాటు విధివిధానాలను పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. తాటి, ఈత చెట్ల నుండి ఉత్పత్తి అయ్యే నీరా పురాతన కాలం నుండి ఆరోగ్య ప్రధాయనిగా గుర్తింపు పొందిందని మంత్రి వివరించారు. తెలంగాణలో నీరా పరిశ్రమను ఏర్పాటు చేయడం పైన ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించిందన్నారు. అసెంబ్లీసమావేశాలు ముగిసిన వెంటనే శ్రీలంక, కాంబోడియాలో పర్యటించి పరిశ్రమను పరిశీలించడం జరుగుతుందన్నారు. కల్లు గీత విధానంపై ఇప్పటికే మహారాష్ట్రలో అధ్యయనం నిర్వహించామన్నారు. తాటి, ఈత చెట్లను నరికే వారికి శిక్ష పెంచే అంశం కూడా పరిశీలనలో ఉందన్నారు. హరితహారంలో భాగంగా ఈత చెట్లను నాటుతున్నామని పేర్కొన్నారు. ఐదు కోట్ల ఈత చెట్లను నాటాలనే లక్ష్యంతో కార్యాచరణ అమలవుతుందని వివరించారు.

వ్యవసాయానికి 12 గంటల విద్యుత్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : వ్యవసాయానికి 12 గంటల విద్యుత్ సరిపోతుందని తెరాస సభ్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం 24 గంటల విద్యుత్ సరఫరాను అమలు జరుపుతున్నందుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. శాసనసభ జీరో అవర్‌లో ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ, 24 గంటల విద్యుత్ సరఫరా కారణంగా భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని, కొన్ని బోరు బావుల్లో నీరు లేక పంటలు ఎండిపోతున్నాయన్నారు. పాలకుర్తి నియోజక వర్గంలోని అన్ని గ్రామాల రైతులు 12 గంటల విద్యుత్ సరిపోతుందని తీర్మానాలు చేశారని ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. పంటలను కాపాడెందుకు వెంటనే 12 గంటల విద్యుత్ సరఫరాను అమలు జరపాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమస్య పై స్పీకర్ మధుసూదనాచారి స్పందిస్తూ తన నియోజక వర్గంలో కూడా ఇదే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి 12 గంటల విద్యుత్ సరిపోతుందని తెలిపారు. ఎర్రబెల్లి దయాకర్‌రావు వాదనతో తాను కూడా ఏకీభవిస్తున్నాను అని స్పీకర్ ప్రకటించారు. ఈ సమస్యపై మంత్రి హరీష్‌రావు స్పందిస్తూ సమస్య తీవ్రతను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. రైతులు కోరిన మేరకు విద్యుత్ సరఫరా చేసి పంటలు పరిరక్షించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కల్యాణలక్ష్మికి రూ.లక్షపెంపుపై హర్షం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సోమవారం అసెంబ్లీలో కేసీఆర్ కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలకు లక్షా116 రూపా యలకు పెంచడంపై ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ హర్షం వ్యక్తం చేశారు. ఇటువంటి పథకం దేశంలోనే లేదని కొనియాడారు. పేదింటి అమ్మాయిలకష్టాలు ఇక తీరినట్లేనన్నారు.

త్వరలోనే ప్రాసిక్యూటర్ పోస్టుల భర్తీ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలోని వివిధ క్రిమినల్ కోర్టులలో మంజూరైన ప్రాసిక్యూటింగ్ అధికారుల పోస్టులను త్వరలోనే భర్తీ చేయడం జరుగుతుందని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో వి. శ్రీనివాస్‌గౌడ్ అడిగిన ప్రశ్నకు హోంమంత్రి నాయిని నరసింహారెడ్డి సమాధానం ఇస్తుండగా ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని ప్రాసిక్యూటింగ్ అధికారుల నియామకం పై వివరణ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం 311 ప్రాసిక్యూటింగ్ అధికారుల పదవులను మంజూరు చేసిందన్నారు. దాదాపు 83 పదవులు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయన్నారు. ఖాళీల వల్ల ప్రాసిక్యూటింగ్ అధికారులపై పని భారం పడుతుందన్నారు. నియామకాలకు సంబంధించి ఉన్నత స్థాయిలో చర్చలు జరుగుతున్నా యని తెలిపారు. ప్రాసిక్యూషన్‌లో మన పోలీసులు గట్టి చర్యలు తీసు కొని శిక్షలు పడే విధంగా చూశారన్నారు. నిరంతర నేర ప్రవృత్తి ఉన్న వారందరిపైన పీడీ చట్టం కింద కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. దీంతో నేరస్థులు భయపడి నేర ప్రవృత్తి తగ్గిందన్నారు. ఈ విషయంలో పోలీసులు విజయం సాధించారని పేర్కొన్నారు. పటిష్టమైన పద్ధతిలో నియామకాలు జరిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నేర ప్రవృత్తి తగ్గించి సరైన న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని సీఎంతెలిపారు.

ఎన్నారై సెల్‌కు రూ.100 కోట్లు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : బడ్జెట్‌లో ఎన్ఆర్ఐ సెల్‌కు రూ. 100 కోట్లు కేటాయించామని ఐటి పంచాయతీ రాజ్, ఎన్ ఆర్ ఐ వ్యవహారాల శాఖ మంత్రి కె.టి.రామారావు తెలిపారు. శాసనసభ జీరో అవర్‌లో బాజిరెడ్డి గోవర్ధన్ ఈ విషయాన్ని ప్రస్తావించారు. ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి అష్టకష్టాలు పడుతున్న తెలంగాణ వాసులను అదుకొనవలసి ఉందన్నారు. దీనిపై మంత్రి స్పందిస్తూ నిధులు ఖర్చు చేయడానికి విధి విధానాలు రూపొందించవలసి ఉందన్నారు. ఫార్మా డి కోర్సులు పూర్తి చేసిన అభ్యర్దులకు ఉపాధి కల్పించి ఆదుకోవాలని టిడిపి సభ్యులు వెంకట వీరయ్య శాసనసభ జీరో అవర్‌లో ప్రభుత్వాన్ని కోరారు. భద్రాచలం నియోజక వర్గంలోని గిరిజన గూడాలు, తండాల్లో మంచినీటి ఎద్దడి ఏర్పడిందని సున్నం రాజయ్య ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. నల్లగొండ జిల్లా గుడితండలో ఐదుగురు విద్యార్దులు నీట మునిగి మృతి చెందిన సంఘటనను రవీంద్ర కుమార్ ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. విద్యార్దుల తల్లిదండ్రులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

బడ్జెట్‌లో ప్రతిబింబించిన కేసీఆర్ ఇజం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉందని టీఆర్ఎస్ సభ్యుడు వేముల వీరేశం చెప్పారు. ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు ఇజం బడ్జెట్ కేటాయింపుల్లో ప్రతిబింబిస్తోందన్నారు. సోమవారం శాసనసభలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం అమరులైన వారి సుందరస్వప్నం.., బంగారు తెలంగాణ సాధన లక్ష్యం.....బడ్జెట్‌ను చూస్తే తెలుస్తుందన్నారు. బడ్జెట్ అన్ని రంగాలు, సామాజిక వర్గాలకు సమతుల్యం ఉండే విధంగా నిధుల కేటాయింపు జరిగిందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఒక్కో పథకం దేశానికే ఆదర్శమన్నారు. అది కాళేశ్వరం ప్రాజెక్టు కావచ్చు... కేసీఆర్ కిట్ కావచ్చు... కళ్యాణలక్ష్మి , మిషన్ భగీరథ ప్రతి ఒక్కటి కూడా దేశంలో ఏ రాష్ట్రంలో కూడా మొదలు పెట్టలేదని చెప్పారు. ఇక్కడి పథకాలను దేశంలోని పలు రాష్ట్రా లకు ఆదర్శంగా నిలుస్తున్నాయని వీరేశం కితాబిచ్చారు



కొత్త మండలాల్లో గోదాములు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణలో కొత్తగా ఏర్పడిన మండలాల్లో అవసరాన్ని బట్టి గోదాములను నిర్మించడం జరుగుతుందని మార్కెటింగ్ శాఖ మంత్రి టి. హరీష్‌రావు తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో బానోత్ మదన్ లాల్, చల్లా ధర్మారెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. కొత్త గోదాములకు సంబంధించి నాబార్డు ప్రణాళికలు సిద్దం చేస్తుందని వివరించారు. ఇప్పటి వరకు 330 గోదాములను నిర్మించామని మంత్రి తెలిపారు. దాదాపు రూ. 1024 కోట్ల అంచనాతో గోదాముల నిర్మాణాలు చేపట్టామని, ఇప్పటి వరకు రూ. 818.14 కోట్లు ఖర్చు చేశామని పేర్కొన్నారు. వాణిజ్య పంటు పండించేప్రాంతాల్లో శీతల గిడ్డంగులను నిర్మిం చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాజకీయాలకు అతీతంగా అన్ని నియోజక వర్గాల్లో రైతుల అవ సరం మేరకు గోదా ములు నిర్మించడం జరుగుతుందన్నారు. గోదాముల నిర్మాణానికి అంచనా విలువకన్నా టెండర్లు తక్కువకు రావడంతో పొదుపు చేసిన మొత్తంతో మరో 34 గోదాములు నిర్మిం చడం జరిగిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 18.30 లక్షల మెట్రిక్ టన్నుల సామర్ధ్యం కలిగిన 364 గోదాములు కొత్తగా అందుబాటులోకి వచ్చాయన్నారు.

'కేసీఆర్ కిట్' సక్సెస్

మంత్రి లక్ష్మారెడ్డి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కేటీఆర్ కిట్ పథకం విజయవంతమైందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి. లక్ష్మారెడ్డి తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో గొంగిడి సునీత, అజ్మీరా రేఖ, బొడిగ శోభ, సండ్ర వెంకటవీరయ్య, జి. కిషన్‌రెడ్డి, సున్నం రాజయ్య అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. కేసీఆర్ కిట్ అమలులోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు 31 శాతం నుండి 50 శాతానికి పెరిగాయని మంత్రి వివరించారు. ఇప్పటి వరకు 4,41,554 మంది మహిళలు కేసీఆర్ కిట్ పథకంతో ప్రయో జనం పొందారని వెల్లడించారు. ఇప్పటి వరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగిన ప్రసవాలకే కేసీఆర్ కిట్‌ను అందచేస్తున్నామని, సింగరేణి, ఆర్టీసీ ఆసుపత్రులకు వర్తింపచేసే విషయంలో తగిన చర్యలు తీసుకుంటా మని మంత్రి తెలిపారు. నేషనల్ హెల్త్ మిషన్ కింద 597 వైద్యాధి కారులు, 1561 మంది స్టాఫ్ నర్సుల ను నియమించడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రు ల్లో వైద్యులు, సిబ్బంది కొరత ను నివారించడం కోసం 10 వేలకు పైగా పోస్టులను భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఇప్పటి వరకు 231 లేబర్ రూముల స్థాం ... ని పెంచామన్నారు. దక్షత కింద 903 మంది వైద్యులకు ప్రత్యేకశిక్షణ ఇచ్చామన్నారు. మెరుగైన ప్రసూతి సర్వీసుల కోసం మిడ్ వైఫరీ కోర్సులను ప్రవేశపెట్టామన్నారు. అందులో 30 మంది స్టాఫ్ నర్సులకు శిక్షణ ఇచ్చామన్నారు. గర్భిణీలను ఆసుపత్రులకు తీసుకెళ్లడానికి 241 అమ్మఒడి వాహనాలను ప్రవేశపెట్టా మన్నారు. నూతనంగా తల్లీ బిడ్డల ఆరోగ్య సంరక్షణ కేంద్రాలను మం జూరు చేశామన్నారు. కేసీఆర్ కిట్‌కు నిధుల ను ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వమే భరించిందన్నారు.

అన్ని గ్రామాల్లో నేత్ర పరీక్షలు

రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో ఉచిత నేత్ర పరీక్షా శిబిరాలను నిర్వ హించబోతున్నామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి. లక్ష్మారెడ్డి తెలిపా రు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో అజ్మీరారేఖ, పుట్టా మధుకర్ అంజయ్య యాదవ్, కౌసర్‌మొ హినొద్దీన్ తదితరులు అడిగిన మరో ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఏప్రిల్‌లో గ్రామాల వారిగా నేత్ర పరీక్షా శిబిరా లను ప్రారం భించి రెండు మూడు మాసాల్లోనే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు ఇవ్వడం, ఆపరేషన్ అవసరమైన వారిని గుర్తించి సమీపంలోని స్వచ్చంద సంస్థలు నిర్వహించే ఆసుపత్రుల్లో చికిత్సలు జరిపించడం కోసం చర్యలు తీసుకుం టున్నామని వివరించారు.



యునానీ ఆరోగ్య కేంద్రాలలో ఖాళీల భర్తీ

యునానీ డిస్పెన్సరీలలో ఖాళీలను భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి.లక్ష్మారెడ్డి తెలిపారు. ఎంఐఎం సభ్యులు జాఫర్ హుస్సేన్ శాసనసభ ప్రశ్నోత్తరాల సమయం లో అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. చార్మినార్‌లోని ప్రభుత్వ నిజామియా టిబ్బి కళాశాలలో బోధన, సాంకేతిక, మినిస్టీరియల్, నర్సింగ్, పారామెడికల్, నాల్గవ తరగతి ఉద్యోగుల పోస్టులు 75 వరకు ఖాళీగా ఉన్నాయన్నారు. ప్రభుత్వ యునాని డిస్పెన్సరీలలో 69 డాక్టర్ పోస్టులు, 61 కాంపౌండర్ పోస్టులు, 29 నర్సింగ్, 19 పిటిఎస్ పోస్టులను భర్తీ చేయవలసి ఉందన్నారు. యునాని డిస్పెన్సరీలలో మందుల కొరత లేదన్నారు. ఇప్పటికే నియామక ప్రక్రియ ను ప్రారంభించమని త్వరలోనే అన్ని ఖాళీలను భర్తీ చేయబోతున్నామని వివరించారు. చార్మినార్‌లోని ప్రభుత్వ నిజామియా టిబ్బి కళాశాల చాలా పురాత నమైందని, అక్కడ అందించే యునాని వైద్యానికి స్థానికంగా మంచి ఆదరణ ఉందని జాఫర్ హుస్సేన్ తెలిపారు. ఎంతో పురాతనమైన ఈ వైద్యాన్ని పరిరక్షించ డంతో పాటుగా ప్రోత్సహించవలసి ఉందన్నారు.

సంక్షేమానికి నామమాత్రంగా నిధులు



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : బడ్జెట్‌లో ప్రభుత్వం సంక్షేమ రంగానికి నామమా త్రంగా నిధులు కేటాయించిందని సీపీఎం సభ్యుడు సున్నం రాజయ్య విమర్శిం చారు. రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న విధంగా రాష్ట్ర నిర్మాణానికి అనుగుణంగా నిధుల కేటాయింపులు జరగలేదని మండిపడ్డారు. ఎస్సీ ,ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీపై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అక్షరాస్యత పెంచేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. కేరళ రాష్ట్రంలో 96 శాతం అక్షరాస్తతఉందని సున్నంరాజయ్య గుర్తు చేశారు. అటవీ హక్కుల చట్టాన్ని అధికారులు నీరుకారుస్తున్నారని, 30 ఏళ్ల నుంచి కూడా పోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులను అధికారులు తరిమేస్తున్నారని,ఈ ఘటనలపై ఆందోళనతో ఆంబోతు ఎంకన్న అనే గిరిజనుడు ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. వ్యవసాయానికి రూ.12,775 కోట్లు కేటాయించడం బాగున్నప్పటికీ ,పంటలకు గిట్టుబాటుధర చెల్లించకపోతే ప్రయోజనం ఉండదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

గ్రామీణాభివృద్ధికి రూ.3817 కోట్లు

హైదరాబాద్,ఆంధప్రభ: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక వివిధ పథకాల కింద కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రామ పంచాయతీలకు రూ.3817కోట్లు విడుదల యినట్టు రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ది శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. సోమవారం శాసనమండలిలో జరిగిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో సభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డి, బి.లక్ష్మినారాయణ, కసిరెడ్డి నారాయణ రెడ్డి తదితరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి బదులిచ్చారు. రాష్ట్రంలో గ్రామ పంచాయతీలకు 2014-15నుంచి 2017-18 వరకూ మాత్రమే కేంద్రం నుంచి నిధులు విడుదలయ్యారన్నారు. ఈ ఏడాదికి సంబంధించి నిధులు ఇంకా అందలేదన్నారు. కేంద్రం నుంచి విడుదలైన నిధులు ఆయా పథకాల కింద ఎప్పటికప్పుడు ఖర్చు చేస్తున్నట్టు మంత్రి జూపల్లి పేర్కొన్నారు.

భాష పండితులకు ప్రమోషన్లు : కడియం

రాష్ట్రంలో భాషా పండితులను స్కూల్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేయడానికి అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి వెల్లడించాం. మండలిలో సభ్యులు పాతూరి సుధాకర్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, పూల రవీందర్ అడిగిన ప్రశ్నలకు ఉపముఖ్యమంత్రి కడియం బదులిస్తూ రాష్ట్రంలో 2487 మంది భాషా పండితులకు ప్రమోషన్లు కల్పిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులపై కొంతమంది హైకోర్టును ఆశ్రయించారన్నారు.

జీతాల పెంపు పరిశీలిస్తాం : మంత్రి జూపల్లి

రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల వేతనాల పెంపుదలను పరిశీలిస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు.



రంగుల కల బడ్జెట్: సండ్ర

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రంగుల కల బడ్జెట్‌గా టీడీపీ సభ్యుడు సండ్ర వెంకటవీరయ్య అభివర్ణించారు. బడ్జెట్‌పై చర్చలో ఆయన పాల్గొన్నారు. గడచిన ఐదు బడ్జెట్‌లో ప్రగతి పద్దుకు రూ.1,99,000 కోట్లు కేటాయించగా కేవలం రూ. 1,37,000 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని విమర్శించారు. 3 లక్షల డబుల్ బెడ్ రూం ఇళ్లు ఈ టర్మ్ లోనే పూర్తి చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారని, కానీ, బడ్జెట్‌లో కేవలం రూ. 2,843 కోట్లు మాత్రమే కేటాయించారని, ఇంత తక్కువ నిధులతో లక్షల ఇండ్లు ఎలా కట్టిస్తారో చెప్పాలని ప్రశ్నించారు. బీసీలకు అభివృద్ధి కేటాయిస్తామని చెప్పారని, బడ్జెట్‌లో ఆ విషయం ప్రస్తావించలేదన్నారు.2 లక్షల ఉద్యోగాల భర్తీ అన్నారు



బేగంపేట నుండి ప్రత్యేక విమానంలో కలకత్తాకు బయలు దేరిన ముఖ్యమంత్రి కేసీఆర్



ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్వాగతం



కలకత్తా కాళీమాతను దర్శించుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్

ఫెడరల్ ఫ్రంట్
వయా బెంగాల్

- మమతతో భేటీ సక్సెస్
- దేశంలోని రైతాంగ సమస్యలు, అజెండాపై చర్చ
- కేసీఆర్‌కు దీదీ అభయం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఫెడరల్ ఫ్రంట్ గొడు గుకిందకు ప్రాంతీ యశక్తులన్నింటినీ తీసుకురావాలని భావిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్ర శేఖరరావు సోమవారం తొలి అడుగు విజయవంతంగా వేశారు. దేశంలోని ప్రాంతీయశక్తుల్లో అత్యంత కీలకంగా ఉన్న దీదీ మమతాబెనర్జీతో భేటీ అయి తన ఆలోచనలను, ఎజెండాను వివరించిన కెసిఆర్.. మిగ తా ప్రాంతీయశక్తులను కూడగట్టేదిశగా కీలక సూచనలు అందుకున్నారు. సోమవారం ఉదయం 11.45క ు బేగంపేట విమానాశ్రయం నుండి ప్రత్యే కవిమానంలో కోల్‌కతా బయలుదేరి వెళ్ళిన కెసిఆర్ షెడ్యూల్ ప్రకారం ఆమెతో భేటీ అయ్యారు. మధ్యా హ్నం 3.15కు పశ్చిమబెంగాల్ సచివాలయానికి వెళ్ళిన కెసిఆర్‌ను మమత పుష్పగుచ్ఛం అందించి ఘనంగా స్వాగతించారు. ఇదే సందర్భంలో గతంలో ఉన్న సంబంధాల నేపథ్యంలో కెకెతో సన్నిహితంగా మాట్లాడారు. ఆ తర్వాత సచివాలయంలోనే రెండు గంటలకు పైగా వివిధ అంశాలపై చర్చించారు. బిజెపి, కాంగ్రెస్‌లకు వ్యతిరేకంగా ఫ్రంట్ ఏర్పాటు ఆవశ్యకత.. ఇది విజయవంతమయ్యేందుకు తన వద్ద ఉన్న ఆలోచనలను కెసిఆర్ మమతకు వివరించారు. దేశంలో రైతాంగ సమస్యలు, నదీజలాల వివాదాలు, రాష్ట్రాల అధికారాల విషయంలో కేంద్రం పెత్తనం వంటి వాటిపై చర్చించారు. దేశంలో నెలకొన్న సమ స్యలు.. సమూల పరిష్కార ఆవశ్యకతపై కెసిఆర్ చేసిన పలు సూచనలను మమత అంగీ కరించారు. దేశ రాజకీయాల్లో ప్రబల మార్పు రావాల్సి ఉందన్న వాదనను ఆమె బలపరిచారు. సరిగ్గా షెడ్యూల్ ప్రకారమే.. కెసిఆర్,మమతల భేటీ సాయంత్రం 5.30కు ముగియగా, ఆ తర్వాత మీడియాతో మాట్లాడిన ఇరువురు నేతలు ప్రత్యామ్నాయ కూటమి అవసరాన్ని వివరించారు. ఆ తర్వాత కోల్‌కతలోని ప్రఖ్యాత కాళిమందిరాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రికి ప్రత్యేక విమానంలో హైదరాబాద్ తిరిగి వచ్చారు. కెసిఆర్ వెంట ఎంపీలు కె.కేశవరావు, కవితలు పర్యటనలో పాల్గొన్నారు. తొలి పర్యటన విజయవంతం కావడంతో రెండో పర్యటనకు ఢిల్లీ లేదా ముంబైని వేదికగా చేసుకోవాలని కెసిఆర్ భావిస్తున్నారు. కెసిఆర్, మమతల భేటీపై జాతీయ రాజకీయవర్గాలు ఆసక్తిని ప్రదర్శించగా.. ఈ భేటీలో ఎలాంటి కీలక నిర్ణయాలు జరగలేదు. అయితే ప్రత్యామ్నాయ కసరత్తుదిశగా కీలక అడుగు పడిందని, దీని ప్రభావం దేశంపై గణనీయంగా ఉంటుందని టిఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి.



థర్డ్ ఫ్రంట్ సక్సెస్ అవ్వాలి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: జాతీయ రాజకీయాల్లో కేసీఆర్ విజయం సాధిం చాలని, ఆయన ఏర్పాటు చేసే థర్డ్ ఫ్రంట్ విజయవంతం కావాలని కోరుతూ సోమవారం ప్రగతి భవన్‌లో ఉపముఖ్యమంత్రి మహమూద్‌అలీ సిఎం కేసీఆర్ చేతికి ఇమామే జామీన్ కట్టారు. థర్డ్‌ఫ్రంట్ ఏర్పాటులో భాగంగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీని కలవడానికి కేసీఆర్ బెంగాల్ రాష్ట్రానికి వెళ్ళారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, కేసీఆర్ నాయకత్వంలో థర్డ్‌ఫ్రంట్ ఏర్పడుతుందని, ఆయన దేశానికి నాయకత్వం వహిస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలోని అన్ని ప్రాంతీయ పార్టీలు కేసీఆర్ ఏర్పాటు చేసే ఫ్రంట్ వైపు చూస్తున్నారన్నారు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్, భాజపాలకు కేసీఆర్ ఏర్పాటు చేసే థర్డ్‌ఫ్రంట్ ఒక్కటే ప్రత్యామ్నాయంగా నిలుస్తుందన్నారు.

కేసీఆర్ నాయకత్వం దేశానికి అవసరం

తమిళనాడు తెలుగు యువశక్తి అధ్యక్షుడు కేతిరెడ్డి వెంకట్‌రెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : దేశంలో థర్డ్ ఫ్రంట్ ఏర్పాటు సీఎం చంద్ర శేఖర్‌రావు కృషి అభినందనీయమని తమిళనాడు తెలుగు యువశక్తి అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడి కంటే సీఎం కేసీఆర్ గొప్ప ప్రజా నేత అని , దేశానికి అవసరమన్నారు. సోమవారం ఆయన ఒక ప్రకటనలో కొనియాడారు. థర్డ్ ఫ్రంట్ ఏర్పాటు వల్ల ఉత్తరాది నాయకత్వానికి చెంప పెట్టులాంటిదన్నారు. కేసీఆర్ నాయకత్వానికి పార్టీలకు అతీతంగా దక్షిణాది రాష్ట్రాల నాయకులు మద్దతివ్వాలని ఆయన కోరారు.

నాన్నతో కవిత

జాతీయ రాజకీయ అడుగు జాడల్లో..



కేసీఆర్, మమతా బెనర్జీతో కవిత సెల్ఫీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: జాతీయ రాజకీయాల దిశగా.. తొలి అడు గువేసిన ముఖ్యమంత్రి కెసిఆర్ కీలకమైన తొలిభేటీకి తన వెంట ఎంపీ కల్వకుంట్ల కవితను తీసుకెళ్ళారు. తాజా రాజకీయపరిణామాల నేపథ్యంలో.. కేంద్ర రాజకీయాల్లోనే కవిత కీలక పాత్ర పోషిస్తారని, తన వెంట తీసుకెళ్ళడం ద్వారా దీనిపై సిఎం స్పష్టతనిచ్చారని రాజకీయవర్గాలు పేర్కొంటున్నాయి. చురుకైన నేతగా.. త్వరితగతిన సమస్యలపై, పరిస్థితులపై అవగాహన ఏర్పరుచుకుని వాక్పటిమతో ఆకట్టుకునే నేతగా అనేకమంది జాతీయనేతల ప్రశంసలందుకున్న కవిత ఇక జాతీయ రాజకీయాల్లో క్రియాశీలం కానున్నట్లు తెలుస్తోంది. నిజామాబాద్ ఎంపీగానే కాకుండా టిఆర్ఎస్ పార్లమెంటరీ వ్యవహారాల్లో చురుగ్గా వ్యవహరించే కవిత తండ్రికి తగ్గ తనయగా గుర్తింపుపొందారు. కేంద్ర ప్రభుత్వంలోనూ, జాతీయస్థాయిలోనూ కవితకు మంచి పలుకుబడి ఉంది. తొలిసారే ఎంపీ అయినా.. కేంద్రమంత్రులను ఒప్పించి అనేక సమస్యలను చాకచక్యంగా పరిష్కరించిన ఘనత కవిత సొంతం చేసుకుంది. లోక్‌సభలో తెలంగాణ సమస్యలతో పాటు జాతీయ అంశాలపై కవిత చేసిన అనర్గళ ప్రసంగాలు ప్రస్తుత ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడుతో పాటు అనేకమంది సీనియర్ పార్లమెంటేరియన్ల ప్రశంసలు అందుకున్నారు. ప్రముఖనేతలు హైదరాబాద్ వచ్చినపుడు లోక్‌సభలో కవిత వాగ్దాటిని ముఖ్యమంత్రి కెసిఆర్ వద్ద ప్రస్తావించి పలు సందర్భాల్లో ప్రశంసించారు. జాతీయ రాజకీయాల్లో వడివడిగా అడుగులు వేస్తున్న కెసిఆర్.. ఇపుడు జాతీయ నేతలతో చర్చలకు కవితను తీసుకెళ్లడం వ్యూహాత్మకమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. కవిత భవిష్యత్ రాజకీయాలకు సరికొత్త బాటను సిఎం నిర్మిస్తున్నారన్న చర్చ జరు గుతోంది. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకునే హస్తిన రాజకీయాల్లో కవితను క్రియా శీలం చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. తెలంగాణతో పాటు ప్రపంచంలోని అనేక దేశాల్లో తెలంగాణ జాగృతి శాఖలను, పార్టీ శాఖలను విస్తరించడంలో కీలకపాత్ర పోషించిన కవితను వ్యూహాత్మకంగానే జాతీయ రాజకీయతెరపై ఫోకస్ చేయబోతున్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు.

మాది సమష్టి సారథ్యం

(మొదటిపేజీ తరువాయి)

ఉంటుందని.. సమిష్టిగా ముందుకు వెళతామన్నారు. పశ్చిమబెంగాల్ రాష్ట్రాన్ని మమతాబెనర్జీ తీర్చిదిద్దుతున్న తీరు ప్రశంసనీయమన్నారు.

కెసిఆర్ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నా: మమతాబెనర్జీ

తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ చెప్పిన అన్ని విషయాలతో తాను ఏకీభవిస్తున్నానని, దేశంలో బలమైన ఫ్రంట్ అవసరముందని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ అన్నారు. భేటీ అనంతరం మీడియాతో మాట్లాడుతూ బిజెపి, కాంగ్రెసేతర పార్టీలతో ఫ్రంట్ ఏర్పాటుదిశగా జరుగుతున్న ప్రయత్నాలను ఆమె స్వాగతించారు. ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుకు ఇది శుభారంభం. రాజకీయాలనేవి నిరంతర ప్రక్రియ. మేం ఏం చర్చించినా అది దేశ అభివృద్ధి లక్ష్యంగానే ఉంటుంది అని మమత పేర్కొన్నారు.

బలమైన ఫెడరల్ ఫ్రంట్‌ను తాము కోరుకుంటున్నామని, ఈ ఫ్రంట్ భిన్నంగా ఉంటుందని మాత్రం చెప్పగలనన్నారు. రెండుగంటల పాటు సాగిన భేటీలో ముఖ్యమంత్రి కెసిఆర్ వెంట రాజ్యసభ సభ్యులు కె.కేశవరావు, నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత, సిఎం రాజకీయ వ్యవహారాల కార్యదర్శి శేరి సుభాష్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధానసలహాదారు రాజీవ్‌శర్మ పాల్గొన్నారు.

ఆప్యాయ ఆతిథ్యం

- మెనూలో పదార్థాలపై దీదీ సలహాలు
- నోరూరించే వంటకాలను వడ్డించిన తాజ్‌హోటల్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : జాతీయ స్థాయిలో తృతీయ ప్రత్యామ్నాయం ఏర్పాటుపై చర్చించేందుకు పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కోల్‌కతాకు వెళ్ళిన తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆ రాష్ట్ర సీఎం మమతా బెనర్జీ నోరూరించే వంటలను సిద్ధంచేసి తినిపించారు. సోమవారం మధ్యాహ్నం కోల్‌కతాకు చేరుకున్న కేసీఆర్ విమానాశ్రయం నుంచి నేరుగా తాజ్‌బంగ్లా హోటల్‌కు చేరుకుని కాసేపు విశ్రాంతి తీసుకున్నారు. అంతకుముందే సీఎం మమతా బెనర్జీ కేసీఆర్‌కు వడ్డించే వంటలను సిద్ధంచేసి ఉంచినట్టు తెలుస్తోంది. మధ్యాహ్న భోజనంలో కేసీఆర్ బృందానికి వడ్డించే మెనూలో ఉండాల్సిన పదార్థాలను ఆమె నిర్ణయించినట్టు సమాచారం. కేసీఆర్ కోసం ప్రత్యేక బెంగాలీ వంటకాలను మమతా బెనర్జీ సిద్ధం చేయించినట్టు తెలిసింది. కేసీఆర్‌కు మిస్తీపలావ్, కలాయుర్ దాల్, బేగున్‌భాజా, ఆలూపోస్తో, చనార్‌దాల్నా, పరోటా, కాషామాంగ్షో తదితర వంటకాలను సిద్ధంచేసి వడ్డించినట్టు సమాచారం. వీటితో పాటు బెంగాల్‌లో అత్యంత రుచికరమైన పలు రకాల మిఠాయిలు, మిక్చర్ వంటి వాటిని కూడా కేసీఆర్ బృందానికి సిద్ధంచేసి వడ్డించినట్టు సమాచారం. మధ్యాహ్న భోజన సమయానికి కేసీఆర్ బృందం కోల్‌కతా చేరుకోగా, భోజనం అనంతరం ఇరువురు సీఎంలు సచివాలయంలో సమావేశమై మూడో ప్రత్యామ్నాయం ఏర్పాటుపై చర్చించారు.

పవన్ నాలుగేళ్లు బాగానే ఉండి..
ఇప్పుడీ విమర్శలేమిటి?!


- కుట్ర రాజకీయాలొద్దు – రాష్ట్రాన్ని బలహీనపర్చొద్దు
- బీజేపీ నమ్మించి అన్యాయం చేసింది
- నేనెవ్వరికీ భయపడను: చంద్రబాబు



అమరావతి, ఆంధ్రప్రభ: ఆది నుంచి తెలుగుదేశం పార్టీ ముస్లిం మైనార్టీలకు దగ్గరగా ఉందని, అయితే బీజేపీకి మద్దతిచ్చిన భావన వారిలో ఉందని టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. అయితే విభజన అనంతరం నష్టపోయిన రాష్ట్రానికి న్యాయం జరగాలన్న ఉద్దేశంతోనే బీజేపీతో పొత్తు పెట్టుకున్నామని వెల్లడించారు. విభజన హామీలను అమలు చేయడంలో ఎన్డీయే సహకారం అందిస్తుందనుకుంటే అన్యాయం చేసిందన్నారు. సోమవారం బీజేపీకి మద్దతు ఉపసంహరించుకున్నందుకు ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడును ప్రత్యేకంగా అభినందనలు తెలిపేందుకు విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే జలీల్ ఖాన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ముస్లిం మైనారిటీలు ఆయన నివాసానికి తరలి వచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ విభజన హామీలు అమలు చేయాలని తాను చేసిన డిమాండ్‌ను కేంద్రం పెడచెవిన పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైకాపా ఎన్నో కుట్రలు, నాటకాలు ఆడుతోందని బీజేపీ అడగకముందే ఉప రాష్ట్రపతి ఎన్నికకూడా మద్దతు ఇచ్చిందన్నారు. తప్పుడు పనులను కప్పిపుచ్చుకునేందుకు కేంద్రంలోని పెద్దల కాళ్లపై పడుతూ రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగేలా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. అదే సమయంలో అవినీతి పార్టీ అయిన వైకాపా అండ చూసుకొని బీజేపీ తనను అణగదొక్కేందుకు చూస్తోందన్నారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ నాలుగేళ్లు బాగా ఉండి, ఈరోజు తనపై విమర్శలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఇదే సమయంలో ఇక తనపై యుద్ధం చేస్తామంటూ బీజేపీ ప్రకటనలు చేస్తోందని, ఒకరాష్ట్రంపై యుద్ధం చేయడమేమిటో చెప్పాలని ప్రశ్నించారు. ముస్లిం, మత పెద్దలంతా రాష్ట్రమంతా తిరిగి ముస్లిం మైనార్టీ వర్గాలకు కేంద్రం, వైకాపా చేస్తున్న అన్యాయాన్ని వివరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. ట్రిపుల్ తలాక్ అంశంపై తొలుత స్పందించింది తెలుగుదేశమేనని ప్రత్యేకంగా అరెస్టులు చేయాలన్న దాన్ని కూడా వ్యతిరేకించానని చెప్పారు. కేవలం ముస్లింపట్ల వివక్షతతోనే ఇదంతా చేస్తున్నారన్న ఉద్దేశంతోనే తాను దీనిని సమర్థించలేదని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే జలీల్ ఖాన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ముస్లిం మైనార్టీలంతా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు.ముస్లిం మైనార్టీలంతా ముఖ్యమంత్రి చంద్రబాబుకు, తెలుగుదేశం పార్టీకి పూర్తి మద్దతుగా ఉంటారని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు అల్తాఫ్ రజా, హబీబ్, అలీ, మౌజమ్ కబీర్ పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

టీడీపీ అవినీతిపై
కేంద్రం విచారణ జరపాలి

- చంద్రబాబుకు 2.5 మార్కులు
- కేసీఆర్‌కు 6 మార్కులు



అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా విషయంలో రాజీ ప్రసక్తేలేదని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఓ ఆంగ్ల టీవీ న్యూస్ ఛానల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో స్పష్టంచేశారు. ఇప్పుడు ఈ ఇంటర్వ్యూ రాష్ట్రంలో హల్‌చల్ చేస్తోంది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా అనే ట్యాగ్ ఇస్తారా? లేదా అనేది ముఖ్యంకాదని, పేరు లేదా స్టేటస్ ముఖ్యంకాదు..కేంద్రం నుంచి రాష్ట్రానికి ఆర్థిక సాయం అందడమే ముఖ్యమని పవన్‌కల్యాణ్ ఆ ఇంటర్వ్యూలో పేర్కొన్నారని అంటున్నారు.ప్రత్యేక హోదా డిమాండ్ కేవలం భావోద్వేగాలతో ముడిపడినదే కాదని, అది ఆచరణాత్మక అవసరాలను కలిగివుందని స్పష్టం చేశారు. బుందేల్‌ఖండ్‌లోని ప్రాంతాలు మాదిరిగా ఏపీలోని ఏడు జిల్లాలు చాలా దుర్భర పరిస్థితుల్లో ఉన్నాయన్నారు. ఈ జిల్లాల్లో పరిస్థితులు చక్క దిద్దాలంటే కేంద్రం నుంచి మరిన్ని నిధులు రావాల్సి ఉందని అన్నారు. తమ తమ డిమాండ్లు నెరవేరనంత వరకూ తాము భారతీయ జనతా పార్టీతో రాజీపడే ప్రసక్తే లేదని పవన్ అన్నారు. ప్రస్తుతం తాము సొంత దారిలోనే వెళుతున్నామని అన్నారు. ఎన్నికల సమయంలో కూటమి అవసరమా లేక సొంతంగా పోటీ చేయాలా అనేది ఇంకా నిర్ణయించలేదని, అప్పుడు ఆలోచిస్తామని అన్నారు. తాను ఇటీవల తెలంగాణా ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిశానని, తృతీయ ఫ్రంట్ గురించి ఆయనకు చెప్పానని తెలిపారు. ఇక ప్రభుత్వ పాలనలో తెలుగురాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు,కేసీఆర్‌కు 10కి ఎన్ని పాయింట్లు ఇస్తారని ప్రశ్నించగా, చంద్రబాబుకు 2.5 మార్కులు, కేసీఆర్‌కు 6 మార్కులు వేస్తాననని బదులిచ్చారు.

ప్రధాని నరేంద్రమోడీ తనకు చాలా దగ్గరగా తెలుసునని చెప్పారు. కానీ తనకు కొన్ని పరిమితులు వున్నాయని అన్నారు. తన వ్యాఖ్యల వెనుక బీజేపీ ఉందంటూ తెదేపా నేతలు మాట్లాడుతున్నారని , ఇందులో ఎంతమాత్రం వాస్తవం లేదన్నారు. ఆశ్చర్యకరంగా

నా వెనుక ప్రజలు ఉన్నారు

గతంలో తన వెనుక చంద్రబాబు ఉన్నారంటూ వైకాపా అధినేత జగన్ కూడా ఆరోపించారని గుర్తు చేశారు. వాస్తవానికి వారిద్దరూ చెప్పేది తప్పు అని, తన వెనుక ప్రజలు మాత్రమే ఉన్నారంటూ స్పష్టంచేశారు.

తెదేపా అవినీతిపై కేంద్రం విచారణ జరపాలి

తెదేపా ప్రభుత్వంపై తాను చేసిన అవినీతి ఆరోపణలపై పవన్‌కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. తాను అకస్మాత్తుగా ఇప్పుడు టీడీపీ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడంలేదని, గత నాలుగేళ్లుగా తాను ఈ అంశాన్ని లేవనెత్తుతున్నానని చెప్పారు. కానీ సీఎం చంద్రబాబునాయుడు ఈ సమస్యను ఏనాడూ తీవ్రంగా తీసుకోలేదన్నారు. ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతి ఆయనకు తెలుసునని అన్నారు. దాదాపు 40 మంది ఎమ్మెల్యేలు ప్రభుత్వంలో అవినీతి జరుగుతున్నట్లు తనకు చెప్పారని, తాను ముఖ్యమంత్రికి సమస్యను వివరించాలని వారు భావించారని, తాను అదే చేశానన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.



దుబాయ్‌లో ప్రవాస తెలంగాణ వాసులతోకలిసి మంత్రి ఈటల రాజేందర్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్న మంథని ఎమ్మెల్యే మధు

అందుబాటులో పాస్‌పోర్టు సేవలు

నల్గొండ పాస్‌పోర్టు కేంద్రం ప్రారంభోత్సవంలో మంత్రి జగదీశ్వర్ రెడ్డి

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : పాస్‌పోర్టు సేవాకేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సహకారంతో పూర్వ 7 జిల్లాకేంద్రాల్లో ఈ పోస్ట్‌ఆఫీస్ పాస్ పోర్ట్ సేవా కేంద్రాలు (పీఓపీఎస్‌కే) ప్రారంభించినట్లు రాష్ట్ర ఇంధన, ఎస్సీ కులాల అభివృద్ధిశాఖ మంత్రి గుంతకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. సోమవారం నల్గొండ జిల్లా కేంద్రంలో పోస్టాఫీస్ పాస్‌పోర్టు సేవాకేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా జగదీష్ రెడ్డి మాట్లాడుతూ,ఒకప్పుడు పాస్ పోర్టు తీసుకోవాలంటే రాజధాని హైదరాబాద్‌కు వెళ్లాల్సి వచ్చేదని, ఆర్థికంగా భారం కావడమే గాక సమయం కూడా వృథా అయ్యేదని, ప్రస్తుతం పరిస్థితులు మారాయని, పూర్వ జిల్లా కేంద్రాల్లో వాటిని ఏర్పాటు చేశామని చెప్పారు. ఇప్పటికే వరంగల్, మహబూబ్‌నగర్ , ఖమ్మం, అదిలాబాద్, మెదక్, సిద్దిపేట పట్టణాలలో ఈ కేంద్రాలు పని చేస్తున్నాయని తెలిపారు. చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ బి చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఈ కేంద్రంలో కొత్త పాస్ పోర్టులతో పాటు రెన్యూవల్స్ , మార్పులు, చేర్పులను చేసుకోవచ్చని సూచించారు. ఈ సందర్భంగా పాస్ పోర్టు సేవలకు సంబంధించిన పోస్టర్లను ఎంపి గుత్తాసుఖేందర్ రెడ్డి, పోస్టల్ బోర్డు సభ్యురాలు ఉషా చంద్రశేఖర్, పోస్ట్‌మాస్టర్ జనరల్ ,కల్నల్ ఎం ఎలీషాతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నల్గొండ ఎమ్మెల్సీ పూల రవీందర్, మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, జిల్లా కలెక్టర్ డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
మంగళవారం 20 మార్చి 2018

మోడీపై ప్రాంతీయ వ్యతిరేకత

శత్రువులు నిన్ను బలోపేతం చేస్తారు, మిత్రులు బలహీన పరుస్తారు.. అనే నానుడి సక్సెస్ అయిన రాజకీయ నాయకులకు వర్తిస్తుంది. విజయం తర్వాత వినయంగా ఉండేవాళ్లు భారత రాజకీయాల్లో చాలా అరుదు. దాదాపు లేరనే చెప్పవచ్చు.

2019 ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజకీయ పార్టీలు తమ, తమ రాజకీయ ఎత్తుగడలకు పదును పెడుతున్నాయి. మిత్రులెవరో, శత్రులెవరో విభజన రేఖను గీసుకునే పనిలో పడ్డాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం ఢిల్లీలో లాబీయింగ్ సందర్భంగా పలు పార్టీలు, నాయకులతో నెలకొన్న సంబంధాలను కెసిఆర్ ఉపయోగించుకోనున్నారు. మూడో ప్రత్యామ్నాయానికి తానే నాయకత్వం వహిస్తానన్న కెసిఆర్ సోమవారం కోల్‌కతాకు వెళ్లి మమతా బెనర్జీతో చర్చించారు. బిజెపి, కాంగ్రెస్ పార్టీలు బలహీనపడుతున్న విషయాన్ని మొట్ట మొదట పసిగట్టి జాతీయ రాజకీయాల మెడలో ఫెడరల్ ఫ్రంట్ గంట కట్టిన నాయకుడు కెసిఆర్. తెలంగాణ ముఖ్యమంత్రి దూకుడుకు బిజెపి, కాంగ్రెస్ వైఫల్యాలే తాత్విక ప్రాతిపదిక.

దేశంలో రాజకీయ సమీకరణలు వేగంగా మారుతున్నాయి. 2014 ఎన్నికలలో బిజెపి అద్భుత విజయాన్ని నమోదు చేసుకుంది. 2014 తర్వాత వేర్వేరు ఉప ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీలో ఓడిపోయింది. గుజరాత్‌లో వోటు బ్యాంకు గణనీయంగా తగ్గింది. బెంగాల్, కేరళ, తమిళనాడు, ఉభయ తెలుగు రాష్ట్రాలలో గతానికి, నేటికీ బిజెపికి వచ్చే స్థానాలలో మార్పు ఉండదు. మిగిలిన రాష్ట్రాలలో కూడా బిజెపికి వచ్చే స్థానాలలో పెద్దగా మార్పు ఉండదు. పంజాబ్ లాంటి చోట్ల కాంగ్రెస్ పుంజుకుంటోంది. స్థూలంగా జాతీయ పార్టీలు అయిన బిజెపికి 200, కాంగ్రెస్‌కు 150 లోపు సీట్లు వచ్చే పరిస్థితులున్నట్టు తాజా సర్వేలను బట్టి అర్థమవుతోంది. రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు ఈ కాలంలో మరింతగా పుంజుకుంటున్నాయి. ప్రాంతీయ పార్టీల ఖాతాలో దాదాపుగా 150 సీట్లు వచ్చే అవకాశం ఉంది. 2019లో ప్రాంతీయ పార్టీలు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటులో కీలక భూమిక పోషించే అవకాశాలకు ఈ లెక్కలు, అంచనాలు ప్రాతిపదిక.

2019 ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీల హవాకు అవకాశం ఉందని ప్రముఖ జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయ్ అభిప్రాయపడ్డారు. 10 మంది ఎంపీలుంటే కేంద్రాన్ని శాసించవచ్చని కూడా ఆయన హైదరాబాద్‌లో గత శనివారం అన్నారు. రానున్న ఎన్నికల్లో సోషల్ మీడియా కీలకపాత్ర పోషిస్తోందన్నది ఆయన విశ్లేషణ. ముఖ్యంగా 'వాట్సాప్' వేదికగా ఎన్నికల యుద్ధం జరిగే అవకాశం ఉందని రాజ్ దీప్ చెబుతున్నారు. ప్రధాన స్రవంతి మీడియా ఎప్పుడో విశ్వసనీయత కోల్పోయినందున సోషల్ మీడియా ప్రత్యామ్నాయ పాత్ర పోషించడం ఖాయం. దేశంలోని పలు పార్టీలు, నేతలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు మీడియాను నియంత్రిస్తున్నారని, వారికి వ్యతిరేకంగా రాసే వార్తలను ప్రసారం కాకుండా అడ్డుకుంటున్నారని రాజ్ దీప్ ఆరోపణ. జయలలిత, మమతా బెనర్జీ, నవీన్ పట్నాయక్ సహా కేసీఆర్ కూడా ఇదే విధానం అనుసరిస్తున్నారని కూడా ఈ సీనియర్ జర్నలిస్టు ఆరోపణ. భారత్‌లో రాజకీయాలను రెండు అంశాలు శాసిస్తున్నాయి. ఒకటి డబ్బు.. రెండు జనాకర్షణ. అవి రెండూ ఒకే చోట ఉండడం అరుదు. ఆ రెండూ ఉన్న వ్యక్తి రాజకీయాలలో తిరుగులేని శక్తి అవుతారని చెప్పడానికి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఒక ఉదాహరణ. కేంద్రంలో ప్రభుత్వాల ఏర్పాటుకు ఇప్పటిదాకా తమిళనాడు నుంచి కరుణానిధి, జయలలిత, యూపి నుంచి ములాయం, మాయావతి, మహారాష్ట్ర నుంచి శరద్ పవార్, పశ్చిమ బెంగాల్ నుంచి మమతా బెనర్జీ, బీహార్ నుంచి నితీష్ కుమార్ వంటి వారే కీలకపాత్ర పోషిస్తున్నారు. వీరంతా ఇప్పుడు దేశ దశ, దిశను శాసిస్తున్న అతిరథులు. రాజకీయాల్లోకి వచ్చి సొంత పార్టీలు పెట్టి ఏళ్లతరబడి శ్రమించాక వారు ఈ స్థాయికి వచ్చారు. జగన్ వ్యవహారంతో కేంద్రంలోని కాంగ్రెస్ అధిష్టానంలో కలకలం మొదలయింది. కాంగ్రెస్ నుంచి విడిపోయి పార్టీ పెట్టుకొన్న శరద్ పవార్, మమతా బెనర్జీలే ఇప్పుడు కాంగ్రెస్‌కు ఊపిరిపోయాలన్నా, తీయాలన్నా ప్రధాన భూమికలుగా మారడం ఇందుకు కారణం. బీజేపీకి మిత్రపక్షం కాకపోయినా అంతకంటే ఎక్కువగానే కెసిఆర్ వ్యవహరించారు. నోట్ల రద్దు వ్యవహారంలో ఆయన మోడీని గట్టిగా సమర్థించారు. జీఎస్టీ విషయంలో ముందు సమర్థించి తర్వాత మాట మార్చారు. జాతీయ రాజకీయాలపై చాలాకాలంగా ఆయనకు ఆసక్తి ఉన్న విషయం కొద్దిమందికే తెలుసు. కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా కేసీఆర్ 'ఫెడరల్ ఫ్రంట్' ఆలోచన అందరూ అనుకుంటున్నట్టు కొత్తది కాదు. ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న జాతీయ పార్టీలపై తిరుగుబాటుకు ఆయన పక్కా ప్రణాళికతోనే సిద్ధమయ్యారు. దేశవ్యాప్తంగా రాజకీయ సమీకరణాలు ఎలా ఉన్నాయి? ఎలా మారబోతున్నాయి? అన్నదానిపై



కేసీఆర్ ఎప్పటికప్పుడు విశ్లేషించుకుంటూ వస్తున్నారు. ప్రాంతీయ పార్టీలన్నీ జట్టుకడితే జాతీయ పార్టీల పెత్తనాన్ని నిలువరించవచ్చునన్నది ఆయన భావన. ఆ దిశగా కేసీఆర్ ప్రయత్నాలు కూడా ముమ్మరం చేశారు. ప్రాంతీయ పార్టీల అగ్రనేతలతోనూ ఆయన మాట్లాడినట్టు తెలుస్తోంది. కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ ప్రతిపాదనపై వారు స్పష్టమైన అభిప్రాయం చెప్పినప్పటికీ వ్యతిరేకత మాత్రం కనబరచకపోవడం అనుకూల అంశం. రాష్ట్రాలు కేంద్రానికి చెల్లిస్తున్న పన్నుల్లో 42 శాతమే తిరిగి ఇచ్చి మిగతా 58 శాతాన్ని తమ అనుకూల రాష్ట్రాల్లో ఖర్చు చేస్తున్నందున కొన్ని రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతున్నాయన్న చర్చకు కెసిఆర్ తెర లేపారు. రాష్ట్రాలక ు ఆర్థిక అధికారం లేకుండా పోతే ఫెడరల్ స్ఫూర్తికి అర్థం లేదన్నది ఆయన వాదన. ఈ పరిస్థితి పోవాలంటే జాతీయ పార్టీల గుత్తాధిపత్యాన్ని నిలువరించడమే సరైన మార్గమని ఆయన భావిస్తున్నారు. దేశవ్యాప్త రైతు సమస్యల పరిష్కారం, రాష్ట్రాల అధికారాలను కాపాడుకోవడం వంటి ఫార్ములా మిగతా ప్రాంతీయ పార్టీలన్నింటినీ ఒకే తాటిపై తీసుకురావడానికి ఇంధనంలా పనిచేస్తుందని కెసిఆర్ నమ్మకం. వారం, పది రోజులుగా జరుగుతున్న పరిణామాలలో బిజెపి, కాంగ్రెస్ రెండు పార్టీలూ రైతుల జపమే చేస్తున్నాయి. ఈ క్రెడిట్ కెసిఆర్‌కే దక్కుతుంది. ఇక వేర్వేరు పోరాట పంథాలతో జాతీయ రణరంగంలో అదృష్టాన్ని పరీక్షించుకోవాలని కెసిఆర్, చంద్రబాబు భావిస్తుండవచ్చు. కానీ వారి టార్గెట్ మోదీ. విడివిడిగా ఎవరికి వారుగా వేస్తున్న ఎత్తుగడలు దేశంలో కొత్త రాజకీయ సమీకరణలకు దారితీయనున్నాయి. దేశంలో బీజేపీ సర్కారు దూకుడుకు వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. ప్రాంతీయ పార్టీల పునరేకీకరణ జరగనున్నది. కొత్త కూటమి దిశగా అవి పయనిస్తున్నాయి. ఒక్కొక్క భాగస్వామ్య పక్షాన్ని ఎన్డీయే కోల్పోతోంది. ఎన్డీయే కూటమి నుంచి తెలుగుదేశం పార్టీ వైదొలగింది. ఎన్డీయే ప్రభుత్వంపై టీడీపీ ఇచ్చిన అవిశ్వాస తీర్మానానికి కాంగ్రెస్, వామపక్షాలతోపాటు మమతా బెనర్జీ నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్, ఇతర ఎన్డీయే యేతర పక్షాలు మద్దతు పలికాయి.


అవిశ్వాస తీర్మానం వీగిపోయినా బీజేపీ పతనానికి ఇది నాంది పలుకుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గోరఖ్‌పూర్, ఫూల్పూర్ లోక్‌సభ ఉప ఎన్నికల ఫలితాలు బీజేపీకి దిగ్భ్రాంతి కల్గించాయి. ఇదే పరంపర కొనసాగితే ఈ రెండు పార్టీలు యూపీలో 57 స్థానాల్లో గెలిచే అవకాశాలు ఉంటాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బీజేపీ ఇక్కట్లు ఈ రాష్ట్రంతోనే మొదలయ్యే అవకాశాలు ఉన్నాయి. బీహార్‌లో లాలూ తనయుడు, మాజీ డిప్యూటీ సీఎం తేజస్వి యాదవ్.. అధికార జేడీయూబీజేపీ కూటమిని గట్టిగా ఢీకొట్టి అరారియా లోక్‌సభ స్థానంతోపాటు మరో అసెంబ్లీ స్థానంలో విజయం సాధించారు. 2015లో జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయేతో కలిసి పనిచేసిన మాజీ సీఎం జీతన్‌రాం మాంఝీ ఈ ఉప ఎన్నికల్లో ఆర్జేడీకి మద్దతు పలికారు. ఇది క ూడా రానున్న ఎన్నికల్లో బీజేపీకి ఇబ్బందికర పరిస్థితులను సృష్టించే అవకాశం ఉంది. మరోవైపు 2019 ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తామని మహారాష్ట్రలో ఎన్డీయే మిత్రపక్షం శివసేన ప్రకటించింది. పంజాబ్‌లో అధికారానికి దూరమైన అకాలీదళ్.. బీజేపీతోఅంటీముట్టనట్లే వ్యవహరిస్తున్నది. పశ్చిమ బెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్ బలమైన శక్తిగా ఉంది. అటు జమ్ము కశ్మీర్‌లోని పీడీపీ, బీజేపీ ప్రతి అంశంలోనూ పరస్పరం విభేదిస్తున్నాయి. ఇటువంటి సమయంలో కీలక భాగస్వామిగా ఉన్న టీడీపీ కూడా బీజేపీకి దూరం అవడం ఎన్డీయేకు కోలుకోలేని దెబ్బ. సీఎం కేసీఆర్ ప్రత్యామ్నాయ కూటమి పిలుపుతో గడచిన కొన్ని రోజులుగా రాజకీయ ఉష్ణోగ్రతలు పెరిగిపోయాయి.

-ఎస్.కె.జకీర్.

చైనా బాటలో రష్యా

వ్లాదిమిర్ పుతిన్ రష్యా అధ్యక్షునిగా నాల్గవ సారి ఎన్నిక కావడం ఊహించిందే. అన్ని వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకున్న పుతిన్ జోసెఫ్ స్టాలిన్ తర్వాత రష్యాను ఎక్కువ కాలం పరిపాలించిన నేతగా చరిత్రలో శాశ్వత స్థానాన్ని పొందనున్నారు. ప్రపంచ దేశాలు ప్రజాస్వామ్యం వైపు, యువ నాయకత్వం వైపు చూస్తున్న సమయంలో చైనా, రష్యాలు ఆరున్నర దశాబ్దాలు పైబడిన వారికి అవకాశం కల్పించడం,అధ్యక్ష పదవిలో సుదీర్ఘ కాలం కొనసాగే దుకు అవకాశం కల్పించడం విశేషం. ఏకవ్యక్తి స్వామ్యంలో చైనా బాటలో రష్యా నడుస్తోంది..అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏడు పదులు దాటిన నాయకుడు. అగ్రరాజ్యాలైన అమెరికా, ఒక నాటి అగ్రరాజ్యమైన సోవియట్ పోటీ పడుతున్న చైనా అరవైఐదు సంవత్సరాలు దాటిన వారికే పాలనా అధికారం అప్పగిస్తున్నాయి. రష్యా ఒకప్పుడు కమ్యూనిస్టు దేశం.అలాగే, చైనా కూడా ఈ రెండు దేశాలు ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల్లో కమ్యూనిస్టులకు స్ఫూర్తి దాయకంగా ఉండేవి. ఆనాటి రష్యాలో కమ్యూనిజాన్ని స్ఫూర్తిగా తీసుకుని మహాకవి శ్రీశ్రీ తెలుగులో గర్జించు రష్యా అంటూ జనాన్ని ఉత్తేజ పర్చే గేయాలు రాశారు.ఇప్పుడు రష్యాలోనూ, చైనాలోనూ కమ్యూనిజం నేతి బీరచందంగా తయారైంది.1980 వ దశకం వరకూ యునైటెడ్ సోవియట్ సోషలిస్టు(యూఎస్ఎస్ ఆర్) కమ్యూనిస్టు దేశంగానే కొనసాగింది. గోర్బొచెవ్ గ్లాస్ నాస్ట్, పెరిస్ట్రోయికాలను ప్రవేశపెట్టారు. అరమరికలు లేని సమాజం కోసమే ఈ సంస్కరణలని ఆయన ఘనంగా చాటుకున్నారు. ఆయన హయాంలోనే యూఎస్ ఎస్ ఆర్ వివిధ దేశాలుగా విడిపోయింది. సోవియట్ యూనియన్ కు ఆయన ఎనిమిదవ,చివరి అధ్యక్షుడు.ఆయన సోవియట్ కమ్యూనిస్టు పార్టీకి ప్రధాన కార్యదర్శిగా 1985 నుంచి 1991 వరకూ కొనసాగారు. గోర్బొచెవ్ సంస్కరణలు చరిత్రాత్మకమైనవి. పెరిస్ట్రోయికా ద్వారా సోవియట్ కమ్యూనిస్టు పార్టీలోప్రజాస్వామ్య విధానాలను ప్రవేశపెట్టిందుకు ఆయన తీసుకున్న నిర్ణయం అప్పట్లో సంచలనాత్మకమైంది. ఆయన నిర్ణయానికి ప్రజల్లో వ్యతిరేకతను పెంచడంలో అవినీతికి పాల్పడిన నాయకులు,వారికి వత్తాసుగానున్న ఆయిల్ కంపెనీల యజమానులు ప్రధాన పాత్ర వహించారు. ఇప్పుడు పుతిన్‌కి అండగా ఉంటున్న ఆయిల్ కంపెనీల యజమానులు అప్పట్లో గోర్బొచెవ్ సంస్కరణలను ముందుకు సాగనివ్వకుండా చేశారు. వారందరికీ అమెరికా మద్దతు. చమురు ఎగుమతుల్లో రష్యాని దెబ్బతీయడానికి అమెరికా కావాలని ప్రయత్నించింది. ప్రచ్ఛన్నయుద్ధ కాలంలో రష్యాను ఆర్థికంగా దెబ్బతీయడానికి ప్రయత్నించింది. ప్రచ్ఛన్నయుద్ధ సమయంలో అమెరికా, రష్యాలు రెండూ ఎత్తులు,పై ఎత్తులతో ప్రపంచంలోని వివిధ ప్రాంతాలను తమ అధీనంలోకి తెచ్చుకోవడానికి సాగించిన యత్నాల్లో చివరికి అమెరికా విజయం సాధించి ఏకైక అగ్రరాజ్యం అయింది.ఆఫ్ఘనిస్తాన్ లో మంటలు రాజేయడంలో ముందు రష్యా,తర్వాత అమెరికా ఎంతగా ప్రయత్నించాయో మూడు దశాబ్దాల క్రితం నాటి చరిత్ర పరికిస్తే స్పష్టం అవుతుంది. మొదట కమ్యూనిస్టు సమాజంలో పెరిగిన పుతిన్ బోరిస్ ఎల్సిన్ అధ్యక్షునిగా ఉన్నప్పుడు రహస్య గూఢచార సంస్థ కేజీబీలో చాలా కాలం పని చేశారు.ఆ సమయంలోనే ఆయన అనేక ఆరోపణలను ఎదుర్కొన్నారు కూడా.పెట్టుబడిదారులతో స్నేహ సంబంధాలు వృద్ధి చేసుకున్నారు. ఆ సమయంలో ఏర్పరుచుకున్న పరిచయాలతో విద్యావంతుల వేదికను ఏర్పరిచారు. సోషలిస్టు మార్కెట్ ప్రజలకు మేలు చేస్తుందని ఆయన నమ్ముతున్నారు.అదే సందర్భంగా మాజీ సోవియట్ వ్యవస్థను అనేక సార్లు ఖండించారు.మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మార్కెట్లను తీర్చిదిద్దాల్సిన అవసరాన్ని ఆయన పెక్కు సందర్భాల్లో స్పష్టంచేశారు. ఆయనను కమ్యూనిస్టు వ్యతిరేకిగా కమ్యూనిస్టులు ప్రచారంచేశారు. ఆఫ్ఘనిస్తాన్‌లో సోవియట్ యూనియన్ పాత్ర విఫలంకావడంతో రష్యా వెనక్కి తగ్గింది. అగ్రరాజ్యహోదా కోల్పోయినా రష్యా ఇప్పటికీ అంతర్జాతీయ వ్యవహారాల్లో తన ఇమేజ్ నిలుపుకోవడానికి ఆయన సమయానుకూలంగా పావులు కదుపుతున్నారు. ఇటీవలి రెండు పరిణామాలు ఆయన ప్రతిష్ఠను మసకబార్చాయి. అమెరికా అధ్యక్ష పదవికి రెండేళ్ళ క్రితం జరిగిన ఎన్నికల్లో ఆయన జోక్యం చేసుకున్నారన్న ఆరోపణలు చాలా తీవ్రమైనవి. ఆయనకే కాక, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కు మచ్చ తెచ్చిందనే చెప్పాలి. బ్రిటిష్ రష్యా గూఢచారిపై విషప్రయోగం చేసిన దాడి పుతిన్‌కి తెలియకుండా జరిగి ఉండదని అంటున్నారు.ఈ ఘటన అనంతరం 23 మంది రష్యన్ దౌత్యవేత్తలను బ్రిటన్ బహిష్కరించింది. ఇరాన్ సాయం కోరడంతో సిరియాలో పుతిన్ జోక్యం చేసుకున్నారు. చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ జీవిత కాల అధ్యక్షునిగా కొనసాగేందుకు ఇటీవల రాజ్యాంగాన్ని మార్చుకున్నారు. అప్పుడు పుతిన్ రాజ్యాంగాన్ని మార్చుకోకపోయినా, ఎన్నికల్లో రిగ్గింగ్ చేయడంద్వారా తన పదవిని నిలబెట్టుకుంటున్నారన్నది ప్రతిపక్షాల ఆరోపణ. ఆయన వయసు 71 సంవత్సరాలు. మరో ఆరేళ్ళ పాటు అధికారంలో కొనసాగుతారు. అమెరికాఅధ్యక్ష పదవి ఎన్నికలో పుతిన్ జోక్యంపై రాబర్ట్ ముల్లర్‌నేతృత్వంలో ట్రంప్ ఒక కమిషన్ ని నియమించారు. ఆ కమిషన్ సిఫార్సుపై ఐదు రష్యన్ సంస్థలపైనా, 19 మంది రష్యన్ అధికారులపైనా అమెరికా చర్యలు తీసుకుంది.మొత్తం మీద పుతిన్ ఎక్కువ కాలం అధికారంలో కొనసాగేందుకు మార్గాన్ని సుగమం చేసుకున్నప్పటికీ నియంతృత్వ పోకడలకు పోయినట్టు వచ్చిన ఆరోపణలు ఆయన ప్రతిష్ఠను మసకబార్చాయి.

ఒక వీరుడు-ఒక భీరువు



అవినీతిపరుని జనం మెచ్చరు, నిజమే. కానీ బీహార్ రాజకీయాల సందర్భంలో ఒక చిత్రమైన ప్రశ్న! అవినీతిని విడిగా చూసినప్పుడు జనం హర్షించరన్నది ఎంత నిజమే అయినా, అవినీతి ముద్ర ఉన్న ఒక వీరునికి, అవినీతి ముద్రలేని ఒక భీరువుకీ మధ్య పోటీ ఏర్పడినప్పుడు జనం ఎవరివైపు మొగ్గుతారు? బీహార్‌లో ఇటీవలి ఉప ఎన్నికల ఫలితాలు దీనికి సమాధానం చెబుతున్నాయి. ఒక లోక్‌సభ స్థానంలోనూ, ఒక అసెంబ్లీ స్థానంలోనూ అవినీతి ముద్రలేని నితీశ్ కుమార్‌ను, అధికారంలో ఆయన భాగస్వామి అయిన బీజేపీని జనం ఓడించి, ఆపాదమస్తకం అవినీతి ముద్ర ఉన్న లాలూప్రసాద్ యాదవ్‌ను గెలిపించారు. లాలూ మీద పశుగ్రాసం కుంభకోణంతో సహా అయిదారు అవినీతి కేసులున్నాయి. ఇంతకుముందు ఒకసారి జైలుకు వెళ్ళి వచ్చారు. ఇప్పుడు మళ్ళీ జైలులో ఉన్నారు. తన మీద కేసులు ఉండడంతో భార్యను ముఖ్యమంత్రి పీఠం మీద కూర్చోబెట్టి ప్రజాస్వామ్యాన్ని కుటుంబస్వామ్యంగా మార్చిన చరిత్ర ఇప్పటికే ఆయనకు ఉంది. ఆ తర్వాత కొడుకుల్ని కూడా రాజకీయాల్లోకి తెచ్చి కుటుంబస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లారు. కూతురికి కూడా అవినీతి ఆరోపణల ఆస్తిలో వాటా ఇచ్చారు. అయినాసరే, ఉత్తర భారతమంతటా నరేంద్రమోడీకి అనుకూలంగా వీస్తున్న ప్రభంజనానికి కూడా ఎదురు నిలిచి అసెంబ్లీ ఎన్నికలలో తన నాయకత్వంలోని ఆర్జేడీ -నితీశ్ నాయకత్వంలోని జేడీయూ కూటమిని గెలుపు బాట పట్టించడంలో ముఖ్యపాత్ర పోషించారు. తన పార్టీకే ఎక్కువ స్థానాలు వచ్చినా నితీశ్‌కే ముఖ్యమంత్రిత్వాన్ని విడిచిపెట్టారు. ఇప్పుడు నితీశ్ కుమార్ గురించి చూద్దాం. అడ్డదారుల్లో డబ్బూ, ఆస్తులూ వెనకేయడమే అవినీతి అనుకుంటే, అలాంటి అవినీతి ఆరోపణలు ఆయన మీద లేవు. ఇంతకు ముందు రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా ఉండి బీహార్‌ను అభివృద్ధి మార్గం పట్టించడానికి ఇతోధికంగా కృషి చేసిన నేతగా పేరు తెచ్చుకున్నారు. లాలూ ప్రసాద్ యాదవ్‌లా ఆయన మరొకరి అండ లేకుండా అధికారపీఠానికి ఎగబాకినవారు కాదు. ఎన్డీయే ఛత్రచ్ఛాయలోనే ఆయన రాజకీయంగా ఎదిగారు. అవినీతి నిర్వచనాన్ని కాస్త విస్తరించుకుని, సెక్యులర్ వాది అయిన నితీశ్ మతతత్వపక్షమైన బీజేపీతో అంటకాగడాన్ని సిద్ధాంతపరమైన అవినీతిగా గుర్తిస్తే ఆయనా అవినీతిపరుడే అవుతారేమో. కానీ, ఏ పార్టీకీ పూర్తి మెజారిటీ రానిస్థితిలో ఏదోవిధంగా ప్రభుత్వాన్ని స్థాపించడం ముఖ్యమై, ఆవిధంగా సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడడం మొదలయ్యాక ఆ అవసరం ముందు సైద్ధాంతిక అవినీతి చిన్నదైపోవడంతో ఆయనా, ఆయనలాంటి మరికొందరు అవినీతి ముద్ర పడకుండా తప్పించుకోగలుగుతున్నారు. ఆర్థిక అవినీతి ఒక్కటే అవినీతిగా మారడంతో అవినీతి ముద్ర నుంచి తప్పించుకున్నవాటిలో అవకాశవాదం కూడా ఒకటి. నితీశ్ కుమార్ లాంటి వారికి అది కూడా ఒక వెసులుబాటు అయింది. 2014 లోక్‌సభ ఎన్నికల ముందువరకూ తను ఎన్డీయే కూటమిలో ఉన్నప్పుడు తన సెక్యులర్ చింతనకు, బీజేపీ మతతత్వానికీ మధ్య నితీశ్‌కు ఎలాంటి విరోధం కనిపించలేదు. ప్రధానమంత్రి అభ్యర్థిగా మోడీ ముందుకు వచ్చిన తర్వాతే ఆ విరోధం కనిపించింది. దాంతో ఆయన ఎన్డీయే నుంచి బయటపడి అంతవరకూ తనకు బద్ధవిరోధిగా ఉన్న లాలూ ప్రసాద్ యాదవ్‌తో చేతులు కలిపి మూడోసారి ముఖ్యమంత్రి కావడంలో పచ్చి అవకాశవాదం ఉన్నప్పటికీ అది ఆయనపై ఉన్న అవినీతిరహితుడన్న ముద్రను చెరపలేకపోయింది.

ఆ తర్వాత లాలూపై, ఆయన కుటుంబసభ్యులపై ఉన్న ఆర్థిక అవినీతి ఆరోపణలు హఠాత్తుగా గుర్తొచ్చి తను ముఖ్యమంత్రి కావడానికి కలసివచ్చిన మహాఘట్ బంధన్‌ను విచ్ఛిన్నం చేస్తూ తిరిగి ఎన్డీయే చంక నెక్కి ముఖ్యమంత్రి పదవిలో కొనసాగడం ద్వారా తను పచ్చి అవకాశవాదినని మరోసారి నిరూపించుకోడానికి ఆయన వెనుకాడలేదు. ఎందుకంటే, అవినీతి జాబితాలో అవకాశవాదం లేదు. లేకపోగా తనపై ఉన్న అవినీతిరహితుడన్న ముద్రను మరింత గట్టి పరచుకోడానికి ఈ చర్య తనకు తోడ్పడుతుందని ఆయన భావించినా ఆశ్చర్యం లేదు. ఆర్థిక అవినీతిని మాత్రమే అవినీతిగా నిర్వచించేవారి గొంతు గట్టిగా వినిపించినంత కాలం, వారే వర్తమాన రాజకీయాలకు భాష్యకారులుగా ఉన్నంతకాలం లాలూ ప్రసాద్ యాదవ్ లాంటివారికి న్యాయం జరగదు. చరిత్రలో వారు కళంకితులుగానే మిగిలిపోతారు. వారిలో ఇతరేతర సుగుణాలు ఎన్ని ఉన్నా అవి గుర్తింపు పొందవు. ఉదాహరణకు, నితీశ్‌లా లాలూ మరొకరి వెన్నెముకను అంటు కట్టుకుని కాకుండా, సొంత వెన్నెముకతో అధికారంలో నిలబడిన వ్యక్తి. నితీశ్‌లో ఉన్నట్టు సైద్ధాంతిక అవినీతి కానీ, అవకాశవాద అవినీతి కానీ ఆయనలో లేవు. ఆయన మొదటినుంచీ సెక్యులర్ వాదం మీద మొండిగా నిలబడ్డారు. తొంభై దశకంలో అద్వానీ అయోధ్య రథయాత్రను అడ్డుకుంటానని ప్రకటించి ఎంత వీరత్వాన్ని చాటుకున్నారో, 2014 ఎన్నికల ముందూ, ఆ తర్వాతా మోడీ ప్రభంజనానికి ఎదురు నిలవడంలోనూ అంతే వీరత్వాన్ని చాటుకున్నారు. అప్పటికే అవినీతి కుంభకోణాల కేసుల్లో ఒకసారి జైలుకు వెళ్ళి వచ్చిన లాలూకు- ముందు ముందు మరోసారి, బహుశా మరెన్నోసార్లు జైలుకు వెళ్లవలసి రావచ్చునని తెలియకుండా ఉండే అవకాశమే లేదు. ఆ పరిస్థితిలో నితీశ్‌లా ఆయన కూడా కాస్త సైద్ధాంతిక అవినీతిని, అవకాశవాద అవినీతిని మరిగి మోడీతో సయోధ్య పాటించి ఉంటే ఇప్పుడు జైలుగోడల మధ్య మగ్గవలసివచ్చేది కాదు. మోడీకీ పాదాక్రాంతుడై భీరుడనిపించుకునే బదులు, జైలుకు వెళ్లడానికే మొగ్గు చూపి వీరుడనిపించుకున్నారు. చెడు చేయడంలోనే కాదు, మంచి చేయడంలోనూ తెగువను చాటుకోవడం ఒక్క వీరుడికే సాధ్యమవుతుంది. అలాగే ఇతరులపై ఔదార్యాన్ని చాటుకోవడం కూడా. గత అసెంబ్లీ ఎన్నికలలో ఆర్జేడీ -జేడీయూ కూటమిని విజయతీరం వైపు నడిపించిన ఘనతలో పెద్ద వాటా తనదే అయినా ముఖ్యమంత్రిత్వం తన అర్థాంగికో, కుమారుడికో దక్కాలని లాలూ అనకుండా నితీశ్‌కు విడిచిపెట్టడంలో ఒక వీరుడికి మాత్రమే సాధ్యమైన ఔదార్యం లేదని అనలేం. భీరుడి లక్షణాలు సరిగ్గా వీటికి తలకిందులుగా ఉంటాయి. క్లిష్టపరిస్థితి ఎదురైనప్పుడు ఒక భీరువు నమ్మిన జనాన్ని నట్టేట ముంచి ఆత్మరక్షణ చూసుకుంటాడు. సిద్ధాంతం కోసం అధికారాన్ని త్యాగం చేసే బదులు, అధికారం కోసం సిద్ధాంతాన్ని త్యాగం చేస్తాడు. శత్రువు బలహీనుడనుకున్నప్పుడు అతనిపై కత్తిదూసినా, బలవత్తరుడని తెలియగానే కాళ్లమీద పడతాడు. నితీశ్‌కుమార్ చేసింది అదే. ఉత్తరప్రదేశ్ ఎన్నికలలో బీజేపీ అప్రతిహత విజయం చూసి గుండె చెదిరింది కనుకనే ఆయన భద్రతను వెతుక్కుంటూ తిరిగి మోడీ లాల్చీ జేబులో దూరిపోయారు. మోడీకి 2019 ఎన్నికలలోనూ తిరుగులేదని ఆయన నొక్కి చెప్పడంలో కనిపించింది ఆయనలోని ఆత్మరక్షణ, అధికార రక్షణల గురించిన యావే. తనలో సైద్ధాంతిక అవినీతి ఉన్నా, అవకాశవాద అవినీతి ఉన్నా అవినీతి రహితుడన్న ముద్రను కాపాడుకుంటూ వచ్చిన నితీశ్, తిరిగి ఎన్డీయే గూటికి చేరడంలో భీరువు అన్న ముద్ర తన మీద పడకుండా చేసుకోలేకపోయారు. బీజేపీని ఓటమి అంచులవరకూ తీసుకెళ్లిన గుజరాత్ ఎన్నికల వరకూ ఓపిక పట్టి ఉంటే ఆ ముద్రను తప్పించుకుని ఉండేవారేమో. అధికార రక్షణ అనే రంధిలో పడిపోయి ఆ ఓపికను, ముందుచూపును కోల్పోవడం కూడా ఒక భీరువు లక్షణమే.

ఏ రూపంలోని అవినీతి అయినా గర్హనీయమే. అందులో సందేహం లేదు. ఒక భీరువూ అంతే గర్హనీయుడు. వీరుడివల్ల ఎప్పుడైనా ఏ కొంచెమైనా మంచి జరిగే అవకాశం ఉంటుంది కానీ, ఒక భీరువు వల్ల ఏ మంచీ జరగదు. బీహార్ ఉప ఎన్నికలలో భీరువైన నితీశ్‌ను ఓడించి వీరుడైన లాలూకు పట్టం కట్టడం ద్వారా అక్కడి జనం చాటిచెప్పింది ఈ సత్యాన్నే. జనం ప్రతిసారీ అవలక్షణాలు ఉన్న ఒక వీరుడివైపు మొగ్గు చూపకపోవచ్చు, కానీ వీరుడికీ, భీరువుకీ పోటీ ఏర్పడినప్పుడు వాళ్ళు భీరువును తిరస్కరించితీరతారు.

-భాస్కరం కల్లూరి

ఆదినుంచే విజ్ఞానానికి పునాది

పుట్టుకతోనే ఏ మనిషి ప్రసిద్ధుడుకాలేడు. పసితనంలోనే బడిలోనూ, కుటుంబంలోనూ ఆ లేత వయస్సు మేధస్సులోనే మంచిని పెంచే, మానవతను పెంపొందించే సృజనాత్మక బడిపంతులు, కుటుంబ సభ్యులు ప్రేరణ ఇవ్వాలి. తొలిదశలోనే చెడుసావాసాలకు, చెడుమార్గాలకు ఎలాంటి అవకాశం లేని రుజుమార్గంలో పయనించే దిశగా పిల్లల పెంపకం కొనసాగాలి. పిల్లల మానసిక పరిస్థితి మైనపు ముద్దలాంటిది. అలాంటి మనోప్రవృత్తులతో ద్వేషాన్ని కర్కశాన్ని, కఠినత్వాన్ని, కరకుదనపు మూసను చొప్పిస్తే వారి మనోప్రవృత్తులు అందుకు అనుగుణంగా తయారై ఆ మూస విధానం జీవిత పర్యంతం నిక్షిప్తమై చెడుమార్గంలో పయనించే దిశగా పయనిస్తుంది.

బడి పిల్లల చదువులకు పునాది. పాఠశాలల్లో చెప్పే పాఠ్యాంశాలు, హోంవర్క్ ఒక విధానమైతే ఇంట్లో తల్లిదండ్రులు, తాతా అవ్వలు కూడా పిల్లల మనోవిజ్ఞానాన్ని వికసింపజేసే సూక్తులు, వందలాదిగా ఉన్న శతక పద్యాలను వారిచిన్ని బుర్రలకు ఆహ్లాదం కలిగించే రీతిలో తెలియజేస్తూ ఉంటే మానసిక వికాసంతో పాటు సామాజిక స్పృహ అలవడుతుంది. ఏదో బడికి పంపుతున్నాం చదువరులై వస్తారనే అడియాశల్ని వదులుకొని బడి పాఠాలకు అదనంగా కుటుంబ సభ్యులు కూడా వారిలో విద్యపై చైతన్యం, ప్రపంచ సామాజిక విజ్ఞానాన్ని పెంపొందించాలి. కళాశాలల దశకు వచ్చిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. కొందరు విద్యార్థులు బుద్ధి పూర్వకంగా అధ్యాపకుల బోధనలు, పాఠ్యాంశాలు, గ్రంథాలయాలకు పరిమితమై తాము వచ్చింది చదువుకోవడానికనే ధ్యాసకు పరిమితమై పుస్తకాల పురుగులుగా అపర బుద్ధిమంతులంటూ సీనియర్ల, సహాధ్యాయుల బిరుదులందుకొంటూ మదనపడుతుంటారు. ఈ అపహాస్యాలు తారాస్థాయి నందుకొన్నప్పుడే, ఎందుకీ కళాశాలలో అడుగుపెట్టామని ఆత్మపరిశీలనకు పూనుకొంటారు.

ధనవంతుల బిడ్డలకు డబ్బు సునాయాసంగా చేతికందుతుంది. దేనికీ ఎందుకు అని ప్రశ్నించే అజమాయిషీ అసలే ఉండబోదు. కళాశాల వారికొక వినోదాన్ని కలిగించే ప్రదర్శనశాల - బుద్ధిపుడితే బోధనకు చెవులప్పగిస్తారు లేకపోతే బోర్ కొడుతుందని ఉడాయిస్తారు. అడిగే నాథులు అంతంత మాత్రమే. ఇలాంటివారు బృందాలు బృందాలుగా తమ కార్యాచరణ రూపొందించుకొని కోరికలే గుర్రాలై పరుగులు పెడతారు. విద్యాలయాల ఆవరణలో కొందరు చదువుకోసం వస్తే ధనవంతుల బిడ్డల్ని ఆసరాగా చేసుకొని వారి దృష్టిని విషయవాంఛలపై మళ్ళిస్తూ మాదకద్రవ్యాలను గురించి, అందులో లభ్యమయ్యే స్వర్గ సుఖాలను గురించి పదే పదే ఏకరువు పెడుతూ ధనవంతులైన విద్యార్థుల్ని మాదకద్రవ్యాల మత్తులోకి లొంగదీసుకొంటారు. యువకుల్నే కాదు యువతుల్ని సైతం ఈ ఊబిలోకి లాగే అమ్మాయిలు సైతం తయారుగా ఉంటారు. మాదకద్రవ్యాలు విద్యాలయ ప్రాంగణాలలోకి ఎలా వస్తాయో, వాటిని ఉపయోగించే తీరు గుట్టుచప్పుడు కాకుండా నిరవధికంగా జరిగిపోతుంటాయి. అపమార్గాలలో డబ్బుని సేకరించి మాదకద్రవ్యాల విక్రయాల డాన్‌లుగా విద్యార్థులు చెలామణి అయి కొండొకచోట చట్టపరమైన దోషులుగా మారి కటకటాలపాలైన ఉదంతాలు మీడియాలో బోలెడన్ని వెలుగుచూశాయి. ప్రభుత్వ కళాశాలల కంటే కార్పొరేట్ విద్యావిధానం కలుషితమైపోతుంది:

మార్కులు, ర్యాంకులు కార్పొరేట్ విద్యాలయాలు, పేరు గొప్పకోసం ఉన్నతాధికారులను ఆశ్రయించి పరువుకోసం పడిగాపులు పడిన ఉదంతాల్ని ఆయా కార్పొరేట్ కళాశాలలవారు కొట్టి పారేసినా, నిజం నిప్పులాగా జ్వలించడం ఖాయం. ఒక్క కార్పొరేట్ విద్యాసంస్థలు అనేమిటి, ప్రభుత్వ కళాశాలల్లో నేటి విద్యాబోధన పట్టాలకు పరిమితమై, ప్రతిభను, పనిలో సామర్థ్యానికి లంకె కుదరక పారిశ్రామికవేత్తలు పెదవి విరుస్తున్నారు. లౌక్యం, ప్రతిభాసామర్థ్యాలు లేకుండా పట్టాలు చేతపట్టుకొని వరుసలలో నిల్చున్న విద్యార్థులకు ఏ ప్రాతిపదికన ఉద్యోగాలివ్వాలని పారిశ్రామికవేత్తలు తలలు బాదుకొంటున్నారు. సప్రామాణికమైన వృత్తి విద్యలో ప్రామాణికత కరవు వృత్తి విద్యారంగంలో ప్రామాణికత కరువైన పాఠ్యాంశాలు, వివరణ వితరణలేని బోధన, సంబంధిత ప్రయోగశాలల కరవు, విద్యార్థుల కాలాన్నే కాకుండా వారు నేర్చిన విద్య నిర్వీర్యమై పోతోంది. ఉద్యోగ ఆసక్తితో ఎన్నో కష్టనష్టాలకు వోర్చి పిల్లల్ని చదివిస్తున్న తల్లిదండ్రుల ఆవేదన ఒకవైపు, ఇన్నేళ్ళూ చదివి చివరికి పట్టాచేత పట్టుకొన్నా, ఆయా పారిశ్రామికరంగాల వారు మీలాంటి ప్రతిభ, ఉత్పాదకతకు సరిపోనివారికి ఉద్యోగాలు కట్టబెడితే పరిశ్రమలు మూన్నాళ్ళకే మూతపడే పరిస్థితి దాపురించడం ఖాయమని ముఖం మీదే చెప్పడం వృత్తిపరమైన విద్యావిధానానికి ఎంత దుర్భర పరిస్థితి వైపు సాగుతోందో విజ్ఞులే గ్రహించాలి.

విద్యాపరంగా తెలుగుతేజాన్ని ప్రపంచ వ్యాప్తంచేసి ఒకటవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకూ ఖచ్చితంగా అమలు చేస్తామన్న ఉభయ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రభుత్వ ఆదేశాలకే పరిమితంగా ఆపై ముందుకు అడుగుపడని దిశ ఆవిష్కృతమౌతోంది. ఆంధ్రప్రదేశ్‌లో పలు అకాడమీలను వ్యవస్థీకృతం చేస్తున్నట్లు ఇటీవల ప్రభుత్వపరమైన ఆదేశాలు జారీ అయినా అందుకు కావాల్సిన నిధులు, విధులు బహిష్కృతం కాకపోవడం శోచనీయం. కళాశాలల్లోను, విశ్వవిద్యాలయాల్లోనూ ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న విషయ విజ్ఞానం, సాంకేతికతను ఒడిసిపట్టి అందుకు అనుగుణంగా ప్రామాణికతతో కూడిన విద్యాపాఠ్యప్రణాళికలను రూపొందించడంలో మన విశ్వవిద్యాలయాలు పోటీపడి విశ్వానికే ఆకర్షణీయమైన సమగ్ర పాఠ్యప్రణాళికలు రూపొందించాలి. పాతతరం పాఠ్యాంశాల ప్రణాళిక ముల్లెనే పదే పదే విప్పుతూ ఇదే నేటితరం శాస్త్రీయ విజ్ఞానమనీ, నైపుణ్యమని చంకలు గుద్దుకొంటే అంతకంటే అపరిపక్వత, వెర్రిమొర్రి ఆలోచనలు మరెక్కడా ఉండబోవు.

-దాసరి కృష్ణారెడ్డి, 9885326493

తెలంగాణ పోరాటంలో లంబాడీల పాత్ర

నేడు ఠానూ నాయక్ వర్ధంతి

తెలంగాణ సాయుధ పోరాటంలో లంబాడీల పరిస్థితి చాలా దారుణంగా ఉండేది. రజాకార్ల, పోలీసుల నుండి తప్పించుకోవడానికి ఉద్యమకారులు మారుమూల పల్లెలైన తండాల్లో తలదాచుకునేవారు. తండాల్లోని లంబాడీలు ఉద్యమకారులకు బాసటగా నిలిచి ఆశ్రయం కల్పించేవారు. వారికోసం నిజాం పోలీసులు, రజాకార్లు గాలించి తండాలపై దాడికి పాల్పడేవారు. ఆ క్రమంలో వారు బంజారా స్త్రీలను నానా హింసలకు గురిచేసేవారు. ఎన్నో సందర్భాల్లో అనేకమంది స్త్రీలు తమ ప్రాణాలకు ముప్పుందని తెలిసినా లెక్కచేయక పోరాడి, ఉద్యమకారుల ఆచూకి చెప్పకుండా ప్రాణాలు పోగొట్టుకున్నారు, ఆనాటి ఉద్యమకారులు. పోరాట ఖిల్లా నల్లగొండ జిల్లా అని నిరూపిస్తూ వచ్చారు. సూర్యాపేట తాలూకా వల్లభాపురంలో భీమ్లా, వాచ్యాల ఇళ్ళు ఉద్యమకారులకు సురక్షిత ప్రదేశాలుగా ఉండేవి. ఆ ఇళ్ళలోని స్త్రీలు కూడా ఉద్యమకారులకు తమ అండదండలను అందించారు. ఇది తెలుసుకున్న రజాకార్లు భీమ్లా, వాచ్యాలను అరెస్టు చేసి నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపారు. జనగాం తాలూకా ధర్మాపురం తండా లండాబీల భూములను విసునూరు దేశ్‌ముఖ్ అన్యాయంగా ఆక్రమించుకొని దౌర్జన్యం చేయసాగారు. వారిని చిత్రహింసలకు గురిచేయడం మొదలుపెట్టారు. ఒకసారి హామూ నాయక్, అతని కొడుకు ఠానూ నాయక్‌ను పట్టుకోవడానికి విసునూరు దేశ్‌ముఖ్ కొడుకు బాబు దాడి చేసినప్పుడు హాము తల్లి మంగ్లీబాయి వీరోచితంగా పోరాడింది. తనముందే తనవాళ్లను కాల్చి చంపినా వెరవలేదు. విసునూరు బాబును తర్వాత భారత సైన్యాలు హతమార్చాయి. మంగ్లీ 1951 వరకూ జైల్లో ఉండి తర్వాత తనువు చాలించింది. బంజారాల త్యాగానికి మారుపేరని ఠానూనాయక్ కుటుంబం నిరూపించింది. కామ్రేడ్ దొడ్డి కొమరయ్యను రజాకార్లు బలిగొన్నప్పుడు గ్రామ ప్రజలకు ధైర్యం చెప్పి వాళ్ళను మళ్ళీ కూడదీసి కదిలించింది కామ్రేడ్ ఠానునాయక్, అతని కుటుంబసభ్యులే. ఠాను కుటుంబంలోని వారంతా వీరోచితంగా పోరాడి అసువులు బాసిన వాళ్ళే. చివరకు 20 మార్చి 1950న కామ్రేడ్ ఠాను నాయక్ ముంద్రాయి గ్రామంలో వీరమరణం చెందాడు. ఎందరో లంబాడీలు తెలంగాణ సాయుధ పోరాటంలో అమరులయ్యారు. అలాంటి సంఘటనలను మాత్రమే కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య తన వీర తెలంగాణ విప్లవ పోరాటం గుణపాఠాలు గ్రంథంలో పొందుపరిచారు. ఇంకా అనేక సంఘటనలు చరిత్రపుటలకు ఎక్కనేలేదు. ఎంతోమంది వీరబంజారాల స్మృతులు గతించిన లంబాడీల తాతలతోనే అంతరించిపోయాయి. ఇలాంటివి మరెన్నో చారిత్రక ఉద్యమ ఘటనలు మరుగున పడ్డాయి.

మన దేశంలోని ఏ సామాజిక ఉద్యమాలను, అస్తిత్వ ఉద్యమాలను చూసినా గిరిజనుల పాత్ర కీలకమైంది. 2002 సంవత్సరంలో కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం హయాంలోను మూడు రాష్ట్రాలు ఏర్పడ్డాయి. అవి ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్, ఉత్తరాఖండ్. ఈ రాష్ట్రాల ఏర్పాటుకోసం గిరిజనులు తమ ప్రాణాలు సైతం లెక్క చేయకుండా పోరాడారు.

-జి.శంకర్ నాయక్, 9908817986

విజిబుల్ పోలీసింగ్ పెరగాలి

● భూవివాదాల్లో జోక్యం వద్దు
● అధికారులకు మార్గదర్శకాలు:
సైబరాబాద్ సీపీ సజ్జనార్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : విజిబుల్ పోలిసింగ్ పెరిగినపుడే నేరాల సంఖ్య తగ్గుముఖం పడుతుందని సైబరాబాద్ సిపి విసి సజ్జ న్నార్ అన్నారు. సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లోని ప్రధాన కాన్ప రెన్స్ హాల్‌లో సోమవారం ఎస్ఓటి, సిసిఎస్ తదితర విభాగాల (స్టేషన్ హౌజ్ ఆఫీసర్స్) ఎస్‌హెచ్‌వోలతో ఆయన భేటీ అయ్యారు. సమావే శంలో ముందుగా ఎస్‌హెచ్‌వోలకు క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్య లకు అక్కడికక్కడే పరిష్కారాలను సూచించారు. మరేమైన సమస్య లుంటే తన దృష్టికి తీసుకు రావాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా సజ్జన్నార్ మాట్లాడుతూ, శాంతిభద్రతలకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. సైబరాబాద్‌లో విజిబుల్ పోలీ సింగ్‌తో పాటు సిసిటివి ఏర్పాటుకు ప్రాముఖ్యత ఇవ్వాలని సూచిం చారు. చైన్ స్నాచింగ్‌పై జీరో టాలరెన్స్ ఉండాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి నిఘాను పెంచాల్సిన అవసరం ఉందని, పదే పదే నేరాలకు పాల్పడే వారిని గుర్తించి వారిపై పిడి యాక్ట్ కేసులను నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం పోలీసింగ్‌కు సంబం ధించి అధికారులకు పలు సూచనలు చేశారు.

తెలంగాణ రాష్ట్రంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉందని, పోలీసుస్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. మహిళలు, చిన్నపి ల్లలు, వృద్ధుల కేసుల విషయంలో ప్రత్యేకంగా శ్రద్ధ వహించాలని, ఎస్ ఓటి, సిసిఎస్ ఇలా వివిధ శాఖల మధ్య సమన్వయం ఉండాలన్నారు. కేసులను వీలైనంత తొందరగా పరిష్కరించాలని ఇన్‌స్పెక్టర్లకు సూచిం చారు. ఉత్తమ పనితీరు కనబరిచే పోలీసులకు రివార్డులు ఇస్తామ న్నారు. ట్యాబుల్లో ఈ పెట్టికేసులను వేగంగా నమోదు చేయాలని, తరచూ గ్రామీణ ప్రాంతాలలో పర్యటించాలని సూచించారు. ఆర్థిక నేరాలు, వైట్ కాలర్ నేరాలను పూర్తిగా అదుపు చేయాలన్నారు. భూ వివాదాల్లో జోక్యం చేసుకోరాదని, భూ వివాదాలలో కోర్టు తీర్పులకు అనుగుణంగానే నడుచుకోవాలన్నారు. కేసుల వివరాలను ఎప్పటిక ప్పుడు క్రైం అండ్ క్రిమినల్ క్రింగ్ నెట్‌వర్క్ సిస్టం (సిసిటిఎన్ఎస్) లో నమోదు చేయాలన్నారు.

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పోలీసుల రెస్పాన్స్ వేగంగా ఉందని, ఇటీవల జరిగిన హెచ్‌సియు ఘటనను కొన్ని గంటల్లోనే ఛేదిం చిన విషయాన్ని కమిషనర్ ప్రస్తావించారు. సమాచారం అందిన వెం టనే ఆర్జిఐఎ పిఎస్ పరిధిలో తుపాకి, బుల్లెట్ల స్వాధీనం చేసుకోవడం, శామీర్‌పేట ఓఆర్ఆర్‌పై ఎక్స్‌ప్లోసివ్స్‌తో వెళ్తున్న కంటెయినర్ లారీలో మంటలు అంటుకోవడంతో అటుగా వెళ్తున్న శామీర్‌పేట ఎస్ఐ అబ్దుల్ రజాక్ వెంటనే డ్రైవర్‌ను అప్రమత్తం చేసి కిందికి దించడంతో పాటు ఫైర్ ఇంజన్‌ను అప్రమత్తం చేయడంతో ప్రమాదం తప్పిందని పేర్కొ న్నారు. వీరందరికీ రివార్డులు ఇవ్వడం జరిగిందన్నారు.

ప్రజల భాగస్వామ్యం

పోలీసింగ్‌లో ప్రజలను భాగస్వాములను చేయాలని సిపి సజ్జ న్నార్ సూచించారు. పోలీసులకు సాయపడే వారికి (సిటిజన్ పోలీసు) వివరాలు గోప్యంగా ఉంచడంతో పాటు వారికి ప్రోత్సాహకాలు ఇస్తా మన్నారు. ప్రజలు హాక్ ఐ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేలా చూడాల న్నారు. ఈ యాప్ ద్వారా ఆపద సమయంలో నేరుగా ఫిర్యాదు చేసు కోవచ్చన్న విషయాన్ని విరివిగా ప్రచారం చేయాలన్నారు. నేనుసైతం కార్యక్రమంలో భాగంగా కాలనీల్లో సిసిటివిలను ఏర్పాటు చేసుకునేలా వివిధ కమ్యూనిటీలను భాగస్వామ్యం చేయాలన్నారు. అనంతరం డ్యూటీలో ప్రతిభ కనబరచిన పలువురు పోలీసులకు సిపి రివార్డులను అందించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సిపి షానవాజ్ ఖాసీం, డిసిపి క్రైమ్స్ జానకీ షర్మిలా, ఎ డిసిపి భద్రేశ్వర్, ఎడిసిపి క్రైమ్స్ నెతా నియల్, సైబర్ క్రైం ఎసిపి నర్సింహారెడ్డి, సిసిఆర్‌బి,ఎస్ఓటి, సిసిఎస్, సైబర్ క్రైం, ఐటి సెల్, శాంతిభద్రతల విభాగం ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు

రూ.కోటి గంజాయి పట్టివేత

హైదరాబాద్, ఆంధ్రప్రభ: విశాఖపట్టణం నుంచి హైదరాబాద్ మీదుగా గంజాయిని మహారా ష్ట్రకు తరలిస్తున్న ఒక వాహనాన్ని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలీ జెన్స్ (డిఆర్ఐ) అధికారులు పట్టు కున్నారు.

విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు డిఆర్ఐ అధి కారులు తార్నాక ప్రాంతంలో ఒక వాహనాన్ని సోదా చేశారు. అం దులో రూ. 81లక్షల విలువ చేసే 543 కిలోల గంజాయి పట్టుబ డింది. వాహనాన్ని అధికారులు ఆపగానే అందులో ప్రయాణం చేస్తున్న ఇద్దరు పారిపోగా డ్రైవ ర్‌ను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడ్డ డ్రైవర్ నుంచి మరింత సమాచారం రాబట్టేందుకు అధికా రులు విచారిస్తున్నారు. ప్రాథమిక విచారణలో విశాఖ సమీపంలోని ఏజెన్సీ ప్రాంతంలో నుంచి గంజాయిని మహారాష్ట్రకు తరలి స్తున్నట్లు తేలింది.

రాజ్యసభ ఎన్నికలపై మాక్ పోలింగ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాజ్యసభ ఎన్నికలు ఈ నెల 23న జరగనున్న నేప థ్యంలో టిఆర్ఎస్ శాసనసభ్యులకు మాక్ పోలింగ్ నిర్వహించాలని పార్టీ నిర్ణ యించింది. మంగళవారం సాయంత్రం 5గంటలకు తెలంగాణభవన్‌లో ఇది జరగ నుంది. టిఆర్ఎస్ తరపున రాజ్యసభకు జోగినిపల్లి సంతోష్‌కుమార్, బండ ప్రకాశ్, బడుగుల లింగయ్యయాదవ్‌లు పోటీ చేస్తుండగా, కాంగ్రెస్ తరుపున బలరాంనా యక్ బరిలో ఉన్నారు. బలం లేకున్నా.. కాంగ్రెస్ పోటీ చేస్తుండగా, పార్టీకి సంబం ధించిన ఓట్లన్నీ అభ్యర్థులకే పడేలా టిఆర్ఎస్ వ్యూహరచన చేస్తోంది. ఈ కార్య క్రమానికి కడియం శ్రీహరి, కెటిఆర్, ఈటల రాజేందర్, జగదీష్‌రెడ్డి పర్యవేక్షకులుగా వ్యవహరిస్తున్నారు.

నకిలీ విత్తనాలపై అవగాహన అవసరం

● వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: నకిలీ విత్తనాల నియంత్రణలో అవగాహన ఉంటేనే లక్ష్యం సాధించగలమని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ ముఖ్య కార్యదర్శి సి. పార్థసారథి అన్నారు. ఈ అంశంపై సోమవారం విత్తన ధృవీకరణ సంస్థ కార్యాల యంలో విజిలెన్స్ విభాగం ఉన్నతాధికారులు, సీడ్స్‌మెన్ అసోసియేషన్ ప్రతినిధు లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వివిధ పంటలకు సంబంధించి నకిలీ, హెచ్‌టీ పత్తి విత్తనాల నియంత్రణలో మరింత అప్ర మత్తంగా ఉండాలన్నారు. నాణ్యమైన విత్తనాలతో ఈ పరిశ్రమను కాపాడుకోవా ల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. టాస్క్‌ఫోర్స్ బృందాల్లో పోలీసు, వ్యవ సాయ శాఖల అధికారులే కాకుండా విత్తన ధృవీకరణ సంస్థ, విత్తనాభివృద్ధి సంస్థల నుంచి అనుభవమున్న అధికారులను భాగస్వాములను చేయాలన్నారు. ఈ సమా వేశంలో ఐజీ నాగిరెడ్డి, కమిషనర్ జగన్మోహన్, విత్తన ధృవీకరణ సంస్థ డైరెక్టర్ కేశవులు తదితరులు పాల్గొన్నారు.

అవినీతిలో కాంగ్రెస్‌ను మించిన తెరాస

● బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణసాగర్‌రావు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: అవినీతిలో తెరాస, కాంగ్రెస్‌ను మించిపోయిందని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణసాగర్‌రావు ఆరోపించారు. సిఎం కేసీఆర్ అవి నీతి సామ్రాజ్య సామ్రాట్‌గా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేసీఆర్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తెరాస అవినీతికి నిదర్శనం....సిరిసిల్లా మున్సిపల్ చైర్మన్ బాహటంగా చెప్పడమేనన్నారు. మంత్రి ఆదేశాల మేరకే మూడు శాతం కమి షన్ రూపంలో తీసుకుంటున్నామని చైర్మన్ సామల పావని నిర్భయంగా చెప్పింద న్నారు. ఇది తెరాస విధానం కాదా? అని ప్రశ్నించారు. అవినీతిని బహిరంగంగా చెప్పడం వల్లే ఆమెతో పార్టీకీ రాజీనామా చేయించారన్నారు. పాట్నర్‌షిప్ పేరుతో తెరాస నేతలు రాష్ట్రంలో కొత్త అవినీతికి తెరతీస్తున్నారని ఆయన మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో భాజపాతో మరో కూటమి ఉండబోతోందని, అందులో కాంగ్రెస్, తెరాస కూడా ఉంటాయన్నారు. కాంగ్రెస్‌తో కలవడానికే కేసీఆర్ మమత బెనర్జీ మద్దతు కోసం పశ్చిమ బెంగాల్‌కు వెళ్ళారన్నారు. కాంగ్రెస్ బస్సుయాత్ర చేస్తుం టే....కేసీఆర్ విమానయాత్ర చేస్తున్నారని ఆయన వ్యంగ్యాస్త్రాలను సంధించారు. రాష్ట్రంలో రైతులు ఆత్మహత్యలు చేసుకున్న వారికి ఒక రూపాయి ఇవ్వని కేసీ ఆర్.... ప్రత్యేక విమానం పెట్టుకుని కలకత్తాకు ఎలా వెలుతారన్నారు. ప్రజల సొమ్మును వృధాగా ఖర్చు చేసే అధికారం కేసీఆర్‌కు ఎవరిచ్చారని మండిపడ్డారు. రాజకీయ పర్యటనల కోసం అధికారులను వెంటపెట్టుకోవడం మంచి పద్ధతి కాదన్నారు.

టెన్త్ ప్రశ్నాపత్రం లీకేజ్

బాధ్యులపై చర్యలు తీసుకోండి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: పదవ తరగతి ప్రశ్నాప త్రం లీకేజీ ఉదంతంపై విచారణ జరిపి బాధ్యులపై తగి న చర్యలు తీసుకోవాలని తెలుగుదేశంపార్టీ తెలంగాణ శాసనసభ్యుడు సండ్ర వెంకటవీరయ్య డిమాండ్ చేశారు. తెరాస ప్రభుత్వ వైఫల్యాలతో విద్యార్థులు, నిరు ద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన దుయ్య బట్టారు. గత ఏడాది కూడా పదవ తరగతి, మెడిసిన్ ప్రశ్నాపత్రాలు లీకేజీ అయ్యాయని సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరిచి విద్యార్థుల జీవితాలకు సంబంధించిన అంశాల్లో కఠినంగా వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు.

'అవిశ్వాసానికి మద్దతు ఇవ్వని తెరాస'

హైదరాబాద్, ఆంధ్రప్రభ : జాతీయ స్థాయిలో భాజపా, కాంగ్రెస్‌లకు ప్రత్యా మ్నాయంగా థర్డ్‌ఫ్రంట్ ఏర్పాటు చేస్తామంటున్న ముఖ్యమంత్రి కేసీఆర్ అవిశ్వాస తీర్మానానికి ఎందుకు మద్దతు ఇవ్వడం లేదని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖరరెడ్డి ప్రశ్నించారు. విభజన హామీలు అమలు చేయాలని పార్ల మెంట్‌లో భాజపా ప్రభుత్వంపై అనివార్యంగా తెదేపా ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మా నానికి మద్దతు ఇవ్వకుండా తెరాస పరోక్షంగా భాజపాకు అనుకూలంగా ఉన్నట్లు స్పష్టమవుతోందని రావుల మండిపడ్డారు. ఓవైపు అన్నాడిఎంకె పార్టీని భాజపా పావుగా వాడుకుంటూ అవిశ్వాస తీర్మానం లోక్‌సభ చర్చకు రాకుండా కుట్ర చేస్తోం దని ఆ పార్టీ దుయ్యబట్టింది. విభజన చట్టంలో తెలంగాణకు రావలసిన బయ్యారం స్టీల్‌ప్లాంట్, రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, గిరిజన, ఉద్యానవన యూనివర్సిటీలు, ఎయిమ్స్ లాంటి సంస్థల హామీల అమలుపై కూడా చర్చకు దారితీసే అవకాశం ఉన్నందున అవిశ్వాస తీర్మానం దోహదం చేస్తుందని రావుల అన్నారు.

'థర్డ్‌ఫ్రంట్ పేరుతో కొత్త డ్రామా'

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెరాస నాలుగేళ్ళ పాలనలో ముఖ్యమంత్రి హోదా లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యా రని, దీన్ని కప్పిపుచ్చుకునేందుకే థర్డ్‌ఫ్రంట్ పేరిట హడావుడి చేస్తున్నారని తెలు గుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఇ.పెద్దిరెడ్డి దుయ్యబట్టారు. కేసీఆర్ పాలనపట్ల ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని, దీన్ని పక్కదారి పట్టించేందుకే ముఖ్య మంత్రి కొత్త నాటకానికి తెరతీశారని ఆయన విమర్శించారు. ఎన్‌డిఎ, యుపిఎ కూటములకు వ్యతిరేకంగా థర్డ్‌ఫ్రంట్ ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించిన కేసీఆర్ పార్లమెంట్‌లో భాజపా ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెదేపా ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఎందుకు తెలపడం లేదని ఆయన ప్రశ్నించారు. తెలంగాణలో తెరాస ప్రభుత్వాన్ని గద్దెదించి తెదేపాను అధికారంలోకి తెచ్చేందుకు తమతో కలిసివచ్చే అన్ని పక్షాలతో విస్తృతస్థాయిలో కలిసి పనిచేస్తామని పెద్దిరెడ్డి అన్నారు.

పెద్దపల్లి టీడీపీ అధ్యక్షుడిగా తిరుపతి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పెద్దపల్లి తెలుగుదేశంపార్టీ జిల్లా అధ్యక్షుడిగా అక్క పాక తిరుపతి నియమితులయ్యారు. పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న తిరుప తిని జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర అధ్య క్షుడు ఎల్.రమణ నియమించారు.

చంద్రబాబు శకం ముగిసింది: వైకాపా

హైదరాబాద్,ఆంధప్రభ: ఏపీ రాజకీయాల్లో చంద్రబాబు నాయుడు శకం ముగిసిందని, తెలుగుదేశం పార్టీకి కూడా రోజులు దగ్గర పడ్డాయని వైఎస్ఆర్ కాం గ్రెస్‌పార్టీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం పార్టీ కార్యాల యంలో మీడియా సమావేశంలో శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రత్యేక హోదాకోసం నాలుగేళ్లుగా తమపార్టీ పోరాడుతుంటే మద్దతు ఇవ్వకపోగా కేసులు పెట్టించిన చంద్రబాబు ప్రత్యేకహోదాను, ప్రజలను అవహేళన చేసి మాట్లాడారన్నారు. ఎం పీలు రాజీనామాలు చేస్తే హోదా వస్తుందా, హోదా ఏమైనా సంజీవినా అని మాట్లా డిన చంద్రబాబు ఇప్పుడు ప్రతిపక్ష పార్టీలైన్‌లోకే వచ్చారన్నారు. కొత్తగా చంద్ర బాబు స్వరం మార్చి మైనార్టీల కోసమే బీజేపీ నుంచి బయటకు వచ్చానని చెబుతు న్నారన్నారు. మోడితో చీకటి ఒప్పందాలు చేసుకున్న చంద్రబాబు ఇప్పుడు డ్రామా లు ఆడుతున్నారన్నారు. వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వాసిరెడ్డి పద్మ మాట్లాడుతూ గత ఎన్నికల్లో చంద్రబాబుకు బలం లేకనే బీజేపీ, పవన్ కల్యాణ్‌తో కలిసి పోటీ చేయగా, వైఎస్ఆర్‌సీపి సింగిల్‌గానే పోటీ చేసిందన్నారు. ఈ ఎన్నికల్లో కూడ ఒంటరిగానే పోటీ చేస్తామన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోండి

● పీసీబీ మెంబర్ సెక్రటరీ సత్యనారాయణరెడ్డి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : చట్టాలు, నియమ నిబంధ నలపై పూర్తి అవగాహన పెంచుకొని క్షేత్రస్థాయిలో సమస్య లను సమర్థవంతంగా పరిష్కరించాలని టిఎస్‌పిసీబీ మెంబర్ సెక్రటరీ పి.సత్యనారాయణరెడ్డి సూచించారు. నూతనంగా నియమితులైన ఇంజనీర్లకు బోర్డు పనితీరుపై సోమవారం ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులకు హాజరైన మెంబర్ సెక్రటరీ లను ఉద్దేశించి మాట్లాడారు. అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంట్ ఇం జనీర్లు చిత్తశుద్ధి, అంకితభావంతో పనిచేసి సంస్థకు మంచి పేరుతేవాలని కోరారు. కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరి రక్షణలో కీలకపాత్ర ఇంజనీర్లదేనని అన్నారు. వాయువు, నీరు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు అమలు చేస్తున్న చట్టాలను, నియమ నిబంధనలను సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత ఇంజనీర్లపై ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న టిఎస్-ఐపాస్ కింద నిర్దిష్ట గడు వులో పరిశ్రమలకు వివిధ రకాల అను మతులు ఇవ్వడంపై ప్రత్యేక దృష్టిసారించి పని చేయాలని సూచించారు.

విధి నిర్వహణలో పాత పద్ధతుల ద్వారా కాకుండా పూర్తి సాంకేతిక పరిజ్ఞా నంతో, కొత్త ఆలోచన, ఒరవడితో పనిచేసి సంస్థకు, రాష్ట్రానికి మంచిపేరు తెచ్చేవిధంగా పని చేయాల్సిన అవసరం ఉందని సత్యనారాయణరెడ్డి సూచించారు. నూత నంగా నియమితులైన ఇంజనీర్లకు వ్యవస్థ పనితీరు, వివిధ అంశాలపై పర్యావరణంపై నిపుణులైన ప్రొఫెసర్లు, శాస్త్రవే త్తలు, బోర్డులోని సీనియర్ ఇంజనీర్లతో ఈనెల 27 వరకు శిక్షణా ఇస్తామని, దీంతోపాటు క్షేత్రస్థాయిలో కూడా ఘన, రసా యన, జీవ వ్యర్థాలు, శాంపిళ్ళ సేకరణతో పాటు వాయు, శబ్ద కాలుష్యంపై కూడా శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్ర మంలో సీఈఈ విశ్వనాథం, జెసీఈఈ యూనిట్-2 బి.ముర ళీధర్‌రెడ్డి, ప్రొఫెసర్ శశిధర్, ఎన్.రవీందర్ తదితరులు పాల్గొ న్నారు. శిక్షణా తరగతులకు నూతనంగా ఎంపికైన 21 మంది ఏఈఈలు హాజరయ్యారు.

ఐదువేల మిద్దెలపై కూరగాయల సాగు

● ఉద్యానవన కమిషనర్ వెంకట్రామిరెడ్డి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పట్టణ ప్రాంతాల్లో 'మన ఇల్లు - మన కూరగాయలు' పథకం విస్తర ణకు చర్యలు తీసుకుంటున్నామని ఉద్యానవనశాఖ కమిషనర్ ఎల్.వెంకట్రామ్‌రెడ్డి తెలిపారు. మన పట్టణ ప్రాంత జనావా సాలలో పోషక పదార్థాలు ఇచ్చే కూరగాయల సాగును పెం చడమే ఈ పథకం లక్ష్యమని చెప్పారు. ఈ అంశంపై సోమ వారం ఉద్యానవనశాఖ శిక్షణా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ నగరంలో 30 లక్షల ఇళ్ళు ఉన్నాయని, కేవలం 5వేల ఇళ్ళలో మిద్దెలపైన మన కూరగాయల పంటలు పండి స్తున్నారని తెలిపారు. మన ఇళ్ళు మన కూరగాయల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. ప్రతి మనిషికి అవసరమైన పోషక పదార్థాలైన విటమిన్లు, ఖనిజ లవణాలు, పిండి పదార్థాలు ఆరోగ్యాన్ని పరిరక్షించు సహజ రసాయ నాలను అందించడంలో కూరగాయలలో ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు.

సగటు మనిషికి రోజుకు 280 గ్రామాల కూరగాయలు ఆహారంలో తప్పనిసరిగా తీసుకోవాలని వెంకట్రామిరెడ్డి తెలి పారు. పెరుగుతున్న జనాభా కూరగాయల ఖర్చు పోషక లోపం, పట్టణాలలో స్థలాభావం వంటి విషయాలను దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన పురుగు మందుల అవశేషాలు లేని తాజా కూరగాయలు ఇంటి ఆవాసాలలో అందుబాటులో తెచ్చేందు కు చర్యలు చేపట్టామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 20 లక్షల మొక్క లు ఇస్తే తగిన చర్యలు తీసుకొని కాపాడుతామని చెప్పారు. కొందరు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని ఆయన ఖండిం చారు. 17 నర్సరీల ద్వారా మొక్కల పెంపకం చేస్తున్నామని తెలిపారు. రైతులకు పండ్ల తోటలపై శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. మన కూరగాయలలో పోట్ల, గోంగూర, తోటకూర, పప్పుదోసకాయ, మిర్చి, కాకర, ఉల్లి, ఎల్లిగడ్డలు, టమాట, వంగ, బెండ, బీరకాయ, మెంతికూర, పాలకూర, ద్రాక్ష మన మిద్దెలపైన పండించుకోవాలని ఆయన కోరారు. హైవే రోడ్ల పక్కన చింత, రావి, మర్రి, జువ్వి, వేలగ, ఉసిరి, మామిడి మొక్కలను పెంచాలని కోరారు. ఈ సమావేశంలో డిప్యూటి డైరెక్టర్ వి.విజయ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో వైశ్యులకు ప్రాధాన్యతేది?

● తెలంగాణ వైశ్య కార్పొరేషన్ సాధన సమితి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో ఇతర కులాలకు ఏర్పాటు చేసిన విధంగా వైశ్యులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో బడ్జెట్‌లో ఒక్క పైసా కేటాయించక పోవడం పట్ల తెలంగాణ వైశ్య కార్పొ రేషన్ సాధనా సమితి ఒక ప్రకటనలో తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. వైశ్యుల డిమాండ్‌కు సిఎం కెసిఆర్ గతంలో సాను కూలంగా స్పందించినప్పటికీ న్యాయం చేయక పోవడం దారుణమని పేర్కొంది.

కోటిచ్చి కోమట్లను కొనాలంటూ తరచూ చెప్పే సిఎం కెసి ఆర్ బడ్జెట్‌లో రూపాయి కూడా కేటాయించకుండా నిరాశకు గురి చేశారని ప్రకటన పేర్కొంది. దేశంలో పన్నులు కట్టే వారి లో40 శాతం వైశ్యులేనని, తమలోనూ చాలా పేదవారున్నా రని, దారిద్ర్య రేఖకు కింద కూడా ఉన్నారని పేర్కొన్నారు. ఇలాంటి వారికి కార్పొరేషన్ ఎంతో ఉపయో గంగా ఉంటుందని వివరించారు. అర్హులైన నిరుపేద వైశ్యులకు సహాయం అందించాల్సిన అవసరం ఉం దని, వారికి ప్రభుత్వసంక్షేమ పథకాలు వర్తింప చేయాల న్నారు. షాపింగ్ మాల్స్, ఆన్‌లైన్ వ్యాపారం పెరిగిన తర్వాత చిన్నా, మధ్య తరగతి వైశ్యుల వ్యాపారాలు తగ్గుముఖం పట్టా యని ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని చాలా నియోజకవర్గాలలో వైశ్యులు ప్రాబల్యం చూపించగలుగుతా రని, ప్రతి పార్టీ వైశ్యులకు 10 సీట్లు కేటాయించాలని తెలంగాణ వైశ్య కార్పొరేషన్ సాధ నా సమితి కోరింది. తెలుగు వారి కోసం పొట్టి శ్రీరాములు తన జీవితాన్ని అర్పించారని, దేశ స్వాతం త్ర్యం కోసం మహాత్మా గాంధీ ఎనలేని సేవ చేశారని గుర్తు చేశారు. వైశ్యులకు అన్ని పార్టీలు రాజకీయాల్లో తగిన ప్రాధా న్యం కల్పించాలన్నారు. తమకు నామమాత్రం పదవులను కట్టబెట్టి వివక్షను చూపుతున్నారని పేర్కొన్నారు.

దుబాయ్‌లో మంత్రి ఈటల పుట్టినరోజు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ పు ట్టిన రోజు వేడుకలు సోమవారం దు బాయ్‌లో ఘనంగా జరిగాయి. ప్రవా స తెలంగాణకు చెందిన ప్రతినిధుల ఆహ్వానం మేరకు మంథని ఎమ్మెల్యే పుట్ట మధు, పెద్దపల్లి జిల్లా గ్రంథా లయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.తెలుగువారితో కలిసి పుట్టమధు కేక్ కట్ చేశారు. దుబా య్‌లో ఉన్న తెలుగువారి కష్టాలు తెలిసిన వ్యక్తి కాబట్టి ఆయన పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహిం చారని పుట్టమధు తెలిపారు.

ఫీజు నియంత్రణ చట్టం చేయాలి

● బీసీ సంఘాల డిమాండ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలోని ప్రైవేటు, కార్పొరేట్ సంస్థల ఫీజు దోపిడిని అరికట్టడం కోసం అసెంబ్లీలో ఫీజు నియంత్రణ చట్టం చేయాలని బీసీ సంఘాలు డిమాండ్ చేశాయి. 12 బీసీ సంఘాల సమావేశం సోమవారం బీసీ భవ న్‌లో జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జకృష్ణ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జాతీ య బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య ముఖ్య అతి థిగా పాల్గొన్నారు. సమావేశంలో వివిధ బీసీ సంఘాల నాయకులు ఎర్ర సత్యనా రాయణ, నీల వెంకటేష్, గుజ్జ రమేష్, జి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థలు ఫీజుల దోపిడికి పాల్పడుతున్నాయని కృష్ణయ్య విమర్శించారు. కార్పొరేట్ సంస్థలను నియంత్రించాలంటే అసెంబ్లీలో చట్టం చేయ డం ఒక్కటే మార్గమన్నారు. ప్రస్తుతం సమావేశాల్లోనే చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ విద్యా సంస్థలు డోనేషన్ల పేరుతో లక్షలాది రూపాయలను తల్లి దండ్రుల నుంచి గుంజుతున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌లోనే దేశ రాజధాని ఢిల్లీ కంటే ఫీజులుఎక్కువగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 10 సంవత్సరాల క్రితం ప్రైవేటు విద్యాసంస్థల్లో కేవలం 10 శాతం మంది విద్యార్థులు ఉంటే ఇప్పుడు అదికాస్త 90 శాతానికి పెరిగిందన్నారు.

వేసవిలో తాగునీటిపై అప్రమత్తం

● భగీరథ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్రంలో ఎండాకాలం ఎక్కడా తాగు నీటి కొరత రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మిషన్ భగీరథ చైర్మన్ వేముల ప్రశాంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు సోమవారం తన కార్యాలయంలో మిషన్ భగీరథ పనుల పురోగతిపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తాగు నీటి సమస్యను ఎదుర్కొనేందుకు తగిన ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఇప్ప టికే రాష్ట్రంలోని 7వేల ఆవాసాలతోపాటు 18 యుఎల్‌బీలకు బల్క్‌గా భగీరథ నీటిని సరఫరా చేయటంపై సంతృప్తిని వ్యక్తం చేశారు. మిగిలిన అవాసాలకు కూడా తాగు నీటిని బల్క్‌గా సరఫరా చేయాలని అదేశించారు. ఇంట్ర పనులతో గ్రామాల్లో సమ స్యలు రాకుండా చూడాలని ప్రశాంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ సమా వేశంలో ఈఎన్‌సీ సురేందర్ రెడ్డి,సీఈలు కృపాకర్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి విజ యపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ స్కూళ్ల ప్రవేశాలకు నోటిఫికేషన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్సియల్ స్కూళ్లలో ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. 2018 -19 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రశేశంతోపాటుగా ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిదవ తరగతిలో భర్తీ కాపి సీట్లలో ప్రవేశానికి కూడా అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని కార్య దర్శి బి. షఫియుల్లా తెలియచేశారు. ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసు కొనవలసి ఉంటుంది. ఈ నెల 19 నుండి వచ్చే నెల 20 వరకు దరఖాస్తులను స్వీక రించి, లక్కీ డిప్ ద్వారా విద్యార్థుల ఎంపిక ఏప్రిల్ 28న ఉంటుంది. ఎంపికైన విద్యా ర్థుల సర్టిఫికేట్ల పరిశీలన ఏప్రిల్ 30 నుండి మే 5 వరకు ఉంటుంది. తరగతులు జూన్ ఒకటవ తేదీ నుండి ప్రారంభిస్తారు. తెలంగాణలో మొత్తం 204 రెసిడెన్సియల్ పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించే విధంగా నోటిఫికేషన్ జారీ చేశారు.

ఏపీ టెట్ ఫలితాల విడుదల

అమరావతి, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ పోస్టుల ఎంపికకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) ఫలితాలను రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు సోమవారం విడుదల చేశారు. విజయవాడలో విలే కరుల సమావేశంలో మంత్రి టెట్ ఫలితాల వివరాలను వెల్లడించారు. రాష్టంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం గతేడాది నోటిఫికేషన్ ఇచ్చింది. పోయిన డిసెంబర్ 18నుంచి ఈ సంవత్సరం జనవరి 22 వరకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 4,46,833 దరఖాస్తులు రాగా, 4,36,829 (97.76 శాతం) మంది హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారని చెప్పారు.

రుణ దరఖాస్తు వెనక్కి

మొదలైన ఘర్షణ

● రుణ మంజూరుపై కేంద్రం, రాష్ట్రం మధ్య లేఖల యుద్ధం ● కీలక సమయంలో రుణ అనుమతికి మొండిచెయ్యి ● 3 శాతం పరిమితి దాటిందంటున్న కేంద్రం ● మార్కెట్ రుణం అనివార్యమంటున్న రాష్ట్రం ● పొత్తు కుదరని జీఎన్‌డీపీ గణాంకాలు ● తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన సీఎం బాబు ● మరోసారి కేంద్రానికి లేఖ రాయమని ఆదేశం

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రానికి అందాల్సిన రుణానికి సంబంధించి కేంద్రం, రాష్ట్రం మధ్య లేఖల యుద్ధం ప్రారంభమైంది. కీలక సమయంలో తమకు రావల్సిన రుణాలు పొందడానికి అనుమతి ఇవ్వాల్సిం దిగా తాజాగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయ డం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇప్పటికే ఒక సారి తిరుగుటపాలో వచ్చిన రుణ దరఖాస్తుకు కొనసా గింపుగా రుణానికి అనుమతి అనివార్యమంటూ ప్రభు త్వం తాజాగా మరో లేఖ రాసినట్టు సమాచారం. మార్కెట్ బారోయింగ్ రుణం రాకకు సంబంధించి జాప్యం జరిగిన పక్షంలో ప్రభుత్వ ఉద్యోగుల వేతనా లకు కటకట తప్పదనే సంకేతాలు వున్న నేపథ్యంలో తాజాగా వివాదానికి ప్రాధాన్యత ఏర్పడింది. ఇదిలా వుండగా అమలులో వున్న కేంద్ర ప్రభుత్వ నిబంధన లకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం బహిరంగ మార్కె ట్ రుణాలకు సంబంధించి ఫిబ్రవరి చివరి వారంలో కేంద్రానికి ప్రతి పాదించింది. ఇప్పటికే ప్రతిపాదించిన 26,000 కోట్లకుగాను ఇప్పటిదాకా నాలుగింట మూ డొంతుల రుణాన్ని పొందిందన్నారు. అయితే ఆర్థికసం వత్సరం ముగుస్తున్న తరుణంలో చివరి త్రైమాసి కంలో రూ. 3,221 కోట్ల రుణంగా ఇవ్వాలంటూ ఆం ధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే తాజాగా కేంద్ర ప్రభుత్వం మాత్రం బహిరంగ మార్కెట్ రుణా లకు అను మతిని తిరస్కరిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి తిరు గు లేఖ రాసింది. అసలే అధిక అప్పులు, తగ్గిన పన్నుల రాబడి నేపథ్యంలో ఈ మొత్తం రుణ రూపేణా పొంద డం కూడా ప్రభుత్వానికి అనివార్యమవుతోంది. కానీ మార్కెట్ బారో యింగ్ లోనక్లు సంబం ధించిన పరిమితి ఇప్పటికే పూర్తయిందని, ఇలాంటి పరిస్థితులలో 3 శాతానికి మించి అనుమతించేందుకు నిబంధనలు ఒప్పుకోవని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన లేఖలో పేర్కొనడం జరిగింది. అయితే క్రితం సంవత్సరంలో మాత్రం పొరుగునే వున్న తెలంగాణతో సహామరొకొన్ని రాష్ట్రాలకు 3.5 శాతం దాకా బహిరంగ మార్కెట్ బారోయింగ్‌కు అనుతినిచ్చిన కేంద్రం రాష్ట్రానికి మాత్రం మొండిచెయ్యి చూపుతోందని ఏపి సర్కారు అంటోంది. పైగా కేంద్రం వద్ద వున్న జిఎస్‌డిపి వివరాలకు, రాష్ట్ర ప్రభుత్వ జిఎస్‌డిపికి మధ్య నెలకొన్న భారీ వ్యత్యాసం కూడా తాజా వివాదానికి కారణమవు తోంది. రాష్ట్ర ప్రభుత్వం చూపిన జిఎస్‌డిపి ఎక్కువగా వున్నందునే తాము రుణ దరఖాస్తును తిరస్కరించి నట్టు చెబుతున్నట్టు ప్రభుత్వ వర్గాలు పేర్కొంటు న్నాయి. కేంద్ర ప్రభుత్వం ఒక మెట్టు దిగినా 3.5 శాతం దాకా రుణాన్ని పొందడానికి అవకాశం వుందనే వాదన ఏపి సర్కారు వర్గాలలో వుంది. ఇటీవల కేంద్ర హోం శాఖ వర్గాలతో జరిగిన భేటీకి హాజరైన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వి.దినేష్‌కుమార్ ఇదే విషయమై కేం ద్రం వద్ద ప్రత్యేకంగా ప్రస్తావించినా, ఫలితం లేకపో యిందనే అభి ప్రాయం వ్యక్తమవుతోంది.

ముఖ్యమంత్రి ఆరా!

బహిరంగ మార్కెట్ రుణదరఖాస్తును కేంద్ర ప్రభు త్వం తిరస్కరించడంపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఆరా తీశా రు. విభజనలో తీవ్ర అన్యాయానికి గురైన ఆంధ్రప్రదేశ్ పట్ల ఒక తీరుగా, తెలంగాణ రాష్ట్రం పట్ల మరోతీరుగా వ్యవహరించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారని తెలి సింది. మరోసారి కేంద్రాన్ని ఈ విషయంలో ఆశ్రయిం చాలని ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. ఈ విష యమై తదనంతర చర్యలకు ఆయన రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడుకు ఆదేశాలు జారీ చేశారు.

దూరవిద్య ద్వారా అగ్రి కోర్సులు

అమరావతి, ఆంధ్రప్రభ: ఇప్పటి వరకు ఉన్న రెగ్యూలర్ వ్యవసాయ విద్యా కోర్సులకు తోడు దూర విద్య ద్వారా అగ్రీ కోర్సులను చదివేందుకు విద్యార్థులకు ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలం అందుబాటులోని తీసుకువచ్చిది. వ్యవసాయ విద్యాలయాల్లో, కళాశాలల్లో, క్షేత్రాల్లో అగ్రీ కోర్సులను అందుకోలేక పోతున్న గ్రామీణ యువత, మహిళలు, రైతులు, ఆసక్తిగల నిరుద్యోగుల కోసం, వ్యవసాయ విద్యాభివృద్ధే లక్ష్యంగా దూర విద్య ద్వారా అగ్రీ కోర్సులను ప్రారంభిం చారు. సాంకేతిక, వ్యవస్థాపక నైపుణ్యాభివృద్ధితో స్వయం ఉపాధి అవకాశాలకు, వ్యవసాయ పరిజ్ఞాన్ని పెంపొందించుకోవడం, నూతన మాధ్యమాలతో వ్యవ సాయ విద్యను అభ్యసించడానికి ఈ కోర్సులు తోడ్పాటును అందించనున్నాయి.

'హోదాకు కట్టుబడి ఉన్నాం: పవన్‌కళ్యాణ్

అమరావతి, ఆంధ్రప్రభ: ఏపీకి ప్రత్యేక హోదా అంశానికి జనసేన కట్టుబడి ఉందని ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ట్విట్ట ర్‌లో స్పందించారు. ప్రైవేట్ న్యూస్ ఛానల్ రిపోర్టర్ తన మాటలను పొర పాటుగా అర్థం చేసుకున్నారని పేర్కొ న్నారు. హోదా విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. రాష్ట్రానికి హోదా సాధించేందుకు జనసేన తిరు గులేనివిధంగా పోరాడు తుందన్నా రు. అందులో భాగంగానే అన్ని పక్షా లను కలుపుకుని ఉద్యమిస్తున్నామ న్నారు. ప్రత్యేక హోదా సాధించేంత వరకు జనసేన విశ్రమించదన్నారు.

క్యాబ్ డ్రైవర్ అరెస్టు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: యు వతి పట్ల ఒక కార్ డ్రైవర్ అసభ్యంగా ప్రవర్తించాడు. యువతి ఫిర్యాదుతో శంషాబాద్ ఎయిర్ పోర్ట్ పోలీసులు కార్ డ్రైవర్‌ను అరెస్టు చేశారు. విమా నాశ్రయంలోని ప్రైవేట్ సంస్థలో పని చేస్తున్న యువతి ఒకరు కారులో బెంగళూరు జాతీయ రహదారిపై వెళ్తున్న సమయంలో డ్రైవర్ అస భ్యంగా ప్రవర్తించడం మొదలు పెట్టా డు. దీంతో యువతి వెంటనే అప్రమ త్తమై సైబరాబాద్ కమిషనరేట్ వాట్సా ప్‌కు మెసేజ్ పంపించింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు కారు ను గుర్తించి పట్టుకున్నారు. అనంత రం కారు డ్రైవర్ తిరుమలేష్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.



ఐసీఐసీఐతో స్విగ్గీ టైఅప్

ముంబై: ఆహారపదార్థాలను సరఫరా చేసే సంస్థగా మంచి గుర్తింపు పొందిన స్విగ్గీతో ప్రైవేటు బ్యాంకు ఐసీఐసీఐ టైఅప్ కుదుర్చుకుంది. దీంతో స్విగ్గీ డెలివరీ చేసే ఉత్పత్తులకు డబ్బు చెల్లింపునకు సంబంధించిన డిజిటల్ లావా దేవీలు ఇకపై మరింత సులభతరం కానున్నా యి. అదేవిధంగా యునిఫైడ్ పేమెంట్ ఇంట ర్‌ఫేస్ (యూపీఐ) ఆధారిత నగదు బదలీ వ్యవ హారాలు, నగదు డిపాజిట్లకు ఐసీఐసీఐతో ఒప్పందం కుదిరిందని స్విగ్గీ ఒక ప్రకటనలో తెలిపింది. తద్వారా, దేశవ్యాప్తంగా తమ పంపి ణీ దారులు కలెక్ట్ చేసిన నగదు డిపాజిట్లకు ఎక్కువ దూరం ప్రయాణించాల్సిన అవసరం ఉండబోదని పేర్కొంది. తాజా ఒప్పందం తో స్విగ్గీ భాగస్వాము లు సొంత యూపీఐని తమ బ్యాంకు ఖాతాలకు లింక్ చేసుకుని యూపీఐ ఆధారిత యాప్‌ల ద్వారా లావాదేవీలు నిర్వహించడం తేలికవుతుంది.

ప్రతీసారి నేరుగా హబ్‌కు చక్కర్లు కొట్టాల్సిన ప్రయాస తప్పు తుంది. అదేవిధంగా వినియోగదారులు సైతం తమకు నచ్చిన, అందుబాటులో ఉన్న వ్యవస్థ ద్వారా చెల్లిం పులు చేసేందుకు మార్గం సుగమం అవుతుంది



బంధన్ బ్యాంకు ఐపీఓకు అనూహ్య స్పందన

న్యూఢిల్లీ: బంధన్ బ్యాంక్ ఐపీవో పట్ల మదుపరులు ఆసక్తి చూపారు. రూ. 4473 కోట్ల నిధుల సమీకరణకు ఐపీవోను ఆఫర్ చేసింది. ఇందుకోసం 8.35 కోట్ల షేర్లను బహిరంగ మార్కెట్‌లో విక్రయించాలని నిర్ణయించింది. అయితే నిర్దేశిత లక్ష్యం కంటే 38.67 శాతం అధికంగా సంస్థాగత కొనుగోలు దారులు సబ్‌స్క్రైబ్ చేసుకున్నారు. కాగా, 1.13 రెట్లు వ్యక్తిగత కొనుగోలు దారులు బిడ్డింగ్‌లో పాల్గొన్నారు. 8.35 కోట్ల షేర్ల ఆఫర్‌కు గాను 121.81 కోట్ల షేర్ల బిడ్డింగ్‌లు వచ్చినట్లు తెలుస్తోంది. కోల్‌కతాకు చెందిన ప్రైవేటు సెక్టార్‌కు చెందిన బంధన్ బ్యాంకు మొత్తం 11,92,80,494 షేర్లను విక్రయానికి ఉంచింది. ఐపీవోలో ఒక్కోషేరు ప్రాథమిక ధరను రూ. 370-375 గా నిర్ణయించింది. కొటక్ మహీంద్రా క్యాపిటల్, యాక్సిస్ క్యాపిటల్, గోల్డ్‌మాన్ సాచ్స్ (ఇండియా) సెక్యూరిటీస్, జేఎం ఫైనాన్షియల్స్, జేపీ మోర్గాన్ ఇండియా తదితర సంస్థలు ఐపీవో బిడ్డింగ్‌లో ఉన్నాయి.

రూ.4000 కోట్లు హాంఫట్

- నీరవ్, కొఠారీ తరహాలో మరో కుంభకోణం
- పారేఖ అల్యూమినిక్స్ పై కేసు నమోదు
- యాక్సిస్ సహా 22 బ్యాంకుల్లో భారీ రుణాలు
- బ్యాంకు ఫిర్యాదుతో కదిలిన డొంక
- పీఏఎల్‌కు చెందిన ముగ్గురు డైరెక్టర్లు అరెస్టు



న్యూఢిల్లీ/ముంబై: వజ్రాల వ్యాపారులు నీరవ్‌మోడీ, చోక్సీ, రొటొమ్యాక్ అధినేత కొఠారీ కుంభకోణాలను తలదన్నేలా మరోకుంభకోణం వెలుగులోకి వచ్చింది. ఏకంగా 22 బ్యాంకులకు నాలుగు వేల కోట్ల రూపాయలు కుచ్చుటోపీ పెట్టిన వ్యవహారం బ్యాంకింగ్ వ్యవస్థ డొల్లతనాన్ని బట్టబయలుచేసింది. పారేఖ అల్యూమినిక్స్ లిమిటెడ్ అనే కంపెనీ భారీ మొత్తంలో బ్యాంకులను మోసం చేసింది. రూ. 250 కోట్ల ఎగవేతపై యాక్సిస్ బ్యాంకు ఫిర్యాదు మేరకు పరేఖ్ అల్యూమినిక్స్ లిమిటెడ్ (పీఏఎల్)కు చెందిన ముగ్గురు డైరెక్టర్లను ముంబై పోలీసులు అరెస్ట్ చేశారు. పీఏఎల్‌కు చెందిన భవర్‌లాల్ భండారీ, ప్రేమాల్ గోరగాంధీ, కమలేష్ కనుంగో అనే ముగ్గురిపై చీటింగ్, ఫోర్జరీ, నమ్మకద్రోహం వంటి సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి.

యాక్సిస్ బ్యాంకు అధికారులు ఇచ్చిన ఫిర్యా దుతో విచారణ జరిపి, ఈ మేరకు చర్యలు చేపట్టినట్లు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. పరేఖ్ అల్యూమిమిక్స్‌లిమిటెడ్‌తోపాటు, 2013లో మరణించిన డైరెక్టర్ అమితాబ్ పరేఖ్‌తోపాటు రాజేంద్ర గాంధి, దేవాన్ష దేశాయ్, కిరణ్ పారిఖ్, విక్రమ్ మోర్దానిల పేర్లను ఫిర్యాదులో పేర్కొన్నారు.

పీఏఎల్‌కు రుణాలిచ్చిన 20 బ్యాంకుల గ్రూపులో యాక్సిస్ కూడా ఒకటి. 2011లో యాక్సిస్ బ్యాంకు పోర్ట్ శాఖ నుంచి ఎల్సీ (లెటర్ ఆఫ్ క్రెడిట్)ను తీసుకుందని తెలుస్తోంది. ఇందుకోసం బోర్డు సమావేశాల్లో తప్పుడు మినిట్స్ నమోదు చేశారని దర్యాప్తులో అధికారులు తేల్చారు. ఇప్పటికే పీఏఎల్ పై ఎస్బీఐ, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ తదితరాలు ఇచ్చిన ఫిర్యాదులపై సీబీఐ విచారణ జరుపుతున్నది. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో సైతం ఓ కేసు నడుస్తోంది. యాక్సిస్ సహా మూడు బ్యాంకుల నుంచి రూ. 125 కోట్ల షార్ట్ టర్మ్ రుణాలు తీసుకున్న పీఏఎల్ తొలుత వాటిని సక్రమంగా చెల్లించింది. బ్యాంకుల వద్ద మంచి నమ్మకం సంపాదించింది. ఇక అక్కడి నుంచి అసలు కథ మొదలు పెట్టింది. ముందస్తు ప్రణాళిక ప్రకారం వేల కోట్లను కొల్లగొట్టేందుకు సిద్ధమైందని అధికారులు తెలిపారు. ఈ క్రమంలో తప్పుడు మార్గాల్లో ఎల్సీలు తీసుకున్నారని, తమకు అవసరమైన రా మెటీరియల్‌తోపాటు యంత్రపరికరాలు కొంటామని చెప్పిన సంస్థ, తీసుకున్న రుణాలను సొంత అవసరాలకు వాడుకున్నట్లు విచారణలో వెల్లడైంది. 22 బ్యాంకుల నుంచి పీఏఎల్ రుణాలను పొందిందని తెలుస్తోంది. మూడు షెల్ కంపెనీలను భాగ్యోదయ్ ఫెర్రో అలాయిస్, భూమికా ఫాయిల్స్, భూషణ్ ఫాయిల్స్ పేరిట రిజిస్టర్ చేయించి, ఆ కంపెనీలకు నిధులను తరలించారని విచారణలో నిగ్గుతేలింది. కాగా ఈ వ్యవహారంలో బ్యాంకు అధికారుల పాత్రను కొట్టిపారేయలేమని దర్యాప్తు అధికారులు పేర్కొన్నారు.

పీఎన్‌బీ కేసులో జేపీసీ దర్యాప్తునకు యూఎఫ్‌బీయూ డిమాండ్

కోల్‌కతా: పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణంపై పార్లమెంటరీ సంయుక్త సంఘంతో దర్యాప్తు జరిపించాలని తొమ్మిది యూనియన్ల యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ డిమాండ్ చేసింది. హర్షత్ మెహతా కేసును దర్యాప్తు చేసిన విధంగానే జేపీసీతో విచారణ చేపట్టాలని యూఎఫ్‌బీయూ పశ్చిమ బెంగాల్ కన్వీనర్ సిద్ధార్థ్ ఖాన్ కోరారు. రిజర్వు బ్యాంకు పర్యవేక్షణ లోపం కారణంగానే ఈ తరహా మోసాలు పదే పదే జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ఇందుకు కిందిస్థాయి ఉద్యోగులు బలిపశువులు అవుతు న్నారని అన్నారు. రిజర్వు బ్యాంకు ఆమోదించిన స్విఫ్ట్ సాఫ్ట్‌వేర్ ద్వారానే పంజాబ్ నేషనల్ బ్యాంకు ఎల్‌వో యూలు జారీచేసిందని, అయినా అక్రమాలను గుర్తించలేక పోవడం పట్ల ఆయన ఆశ్చర్యం వ్యక్తంచేశారు. అదేవిధంగా కేంద్రం ప్రతిపాదించిన డిపాజిట్ ఇన్సూరెన్స్ బిల్లును యూఎఫ్‌బీయూ వ్యతిరేకించింది.

సోని ఇండియా ఎండీగా నాయర్



న్యూఢిల్లీ: సోనీ సంస్థ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్‌గా సునిల్ నాయర్ నియమితులయ్యారు. తద్వారా ఈ పదవి చేపట్టిన తొలి భారతీయుడిగా నాయర్ నిలిచారు. జపనీస్ ఎలక్ట్రానిక్ దిగ్గజ సంస్థ సోనీకి 2012 నుంచిఇండియాలో ఎండీగా కెనిచిరొ హిబి బాధ్యతలు నిర్వర్తించారు. హిబిని బ్రెజిల్ ఆపరేషన్స్ హెడ్‌గా బదిలీ చేసిన నేపథ్యంలో అతని స్థానంలో నాయర్‌కు అవకాశం లభించింది. 1995లో గల్ఫ్ సేల్స్ టీం సభ్యుడిగా సోనీ గ్రూప్‌లో చేరిన నాయర్, తర్వాత ఈశాన్య ఆఫ్రికా, రష్యా, లెబనాన్, సిరియాతోపాటు ఇతర గల్ఫ్ దేశాల్లో వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించారు. 2006-15 మధ్యకాలంలో సేల్స్ హెడ్‌గా బాధ్యతలు చేపట్టక ముందు ఆయన ఉత్తర అమెరికాలో రిటైల్ విభాగంలో పనిచేశారు. 2006లో నాయర్ భారత్ వ్యవహారాలు చేపట్టేనాటికి సంస్థ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నది. శాంసంగ్, ఎల్జీ సంస్థల నుంచి గట్టిపోటీ ని ఎదుర్కొనంటున్నది. అలాంటి స్థితినుంచి ప్రపంచంలోనే సోనీ అమ్మకాల్లో భారత్ నాల్గవ అతిపెద్ద మార్కెట్‌గా వృద్ధి చెందిందంటే అది నాయర్ ఘనతగానే చెప్పు కోవచ్చు. నాయర్ ఘజియాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ఆఫ్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీలో ఉన్నత విద్యను అభ్యసించారు.

భారత్‌కు బికినీ ఎయిన్‌లైన్



ముంబై: తక్కువ ఖరీదులో విమాన యాన సేవలు అందిస్తూ, వివాదాస్పద ఎయిర్‌వేస్‌గా ముద్రప డిన వియట్‌జెట్ ఎయిర్ త్వరలో భారత్‌లో కార్య కలాపాలు ప్రారంభిం చనుంది. వియత్నాంకు చెందిన ఈ విమానయాన సంస్థను 'బికినీ ఎయిర్‌లైన్'గా కూడా పిలుస్తారు. ఈ యేడాది జులైలో వియత్నాం రాజధాని నగరం నుంచి న్యూఢిల్లీకి సర్వీసులు ప్రారంభించనున్నట్లు సంస్థ ప్రకటించింది. ప్రారంభలో వారానికి నాలుగు విమానాలు నడిపేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపింది. 2012లో వియట్‌జెట్ ఎయిర్ ముద్రించిన వార్షిక క్యాలెంటర్ వివాదాస్పదమైంది. గ్రౌండ్ సిబ్బంది సహా, పైలట్లు, సహాయ సిబ్బందిని బికిని మోడళ్లుగా చూపింది. అంతేకాకుండా, విమానంలో కాలినడక ప్రాంతంలో స్విమ్మింగ్ షూట్ ధరించిన మోడళ్లతో ఫ్యాషన్ షోలు నిర్వహిస్తున్నట్లుగా సదరు క్యాలెండర్‌లో చిత్రీకరించింది. ఇది అప్పట్లో వివాదాస్పదం అయింది. అప్పటి నుంచి వియట్‌జెట్‌కు బికిని ఎయిర్‌లైన్‌గా ముద్రపడింది.

పోస్టాఫీసుల్లో రిల్ బిగ్‌టీవీ బుకింగ్‌లు



ముంబై: ఇకపై పోస్టాఫీసుల్లోనూ బుకింగ్‌లు చేసుకోవచ్చని డీటీహెచ్ సర్వీసుల ప్రొవైడర్ సంస్థ రిలయన్స్ బిగ్‌టీవీ ప్రకటించింది. మహారాష్ట్ర, గోవా రాష్ట్రాల్లో 12000 తపాల కార్యాలయాల్లో బిగ్‌టీవీ బుకింగ్‌లు అందుబాటు లో ఉంటాయని ప్రకటించింది. రూ. 499 మాత్రమే చెల్లించి హెచ్‌డీ సెట్ టాప్ బాక్స్‌ను రిజర్వు చేసుకోవచ్చని తెలిపింది. కనెక్షన్ ఇచ్చిన తర్వాత రూ. 1500 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఫ్రీకాస్ట్ సెట్‌టాప్ బాక్సు ద్వారా 500 ఫ్రీ చానళ్లను ఐదేళ్లపాటు, చెల్లింపు చానళ్లను ఏడాదిపాటు దేశవ్యాప్తం గా ప్రసారం చేయనున్నట్లు బిగ్‌టీవీ డైరెక్టర్ విజేందర్ సింగ్ చెప్పారు. రెం డవ సంవత్సరం నుంచి చెల్లింపు చానళ్లకు నెలకి రూ. 300 వంతున రీచార్జి చేయడం ద్వారా నిరంతరాయంగా సేవలు పొందవచ్చని వెల్లడించారు.

లూపిన్ ఔషధానికి యూఎస్ ఎఫ్‌డీఏ

న్యూఢిల్లీ: దేశీయ ఔషధ దిగ్గజ సంస్థ లూపిన్ ఉత్పత్తి చేసిన సొరియాసిస్ స్ప్రేకి అమెరికా ఎఫ్‌డీఏ ఆమోదం లభించింది. ఇది టారో ఫార్మాష్యూటికల్స్ యొక్క జనరిక్ ఉత్పాదన. 30 మిలీ, 50 మిలీ, 100 మిలీ స్ప్రేలకు తాజా అనుమతి లభించింది. ఈ మేరకు లూపిన్ సంస్థ సోమవారం బీఎస్ఈకి నివేదించింది.

అల్ట్రాటెక్ చేతికి బియాని



న్యూఢిల్లీ: అప్పుల్లో కూరుకుని పోయిన బియానీ సిమెంట్ కంపెనీలో 98 శాతం వాటా కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు అల్ట్రాటెక్ తెలిపింది. రుణ ఎగవేత చర్యల నుంచి విముక్తి కల్పించేందుకు బియానీకి 7266 కోట్ల రూపాయలు సమకూర్చనున్న ట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది. టెర్మినేషన్ ఆఫ్ ఐబీసీ ప్రొసీడింగ్స్ మేరకు వాటా కొనుగోలు ఒప్పందం ఖరారైనట్లు స్టాక్ ఎక్స్చేంజీకి వివరించింది. రుణదాతలకు చెల్లింపుల నిమిత్తం నిధులు సమకూర్చాల్సిందిగా బియాని ఇండస్ట్రీస్ అల్ట్రాటెక్‌ను ఆశ్రయించింది. ఇందుకోసం ఐబీసీ ప్రొసీడింగ్స్ ప్రకారం సిమెంట్ కంపెనీలోని మొత్తం వాటా విక్రయానికి సిద్ధమని తెలిపింది. ఈ క్రమంలో ఇరు సంస్థల మధ్య ఒప్పందంపై సంతకాలు జరిగాయి. అనంతరం ఉద్దేశపూర్వక రుణ ఎగవేత దారు ముద్రనుంచి బయటపడేసేలా నిధుల సమకూర్పునకు సంబంధించి హామీ లెటర్‌ను అల్ట్రాటెక్ జారీచేసింది.

'అల్యూమినియం పరిశ్రమపై అమెరికా ప్రభావం కొంతే..



ముంబై: అల్యూమినియంపై అమెరికా విధించిన 10శాతం దిగుమతి సుంకంతో సమీపకాలంలో పరిశ్రమపై పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చని ఇక్రా తాజా నివేదిక వెల్లడించింది. మెక్సికో, కెనడా మినహా మిగతా దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న అల్యూమినియంపై సుంకాన్ని 10శాతానికి పెంచుతూ ఇటీవల అగ్రరాజ్యం నిర్ణయం తీసుకుంది. చైనా ప్రభుత్వం తీసుకున్న కఠిన నిర్ణయాలతో ఇప్పటికే అంతర్జాతీయ అల్యూమినియం పరిశ్రమ ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నది. కాలుష్య కారక, అక్రమ అల్యూమినియం ఉత్పత్తుల పరిశ్రమలపై చైనా ఆంక్షలు విధించిన నేపథ్యంలో, తాజాగా అమెరికా చర్యల ప్రభావం తప్పక ఉంటుందని ఇక్రా అభిప్రాయపడింది. అయితే సమీపకాలంలో దీని తీవ్రత ఎక్కువగా ఉండదని పేర్కొంది. ఉత్పత్తులను తగ్గించాలన్న డ్రాగన్ నిర్ణయం మూలంగా 2017లో అంతర్జాతీయ మార్కెట్‌లో 1.4 మిలియన్ మెట్రిక్ టన్నుల లోటు ఏర్పడింది. సమీపకాలంలో ఇది 2.5 మిలియన్ మెట్రిక్ టన్నులకు చేరే అవకాశం ఉందని ఇక్రా రేటింగ్ సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జయంత్ రాయ్ వ్యాఖ్యానించారు. 2016లో అమెరికా దిగుమతుల వాటా 3.96 మిలియన్ మెట్రిక్ టన్నులుగా ఉంది. ఇందులో 2.30 మి.మె.టన్నులు ఒక్క కెనడా నుంచే దిగుమతి అయ్యేది. మిగతా 1.66 మి.మె.టన్నుల అల్యూమినియం రష్యా, ఖతార్, యూఏఈ, అర్జెంటీనా తదితర దేశాల నుంచి సమీకరిస్తుందని జయంత్ చెప్పారు.

అమ్మకాల ఒత్తిడి...

- నష్టాల్లో స్టాక్ మార్కెట్లు
- 4100 పాయింట్ల దిగువకు నిఫ్టీ



ముంబై: అంతర్జాతీయం గా బలహీన సంకేతాలతో స్టాక్ మార్కెట్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. సోమవారం బీఎస్ఈ సెన్సెక్స్ 252. 88 పాయింట్లు, నిఫ్టీ 100.95 పాయింట్లు నష్టపో యింది. ఈ క్ర మంలో రెండు సూచీలు సైకలాజికల్ స్థిరస్థాయిల దిగువకు చేరాయి. ఒకవైపు అమెరికా ఫెడరల్ బ్యాంకు పాలసీ నిర్ణ యం(20,21 తేదీల్లో), మరొకవైపు మోడీ ప్రభుత్వం ముంగిట అవి శ్వాస తీర్మానం వంటి అంశాల నేపథ్యంలో మదుపరులు కొను గోళ్లకు మొగ్గుచూపడం లేదు. వీటికితోడు కరెంటు ఖాతా లోటు పెరగనుం దన్న సంకేతాలు కూడా ఇన్వెస్టర్లను భయపెడుతు న్నాయి. బ్యాం కింగ్, లోహ షేర్లు ఎక్కువగా అమ్మకాల ఒత్తిడికి గుర య్యాయి. బీఎ స్ఈలో ప్రతిమూ డు షేర్లు నష్టానికి గాను ఒకషేరు లాభపడింది. లోహషేర్లలో ఎన్ఎండీసీ 6.59శాతం, హిందు కాపర్ 5.87శాతం, సె యిల్ 5.36శా తం, టాటాస్టీల్ 4.35శాతం, హిం దాల్కో 3.27శాతం నష్టపో యాయి. కాగా నేషనల్ అల్యూమినియం కంపెనీ 1.97శాతం లాభపడింది.

ఓలా, ఉబర్ డ్రైవర్ల సమ్మె


- డిమాండ్లను పరిష్కరించాలని నిరసన
- క్యాబ్‌లు దొరకక ప్రజల ఇబ్బందులు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తమ డిమాండ్ల సాధన కోసం ఓలా, ఉబెర్ వంటి క్యాబ్ ఆధారిత టాక్సీ డ్రైవర్లు దేశ వ్యాప్తంగా వివిధ నగరాల్లో సమ్మె కు దిగడంతో నిత్యం క్యాబ్‌లను ఆశ్రయించి గమ్యస్థానాలకు చేరే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్‌లో క్యాబ్‌లకు తీవ్ర కొరత ఏర్పడగా, చిన్న చిన్న క్యాబ్ సంస్థలకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. హైదరాబాద్ సహా న్యూఢిల్లీ, ముంబై, పూణే, బెంగళూరు తదితర నగరాల్లో క్యాబ్ డ్రైవర్లు సమ్మెకి దిగారు. తమ చెల్లింపు విధానాన్ని పునర్వ్యవస్థీకరించాలని, ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నారు.తాము రూ. 7 లక్షల వరకు పెట్టుబడి పెట్టి క్యాబ్‌లను ఓలా, ఉబెర్ వంటి సంస్థల్లో రిజిస్టర్ చేసుకుంటే నెలకు లక్షన్నర రూపాయలకు ఆదాయం వస్తుందని మోసపు మాటలు చెప్పారని, ప్రస్తుతం దానిలో సగం కూడా తమకు రావడం లేదని డ్రైవర్ల సంఘం నేత సంజయ్ నాయక్ ఆరోపించారు. కంపెనీ ఆధీనంలోని కార్లకే తొలి ప్రాధాన్యత ఇస్తున్నారని, డ్రైవర్ యజమానిగా ఉన్న కార్లకు బుకింగ్స్ ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. లోక్ గ్యారెంటీ లెటర్లు ఇవ్వడం లేదని, ముద్రాస్కీం ఉన్నప్పటికీ దాన్ని తాము వినియోగించుకోలేకపోతున్నామని తెలిపారు. తమ సమస్యలు పరిష్కారమయ్యేంత వరకూ సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఓలా, ఉబెర్ యాజమాన్యాలు దిగిరాకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నైపుణ్య శిక్షణతో ఉపాధి, ఉద్యోగ కల్పన

దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన జాతీయ పట్టణ ఉపాధి పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం అనేక మందికి వృత్తి నైపుణ్య శిక్షణ అందించింది. శిక్షణ పూర్తయిన వారికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పించింది. ఈ పథకం కింద ఉత్తరప్రదేశ్ నుంచి ఎక్కువ మందికి లబ్ధి చేకూరింది. 28, 212 మందితో యూపీ అగ్రస్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు జాబితాలో వరుసగా మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాయి. కాగా, కేవలం నలుగురికే ఉపాధి అవకాశాలతో జమ్ము కాశ్మీర్ అట్టడుగున నిలిచింది. ఏప్రిల్ 2017నుంచి జనవరి 2018 మధ్య కాలానికి సంబంధించిన ఉపాధి అవకాశాల ఆధారంగా ఈ జాబితాను రూపొందించారు. ఇదిలావుండగా, ఈ పథకం ద్వారా 2014-15లో 63,115 మంది, 2015-16లో 33,664 మంది, 2016-17 మధ్యకాలంలో 1,51,901 మంది2017-18 మధ్యకాలంలో 83, 333 మంది ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందినట్లు కేంద్రప్రభుత్వం పార్లమెంటుకు వెల్లడించిన నివేదికలో స్పష్టం చేసింది.



ఉత్తర్‌ప్రదేశ్	28212
జార్ఖండ్	16276
ఆంధ్ర ప్రదేశ్	9250
తెలంగాణ	6039
మహారాష్ట్ర	3971
పశ్చిమ బెంగాల్	3044
గుజరాత్	2957
ఛత్తీస్‌గఢ్	2645
అసోం	1102
మధ్య ప్రదేశ్	1024



తమిళనాడు	994	చండీగఢ్	133
ఒడిశా	776	అరుణాచల్	113
నాగాలాండ్	763	హర్యానా	107
గోవా	639	హిమాచల్	100
కర్నాటక	622	మిజోరాం	91
పంజాబ్	569	మేఘాలయ	73
కేరళ	425	రాజస్థాన్	33
బీహార్	354	జమ్మూ కశ్మీర్	4

విజయ పథం వీడొద్దు

- నిర్దిష్ట లక్ష్యాలతో ముందుకు సాగాలి
- వైఫల్యాలతో నిరాశ చెందవద్దు
- మాజీ మిస్ ఇండియా గుల్‌పనాగ్

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : విజయపథం చేరుకునేందుకు లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, అప్పుడే గమ్యాన్ని ముద్దాడుతామని ప్రముఖ నటి, 1999 లో మిస్ ఇండియా విజేత, పైలెట్, ఎన్‌జీఓ నేత, ఆమ్ ఆద్మీ పార్టీనాయకురాలు గుల్ పనాగ్ అన్నారు. ఫిక్కీ హైదరాబాద్ ఛాప్టర్ సోమవారం ఇక్కడ విజయానికి మెట్లు అనే అంశంపై నిర్వహించిన సదస్సులో గుల్ పనాగ్ మాట్లాడారు. గంట పాటు ఆమె ప్రసంగం కొనసాగించారు. ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. ఫిక్కీ చైర్ పర్సన్ కామినీ సరాఫ్ సమన్వయకర్తగా వ్యవహరించిన సదస్సులో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా తాను సినిమా ఇండస్ట్రీలోకి ఎలా వెళ్లాల్సి వచ్చింది... రాజకీయ నాయకురాలిగా ఎలా మారాల్సి వచ్చింది తదితర తన జీవితానుభవాలను వివరించారు. సక్సెస్ అంటే ఏమిటి ? విజేతకు కావాల్సిన లక్షణాలపై ఆమె వివరిస్తున్నప్పుడు హాల్ చప్పట్లతో మారుమోగింది. మారథాన్ పోటీలో తాను పాల్గొన్నప్పుడు పురుషుల నుంచి వివక్షకు గురయ్యానని చెప్పారు. చండీగడ్ తన స్వస్థలమని, అయితే, తన తండ్రి మిలటరీ ఉద్యోగి కావడంతో దేశంలోని పలు చోట్ల చదువుకోవాల్సి వచ్చిందన్నారు. గణితంలో డిగ్రీ చదువుకున్నానని, పొలిటికల్ సైన్స్‌లో ఎంఏ చదివానని చెప్పారు. తన తాత కల్నల్ శంషేర్ సింగ్ పేర ప్రభుత్వేతర సంస్థను స్థాపించి స్త్రీ, పురుష సమానత్వం, విద్యాభివృద్ధి, విపత్తు నిర్వహణ తదితర కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. 2014 లో చండీగఢ్ లోక్‌సభ స్థానం నుంచి ఆమ్ ఆద్మీపార్టీ తరపున పోటీ చేసి ఓటమి చెందానని చెప్పారు. అయితే, దాన్న ఓటమిగాతాను భావించడం లేదని స్పష్టంచేశారు. తనకు లక్షకు పైగా ఓట్లు పడ్డాయని, ప్రజల సమస్యలను, కన్నీళ్లను దగ్గరి నుంచి చూశానని, పల్లె వాతావరణలో సాంఘిక,ఆర్థిక స్థితిగతులను తెలుసుకోగలిగానని చెప్పారు. రాజకీయాల్లోకి ఎలా రావాల్సి వచ్చిందని అడగ్గా... వ్యక్తిగా, ప్రభుత్వేతర సంస్థ ప్రతినిధిగా కంటె రాజకీయ నాయకుడిగా ప్రజలకు ఎక్కువగా సేవలందించవచ్చన్నారు. తమ ఊరిలో రోడ్లు సమస్యను అధికారుల దృష్టికి తేగా పట్టించుకోలేదని, అదే స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తేగా ఆ సమస్యకు పరిష్కారం దొరికిందని, ఆ విధంగా తాను రాజకీయాల్లోకి రావాల్సి వచ్చిందని గుల్ పనాగ్ స్పష్టం చేశారు. విజయం సాధించాలనుకుంటే సరిపోదని, దాన్నిసాధించేందుకు అనుగుణంగా మార్గాలను అన్వేషించాలని సూచించారు. మహిళలు ముందుగా స్వతంత్రులు కావాలని అప్పుడే దేన్నైనా సాధించగలరన్నారు. గత ఎన్నికల్లో కిరణ్ ఖేర్ చేతుల్లో ఓటమి పాలయ్యానని, వచ్చే ఎన్నికల్లో మళ్లీ పోటీ చేస్తాన ని కుండబద్దలు కొట్టారు. అయితే, ఏ పార్టీ తరపున పోటీ చేస్తానన్న విషయంలో స్పష్టత ఇవ్వలేదు. కానీ పోటీ మాత్రం చేస్తున్నానని చెప్పారు. ఫిక్కీ చైర్‌పర్సన్ కామినీ సరాఫ్ మాట్లాడుతూ, విజయం సాధించడం వెనుక ఒకఐడియా ఉండాలని, అది మార్పుకు దోహదపడుతుంద న్నారు. ఈ సందర్భంగా ఫిక్కీ ప్రతినిధులు గుల్ పనాగ్‌ను ఘనంగా సత్కరించారు.



పదవీ విరమణ పెంపుపై ఉత్కంఠ

●తుది నిర్ణయం ముఖ్యమంత్రిదే
●రెండు వర్గాల్లో టెన్షన్ ●మధ్యే మార్గం అలోచిస్తున్న ప్రభుత్వం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కరవమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకు కోపం అన్నట్టుగా ప్రభుత్వ వైద్యుల పదవీ విరమణ పెంపు పరిస్థితి తయారయ్యింది. బంతి సీఎం కోర్టులో ఉందని ఆయన ఎవరికీ మేలు చేసే విధంగా నిర్ణయం తీసుకున్నా మరోవర్గం మాత్రం ఈ విషయంలో ఆచితూచి సీఎం నిర్ణయం తీసుకోవాలని సూచిస్తోంది. ప్రభుత్వ వైద్యుల పదవీ విరమణపై ఒక వర్గం వద్దని వాదిస్తుండగా, మరో వర్గం కావాలంటుంది. కొన్ని రోజులుగా ఈ విషయమై రెండు వర్గాలుగా విడిపోయిన వైద్య సంఘాలు ప్రభుత్వానికి ఎవరికీ తోచిన విధంగా వారు వాదనలు వారు వినిపిస్తున్నారు.

వైద్యుల పదవీ విరమణ వయస్సు పెంచితే నూతన నియామకాలు జరగక వైద్య పట్టా తీసుకున్న వేలమంది నిరుద్యోగులుగా మిగులుతారని ఒకవర్గం ఆవేదన వ్యక్తం చేస్తోంది. మరో వర్గం మాత్రం బోధనా కాలేజీలో సీనియర్ల కొరత చాలా ఉందని పేర్కొంటోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పెరుగుతున్న రోగులకు అనుగుణంగా సీనియర్ వైద్యులు అవసరమని, అసలు వైద్య ఆరోగ్య శాఖలో సీనియర్ల కొరత చాలా సంవత్సరాలుగా వేధిస్తున్నదని మరో వర్గం పేర్కొంటున్నది. సంవత్సరానికి సుమారు 50కి పైగా సీనియర్లు పదవీ విరమణ చేస్తున్నారని దీంతో వైద్య ఆరోగ్య శాఖలో చాలా ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నది వారి వాదన. ఇరువర్గాలు ఇప్పటికే మంత్రి లక్ష్మారెడ్డి, సీఎంను కలిసి తమ వాదనలు వినిపించారు.

ప్రొఫెసర్ల కొరతతో ఇబ్బందులు

ప్రస్తుతం రాష్ట్రంలో వైద్య విద్యను అభ్యసిస్తోన్న అధ్యాపకుల పదవీ విరమణ వయస్సు 58 ఏళ్లు. దీనిని 65 సంవత్సరాలకు పెంచాలని వారు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో 7 బోధనాసుపత్రులు ఉన్నాయి. వాటిలో ప్రస్తుతం ప్రొఫెసర్ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. భారత వైద్య మండలి (ఎంసీఐ) తనిఖీకి వచ్చిన సమయంలో వైద్య సీట్లను కోల్పోవాల్సిన అవసరం ఉందని ఒక వర్గం పేర్కొంటుంది. తనిఖీల సమయంలో ఇతర కళాశాలల్లో పనిచేస్తున్న వారిని రప్పించి తమ కళాశాల అధ్యాపకులుగా చూపించాల్సి వస్తుందని ప్రొఫెసర్లు పేర్కొంటున్నారు. అధ్యాపకుల పదవీ విరమణ వయస్సు పెంచడం వలన ఇలాంటి సమస్యలు ఉండవని వారు ప్రభుత్వానికి తెలియచేస్తున్నారు. ప్రస్తుతం ఏపీలో 63ఏళ్లు చేశారని, ఇక్కడ కూడా వయస్సు పెంచితే బాగుంటుందని పేర్కొంటున్నారు.

5 సంవత్సరాల అనుభవముంటే అసోసియేట్ ప్రొఫెసర్

వైద్య విద్యలో అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్టులుంటాయి. అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు ఐదు సంవత్సరాల అనుభవం ఉంటే అసోసియేట్ ప్రొఫెసర్ అవుతారు. నాలుగేళ్లు అసోసియేట్ ప్రొఫెసర్‌గా చేస్తే ప్రొఫెసర్ అవుతారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేకపోతే నేరుగా భర్తీ చేసుకోవచ్చు. ప్రొఫెసర్ల పోస్టులను మాత్రం అనుభవం ఉన్న వారితోనే భర్తీ చేయాల్సి ఉంటుంది. ఒక ప్రొఫెసర్‌కు 30 ఎంబీబీఎస్, 3 పీజీ సీట్లు ఇస్తారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో గాంధీ, ఉస్మానియా, కాకతీయ, నిజామాబాద్, రిమ్స్, మహబూబ్‌నగర్‌తో పాటు కొత్తగా ఈ విద్యా సంవత్సరం నుంచి సిద్ధిపేట వైద్య కళాశాలతో కలిపి 1,350 ఎంబీబీఎస్, 1200 పీజీ సీట్లు ఉన్నాయి. మొత్తం 40 శాతం కూడా అధ్యాపకులు లేరని ప్రొఫెసర్లు పేర్కొంటున్నారు. 2500 మందికి గాను కేవలం 1800 మంది మాత్రమే ఉన్నారని పేర్కొంటున్నారు.



అధ్యాపకులు ఇరు వర్గాల వాదనలు విన్నాం. దీనిపై సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నాం. ఎవరి బాధలను వారు చెప్పుకున్నారు.

ఇరు వర్గాల వాదనలు విన్నాం

వాటిని పరిగణలోకి తీసుకున్నాం. నిపుణుల కమిటీతో చర్చించిన అనంతరం దానిపై నిర్ణయం తీసుకుంటారు. ఎవరూ కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అందరికీ మేలు జరిగే విధంగా సీఎం ఆలోచన ఉంటుంది.

కేంద్ర ప్రభుత్వ పరిధిలోని వైద్యుల వయస్సు పెంపు

కేంద్ర ప్రభుత్వ పరిధిలోని వైద్య ఆరోగ్య సంస్థల్లో పనిచేస్తున్న వైద్యుల పదవీ విరమణ వయస్సును 65 ఏళ్లకు పెంచుతూ గతంలో కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయాన్ని ఇక్కడ కూడా అమలు చేయాలని ఒక వర్గం డిమాండ్ చేస్తోంది. కేవలం బోధనాసుపత్రుల్లో వారే కాకుండా జిల్లా, ప్రాంతీయ, సామాజిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు అన్ని ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యులను కూడా పరిగణలోకి తీసుకోవాలని వారు వాదిస్తున్నారు.

తెరపైకి కొత్త ప్రతిపాదన

ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో హారీజెంటల్ సీనియార్టీ ఉంది. దీంతోపాటు ప్రమోషన్ స్టాగినేషన్ ఉంటుంది. అయితే ఏపీలో మాత్రం ఈ మధ్యన శాలరీ అడ్వాన్సుడ్ స్కీం అనే దానిని ప్రస్తుతం అమలు చేశారు. దీనివల్ల వైద్యులందరూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉన్నారు. దానినే ఇక్కడ కూడా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. శాలరీ అడ్వాన్సుడ్ అమలు చేసినట్టయితే రెగ్యులర్ ప్రమోషన్ ఆలస్యం అయినా జూనియర్, సీనియర్లకు జీతాల పెంపులో ఎలాంటి ఇబ్బంది ఉం డదన్నది ప్రభుత్వం మూడో మార్గంగా ఆలోచిస్తున్నట్టు అధికార వర్గాల సమాచారం. క్యాడర్ అడ్వాన్స్ మెంట్ స్కీం అమలు జరిగితే డిజిగినేటెడ్ అసోసియేట్ ప్రొఫెసర్ డిజిగినేటెడ్ ప్రొఫెసర్‌లను ఎంసీఐ తనిఖీల సమయంలో రెగ్యులర్ అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్‌గా చూపించుకోవన్నది వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల భావన. ఈ కొత్త ప్రతిపాదనను ప్రభుత్వానికి సైతం వారు వినిపించారు. ఈ ప్రతిపాదనను సీఎం పరిగణలోకి తీసుకుంటారా లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది.



ఏడాదికి 50 మందికి పైగా సీనియర్లు, జూనియర్ల రిటైర్ అవుతున్నారు. అండర్ గ్రాడ్యుయేట్ లెవల్‌లో ఫ్యాకల్టీలు ఎక్కువగా

ఏడాదికి 50 మంది రిటైర్:డీఎంఈ

లేరు. క్యాడర్ అడ్వాన్సుడ్ మెంట్ స్కీంను అమలు చేస్తే డిజిగినేటెడ్ అసోసియేట్ ప్రొఫెసర్, డిజిగినేటెడ్ ప్రొఫెసర్‌లను ఎంసీఐ తనిఖీలకు వచ్చినప్పుడు చూపించవచ్చు. దీనివల్ల మరిన్ని పీజీ సీట్లను పెంచుకునేందుకు వీలు ఉంటుంది.

బడుగుల సంక్షేమమే ధ్యేయం

●మంత్రి జోగు రామన్న



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర సర్కార్ పనిచేస్తోందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న తెలిపారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు. సర్కార్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రచారానికి సంబంధించి ఎంబీసీ సంక్షేమ సంఘం రూపొందించిన వాల్ పోస్టర్‌ను మంత్రి ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్‌తో కలిసి సోమవారం సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంబీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గడ్డం సాయి కిరణ్, ఎమ్మెల్సీ పురాణం సతీష్, సంఘం నాయకులు బెల్లం మాధవి, పల్లవి, సింగీతం సాయి, అనూప్, గంగిరెద్దుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జెల్లెల నర్సింహా తదితరులు పాల్గొన్నారు. సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందన్నారు. కళ్యాణలక్ష్మి పథకం నిరుపేదలకు వరమని అన్నారు. కళ్యాణ లక్ష్మి పథకంలో ఇకపై రూ. 1,00,116 ఇవ్వాలని నిర్ణయించినట్టు మంత్రి స్పష్టం చేశారు. నిరుపేదలు ఈ పథకంతో ఎంతో లబ్ధి పొందుతున్నారని అన్నారు.

పథకాలను విజయవంతం చేయాలి

●ఉద్యోగుల డైరీని ఆవిష్కరించిన మంత్రి జూపల్లి



హైదరాబాద్, ఆంధప్రభ: పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని మంత్రి జూపల్లి ఆ శాఖ ఉద్యోగులను కోరారు. సోమవారం పంచాయతీరాజ్ శాఖ కార్యాలయంలో ఆ శాఖ ఉద్యోగులు రూపొందించిన ఉగాది క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను అందరికీ అర్థం అయ్యే విధంగా క్యాలెండర్ రూపొందించటం అభినందనీయం అన్నారు. తమది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నీతూ ప్రసాద్‌తోపాటు వెస్లీ సైదులు అధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల హౌసింగ్ సమస్యపై మంత్రుల కమిటీ భేటీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: జర్నలిస్టుల హౌసింగ్ సమస్యపై కో-ఆర్డినేషన్ కమిటీ సోమవారం అసెంబ్లీలో రాష్ట్ర మంత్రులు కేటీరామారావు, హరీష్‌రావులను కలిసి వినతిపత్రాలు అందజేసింది. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. అడ్వకేట్ జనరల్‌తో మాట్లాడి త్వరలోనే ఒకసమావేశం ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా మంత్రులు హామీనిచ్చారు. రెండు, మూడురోజుల్లోనే ఈ సమావేశం నిర్వహిస్తామన్నారు. డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డిని కూడా కమిటీ సభ్యులు కలిశారు. జెహెచ్‌సీసీ కన్వీనర్ దిలీప్ రెడ్డి నేతృత్వంలో మంత్రులను కలవగా కార్యక్రమంలో కో-కన్వీనర్లు వెంకటాచారి, విరాహత్‌అలీ, బసవపున్నయ్య, రాజమౌళిచారి పాల్గొన్నారు.

20న తెలంగాణ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఎన్నికలు

హైదరాబాద్,ఆంధ్రప్రభ : తెలంగాణ హైకోర్టు న్యాయవాదుల సంఘం 2018-19 సంవత్సరం కార్యవర్గం ఎన్నికలు మార్చి 29న జరుగుతాయని తెలంగాణ హైకోర్టు బార్ అసోసియేషన్ కార్యదర్శి పాశం సుజాత తెలిపారు.ఈ మేరకు ఆమె సోమవారం ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు. నామినేషన్ పత్రాలు దాఖలు చేసేందుకు చివరి తేది.21-3-2018.(సాయంత్రం 4.30 గంటల వరకు). దాఖలైన మొత్తం నామినేషన్ల సంఖ్య, సక్రమమని తేలిన నామినేషన్ల సంఖ్యను కూడా తేది.21-3-2018న ప్రకటిస్తారు. నామప త్రాల ఉపసంహరణ తేది.22-3-2018.(సాయంత్రం4.30 గంటలవరకు). నామినేషన్ల తుది జాబితా తేది.22-3-2018(సాయంత్రం 4.45 గంటలకు). అలాగే తేది.29-3-2018న ఉదయం 1030 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు, ఫలితాలను ప్రకటించడం జరుగుతుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

ఏప్రిల్ 4న ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఎన్నికలు

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదుల సంఘం కార్యవర్గం 2018-2019 సంవత్సరం ఎన్నికలు ఏప్రిల్ 4న జరుగుతాయని ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం కార్యదర్శి కె.జ్యోతి ప్రసాద్ తెలిపారు.ఈ మేరకు ఆయన ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు.నామపత్రాల స్వీకరణ (ఉదయం 11 నుంచి సాయంత్రం 4.30 గంటలు) చివరి తేది.21.3.2018. అలాగే నామినేషన్ల పరిశీలన, సక్రమమైన నామినేషన్ల ప్రకటన తేది.21.3.2018 (సాయంత్రం 5 గంటలకు). నామినేషన్ల ఉపసంహరణ తేది.22.3.2018(సాయంత్రం 4.30 వరకు).తుది జాబితా ప్రకటన తేది.22.3.2018.(సాయంత్రం 4.45).ఇక ఏప్రిల్ 4న ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం 5 గంటల తర్వాత ఓట్లను లెక్కించి ఫలితాలను ప్రకటించనున్నట్లు ఎన్నికల ప్రకటనలో పేర్కొన్నారు.

ఖైదీ ఆత్మహత్యాయత్నం

ఖమ్మం (లీగల్), ప్రభన్యూస్: క్షణికావేశానికి గురైన ఖైదీ ఆత్మహత్యాయత్నానికి సోమవారం తెల్లవారుజామున ఖమ్మం సబ్‌జైల్‌లో చోటు చెసుకుంది. జైలర్ తెలిపిన వివరాల ఖమ్మం కాల్వొడ్డు ప్రాంతానికి చెందిన శ్రీనివాసరావు అనే వ్యక్తి హత్య కేసులో 2012నుంచి వరంగల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. 2015లో ఖమ్మం సబ్‌జైలుకు తరలించారు. ఈ నెల 16వ తేదీన పెరోలుపై ఇంటికి వెళ్లివచ్చిన ఖైది కుటుంబం కలహాలతో కలత చెంది ఉంటాడని జైలు అధికారి తెలిపారు. ఈ నేపథ్యంలో సోమవారం తెల్లవారుజామున జైలు గది కిటికీ సువ్వతో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వెంటనే గమనించిన సిబ్బంది ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ల సలహాల మేరకు మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ఖైది ఆరోగ్య పరిస్థితి మెరుగుపడినట్లు అధికారులు తెలిపారు.

కొత్త పార్టీ ఏర్పాటు సభ ఏప్రిల్ రెండో వారంలో

హైదరాబాద్, ఆంధ్రప్రభ: టీజేఏసీ చైర్మన్ కోదండరామ్ ఏర్పాటు చేయబోయే కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు సభను ఏప్రిల్ రెండు లేదా మూడో వారంలో నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. అదే రోజు పార్టీ పేరును కూడా ప్రకటించాలనే అభిప్రాయానికి వచ్చారు. సోమవారం కోదండరామ్ అధ్యక్షతన టీజేఏసీ సన్నహాక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు నిర్ణయాలు తీసుకున్నారు. పార్టీ ప్రారంభసభకు ముందు ఏప్రిల్ 10 వరకు పాత 10 జిల్లాలలో సభలు, సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. పార్టీ ప్రకటన సభకు భారీగా జనసమీకరణ చేయాలని, అందుకు రెండు, మూడు కమిటిలు ఏర్పాటు చేయాలనే అభిప్రాయానికి వచ్చారు. ఇప్పటికే పార్టీ ఏర్పాటుకు సంబంధించి రిజిష్టేషన్ కూడా పూర్తి కావచ్చిందని టీజేఏసీ నాయకులు తెలిపారు. ఈ సన్నాహక కమిటి సమావేశానికి టీజేఏసీ కన్వీనర్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తమ్, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్, జాహేద్‌అలీఖాన్, గాదె ఇన్నయ్య, వెంకట్‌రెడ్డి, బైరీ రమేష్‌తో పాటు వివిధ జిల్లాలకు చెందిన నేతలు హాజరయ్యారు.

ఏప్రిల్‌లో సీపీఎం జాతీయ మహాసభలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సీపీఐ(ఎం) జాతీయ మహాసభలు విజయవంతం చేయాలని ఈ నెల 24 నుంచి బస్సు యాత్రలను ప్రారంభిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏప్రిల్ 18 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో సీపీఐ(ఎం) జాతీయ మహాసభలకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు పార్టీ జాతీయ నాయకులు, వివిధ రాష్ట్రాల నుంచి పార్టీ ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఈ మహసభల విజయవంతానికి రాష్ట్రంలో రెండు బస్సు యాత్రలు చేపట్టనున్నట్లు చెప్పారు. మొదటి జాత రంగారెడ్డి జిల్లా ఇబ్రాహీంపట్నంలో పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, రెండో జాతను పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం భువనగిరిలో ప్రారంభిస్తారని వివరించారు.

23 నుంచి పంజాబ్‌లో ఏఐఎఫ్‌డీవై జాతీయ మహాసభలు


పంజాబ్‌లో సంగ్రూర్‌లో ఈ నెల 23 నుంచి జరిగే ఏఐఎఫ్‌డీవై అఖిల భారత ద్వితీయ మహాసభలకు రాష్ట్రం నుంచి 65 మంది ప్రతినిధులు హాజరవుతున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనం సుధాకర్ తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యువతను మోసం చేస్తున్న తీరుపై 23,24,25 తేదీల్లో జరిగే జాతీయ మహాసభల్లో చర్చిస్తామన్నారు.

ప్లీనరీతో కొత్త జోష్!

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఏఐసీసీ ప్లీనరీ సమావేశాలు విజయవంతం కావడంతో కాంగ్రెస్ కేడర్‌లో నూతనోత్తేజం, మనోధైర్యం నింపిందని ఏఐసీసీ సభ్యులు కనుకుల జనార్దన్‌రెడ్డి సోమవారం తెలిపారు. భావితరానికి రాహుల్ గాంధీ దిశానిర్దేశం చేశారని ఆయన పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో అటు దేశం లోనూ ఇటు రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని టీఆర్ఎస్ పాలనలో ప్రజలు విసుగు చెందారని ఆయన వివరించారు.

రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన

●రైతు భరోసా యాత్రలో మాజీ మంత్రి శ్రీధర్‌బాబు



భూపాలపల్లి రూరల్, ప్రభ న్యూస్ : తెలంగాణ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ చేయబడిందని, సీఎం కేసీఆర్ నియంత పాలన కొనసాగి స్తున్నడని టీపీసీసీ ఉపాధ్యక్షులు, మాజీ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం భూపాలపల్లి మండలం ఆజంనగర్ గ్రామం నుండి ఏఐసీసీ సభ్యులు, మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ గండ్ర వెంకట రమణారెడ్డి రైతుల సంక్షేమం కోసం చేపట్టిన రైతు భరోసా పాదయాత్ర ప్రారంభమైంది. ఈ యాత్రకు సంఘీభావం తెలిపిన శ్రీధర్ బాబు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అనేక మంది విద్యార్థులు, యువకులు ప్రాణాలర్పించి సాధించుకున్న తెలంగాణను సీఎం కేసీఆర్ మాయమాటలతో కాలంవెల్లబుచ్చి ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తున్నారన్నారు. గండ్ర వెంకట రమణా రెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర చెల్లించక పోవడంతో వారి బతుకులు దుర్భరంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, రైతన్నల సంక్షేమం కోసం, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టితీసుకెళ్ళేందుకు తాను 40 రోజుల పాటు నియోజకవర్గంలో రైతు భరోసా పాదయాత్ర చేపట్టామన్నారు. కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి గండ్ర జ్యోతి, ఉమ్మడి జిల్లా నాయకులు దొమ్మటి సాంబయ్య, ములుగు మాజీ ఎమ్మెల్యే సీతక్క తదితరులు పాల్గొన్నారు.

ప్రాసిక్యూషన్స్ శాఖ బలోపేతం

●హోంమంత్రి నాయిని



హైదరాబాద్, ఆంధ్రప్రభ : డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ శాఖను సమూలంగా బలోపేతం చేయడానికి చేపట్టాల్సిన చర్యలపై సోమవారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి, న్యాయ మం త్రి ఇంద్రకరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఉన్న వివిధ కోర్టులలో అవసరమైన ప్రాసిక్యూటింగ్ ఆఫీసర్ల పోస్టులు మంజూరు చేయడానికి సత్వర చర్యలు తీసుకోవాలని సమావేశం నిర్ణయించింది.

క్యాడర్ ప్రాసిక్యూటర్ పోస్టుల మంజూరు, భర్తీకి కొంత సమయం అవసరమైన నేపథ్యంలో ప్రస్తుతం నియామకం చేస్తున్న టెన్యూర్ ప్రాసిక్యూటర్ల నియామకం కోసం మరింత పటిష్టమైన విధానాన్ని అవలంబించాలని నిర్ణయించారు. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ ఆఫీసులో అవసరమైన మినిస్టీరియల్ సిబ్బంది, ఫర్నిచర్, కంప్యూటర్లు, సిబ్బందికి ఇంటర్నెట్ ఫోన్ ఇతర సదుపాయాల కల్పనకు పూర్తి స్థాయిలో తక్షణమే తగు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలని డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్‌కు సూచించారు. ఇప్పటికే వివిధ కోర్టులకు ప్రాసిక్యూటింగ్ అఫీసర్ల పోస్టుల మంజూరు కొరకు ప్రభుత్వంలో ఉన్న ప్రతిపాదనలు చేయడంతో పాటు సత్వరమే మంజూరుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ప్రస్తుతం ప్రాసిక్యూషన్స్ శాఖాధిపతి కార్యాలయానికి తగిన వసతి లేని కారణంగా అనువైన ప్రభుత్వ భవనాన్ని సమకూర్చుకోవాలని, భవనాన్ని గుర్తించి ప్రతిపాదనలను పంపించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో హోం శాఖ కార్యదర్శి రాజీవ్ త్రివేది, లా కార్యదర్శి నిరంజన్ రావు, డిజిపి మహేందర్‌రెడ్డి,సిఐడి అదనపు డిజి గోవింద్‌సింగ్, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ వైజయంతి తదితరులు పాల్గొన్నారు.

భాగ్యనగరంలో ఉద్రిక్తత

●రథయాత్రకు అనుమతి లేదన్న పోలీసులు
●పలువురు వీహెచ్‌పీ నేతల అరెస్టు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రామ రథయాత్ర నిర్వహణ విషయంలో పోలీసులకూ, విశ్వ హిందూ పరిషత్ (విహెచ్‌పి)కి మధ్య ఆదివారం తలెత్తిన వివాదం సోమవారం కూడా కొనసాగింది. ఆదివారం సాయంత్రం నుంచే విహెచ్‌పి కార్యాలయ పరిసర ప్రాంతాలను తమ అదుపులోకి తీసుకున్న పోలీసులు సోమవారం కూడా కొనసాగించారు. కార్యాలయాన్ని పోలీసులు చుట్టుముట్టారన్న విషయం తెలుసుకున్న కార్యకర్తలు భారీ ఎత్తున అక్కడకు తరలి రావడంతో పరిసర ప్రాంతాలలో ఉద్రిక్తత నెలకొంది. దీంతో పోలీసులు విహెచ్‌పి కార్యాలయ పరిసర ప్రాంతాలలోని దుకాణాలను మూసివేయించడంతో పాటు మరిన్ని సాయుధ బలగాలను మోహరింప చేశారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణం కోసం కేంద్రంపై వత్తిడి పెంచేందుకు దేశవ్యాప్తంగా రథయాత్రలు నిర్వహించాలని కొద్ది రోజుల క్రితం ఉడిపిలో జరిగిన సాధుసంతుల సమావేశం నిర్ణయించింది. ఇందులో భాగంగానే బాసర నుంచి భద్రాచలం వరకు రథయాత్రను సోమవారం నుంచి నిర్వహించేందుకు విహెచ్‌పి ప్రత్యేకంగా రామరథాన్ని సిద్ధం చేయించింది. ఈ రథం ఆదివారం ఉదయం విహెచ్‌పి కార్యాలయానికి చేరుకోగానే పోలీసులు చుట్టుముట్టి అనుమతిలేదని, కదిలిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. దీంతో పోలీసులు, విహెచ్‌పి కార్యకర్తల మధ్య మాటల యుద్ధం మొదలైంది. ఆదివారం సాయంత్రం వరకు విహెచ్‌పి నేతలు పోలీసులతో సంప్రదింపులు జరిపినా ఫలితం లేకపోయింది.

డీజీపీని కలిసిన నేతలు

రథ యాత్రకు పోలీసులు అడ్డు చెప్పడం, కార్యాలయానికి కార్యకర్తలు రాకుండా అడ్డు చెప్పడం తదితర పరిణామాల నేపథ్యంలో విహెచ్‌పి తెలంగాణ ప్రాంత అధ్యక్షులు రామరాజు, కార్యదర్శి గాల్‌రెడ్డి, భజరంగ్ దళ్ ప్రముఖ్ సుభాష్, నగర కార్యదర్శి ఆలె నగేష్ తదితరులు డిజిపి ఎం. మహేందర్‌రెడ్డిని కలిశారు. రథయాత్ర సందర్భంగా ఏదైనా దుస్సంఘటన జరగొచ్చన్న ఉద్దేశ్యంతో యాత్రకు అనుమతించడం లేదని ప్రతినిధి బృందానికి డిజిపి తేల్చి చెప్పారు.

కోర్టును ఆశ్రయిస్తాం : వీహెచ్‌పీ

తాము నిర్వహించే రథయాత్ర ఎవరికీ వ్యతిరేకం కాదని విహెచ్‌పి నేతలు సోమవారం మీడియా సమావేశంలో వాపోయారు. మంగళవారం కోర్టుకు వెళ్ళి రథయాత్రకు అనుమతి తీసుకుంటామన్నారు.

రెచ్చిపోయిన మావోయిస్టులు

●కాంట్రాక్ట్ కుమారుడు హతం... నాలుగు వాహనాలు దగ్ధం
●2 నెలల వ్యవధిలో ఏడు వాహనాలను తగులబెట్టిన మావోయిస్టులు
●ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్లకు ప్రతీకారం తీర్చుకుంటున్న నక్సల్స్



హతమైన కాంట్రాక్టర్ కుమారుడు

చింతూరు, ప్రభ న్యూస్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టులు చెలరేగి రహదారి పనుల కాంట్రాక్టర్ కుమారుడుని హత్య చేయడంతో పాటు రహదారి పనులు నిర్వహిస్తున్న వాహనాలను సోమవారం నాడు దగ్ధం చేశారు. ఆంధ్రా - తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు రాష్ట్రమైన చతీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో కాంట్రాక్టర్ కుమారుడైన విశాల్ కుమార్‌ను మావోయిస్టులు అపహరించి అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్ళి అనంతరం హత్య చేసి రహదారిపై పడవేశారు. బీజాపూర్ జిల్లాలోని తునమ్‌నార్ - కోడేటాపాల్ గ్రామాల మధ్య నూకన్‌పాల్ గ్రామ సమీపంలో రహదారి పనులు నిర్వహణకు వినియోగిస్తున్న 4 వాహనాలను సైతం దగ్ధం చేశారు. ఈ వాహనాలలో రెండు జేసీబీలు, రెండు కాంక్రీట్ మిల్లర్లు ఉన్నాయి.

చత్తీష్‌ఘడ్ రాష్ట్రంలో అభివృద్ధి పనులలో భాగంగా బీజాపూర్ జిల్లాలో ప్రధానమంత్రి సడక్ నిర్మాణ యోజనలో పథకంలో రహదారి పనులను మంజూరు చేశారు. ఈ పనులను గత మూడు నెలల నుండి నిర్వహిస్తున్నారు. ఈ పనులు ప్రారంభం నుండే మావోయిస్టులు రహదారి పనులను నిలిపి వేయాలని పలుమార్లు సదరు కాంట్రాక్టర్‌కి హెచ్చరికలు జారి చేసినట్లు సమాచారం. మావోయిస్టులు హెచ్చరికలు జారీ చేసి నప్పటికీ రహదారి పనులు నిలిపివేయకపోవడంతో అగ్రహిం చిన మావోయిస్టులు ఆ రహదారి పనులను కాంట్రాక్ట్ తీసు కున్న కాంట్రాక్టర్ కుమారుడిని హతమార్చడంతో పాటు అక్కడ పనులు చేస్తున్న వాహనాలను దగ్ధం చేశారు.



పలు వాహనాలు దగ్ధం

బీజాపూర్ జిల్లాలోని తునమ్‌నార్ - కోడేటాపాల్ గ్రామా ల మధ్య నూకన్‌పాల్ గ్రామ సమీపంలో రహదారి పనులు నిర్వహణకు వినియోగిస్తున్న 4 వాహనాలను దగ్ధం చేశారు. ఈ పనులు నిర్వహిస్తున్న పలు వాహనాలను మావోయిస్టులు దఫాదఫాలుగా దగ్ధం చేస్తూనే వస్తున్నారు. ఫిబ్రవరి నెలలో బస్తర్ జిల్లా మారుడూమ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రహదారి నిర్మాణ పనులలో వినియోగిస్తున్న 10 ట్రాక్టర్లను మరికొన్ని వాహనాలను తగలబెట్టారు. ఇదే జిల్లాలో మొదకాపాల్ పోలీ స్టేషన్ పరిధిలోని భట్టపల్లి సంకనపల్లి గ్రామాల మధ్య జరు గుతున్న రహదారి పనులలో వినియోగించిన ఒక మిక్సిర్ వాహనం, 9 ట్రాక్టర్లను మావోయిస్టులు దగ్ధం చేశారు. ఇది ఇలా ఉంటే మొత్తం రహదారి పనులు నిర్వహిస్తున్న సువారు 30 వాహనాలను తగలబెట్టడంతో పాటు రహదారి నిర్మాణ పనులు చేపడుతున్న కార్మికులు (కూలీలను) కొట్టి పనులు చేస్తే చంపేస్తామని బెదిరించడం జరిగింది. సుకుమా జిల్లాలో నేషనల్ హైవే 30 రహదారి పనులు వద్ద వినియోగిస్తున్న టిప్పర్ వాహానాన్ని తగలబెట్టి రహదారి నిర్మాణం ఆపేయాలని హెచ్చరించారు. ఈ హెచ్చరికలు పట్టించుకోకుండా రహదారి నిర్మాణ పనులు నిర్వహిస్తుండటంతో మావోయిస్టులు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు తెలుస్తుంది.

ఎన్‌కౌంటర్లకి ప్రతికారం తీర్చుకుంటున్న మావోలు

చతీస్‌గఢ్ - తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో ఈ నెల 2 వ తేదిన ఐదు రాష్ట్రాల పోలీసులు పాల్గొని కూంబింగ్ నిర్వహిస్తున్న తరుణంలో కాల్పులు జరిగి 12 మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్ అయ్యారు. ఈ ఎన్‌కౌంటర్‌కి ప్రతికారంగానే ప్రతి కౌంటర్ మావోయిస్టులు పాల్పడుతున్నట్లు తెలిస్తుంది. ఈ మధ్యకాలంలో జరిగిన ఎదురు కాల్పులో 12మంది మావోయిస్టులు ప్రాణాలను కోల్పోయి తీవ్రంగా నష్టపోయిన వారు ప్రతీకారంతో రెచ్చిపోయి కూంబింగ్ నిర్వహిస్తున్నా సీఆర్‌పీఎఫ్ జవాన్లుపై ఎదురు దాడికిదిగి మందుపాతర పెల్చీ ఎదురు కాల్పులు జరపడంతో 9 మంది జవాన్లు నెత్తుటి దారల్లో ప్రాణాలు కోల్పోయారు. ఈ రెండు నెలలో వ్యవధిలో మావోయిస్టులు మూడుసార్లు వాహనాలను తగలబెట్టారు.

వేసవి కూలీపై ఉపాధ్యాయులు ఫైర్

● అవమానించారంటూ కమిషనర్‌పై మండిపడ్డ ఉపాధ్యాయ సంఘాలు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో 2016లో మధ్యాహ్న భోజనం విధులు నిర్వహించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను అవమానిస్తూ పాఠశాల విద్య సంచాలకులు సర్క్యూలర్‌జారీ చేశారని గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘంతోపాటు, ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. 2016లో మధ్యాహ్న భోజనం విధులు నిర్వహించిన ప్రాధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు నిబంధనల ప్రకారం 24 రోజుల సంపాదితసెలవులు(ఈఎల్) జమ చేయాల్సి ఉండగా అందుకు బదులుగా వేసవి సెలవుల్లో పనిచేసినందుకు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు గౌరవ వేతనం పేరుతో రోజు కూలీ చెల్లిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను ఉపాధ్యాయ సంఘాలతోపాటు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం నేతలు తీవ్రంగా ఖండించారు. ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈఎల్‌లు ఇవ్వకుండా రోజువారీ కూలీ ఇస్తున్నట్టుగా ఉత్తర్వులు ఇవ్వడాన్ని సంఘాలు తప్పుపడుతున్నాయి. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం హెచ్‌ఎంలు, ఎస్‌ఏలకు రోజుకు రూ. 25లాగా, ఎస్‌జిటిలకు రూ. 18.75 చొప్పున రోజుకూలీగా వస్తుందని టిఎస్‌యుటిఎఫ్‌రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ రాములు, ప్రధాన కార్యదర్శి చావ రవి విమర్శించారు. ఈ ఉత్తర్వుల ద్వారా ఉపాధ్యాయులను అవమానించినట్టుగా తాము భావిస్తున్నామని, ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాలలకు వేసవి సెలవులు ప్రారంభం అయిన నాటి నుంచి తిరిగి స్కూల్స్ ప్రారంభం అయ్యే వరకు విధులు నిర్వహించామని, తమకు ఈఎల్ ఇవ్వకుండా రోజువారీ కూలీ లాగా ఇస్తూ పాఠశాల విద్య సంచాలకులు ఉత్తర్వులు ఇవ్వడాన్ని తెలంగాణరాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సింగిడి లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజభాను చంద్రప్రకాశ్ తీవ్రంగా ఖండించారు.

మరణ భిక్ష పెట్టండి

● తూర్పు కలెక్టర్‌కు పిఠాపురం మహిళ దరఖాస్తు ● తన అవయవాలు దానం చేయాలని వినతి ● రెండేళ్లుగా కడుపులో 25కిలోల కణితితో నరక యాతన

● ఆపరేషన్‌కు సరిపోని సీఎం రిలీఫ్ ఫండ్

కాకినాడ, ప్రభ న్యూస్ బ్యూరో: 'సారూ..ఈ బాధ భరించలేను.. చనిపోవడానికి అనుమతివ్వండి.. నా అవయవాలు అవసరమైన వారికి దానం చేయండి...' అని పిఠాపురం డ్రైవర్స్ కాలనీకి చెందిన పత్తి రామలక్ష్మి తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రాను వేడుకుంది. ఈ మేరకు సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌సెల్‌కు భర్త, తన ఇద్దరు కుమారులతో వెళ్లిన ఆమె కలెక్టర్‌కు దరఖాస్తు అందజేసింది. ఈ సంఘటన కలెక్టర్‌ను సైతం ఆవేదనకు గురిచేసింది.

స్థానిక డ్రైవర్స్ కాలనీకి చెందిన 37 ఏళ్ల రామలక్ష్మి గత రెండేళ్లుగా కడుపులో కణితితో బాధ పడుతోంది. రోజు రోజుకూ కణితి పెరుగుతుండటంతో ఆమె ఉదరం విపరీతంగా పెరిగిపోయింది. చివరికి నడవలేని పరిస్థితి ఏర్పడింది. కాళ్లు రెండే ఉబ్బిపోయాయి. ఆమె భర్త కొండబాబు లారీ డ్రైవరు. పెద్ద ఆసుపత్రులకు తీసుకువెళ్లే స్థోమత లేక ఆమెను ఇంట్లోనే వైద్యం చేయిస్తున్నాడు. ఈ స్థితిలో ఆమె బాధను చూడలేక ఇరుగు పొరుగు చందాలు వేసుకుని హైదరాబాద్ యశోద ఆసుపత్రికి ఆమెను తరలించారు. వైద్య పరీక్షల అనంతరం రామలక్ష్మికి 'హ్యూజ్ ఎబ్డామినో పెలివిక్ సోలిడ్, సెస్టిక్ ఓవరిన్ మాస్' అనే అరుదైన వ్యాధి సోకినట్లు తేల్చారు. దీనివల్ల కడుపులో రోజు రోజుకు పెరుగుతున్న కణితిని తొలగించకపోతే అది పగిలి ప్రాణం పోయే ప్రమాదం వుందని వైద్యులు తేల్చారు. కణితిని ఆపరేషన్ చేసి తొలగించడానికి రూ.4.5లక్షలు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. అయితే అంత ఖర్చు చేసే స్థోమత లారీ డ్రైవర్ అయిన కొండబాబుకు లేదు. అలాగని స్థానికులు సైతం సాయం చేసే పరిస్థితి లేకపోవడంతో స్థానిక ఎమ్మెల్యే వర్మను కాలనీవాసులు ఆశ్రయించారు. ఆయన సిఫార్సు లేఖతో ముఖ్య మంత్రి సహాయ నిధి నుంచి రూ.1.01లక్షలు మంజూరైంది. అయితే ఈ మొత్తం ఆపరేషన్‌కు సరిపోకపోవడంతో ఆ మొత్తం కూడా రామలక్ష్మి కుటుంబం స్వీకరించలేదు. చివరికి గత్యంతరం లేక, బాధ



బరించలేక అనాయాస మరణానికి అనుమతివ్వాలని రామలక్ష్మి కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకుంది. చనిపోయాక తన అవయవాలు అవసరమైన వారికి దానం చేయాలని వేడుకుంది.

కుటుంబం మొత్తం చనిపోతాం:

కడుపులో కణితిలో బాధపడుతున్న రామలక్ష్మి చివరికి ప్రభుత్వం అనుమతితో చనిపోవాలని నిర్ణయించుకుని భర్తకు విషయం తెలిపింది. దీంతో ఏమీ చేయలేని నిస్సాహాయ స్థితిలో వున్న కొండబాబు ఆమెతో పాటు తానూ, తన ఇద్దరు కుమారులను సైతం చనిపోవడానికి నిర్ణయించుకున్నట్లు చెప్పాడు. రామలక్ష్మి దంపతులకు ఇద్దరు కొడుకులు. పెద్దోడు మహేష్ తొమ్మిదో తరగతి, చిన్నోడు అర్జున్ ఆరో తరగతి చదువుతున్నారు. రెండేళ్ల నుంచి తల్లి పడే బాధ చూడలేక ఆమెకు సహాయంగా, సపర్యలు చేయడానికి ఇద్దరూ చదువు మానేసినట్లు తెలిపారు. తనపని తాను చేసుకోలేని తల్లికి వీరిద్దరూ చేదోడు అయ్యారు. ఆమెకు సపర్యలు చేస్తూ ఇంటి పట్టునే వుంటున్నారు. వీరి హృదయ విదారక పరిస్థితికి కాలనీ మొత్తం కన్నీరు పెడుతోంది. వారికి సహాయం చేయలేని అసహాయ స్థితికి కుమిలి పోతోంది.

కోమటిరెడ్డి, సంపత్‌లకు ఊరట

● ఆరు వారాలపాటు ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వొద్దు ● కేంద్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశం ● వీడియో ఫుటేజీలను సమర్పించండి ● తెలంగాణ సర్కార్‌కు ఉన్నత న్యాయస్థానం స్పష్టీకరణ ● స్వాగతించిన కాంగ్రెస్

హైదరాబాద్,ఆంధ్రప్రభ : తెలంగాణ శాసనసభ నుంచి బహిష్కరణకు గురైన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,,ఎ.సంపత్ కుమార్ లకు హైకోర్టులో ఊరట లభించింది. పిటిషనర్లు ప్రాతినిథ్యం వహిస్తున్న నల్గొండ,ఆలంపూర్ నియోజకవర్గ స్థానాలకు చేపట్టాల్సిన ఉప ఎన్నికల ప్రక్రియపై ఆరు వారాల పాటు నోటిఫికేషన్ జారీ చేయరాదని కేంద్ర ఎన్నికల కమిషన్‌ను హైకోర్టు ఆదేశించింది. ఆ రోజు అసెంబ్లీలో జరిగిన ఘటన ద శ్యాలకు సంబంధించిన ఒరిజినల్ వీడియో ఫుటేజ్‌లను సీల్డ్ కవరులో ఈ నెల 22 లోగా సమర్పించాలని తెలంగాణ సర్కారుకు హైకోర్టు స్పష్టం చేసింది.ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వంతో పాటు అసెంబ్లీ కార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. .ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.శివశంకరరావు సోమవారం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.తదుపరి విచారణ వారం రోజులు వాయిదా వేశారు. తమ శాసన సభ్యత్వాలను రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి .వెంకట్ రెడ్డి(నల్గొండ), ఎ.సంపత్ కుమార్(ఆలంపూర్) హైకోర్టును ఆశ్రయించారు..తమను బహిష్కరిస్తూ తీసుకున్న తీర్మానంతో పాటు నియోజకవర్గ స్థానాలను ఖాళీ అయినట్లు ప్రకటిస్తూ అసెంబ్లీ కార్యదర్శి జారీ చేసిన ప్రత్యేక గెజిట్ నోటిఫికేషన్‌ను సస్పెండ్ చేయాలని, ఆ రెండు నియోజకవర్గాలకు ఉపఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయరాదని ఎన్నికల సంఘాన్నిఆదేశించాలని వారు హైకోర్టును అభ్యర్థించిన విషయం తెలిసిందే . సందర్భంగా తెలంగాణ అడ్వకేట్ జనరల్(ఏజీ) డి.ప్రకాశ్ రెడ్డి వాదనలు వినిపిస్తూ ..ఉభయసభలను ఉద్దేశించి చేసిన గవర్నర్ ప్రసంగం సభా వ్యవహార పరిధిలోకే వస్తుందన్నారు.శాసన మండలి ఛైర్మన్ పై సభలో అందరి సమక్షంలో దాడి జరిగినందువల్ల.సభ్యత్వం రద్దుపై ఎథిక్స్,ప్రివిలెజ్ కమిటీలకు సిఫారసు చేయాల్సిన అవసరంలేదన్నారు.సభ వెలుపల జరిగిన ఘటనలపై మాత్రమే సభ్యులను వివరణ,సంజాయిషీ,కోరతారన్నారు.విచారణ



కమిటీ వేస్తారన్నారు.చట్టసభలో జరిగిన ఘటనపై కోర్టు విచారణ పరిధి తక్కువగా ఉంటుందని విన్నవించారు.కేవలం కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే కోర్టు జోక్యం చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. .హెడ్ ఫోన్ విసిరి శాసనమండలి ఛైర్మన్‌కు తగిలిన గాయాల కంటే,,, సభ్యుల అవిధేయమైన ప్రవర్తన కారణంగానే వారి సభ్యత్వాలను రద్దు చేసినట్లు ఏజీ వివరించారు.అక్కడ అసెంబ్లీలో అందుబాటులోని వీడియో ఫుటేజ్ లనే అందజేస్తామని తెలిపారు. సభ్యత్వాల రద్దు విషయంలో సభాపతి సహజ న్యాయసూత్రాలను పాటించలేదనడంలో వాస్తవం లేదన్నారు.అలాగే స్పీకర్ సహజ న్యాయసూత్రాలను, ,రాజ్యాంగాన్ని ఎక్కడా ఉల్లంఘించలేదన్నారు.., .గవర్నర్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించడం అసెంబ్లీలో భాగమేనని,. బిజినెస్ రూల్స్ ప్రకారమే స్పీకర్ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు...ఏపీ ఎమ్మెల్యే ఆర్.కె.రోజా సస్పెన్షన్ పై దాఖలైన వ్యాజ్యం సుప్రీంకోర్టు ధర్మాసనం ముందు ఇంకా పెండింగ్‌లో ఉన్నట్లు ఏజి గుర్తు చేశారు.ఈ దశలో పిటిషనర్ల తరపు న్యాయవాది రవిశంకర్ జంధ్యాల వాదనలు వినిపిస్తూ...అసెంబ్లీలో ఈ నెల 12న జరిగిన ఘటనకు సంబందించిన ఒరిజినల్ వీడియో పుటేజ్ లను అందజేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని అభ్యర్థించారు. ఆ పుటేజ్ కోసం అధికారులకు దరఖాస్తు చేసినప్పటికీ ఇంకా ఇవ్వలేదన్నారు. ఇరు పక్షా ల వాదనలు విన్న అనంతరం న్యాయమూర్తి పిటిషనర్లు ప్రాతినిథ్యం వహిస్తున్న నల్గొండ,ఆలంపూర్ అసెంబ్లీ నియోజకవర్గ స్థానాల ఉపఎన్నికల ప్రక్రియకు సంబంధించి 6 వారాల వరకు నోటిఫికేషన్ జారీ చేయరాదని కేంద్ర ఎన్నికల కమిషన్ ను ఆదేశించారు. అలాగే ఆ ఘటనకు సంబంధించిన ఒరిజినల్ వీడియో ఫుటేజ్ లను ఈ నెల 22లోగా సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు.కౌంటర్లు దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వంతో పాటు అసెంబ్లీ కార్యదర్శిని ఆదేశించారు.తదుపరి విచారణ వారం రోజులకు వాయిదా వేశారు.

హైకోర్టు సూచన శుభపరిణామం: టీ పీసీసీ చీఫ్ ఉత్తమ్

కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేల నియోజక వర్గాల్లో ఆరు వారాల వరకు ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వొద్దని ఎన్నికల కమిషన్‌కు హైకోర్టు సూచిండం శుభపరిణామమని టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం కళ్లు తెరవాలని ఆయన సూచించారు. సీఎం చంద్రశేఖర్‌రావు కాంగ్రెస్ పార్టీపై కక్ష పూరితంగా వ్యవహారిస్తున్నారని ఆయన మండిపడ్డారు.

రాజ్యసభ ఎన్నికల్లో కోమటిరెడ్డి, సంపత్‌లకు ఓటు హక్కు ఉండేనా..?

కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్‌లకు రాజ్యసభ ఎన్నికల్లో ఓటు హక్కు ఉంటుందా..? ఉండదా..? అనే అంశంపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ నెల 23న రాష్ట్రం నుంచి ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరుగనున్న విషయం తెలిసిందే. ఈ ఎన్నికల బరిలో అధికార టీఆర్ఎస్ పార్టీ నుంచి ముగ్గురు ఉండగా.. ప్రధాన ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ నుంచి కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్ పోటిలో ఉన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం సాధించడానికి అసెంబ్లీలో సరిపోను బలం లేకున్నప్పటికి.. ఇంతకు ముందే పార్టీ మారిన ఎమ్మెల్యేలకు విప్ జారీ చేసేందుకు అవకాశం ఉంటుందని కాంగ్రెస్ పార్టీ భావించింది. గవర్నర్ ప్రసంగం సమయంలో జరిగిన ఘటనకు సంబంధించి శాసన సభాపతి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్‌ల సభ్యత్వాలను రద్దు చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ ఇద్దరు సభ్యులకు రాజ్యసభ ఎన్నికల్లో ఓటేసే అవకాశం అవకాశం దక్కుతుందో లేదో అనే దానిపైన కాంగ్రెస్ పార్టీలోనూ ఉత్కంఠ నెలకొంది. కోమటిరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నల్లగొండ, సంపత్‌కుమార్ నియోజక వర్గమైన అలంపూర్‌కు ఉప ఎన్నికల నోటిఫికేషన్ ఆరు వారాల వరకు విడుదల చేయవద్దని హై కోర్టు సూచించడంతో ఓటు హక్కు ఉంటుందని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. పూర్తిస్థాయి వీడియో పుటేజీలను ఈ నెల 22 వరకు సీల్డ్ కవర్‌లో ఇవ్వాలని శాసన సభా కార్యదర్శికి హై కోర్టు ఆదేశించింది. సభ్యత్వం రద్దైన ఆ ఇద్దరు నేతలు కూడా రాజ్యసభ ఎన్నికల్లో ఓటేసే అవకాశం కల్పించాలని న్యాయస్థానానికి విజ్ఞప్తి చేశారు. తదుపరి విచారణ ఈ నెల 22కు వాయిదా వేయడం, మరుసటి రోజునే రాజ్యసభ ఎన్నికలు జరగనున్నాయి. రాజ్యసభ నోటిఫికేషన్ వచ్చాకే సభ్యుల సభ్యత్వాలను రద్దు చేసినందున ఓటింగ్‌కు హాజరయ్యే అవకాశం ఉంటుందని అంటున్నారు.

కళ్యాణలక్ష్మితో నిరుపేదల జీవితాల్లో వెలుగు


సీఎం కేసీఆర్‌కు బీసీ మహిళా ఐక్య వేదిక కృతజ్ఞతలు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు నిరుపేదల జీవితాల్లో వెలుగులను నింపుతున్నాయని బీసీ మహిళా ఐక్య వేదిక కొనియాడింది. పథకం ద్వారా ఇప్పటి వరకు చేస్తున్న ఆర్థిక సాయాన్ని పెంచడం పట్ల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఆలంపల్లి లత హర్షం ప్రకటించింది. ఇప్పటి వరకు ఈ పథకంలో రూ. 75,116 ఇస్తుండగా ఇకపై దీనిని కాస్త రూ. 1,00,116కు పెంచుతూ ప్రభుత్వం ప్రకటించడాన్ని ఆమె స్వాగితించారు. సీఎం కేసీఆర్‌కు పేదింటి మహిళల పట్ల ఉన్న గౌరవాన్ని తెలుపుతుందన్నారు. నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న సీఎం కేసీఆర్‌కు మహిళలు జీవితాంతం రుణపడి ఉంటారని అన్నారు. కళ్యాణలక్ష్మి పథకం దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు.



మీ జిల్లాకొస్తా.. తనిఖీ చేస్తా

● నీరు-ప్రగతి టెలీకాన్ఫరెన్స్‌లో ఏపీ సీఎం చంద్రబాబు



అమరావతి, ఆంధ్రప్రభ : అసెంబ్లీ సమావేశాలు ముగిసిన అనంతరం అన్ని జిల్లాల్లో పర్యటించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు. ప్రతీ పనినీ తనిఖీ చేస్తానని అప్రమత్తంగా, బాధ్యతయుతంగా పనిచేయాలని అధికార యంత్రాంగం హెచ్చరికలు జారీ చేశారు. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన నివాసం నుంచి నీరు-ప్రగతిపై అధికార యంత్రాంగంతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ కేంద్రం నుంచి ఆశించిన సహకారం లేనప్పటికీ రాష్ట్రాన్ని తన కాళ్ళ మీద నిలబడగల స్థితికి తీసుకువచ్చామని అన్నారు. విభజన వల్ల నష్టపోయిన రాష్ట్రాన్ని ఆదుకోవాలని కేంద్రంతో పోరాటం చేస్తున్నామన్నారు. హక్కుల కోసం చేస్తున్న ఈ పోరాటంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందని, ఇలాంటి కీలక సమయంలో అధికార యంత్రాంగం మరింత సమర్థవంతంగా బాధ్యత నిర్వహించాలని కోరారు. గడిచిన డిసెంబర్ ప్రజా సంతృప్తి 57 శాతం ఉంటే అది ఫిబ్రవరినాటికి 62 శాతానికి వచ్చిందని, దీనిని మరింత పెంచాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, అధికారులు నిర్వర్తిస్తున్న బాధ్యతలు, వ్యవహారశైలి వల్ల ప్రజా సంతృప్తి రోజురోజుకు పెరుగుతుందన్నారు. పరిష్కార వేదిక(కాల్ సెంటర్) గురించి ప్రజలకు మరింత అవగాహన కలిగే విధంగా ప్రచారం చేయాలని సూచించారు.

చిన్నారులను చిదిమేసిన చెరువు

● తీరిన రుణం.. తెగిన బంధం ● సరదాగా ఈతకెళ్లి అనంతలోకాలకు ● చెరువులో పడి నలుగురు విద్యార్థులు మృతి ● శోకసంద్రంలో బొమ్మనపల్లి

ఇల్లెందు, ప్రభన్యూస్ : నవమాసాలు మోసి కన్నబిడ్డలు పెద్దయ్యాక ప్రయోజకులై సాకుతాడని సంబర పడిపోతున్న తల్లిదండ్రులకు తీరని రుణం మిగిల్చి పేగు బంధాన్ని తెంచుకొని అనంతలోకాలకు వెళ్ళిపోయారు. సరదాగా ఇంట్లో ఆడుతూ పాడుతూ బడికి వెళ్ళే ఆ చిన్నారులు తమ కళ్ళ ముందే శవాలుగా మారితే ఆ కుటుంబాలు పడే క్షోభ అంతా ఇంతా కాదు. సబ్ డివిజన్ పరిధిలోని టేకులపల్లి మండలం బొమ్మనపల్లి గ్రామానికి చెందిన నలుగురు విద్యార్థులు ఈతకు వెళ్లి మృతిచెందిన సంఘటన నియోజకవర్గ వ్యాప్తంగా సంచలనం రేపింది. ఘటన వివరాలిలా ఉన్నాయి. బొమ్మనపల్లి గ్రామానికి చెందిన లావుడ్య సౌజన్(13), బానోత్ సిద్దు(11), బానోత్ పండు(సంతోష్)(14), బానోత్‌దిలీష్(10)లు పాఠశాలలో 8,6,5 తరగతులను చదువుతున్నారు. ఎప్పటిలాగే సోమవారం సైతం పాఠశాలకు వెళ్ళి తిరిగివచ్చిన ఈ చిన్నారులు ఇంటివద్ద భోజనం చేసి మాంగ్యా తండా సమీపంలో గల సాయమ్మ చెరువు దగ్గరకు ఈతకు వెళ్ళారు. ఒంటి మీద ఉన్న బట్టలను ఒడ్డుమీద పెట్టి ఈత కోసం చెరువులోకి దిగారు. ఆ చెరువులో ఎత్తు పల్లాలు తెలియని ఆ చిన్నారులు ఒకేసారి ముందుకు వెళ్లడంతో చెరువులో ఇటీవల మిషన్ భగీరథ పనుల సందర్భంగా గోతులు తీయడంతో ఆ గోతిలోకి వెళ్ళిన చిన్నారులు ఈత సక్రమంగా రాక మునిగి మృత్యువాత పడ్డారు. పిల్లలు ఇంటికి రాకపోయే సరికి కుటుంబసభ్యులు వారి కోసం వెతుకులాట మొదలుపెట్టారు. చెరువు ఒడ్డున బట్టలు ఉన్న విషయాన్ని తెలుసుకున్న కుటుంబసభ్యులు ఆ చెరువు దగ్గరికి వెళ్ళి అనుమానం వచ్చి గజ ఈతగాళ్ళతో చెరువులో గాలింపు చేపట్టగా నాలుగు మృతదేహాలు వెలుగుచూసాయి. మృతిచెందిన వారిని ఒడ్డుకు తీసుకొచ్చి గ్రామంలోకి తీసుకురావడంతో గ్రామం ఒక్కసారిగా చిన్నబోయింది. మృతదేహాలను చూసిన ప్రతీ ఒక్కరూ కన్నీరు మున్నీరుగా విలపించారు. కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. అల్లారుముద్దుగా సాకుకుంటున్న తమ పిల్లలు అభం శుభం తెలియని వయసులోనే చెరువు రూపంలో మృత్యువాత పడడంతో ఆ కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. తమ కుటుంబానికి దిక్కెవరంటూ ఏడ్చిన తీరు పలువురిని కంటతడిపెట్టించాయి. ఇలాంటి కష్టం పగవాడికి కూడా రావద్దంటూ తమ పిల్లల మృతదేహాలను పై పడి విలపించిన తీరు హృదయవిదారకంగా మారింది. కాగా ఈ ఘటనతో టేకులపల్లి మండలంలో పలు గ్రామాలలో విషాదఛాయలు అలుముకున్నాయి.




చిన్నారులవి ప్రభుత్వ హత్యలే..

మిషన్ కాకతీయ పేరుతో చెరువులలో ఇష్టానుసారంగా గోతులు తీసి సదరు కాంట్రాక్టర్ గోతులను పూడ్చకపోవడంతోనే బొమ్మనపల్లికి చెందిన నలుగురు విద్యార్థుల మృతికి కారణమైందని ఇందుకు ప్రభుత్వమే బాధ్యతవహించాలని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు భూక్య దళ్‌సింగ్ నాయక్ డిమాండ్ చేశారు. సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని కుటుంబానికి నష్టపరిహారం చెల్లించడంతో పాటు ప్రతీ కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగావకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. మృతదేహాలను సందర్శించి వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా జెడ్పీటీసీ లక్కినేని సురేందర్ , పలువురు ప్రజాప్రతినిధులు , పలు రాజకీయ పార్టీల నాయకులు మృతదేహాలను సందర్శించి ఆ కుటుంబాలను ఓదార్చారు.

ద్రోహులకు డిపాజిట్లు గల్లంతు

● స్వప్రయోజనాల కోసం రాష్ట్ర భవిష్యత్తు తాకట్టు పెడతారా..? ● పవన్ యూ టర్న్.. ఎందుకో ప్రజలకు తెలుసు ● దేశవ్యాప్తంగా రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై చర్చ: చంద్రబాబు నాయుడు

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం తెలుగుదేశం పార్టీ కేంద్రంపై పోరాటం చేస్తుంటే కొందరు తమ స్వార్థ ప్రయోజనాల కోసం రాష్ట్ర భవిష్యత్‌ను తాకట్టు పెట్టేలా వ్యవహరిస్తున్నారని, ఇలాంటి ద్రోహులకు రానున్న ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవని తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. ఒక పార్టీతో అవిశ్వాసం పెట్టిస్తూ, మరో పార్టీతో గొడవ చేయించడం చేస్తూ బీజేపీ కుటిల రాజకీయాలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. పార్లమెంటును కూడా వాయిదా వేయాలని చూస్తోందని, ఇది లాలూచీ రాజకీయాలకు పరాకాష్టగా అభివర్ణించారు. రాష్ట్రానికి న్యాయం చేయమని అడిగే వారిపై యుద్ధం చేస్తారా..? అంటూ బీజేపీపై విరుచుకుపడ్డారు. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలుగుదేశం పార్టీ ఎంపీలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ యూ టర్న్ ఎందుకు తీసుకున్నారో ప్రజలందరికీ తెలుసని, గడిచిన నాలుగేళ్లుగా ఒక్కసారి కూడా విమర్శించని వ్యక్తి ఇప్పుడు ఎందుకు మాట్లాడుతున్నారో అర్థమవుతోందన్నారు. ఒకప్పుడు కేసుల మాఫీ కోసం జగన్ కాంగ్రెస్‌తో లాలూచీ పడి బెయిల్‌పై బయటకి వచ్చారని, ఇప్పుడు బీజేపీతో లాలూచీ పడుతున్నారన్నారు. ప్రధానమంత్రి కార్యాలయంలో వైకాపా నేత విజయసాయిరెడ్డి తిష్ట వేస్తున్నారని ఇంతకన్నా రుజువు ఏముంటుందని ముఖ్యమంత్రి అన్నారు. రెడ్‌హ్యాండెడ్‌గా ఫోటోలతో సహా దొరికిపోయారని చెప్పారు. ఎవరెన్ని కుట్రలు చేసినా రాష్ట్ర ప్రయోజనాల అంశంలో వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయంపై జాతీయ స్థాయిలో చర్చ జరుగుతోందని, అదే విధంగా రాష్ట్ర హక్కుల ఎంపీలు చేస్తున్న పోరాటం ప్రతి ఒక్కరి దృష్టిని ఆకర్షిస్తోందన్నారు. అశాస్త్రీయ విభజనకు పాల్పడిన కాంగ్రెస్ పార్టీ కూడా తాజాగా నిర్వహించిన పార్టీ ప్లీనరీలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని ప్రకటించిందని అటువంటప్పుడు ఈ డిమాండ్ నేరవేర్చేందుకు కేంద్రానికి ఉన్న అభ్యంతరం ఏమిటో చెప్పాలన్నారు. బీజేపీ, పవన్, జగన్ చేస్తున్న తప్పులన్ని ప్రజలు గమనిస్తున్నారని ఎంపీలకు చంద్రబాబు వివరించారు. కొందరు జాతీయ రాజకీయాల్లోకి వస్తున్నామని తప్పుడు ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర ప్రయోజనాల కన్నా ఏదీ ముఖ్యం కాదన్న విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు.



కుట్ర రాజకీయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

కేంద్రంతో కుమ్మక్కై వైకాపా, పవన్‌కల్యాణ్ చేస్తున్న కుట్ర రాజకీయాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్ళాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. అన్ని నియోజకవర్గాల్లో సైకిల్, బైక్ ర్యాలీలను నిర్వహించడంతోపాటు ఇంటింటికీ తిరిగి కేంద్రం చేస్తున్న అన్యాయం, కుట్ర రాజకీయాలను ఎండగట్టాలని సూచించారు. ప్రతి గ్రామంలో, బస్సుల్లో, ఎక్కడ చూసినా ఇదే చర్చ జరగాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో కరపత్రాలను పంపిణీ చేయాలన్నారు. ఈ సందర్భంగా లోక్‌సభపక్షనేత తోట నర్సింహం మాట్లాడుతూ తృణమూల్ కాంగ్రెస్, సమాజ్ వాది పార్టీతోపాటు మరికొన్ని పార్టీలు తాము ప్రవేశపెట్టిన అవిశ్వాసానికి సంఘీభావం ప్రకటించినట్లుగా వివరించారు. రాజ్యసభ సభ్యుడు గరికపాటి మోహనరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక ప్రాంతీయ పార్టీ వైదొలగిందన్న అంశం జాతీయ స్థాయిలో చర్చకు దారితీయడమే కాకుండా రాజకీయాలను ఒక కుదుపు కుదిపిందన్నారు. అంతే కాకుండా స్టాక్ మార్కెట్‌పై కూడా ప్రభావం చూపిందని ఈ మేరకు జాతీయ మీడియాలో కథనాలు కూడా వచ్చినట్లుగా తెలిపారు.

హోదాపై బాబుది మొసలి కన్నీరు

● జైట్లీ ప్యాకేజీ ఇస్తామంటే మంత్రులు రాజీనామాలెందుకు చేయలేదు? ● ఎన్నికలు దగ్గరకొచ్చేసరికి కేంద్ర మంత్రులతో రాజీనామాల నాటకం ● ప్రజా సంకల్పయాత్రలో వైఎస్ జగన్

గుంటూరు, ప్రభ న్యూస్ బ్యూరో: కేంద్రంలో ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టి ఇప్పుడు మొసలికన్నీరు కారుస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిపై ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా పత్తిపాడు నియోజకవర్గంలోని పెదనందిపాడులో సోమవారం ప్రజాసంకల్పయాత్రలో భాగంగా జరిగిన బహిరంగ సభలో జగన్ మాట్లాడారు. రెండేళ్ల క్రితం కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని ప్రకటిస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు ఎలా స్వాగతించారని ప్రశ్నించారు. ఎన్నికలు దగ్గరకొస్తుండే సరికి కేంద్ర మంత్రులతో ప్రత్యేక హోదా అంటూ రాజీనామాల డ్రామాలకు తెరలేపారని విమర్శించారు. రాష్ట్రంలో నాలుగేళ్లుగా రైతులు గిట్టుబాటు ధరలేక అల్లాడుతూ అప్పుల ఊబిలో చిక్కుకు పోయారన్నారు. చంద్రబాబు దళారి అవతారమెత్తి రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి, హెరిటేజ్‌లో స్పెషల్ ప్యాక్‌లు చేసి కొనుగోలు ధరకంటే మూడంతలు ఎక్కువ చేసి అమ్ముతున్నారని ఆరోపించారు. వరికి ఉత్పత్తి ఖర్చు ప్రభుత్వ అంచనాల ప్రకారం రెండువేల రూపాయాలైతే, రూ.1200 మాత్రమే గిట్టుబాటు ధర కల్పిస్తున్నారన్నారు. మినుము కనీస మద్దతు ధర రూ.5,500 అయితే మార్కెట్లో కనీసం 4 వేలు కూడా గిట్టడం లేదన్నారు. పెసలు 5,575 ఉంటే, మార్కెట్లో 4 వేలకు కూడా కొనేవారు కనిపించడంలేదన్నారు. మొక్కజొన్న రూ.1,425 మద్దతు ధర ఉంటే, 1,150 కూడా గిట్టడంలేదన్నారు. నాలుగేళ్లుగా రైతులు ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నారన్నారు. దళారులకు సాక్షాత్తు చంద్రబాబు నాయుడే నాయకుడు కావడంతో ఈ పరిస్థితి దాపురించిందన్నారు. రాష్ట్రంలో తాగునీటి పరిస్థితి దారుణంగా ఉందనీ, గ్రామాల్లో రూ.20 చెల్లించి క్యాన్ కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. కారణం చెరువుల్లో మట్టిని తవ్వి, అమ్ముకొంటున్నారని దీంతో మంచినీటి చెరువులు తవ్వి తవ్వి ఉప్పునీరు వస్తోందన్నారు. అమరావతి కృష్ణానది నుంచి రూ.100 కోట్లు ఖర్చు చేస్తే గుంటూరు జిల్లాకు తాగునీటి సమస్య ఉండదన్నారు. అధికారంలోకి రాకముందు చంద్రబాబు కరంటు బిల్లులు షాక్ కొడుతున్నాయని, అధికారంలోకి రాగానే ఉచిత కరంటు ఇస్తానని చెప్పి ఇప్పుడు నెలనెలా ప్రతి పేదవాడి ఇంటికి కూడా రూ.500 తగ్గకుండా బిల్లులు వస్తున్నాయని ఇది నిజమా, కాదా అంటూ బహిరంగ సభలో ప్రజలను ప్రశ్నించారు. దేశంలో ఎక్కడా లేని పెట్రోల్ రేట్లు ఇక్కడ ఉన్నాయని, పక్క రాష్ట్రమైన తెలంగాణాలో 7 రూపాయలు మనకంటే తక్కువనిదీంతో ప్రభుత్వం పెట్రోల్‌పై కూడా దోచుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జన్మభూమి కమిటీలు రేషన్‌లోను, ఇండ్ల నిర్మాణాల్లోను, చివరికి మరుగుదొడ్లలోను లంచాలను పందికొక్కుల్లా బొక్కేస్తున్నారని తీవ్ర విమర్శలు చేశారు.



ప్రజల ఆశీర్వాదంతో అధికారంలోకి రాగానే ప్రతి పేదవానికి ఉచితంగా ఇల్లు కట్టించడంతోపాటు రిజిస్ట్రేషన్ కూడా ఉచితంగా చేయిస్తామన్నారు. వృద్ధాప్య పింఛన్లు 65 నుంచి 60 ఏళ్లకు తగ్గించి నెలనెలా రూ.2 వేలు ఇంటికి వచ్చి అందించేలా చూస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ బీసీలకు 45 ఏళ్లకే పింఛన్ వర్తించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సభకు ముందు కేంద్రంపై అవిశ్వాస తీర్మాణం సందర్భంగా ఎంపీలకు సంఘీభావంగా కాకుమాను మండలంలో నిర్వహించిన మానవహారంలో వైఎస్ జగన్ పాల్గొన్నారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, పొన్నూరు పార్టీ ఇన్‌చార్జి రావి వెంకటరమణ, మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, గుంటూరు పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి లావు శ్రీకృష్ణదేవరాయలు, నగర అధ్యక్షుడు లేళ్ల అప్పిరెడ్డి, అధికార ప్రతినిధి కిలారి రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

వడపోతకు బ్రేక్

(మొదటి పేజీ తరువాయి)

పద్ధతుల్లో కరెన్సీ కొరతను అధిగమించేందుకు ఆర్థికశాఖ అధికారులు సులువైన మార్గాలను అన్వేషిస్తున్నారు. తాజాగా రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్ఎల్‌బీసీ) ఇచ్చిన నివేదిక ప్రకారం చెక్కుల పంపిణీలో వ్యూహాత్మక టైమ్ షెడ్యూల్‌ను అమలు చేయనున్నారు. గ్రామ, మండల రైతు సమన్వయ సమితుల భాగస్వామ్యంతో, స్థానిక బ్యాంకుల సమన్వయంతో లబ్ధిదారులైన రైతులు చెక్కులను విత్‌డ్రా చేసుకునే వెసులుబాటు కల్పిస్తారు. అయితే ఒక్కో మండలం పరిధిలో ఒక్కో తేదీని ఖరారుచేసి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేయనున్నారు. రాష్ట్రంలో ఉన్న నగదును రొటేషన్ పద్ధతిలో సర్దుబాటు చేసేందుకు వ్యూహాత్మక ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. ఈ విధానాన్ని అవలంబిస్తే కొంత ఎక్కువ సమ యం అమసరమవుతున్నందున ఏప్రిల్ రెండోవారం నుంచే చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు.

రొటేషన్ పద్ధతిలో సర్దుబాటు

రాష్ట్రంలో ఉన్న నగదును రొటేషన్ పద్ధతిలో సర్దుబాటు చేసేందుకు వ్యూహాత్మక ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. ఈ విధానాన్ని అవలంబిస్తే కొంత ఎక్కువ సమయం అమసరమవుతున్నందున ఏప్రిల్ రెండోవారం నుంచే చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు. వారం, పది రోజుల పాటు విస్తృత స్థాయి చర్చలు, సంప్రదింపులతో కసరత్తు చేసిన మంత్రివర్గ ఉపసంఘం ఇటీవలే ముఖ్యమంత్రికి నివేదిక సమర్పించింది. ఈ పథకం అమలు విషయంలో తలెత్తిన అనేక సందేహాలను నివృత్తి చేస్తూ ప్రత్యామ్నాయ మార్గాలను సూచించింది. బీడు భూములు మినహాయించి వ్యవసాయ యోగ్యమైన భూములు కలిగి ఉన్న ప్రతి రైతు కుటుంబానికీ పెట్టుబడి రాయితీ పథకాన్ని వర్తింప జేయాలని స్పష్టం చేసింది. అలాగే బేరర్ చెక్కుల రూపంలోనే ఈ మొత్తాన్ని పంపిణీ చేయాలని తేల్చి చెప్పింది.



రెండు విడతలుగా 'పెట్టుబడి మద్దతు'

ప్రతిష్టాత్మక పథకం 'పెట్టుబడి మద్దతు' అమలుకు కరెన్సీ కొరత ఏర్పడిన నేపథ్యంలో ప్రభుత్వం వ్యూహాత్మక నిర్ణయం తీసుకుంది. ఇటు ప్రభుత్వానికి, అటు రైతులకు ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు ప్రతిపాదిత మొత్తాన్ని రెండు విడతలుగా పంపిణీ చేసేందుకు ఆదేశాలు ఇచ్చింది. త్వరలో ప్రారంభమయ్యే ఖరీఫ్ సీజన్ ను సంబంధించి ఏప్రిల్‌లో రూ. 2వేలు, జూన్‌లో మరో రూ. 2వేలు రైతులకు ఇవ్వాలని సీఎం అధికారులను ఆదేశించారు. గత నెల రోజుల కాలంగా సంప్రదియులు జరుపుతున్నా బ్యాంకుల్లో కరెన్సీ కొరతపై కేంద్రం స్పందించని కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఏఈవోలు, వీఆర్‌వోల పాత్ర కీలకం

రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి 5వేల ఎకరాల సాగు విస్తీర్ణానికి ఒకరి చొప్పు న నియమించిన వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవోలు), గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్వోలు), పంచాయతీ కార్యదర్శుల ద్వారా ఇంటింటికీ తిరిగి నిర్దేశిత మొత్తానికి చెక్కులను పంపిణీ చేయాలని ప్రభుత్వానికి సూచించారు. తాజా సమాచారం మేరకు వారంలోగా పెట్టుబడి మద్ధతు పథకం అమలుకు మార్గదర్శకాలు వెలువడనున్నాయి. పెట్టుబడి మద్దతు పథకం ద్వారా జరిగే వ్యవసాయ రంగాభివృద్ధి, రైతులకు కలిగే వెసులుబాటు తదితర అంశాలను కూడా ప్రతి రైతు తెలుసుకునే విధంగా గ్రామగ్రామాన విస్తృత ప్రచారం చేయనున్నారు.

చేతులెత్తేసిన కేంద్రం

ఈ పథకం అమల్లో తలెత్తిన చిక్కుముడి సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో పరిష్కరించుకోవడం కష్టసాధ్యంగా మారడంతో కేంద్రాన్ని సంప్రదించక తప్పలేదు. ప్రతిపాదిత మొత్తాన్ని రైతులకు నగదు రూపంలో చెల్లించేందుకు ఆర్థిక నిబంధనలు అడ్డొస్తున్నందున వెసులుబాటు కోరారు. అదే సమయంలో సుమారు రూ.6వేల కోట్లకు పైగా ఏకకాలంలో కరెన్సీ అవసరమవుతున్నందున ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, ఆర్బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్‌లను కలిసి నిధుల సర్దుబాటును ప్రతిపాదనలను అందజేశారు. కానీ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనల్లో ఏ ఒక్కదానికీ కేంద్రం అంగీకరించలేదు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో మొత్తం 71.75 లక్షల రైతు కుటుంబాలకు సంబంధించిన ఈ అంశంపై లోతుగా అధ్యయనం చేసిన మంత్రివర్గ ఉపసంఘం ప్రత్యామ్నాయ మార్గంలో కరెన్సీని సర్దుబాటు చేసుకుని పథకాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు నిర్ణయం తీసుకుంది. దేశంలోనే మొదటిసారిగా 1.65 కోట్ల ఎకరాల వ్యవసాయ భూమికి రూ.4వేల చొప్పున చెల్లించనున్నారు.

టెన్త్ ఇంగ్లీష్ పేపర్-1 లీక్..!

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నత పాఠశాలలో కూడా ప్రశ్నాపత్రం బయటికొచ్చింది. ఇక్కడ ప్రశ్నాపత్రం బయటికి రావడానికి కొన్ని ప్రైవేటు యాజమాన్యాలు విద్యార్థులతో ప్రశ్నాపత్రాన్ని ఫోటో తీయించి వాట్సాప్ ద్వారబయటికి తీసుకొచ్చినట్టు తెలుస్తోంది. రెండు జిల్లాల్లో ఇంగ్లీష్ పేపర్-1 ప్రశ్నాపత్రం బయటికి రావడంతో పరీక్షరాసిన విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. రెండు జిల్లాల్లో ప్రశ్నాపత్రం బయటికి రావడంతో అధికారులు ఉరుగులు, పరుగులు తీశారు. రెండు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు స్వయంగా రంగంలోకి దిగి జరిగిన ఘటనలపై విచారణ చేపట్టి అందుకు బాధ్యులైన వారిని అరెస్టు చేసి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ప్రశ్నాపత్రం లీకేజికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకున్నట్టు పాఠశాలవిద్యాశాఖ సంచాలకులు జి కిషన్ తెలిపారు. పరీక్షల యాక్ట్‌తోపాటు, క్రిమినల్ కేసులను నమోదు చేసినట్టు తెలిపారు.

పేపర్ లీకేజీ కాలేదు

- గంట తర్వాత బయటికొచ్చింది
- బాధ్యులైన అధికారులను విధుల నుంచి తొలగించాం: కిషన్

ఆదిలాబాద్, మహబూబ్ నగర్ జిల్లాల్లో ఎస్ఎస్‌సి ఇంగ్లీష్ పేపర్-1 ప్రశ్నాపత్రం బయటికి రావడంపై పాఠశాల విద్య సంచాలకులు జి కిషన్ సీరియస్ అయ్యారు. బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారిని వెంటనే అరెస్టు చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన కేసులో ఇన్విలేటరే స్వయంగా పాల్గొన్నట్టు సమాచారం ఉందని, ఆమెతోపాటు అక్కడ విధులు నిర్వహిస్తున్న సీఎస్, డివో, అడిషనల్ డివోను సస్పెండ్ చేశామన్నారు. అలాగే మహబూబ్ నగర్ జిల్లాలో పరీక్షా కేంద్రందగ్గరకు వచ్చిన వ్యక్తి ప్రశ్నాపత్రాన్ని సెల్‌ఫోన్‌లో ఫోటో తీసుకుని బయటికి తీసుకెళ్లినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆపరీక్షా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న అందరినీ విధుల నుంచి తప్పించినట్టు తెలిపారు. మంగళవారం జరగాల్సిన ఇంగ్లీష్ పేపర్-2 పరీక్ష యాథావిధిగా కొనసాగుతుందని కిషన్ స్పష్టం చేశారు. పరీక్షప్రారంభం అయిన తరువాత ప్రశ్నాపత్రం బయటికొచ్చినందున దీనిని లీకేజీగా భావించడం లేదని, కేవలం మాల్ ప్రాక్టీస్ కేసుగానే భావిస్తున్నట్టు తెలిపారు. అదేవిధంగా సూర్యాపేట జిల్లాలోని జడ్‌పిహెచ్ఎస్ నూతన్‌కల్-ఏ కేంద్రంలో పనిచేసే ఇన్విజిలేటర్‌ను సస్పెండ్ చేశామని, జడ్‌పిహెచ్ఎస్ నూతన్‌కల్-బి కేంద్రంలోని ఒక ఇన్విజిలేటర్‌ను విధుల నుంచి తొలగించినట్టు కిషన్ మీడియాకు తెలిపారు.

బయోసైన్సెస్ సంస్థతో అగ్రి వర్సిటీ ఒప్పందం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : సేంద్రీయ వ్యవసాయం, బయోఫర్టిలైజర్స్ తయారీలో పోస్టుగ్రాడ్యుయేట్ విద్యార్థులలో నైపుణ్యాభివృద్ధి అందించడంపై ప్రొఫెసర్ జయశం కర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంతో హైదరాబాద్, సైదాబాద్‌లోని వర్షా బయో సైన్సెస్ సంస్థ సోమవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. వర్సిటీ పరిపాలన భవనంలో జరిగిన కార్యక్రమంలో ఉపకులపతి డాక్టర్ వి.ప్రవీణ్‌రావు సమక్షంలో అవగాహన ఒప్పంద పత్రాలపై రిజిస్ట్రార్ డాక్టర్ సుధీర్‌కుమార్, వర్షా బయోసైన్సెస్ చైర్మన్ డాక్టర్ ఎ.జాన్‌పీటర్ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌రావు మాట్లాడుతూ, ఈ అవగాహన ఒప్పందంవల్ల యూజీ, పీసీ విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ లభించేలా ఉండాలన్నారు. బయోఫర్టిలైజర్స్ తయారీకి సంబంధించి బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులకు ఎక్స్‌పీరియన్షియల్ లెర్నింగ్‌లో భాగంగా చిన్నపాటి యూనిట్‌ను విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేయాలని వర్షా సంస్థను కోరారు. అందుకు ఆ సంస్థసానుకూలంగాస్పందించింది. యూనిట్ ఏర్పాటుపై డీన్ అగ్రికల్చర్‌తో చర్చించి తగిన కార్యాచరణ రూపొందించాలని ప్రవీణ్‌రావు వారికి సూచించారు .ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉన్నతాధి కారులు డాక్టర్ కేవీన్ డాంగి, డాక్టర్ రాజారెడ్డి, డాక్టర్ టి.ప్రదీప్, డాక్టర్ కేవీఎస్ డాక్టర్ జమునారాణి, డాక్టర్ మృణాళిని, డాక్టర్ సదాశివరావు, డాక్టర్ వీరాంజనేయులు పాల్గొన్నారు.

ముమ్మాటికీ ఎన్నికల బడ్జెట్టే : బీజేపీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌ను రూపొందించిందని శాసనమండలిలో భాజపా నాయకుడు రాంచందర్‌రావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ, ప్రజలను మభ్యపెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా అంకెల గారెడి చేసిందని ఆరోపించారు. వాస్తవాలకు దూరంగా బడ్జెట్‌ను రూపొందించడం వల్ల ఎలాంటి ప్రయోజనం చేకూరదన్నారు. గత సంవత్సరంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వివిధ పద్దుల కింద కేటాయించిన నిధులు...ఖర్చు చేసిన మొత్తాలను క్షున్నంగా పరిశీలించాలని సూచించారు. కేటాయింపులకు...చేసిన ఖర్చు మధ్య చాలా వ్యత్యాసం ఉందన్నారు. కొన్ని పద్దుల కింద కేటాయించిన నిధుల్లో ఒక్క రూపాయి కూడా ఖర్చుపెట్టలేదని విమర్శించారు. అలాంటప్పుడు కేటాయింపుల్లో పెద్దమొత్తంలో చూపించడం ఎందుకని ప్రశ్నించారు. గత ఆర్థిక సంవత్సరం కోసం 1.49 లక్షలకోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెడితే.... రానున్న ఆర్థిక సంవత్సరానికి లక్షా డెబ్బైనాలుగువేల కోట్లతో రూపొందించారన్నారు. ఇంత పెద్దమొత్తంలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం అవసరమా? అని రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పునరాలోచించుకోవాలని ఆయన సూచించారు.

బడ్జెట్ దేశానికి దిక్సూచి

- ప్రతి నియోజకవర్గంలో ఆగ్రోప్రాసెస్ యూనిట్ల నిర్మాణం
- త్వరలో రైతు నివేదికల ఏర్పాటు
- యాంత్రీకరనిపై ప్రత్యేక దృష్టి: గుత్తా



నల్గొండ, ప్రభ న్యూస్ బ్యూరో: ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధతో వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలకు నిధులిచ్చారు.. వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో పెద్దపీట వేశారు.. తెలంగాణ బడ్జెట్ దేశానికే దిక్సూచి.. అని రాష్ట్ర రైతు సమన్వయ సమితి చైర్మన్, నల్గొండ పార్లమెంట్ సభ్యులు గుత్తా సుఖేందర్‌రెడ్డి అభివర్ణించారు. రైతు పెట్టుబడి సాయం 12వేలకోట్లు.. బీమా చెల్లింపులకోసం 500కోట్లు.. యాంత్రీకరణకోసం 525కోట్లు.. రైతు సమన్వయ సమితుల సీడు మనీకోసం 300కోట్లు.. కేటాయించి అన్నదాతపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారని చెప్పారు. రైతు సమన్వయ సమితి రాష్ట్రచైర్మన్‌గా ఎన్నికైన తర్వాత మొట్టమొదటి సారిగా సోమవారం నల్గొండకు విచ్చేశారు. పట్టణంలోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని 2,650క్లస్టర్లలో సర్వే నెంబర్ల వారీగా భూసార పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. మొబైల్ భూసార యంత్ర పరికరాలను కొనుగోలు చేసి రైతులకు పంటల అనుకూలతలపై సూచనలు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. రైతు వేదికల నిర్మాణం త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జిల్లాలోని 137క్లస్టర్లకు గాను ఇప్పటికే 124క్లస్టర్లలో వేదికలకు భూమిసేకరణ చేయడం జరిగిందన్నారు. రైతు వేదికల్లోనే వ్యవసాయ విస్తరణ అధికారుల కార్యాలయం ఏర్పాటు చేసి అక్కడి నుంచి రైతులకు సేవలందించే విధంగా చర్యలు చేపడుతామన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఆగ్రోప్రాసెసింగ్ యూనిట్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రాంతాన్నిబట్టి పండించే పంటలనుబట్టి ప్రాసెస్ యూనిట్లను నెలకొల్పుతామని చెప్పారు. కోల్డ్ స్టోరేజీలను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేస్తామని అన్నారు. వ్యవసాయం లాభసాటిచేయడం కోసమే రైతు సమన్వయ సమితులు పనిచేస్తాయని స్పష్టం చేశారు. అన్నదాతలు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకోవద్దని, ఎవరైనా ఒత్తిడిచేస్తే ఫిర్యాదు చేయాలని అన్నారు. పరిష్కార మార్గంచూపి ఆత్మహత్యలు నివారించవచ్చని చెప్పారు. రబీలో ధాన్యం సేకరణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా 3,250కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఐకేపీ, పిఏసీఎస్, మార్కెట్ యార్డులలో పౌరసరఫరాల శాఖ నుండి మాత్రమే కొనుగోలు చేస్తామని అన్నారు. పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా ఎకరాకు 8వేల రూపాయల పెట్టుబడి సాయం అందిస్తామని స్పష్టం చేశారు. అందులో నిర్ణయాలు తీసుకున్న తర్వాత రాష్ట్రంలోని గ్రామ, మండల, జిల్లా సమన్వయ సమితుల సభ్యులతో సమావేశం ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో రాష్ట్రఅటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, నార్మాక్స్ చైర్మన్ గుత్తా జితేందర్‌రెడ్డి, ఎంపీపీ పాశం రాంరెడ్డి, కొండేటి మల్లయ్య, అబ్బగోని రమేష్, అవుట రవీందర్, బషీర్‌పాల్గొన్నారు.

సమయం ముంచుకొస్తోంది

- పెట్టుబడి పథకంపైగ్రామాల వారీగా అర్హుల జాబితాలు ఇవ్వండి
- ఆమేరకు వ్యవసాయశాఖ కార్యాచరణ సిద్ధం చేసుకుంటుంది
- రెవెన్యూ ఉన్నతాధికారులకు సీఎస్ ఎస్‌కే జోషి ఆదేశాలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : పెట్టుబడి మద్ధతు పథకం అమలుకు సమయం దగ్గరపడుతోందని, గ్రామాల వారీగా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శైలేంద్ర కుమార్ జోషి అధికార యంత్రాంగాన్ని ఆదేవించారు. రైతుల ఖాతాల వారీగా ఆధునీకరించిన భూముల వివరాలను రెవెన్యూశాఖ ఈనెల 28లోగా వ్యవసాయశాఖకు అందజేయాలని సూచించారు. సోమవారం సచివాలయంలో రైతులకు వ్యవసాయ పెట్టుబడి సహాయంపై రెవెన్యూ, ఆర్థిక, వ్యవసాయ, ఎన్ఐసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జోషి మాట్లాడుతూ, రెవెన్యూశాఖ ద్వారా వ్యవసాయ భూముల వివరాలు అందగానే వ్యవసాయశాఖ చెక్కుల ముద్రణకు ఏర్పాట్లపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. బ్యాంకుల ద్వారా గ్రామాల వారీగా చెక్కుల సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్ఎల్‌బీసీ సమావేశం నిర్వహించి బ్యాంకులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. సంబంధిత వీఆర్‌వోలను బాధ్యులు చేయాలన్నారు భూరికార్డుల వివరాలను కలెక్టర్లు స్థూలంగా పరిశీలించి జాబితాలు విడుదల చేయాలన్నారు. చెక్కుల ముద్రణకు షెడ్యూల్‌ను రూపొందించుకోవాలన్నారు. ఏప్రిల్ 15 నాటికి పూర్తిగా చెక్కులు మంలాలు, గ్రామాల వారీగా అందుబాటులో ఉండాలన్నారు. గ్రామాల వారీగా రిజిస్ట్రర్లు నిర్వహించాలన్నారు. ఏప్రిల్ 19 లేదా 20 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా సీఎం కేసీఆర్ రైతులకు వ్యవసాయ పెట్టుబడి చెక్కులు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. అందుకు అనుగుణంగా యంత్రాంగం సిద్ధం కావాలన్నారు. చెక్కుల పంపిణీ సందర్భంగా వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక ఏర్పాట్లు ఉండాలన్నారు. వ్యవసాయ పెట్టుబడి చెక్కుల భద్రతకు తగు చర్యలు ఉండాలన్నారు. గ్రావూల వారీగా భూ వివరాలకు సంబంధించి వీఆర్‌వోలకు 'ఈ' సైన్ ఫెసిలిటీ, వోటీపీ విధానం ద్వారా అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని మండలాలకు బ్యాంకుల వారీగా చెక్కుల ముద్రణపై ప్రత్యేకంగా సమీక్షించుకోవాలన్నారు. డాటా ట్యాపరింగ్ కాకుండా చూడాలన్నారు. చెక్కుల పంపిణీ సందర్భంగా గ్రామాలలో ఎటువంటి ఇబ్బందులు ఎదురు కాకుండా చూసుకోవాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెట్టుబడి సహాయం అందాలన్నారు. రోజుల వారీగా చెక్కుల పంపిణీ వివరాలను వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయానికి పంపాలన్నారు.

ఈ సమావేశంలో రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారి, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణారావు, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి, సిసిఎల్ఏ డైరెక్టర్ కరుణ, వ్యవసాయశాఖ కమిషనర్ జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై రైల్వే జీఎం సమీక్ష



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రైళ్లు, రైల్వే స్టేషన్లలో పరిశుభ్రత నిర్వహణపై దృష్టి కేంద్రీకరించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. రైళ్లు, రైల్వే స్టేషన్లలో పరిశుభ్రత పైన ఆయన రైల్ నిలయంలో సమీక్ష నిర్వహించారు. జోన్ పరిధిలోని అన్ని డివిజన్ల రైల్వే మేనేజర్లు, ఉన్నతాధికారులు సమీక్షలో పాల్గొన్నారు. రైలు కోచుల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతను ఇవ్వవలసి ఉందన్నారు. ప్రయాణికులకు సంతృప్తి కలిగించే విధంగా పరిశుభ్రత ఉండాలన్నారు. అధికారులు తరచుగా తనిఖీలు చేసి ఉత్తమమైన పరిశుభ్రత ప్రమాణాలను పాటించవలసి ఉందన్నారు. రైల్వే స్టేషన్ల పునరభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. భద్రతకు సంబంధించిన అంశాలపై కడా సమీక్ష జరిపారు. కాపలాలేని లెవెల్ క్రాసింగ్‌లను తొలగించడం, ప్రమాదాలకు తావు లేని విధంగా రైలు మార్గాలను ఆధునీకరించడం అత్యంత ప్రధానం అన్నారు. రైళ్లు సమయపాలన పాటించాలని జనరల్ మేనేజర్ ఆదేశించారు.

ఆర్టీసీలో కార్మికుల సమస్యలపైన ఎంప్లాయిస్ యూనియన్ రీలే దీక్షలను ప్రారంభించింది. తాము దీక్షలు ప్రారంభించడంతోనే ప్రభుత్వం గుర్తింపు సంఘంతో చర్చలు ప్రారంభించిందని ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి తెలిపారు. ఈ నెల 23 వరకు దీక్షలు కొనసాగుతాయని పేర్కొన్నారు. వేతన సవరణ, ఖాళీల భర్తీ, కార్మికులపై పని భారం కుదింపుతో పాటుగా ఆర్టీసీ పరిరక్షణ కోసం ఉద్యమిస్తున్నామని పేర్కొన్నారు.

మే8న దోస్తు నోటిఫికేషన్

- 10 నుంచి 26 వరకు వెబ్‌ఆప్షన్లు
- మూడు దశల్లో సీట్ల కేటాయింపు
- పరీక్ష ఫీజు రూ. 200
- జూలై 2 నుంచి డిగ్రీ ఫస్టియర్ క్లాసులు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం మే 8న దోస్తు నోటిఫికేషన్ వెలువడనుంది. విద్యార్థులు ఆన్‌లైన్‌లో మే 10 నుంచి 26 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. దరఖాస్తు ఫీజు రూ. 200గా నిర్ణయించారు. దరఖాస్తు సమయలోనే వారికి ఏ కాలేజీలో సీటు కావాలి అనే విషయాలను వెబ్‌ఆప్షన్ల ద్వారా ఇవ్వాల్సి ఉంటుంది. 27 నుంచి 29 వరకు అపరాధ రుసుం రూ. 400తో దరఖాస్తు చేసుకోడానికి అవకాశం కల్పించారు. దోస్టుకు సంబంధించి విధి విధానాలను రూపొందించ డం కోసం సోమవారం ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో యూనివర్సిటీల వీసీలతో సమావేశం నిర్వహంచారు. ఉన్నత విద్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య తుమ్మల పాపిరెడ్డి, వైస్ చైర్మన్-1దోస్టు కన్వీనర్ ఆచార్య లింబాద్రి, వైస్‌చైర్మన్-2 వెంకటరమణ,కళాశాల విద్య కమిషనర్ నవీన్ మిట్టల్, ఉన్నత విద్యా మండలి కార్యదర్శి డాక్టర్ ఎన్ శ్రీనివాసరావుతోపాటు ఆరు యూనివర్సిటీల వీసీలు పాల్గొన్నారు. సమావేశంలో గత రెండేళ్లుగా దోస్టు నిర్వహణలో వచ్చిన సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. అయితే వాటిలో కొన్నింటిపై మరోసారి నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించా రు.

ఆర్టీసీ స్థితిగతులపై సమీక్ష



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆర్టీసీ స్థితిగతులు, సిబ్బంది వేతన సవరణ అంశాలపైన శాసనసభ సమావేశ మందిరంలో ఉన్నత స్థాయి సమీక్ష జరిగింది. రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి, సాగునీటి పారుదల శాఖ మంత్రి టి. హరీష్‌రావు, అబ్కారీ శాఖ మంత్రి పద్మారావు. శాసనసభ్యులు వి. శ్రీనివాస్ గౌడ్, ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ జి.వి. రమణారావు, గుర్తింపు సంఘం తెలంగాణ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి అశ్వర్థామరెడ్డి తదితరులు సమీక్షలో పాల్గొన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. చర్చలు అసంపూర్ణంగా ముగిసాయని, మంగళవారం మరో సారి చర్చలు జరుగుతాయని అశ్వర్థామరెడ్డి తెలిపారు. పలువురు తెలంగాణ మజ్దూర్ యూనియన్ నాయకులు సమావేశంలో పాల్గొని కార్మికుల వేతన ఒప్పందం, ఇతర సమస్యలను మంత్రుల దృష్టికి తెచ్చారు. సమస్యలను అన్నింటిని చర్చించి ఆర్టీసీ పరిరక్షణ, సిబ్బంది వేతన పెంపు, సమస్యల పరిష్కారం కోసం సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని మంత్రులు హామీ ఇచ్చారని గుర్తింపు సంఘం నాయకులు తెలిపారు.

వర్గీకరణకు అండగా ఉంటాం

మందకృష్ణకు కాంగ్రెస్ భరోసా



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : షెడ్యూల్డ్ కులాల వర్గీకరణకు తాము మద్దతిస్తున్నామని కాంగ్రెస్ నేతలు తేల్చిచెప్పారు. ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో తెలంగాణా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డితో పాటు ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, కాంగ్రెస్ మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ఆ పార్టీ సీనియర్ నేత దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే సంపత్ పాల్గొన్నారు. మొదట మంద కృష్ణ మాట్లాడుతూ తాను ప్రధానంగా రెండు అంశాలను తెలంగాణా కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ కుంతియా, టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చేందుకు ఢిల్లీ వచ్చానని, దానికి వారి మద్దతు కావాలని కోరారు. మొదటిది ఎస్సీ వర్గీకరణ కాగా, రెండోది తన ప్రాణాలకు కేసీఆర్ నుంచి ఉన్న ముప్పు అని ఆయన చెప్పారు. షెడ్యూల్ కులాల వర్గీకరణకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది, వర్గీకరణ విషయంలో బీజేపీ జాప్యం చేస్తోందని ఆయన మండిపడ్డారు. వర్గీకరణ విషయంలో కేంద్రంపై కాంగ్రెస్ ఒత్తిడి తీసుకురావాలని మంద కృష్ణ మాదిగ విజ్ఞప్తి చేశారు. లోక్ సభ, రాజ్యసభలో వర్గీకరణ అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తాలని, ఉషా మెహ్రా నివేదికను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రెండో విషయాన్ని రాహుల్, కారత్, సురవరం సుధాకర్ రెడ్డి దృష్టికి కూడా తీసుకొస్తున్నానని అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం రెండుసార్లు తనను జైల్లో పెట్టిందని, హతమార్చాలని కుట్ర పన్నుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇద్దరు మంత్రులు, ఒక ఎమ్మెల్యేకు ఈ కుట్రలో భాగస్వామ్యం ఉందని కృష్ణ మాదిగ ఆరోపించారు. ఈ విషయాన్ని జాతీయ నేతల దృష్టిలో పెడతానని, త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తానని వివరించారు. నా హత్యకు ఇది సమయం కాదని ముఖ్యమంత్రి కేసీఆర్ వాయిదా వేయించారని, తనను జైల్లో నుంచి బయటకు రాకుండా చేసేం దుకు, బెయిల్ రద్దు చేయించేందుకు ప్రత్యేక ప్రాసిక్యూటర్లను పెట్టారని ఆయన విమర్శించారు.అనందరం మాట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి... పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ మద్దతిస్తుందని తెలిపారు. ఏమాత్రం అవకాశం దొరికినా పార్లమెంట్‌లో విభజన అంశాన్ని లేవనెత్తుతామని చెప్పారు. తెలంగాణ ఏర్పడడానికి సహకరించిన అప్పటి స్పీకర్ మీరా కుమార్‌ను కేసీఆర్ అవమానిస్తూ మాట్లాడారని ఆయన మండిపడ్డారు. దళిత ఎమ్మెల్యే సంపత్ శాసన సభ్యత్వాన్ని రద్దు చేయించడంతో దళితులపై కేసీఆర్ వ్యతిరేక భావంతో ఉన్నారనే విషయం స్పష్టమవుతోందని ఉత్తమ్ చెప్పుకొచ్చారు. దళిత సమాజం, తెలంగాణ సమాజం కేసీఆర్ వికృత, వికార చర్యలను తిరస్కరిస్తుందని ఆయన దుయ్యబట్టారు. టీఆర్ఎస్, కేసీఆర్ హతమార్చేందుకు ప్రయత్నిస్తోందంటూ మంద కృష్ణ చేసిన ఆరోపణలపై సీబీఐతో విచారణ జరిపించాలనికాంగ్రెస్ డిమాండ్ చేస్తోందని ఉత్తమ్ తెలిపారు. కేంద్ర హోం మంత్రికి ఈ దిశగా కాంగ్రెస్ హైకమాండ్ లేఖ రాస్తుందని చెప్పారు. లంచాలు అడిగితే చెప్పుతో కొట్టాలని పిలుపునిచ్చిన కేటీఆర్ ఇలాఖాలోనే రాజకీయ నాయకుల లంచాల భాగోతాన్ని ఆ పార్టీ నేతలే బయటపెట్టారంటూ సిరిసిల్ల జడ్పీ ఛైర్ పర్సన్ సామల పావని ఉదంతాన్ని ఉత్తమ్ ఉటంకించారు. దీనికి కేటీఆర్ ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. ఆ తర్వాత మాట్లాడిన కుంతియా ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ మద్దతిస్తోందని వెల్లడించారు. మాదిగలను కేసీఆర్, ఎన్డీఏ ప్రభుత్వం మోసం చేసిందని, తామెప్పుడూ వారికి అండగా ఉంటామనీ అన్నారు. కేసీఆర్ ప్రభుతవం వచ్చాక వారికి రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరించాలని కుంతియా అన్నారు.

నాలుగో కేసులోనూ లాలూ దోషి



- లాలూ సహా 18 మంది దోషులు • జగన్నాథ్ మిశ్రా సహా 12 మంది నిర్దోషులు • 21న శిక్ష ఖరారు చేయనున్న సీబీఐ కోర్టు

రాంచీ: దాణా కుంభకోణంలో జైలు శిక్ష అనుభవిస్తున్న బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ ను సీబీఐ న్యాయస్థానం నాలుగో కేసులోనూ దోషిగా తేల్చింది. 1995-96 లో డుంకా కోశాగారం నుంచి అక్రమంగా రూ. 3.3 కోట్ల రూపాయలు విత్ డ్రా చేశారన్న సీబీఐ అభియోగాలపై విచారణ జరిపిన ధర్మాసనం లాలూతో పాటు మరో 18 మందిని దోషులుగా పేర్కొంది. అయితే మరో మాజీ ముఖ్యమంత్రి జగన్నాథ్ మిశ్రాతో పాటు 12 మందిని మాత్రం నిర్దోషులుగా ప్రకటించడం గమనార్హం.. ఐపీసీ 120బీ (నేరపూరిత కుట్ర), 409 (అధికార దుర్వినియోగం), 420 (మోసం), 471 (తప్పుడు ధృవపత్రాల సృష్టి) తదితర కేసుల నమోదు దోషులుగా తేల్చింది. అయితే దోషులకు ఇంకా శిక్ష ఖరారు కాలేదు. ఈనెల 21న మరోసారి విచారణ జరిపిన తర్వాత సీబీఐ కోర్టు శిక్ష ఖరారు చేయనుంది. గతేడాది డిసెంబర్ 23 వ తేదీ నుంచి లాలూ జార్ఖండ్ లోని బిర్సాముండా జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. 1991-1996 మధ్య లాలూ బీహార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జరిగిన రూ. 950 కోట్ల దాణాకుంభకోణం 1996లో వెలుగులోకి వచ్చింది. పశువుల దాణా కొనుగోళ్లలో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఆరోపణలు రావడంతో లాలూసహా మరికొందరిపై కేసు నమోదైంది. దీంతో ముఖ్యమంత్రి పదవికి లాలూ రాజీనామా చేసి తన భార్య రబ్రీదేవిని సీఎంగా చేశారు. దాణా కుంభకోణానికి సంబంధించి మొత్తం ఐదు కేసులు నమోదు కాగా నాలుగు కేసుల్లో లాలూ దోషిగా తేలారు. మరోకేసు పెండింగ్ లో ఉంది.

కేసు-1

లాలూ ప్రసాద్ బీహార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బాంకా, భాగల్పూర్ జిల్లాల్లోని కోశాగారాల నుంచి రూ। 47 లక్షల రూపాయలు అక్రమంగా విత్ డ్రా చేశారు. నకిలీ బిల్లుల ద్వారా ఈ డబ్బును విత్ డ్రా చేసినట్లు సీబీఐ నిరూపించింది. 1995-96 లో లాలూ సీఎంగా ఉన్నప్పుడు ఈ కుంభకోణం జరిగింది. ఈ కేసులో లాలూ, మాజీ ముఖ్యమంత్రి జగన్నాథ్ మిశ్రా, సహా 45 మందిని న్యాయస్థానం దోషులుగా తేల్చింది.

కేసు-2 (తీర్పు జనవరి 6, 2018

దేవ్‌గఢ్ ట్రెజరీ నుంచి 1991-94 మధ్య లాలూ ప్రసాద్ రూ.89 లక్షలు అక్రమంగా విత్ డ్రా చేసిన కేసులో జనవరి 6న లాలూకు కోర్టు మూడున్నరేళ్ల జైలుశిక్షతో పాటు రూ.10 లక్షల జరిమానా కూడా విధించింది. లాలూతో పాటు మరో ఏడుగురికి న్యాయస్థానం శిక్ష ఖరారు చేసింది. మరో ఏడుగురికి కూడా మూడున్నరేళ్ల జైలుతో పాటు రూ.5 లక్షల జరిమానా విధించింది.

కేసు-3 (తీర్పు 2013

చైబాసా కోశాగార కేసు లాలూపై నమోదైనమొదటిది. 1996లో లాలూ చైబాసా కోశాగారం నుంచి రూ. 37కోట్ల 50 లక్షల మోసపూరితంగా విత్ డ్రా చేసినందుకు గాను 2013 అక్టోబర్ లో న్యాయస్థానం లాలూకు 25 లక్షల జరిమానాతో పాటు..ఐదేళ్లు జైలు శిక్ష విధించింది. ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయకుండానిషేధం విధించింది. అయితే అదే ఏడాది డిసెంబర్ లో లాలూ కు సుప్రీంకోర్టుకు ఉపశమనం కలిగింది.ఈ కేసులో సుప్రీంకోర్టు లాలూకు బెయిల్ మంజూరు చేసింది. 2014 లో జార్ఖండ్ హైకోర్టు మిగతా నాలుగు కేసుల్లో విచారణపై స్టే విధించింది. ఒక కేసులో దోషిగా తేలిన వ్యక్తికి మిగతా కేసులను కూడా ఆపాదించడం సరికాదని వ్యాఖ్యానించింది.

కేసు-4 (తీర్పు మార్చి 21

1995-96 లో డుంకా కోశాగారం నుంచి అక్రమంగా రూ. 3.3 కోట్ల రూపాయలు విత్ డ్రా చేశారన్న సీబీఐ అభియోగాలపై విచారణ జరిపిన ధర్మాసనం లాలూతో పాటు మరో 18 మందిని దోషులుగా పేర్కొంది. అయితే మరో మాజీ ముఖ్యమంత్రి జగన్నాథ్ మిశ్రాతో పాటు 12 మందిని మాత్రం నిర్దోషులుగా ప్రకటించడం గమనార్హం..

కేసు-5

1991-95 కాలంలో లాలూ యాదవ్ డోరండా కోశాగారం నుంచి రూ.139.39 కోట్ల రూపాయలు అక్రమంగా విత్ డ్రా చేశారన్నది సీబీఐ అభియోగం. 1.97 కోట్ల కు బదులు 48 లక్షల 45వేల 502 రూపాయలు నకిలీ వోచర్లు ఉపయోగించి.. 2వేల 367 ఆర్డర్లు చేసినట్లు నకిలీ పత్రాలు సృష్టించినట్లు సీబీఐ ఆరోపిస్తోంది. ఈ కేసుపై న్యాయస్థానం విచారణ జరుపుతోంది.

దాణా కుంభకోణం కేసు టైం లైన్

జనవరి 1996: చైబసా డిప్యూటీ కమిషనర్ పశుసంవర్ధక శాఖలో సోదాలతో వెలుగులోకి దాణా కుంభకోణం.
మార్చి 1996: లాలూ ప్రసాద్ యాదవ్ పై సీబీఐ చార్జ్‌షీట్.
జూలై 1997: బీహార్ సీఎం పదవికి లాలూ రాజీనామా.. సీబీఐ ముందు లొంగుబాటు, జ్యుడిషియల్ కస్టడీకి లాలూ.
ఏప్రిల్ 2000: కేసులో లాలూ భార్య రబ్రీదేవి పేరు.
అక్టోబర్ 2001: కేసును జార్ఖండ్ హైకోర్టుకు మార్చిన సుప్రీం కోర్టు.
ఫిబ్రవరి 2002: సీబీఐ ప్రత్యేక న్యాయస్థానంలో విచారణ ప్రారంభం
డిసెంబర్ 2006: ఆస్తుల కేసులో లాలూ, రబ్రీదేవి నిర్దోషులుగా తేల్చిన కిందిస్థాయి కోర్టు
మార్చి 2012: లాలూ, జగన్నాథ్ మిశ్రాలపై ఛార్జ్‌షీట్లు
సెప్టెంబర్ 2013: లాలూ, జగన్నాథ్ మిశ్రా సహా 45 మందిని దోషులుగా తేల్చిన సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం
డిసెంబర్ 2013: లాలూకు సుప్రీంకోర్టులో బెయిల్
మార్చి 2014: లాలూపై ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధించిన సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం
మార్చి 2017: సీబీఐ ప్రత్యేక న్యాయస్థానంలో విచారణ ప్రారంభం
డిసెంబర్ 2017: లాలూతో పాటు 15 మందిని దోషులుగా తేల్చిన సీబీఐ కోర్టు, జైలుకు తరలింపు
జనవరి 6, 2018: లాలూకు మూడున్నరేళ్ల జైలు శిక్ష
మార్చి 19,2018: నాలుగో కేసులో లాలూ దోషి.



2024 వరకు పుతినే

- నాలుగోసారి అధ్యక్ష స్థానంలో.. • 76.67 శాతం ఓట్లతో గెలుపు
- అధ్యక్ష పదవీ కాలాన్ని 6 ఏళ్లు పొడిగించిన ఘనత ఆయనదే • ప్రధాన ప్రత్యర్థి అలెక్సీని న్యాయపరమైన కారణాలతో బరి నుంచి తప్పించిన వైనం

మాస్కో: రష్యా ఎన్నికల్లో వ్లాదిమిర్ పుతిన్ భారీ మెజారిటీతో విజయం సాధించారు. ఇది ముందుగా అనుకున్న విషయమే అయినా, రష్యా ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటించింది. భారత కాలమానం ప్రకారం శనివారం అర్ధరాత్రి 1.30 గంటలకు మొదలైన రష్యా అధ్యక్ష ఎన్నికల పోలింగ్ ఆదివారం అర్ధరాత్రి 11.30 గంటలకు ముగిసింది. పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు ప్రారంభించారు. దాదాపు 99.9 శాతం బ్యాలెట్ల ఓట్ల లెక్కింపు పూర్తయినట్లు, లెక్కించిన ఓట్లలో పుతిన్ 76.67 శాతం ఓట్లను సాధించినట్లు సమాచారం. వ్లాదిమిర్ పుతిన్ రష్యా అధ్యక్షుడిగా ఎన్నికవడం ఇది నాలుగోసారి. 2000 సంవత్సరంలో ప్రారంభమైన పుతిన్ రాజకీయ ప్రస్థానం ఈ ఎన్నికల్లో గెలుపొందటంతో 2024 వరకూ కొనసాగనుంది. 2012 వరకూ రష్యాలో అధ్యక్షుడి పదవీకాలం నాలుగు సంవత్సరాలు మాత్రమే. కానీ 2012లో పుతిన్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో పదవీ కాలాన్ని నాలుగు నుంచి ఆరు సంవత్సరాలకు పొడిగించారు. రష్యాను అత్యధిక కాలం పాలించిన నియంత జోసఫ్ స్టాలిన్ తర్వాత ఎక్కువ కాలం అధ్యక్షుడిగా ఉన్న నాయకుడుగా పుతిన్ రికార్డు నెలకొల్పనున్నారు. ఈ ఎన్నికల్లో పుతిన్‌తో పాటు మరో ఏడుగురు అభ్యర్థులు బరిలో దిగారు. పుతిన్‌పై తీవ్ర వ్యతిరేకత ఉన్నప్పటికీ ఆయనకు ప్రత్యామ్నాయంగా మరో బలమైన నేత లేకపోవడం, పుతిన్ ప్రధాన ప్రత్యర్థి అలెక్సీ నావల్నీని ఎన్నికల్లో పోటీ చేయకుండా న్యాయపరమైన కారణాలను చూపి నిషేధించి బరి నుంచి తప్పించారు. దీంతో పుతిన్ ఎన్నిక లాంఛనమే అని తేలిపోయింది. ఇక ఎన్నికల్లో ఏకపక్షంగా ఫలితం వచ్చింది. ఇదే పుతిన్ తిరుగులేని నాలుగోసారి విజయానికి కారణమయినట్లు సమాచారం. పుతిన్ పాలన సమయంలోనే పుట్టి, పూర్తిగా ఆయన పాలనలోనే ఎదిగి 18 ఏళ్లు నిండిన యువత తొలిసారిగా ఈ ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకున్న శాతం కూడా పుతిన్‌కు కలిసివచ్చింది.



తల్వార్ దంపతులకు నోటీసులు



- మరోసారి కోర్టుకెక్కనున్న ఆరుషి తల్లిదండ్రులు
- నిర్దోషిత్వాన్ని సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో అప్పీలు

న్యూఢిల్లీ: కుమార్తె ఆరుషి, పనిమనిషి హేమరాజ్ జంట హత్యల కేసు విషయంపై దంత వైద్యులైన తల్వార్ దంపతులు మరోసారి కోర్టుబోను ఎక్కనున్నారు. తల్వార్ దంపతులను నిర్దోషులుగా విడుదల చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన అప్పీల్‌ను సోమవారం సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. పనిమనిషి హేమరాజ్ భార్య కుంకాల బంజాడే ఈ కేసు పునర్విచారణ చేపట్టాలని సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ మేరకు పిటీషన్ స్వీకరించిన జస్టిస్ రంజన్ గోగోయ్ నేతృత్వంలోని బెంచ్ తల్వార్ దంపతులకు నోటీసులు జారీ చేసింది. మే 2008లో నోయిడాలోని దంతవైద్యులైన రాజేశ్, నూపూర్ తల్వార్ దంపతుల కుమార్తె ఆరుషి, పనిమనిషి హేమరాజ్ హత్యకు గురయ్యారు. తల్వార్ దంపతులు నివాసంలో 14ఏళ్ల అరుషి ఆమె గదిలోనే రక్తపు మడుగులో పడిఉండటాన్నిఉంటున్న కనుగొన్నారు. ఆరుషి గొంతుకోసి ఉండటంతో ఆరుషిది హత్య అని ప్రాథమిక దర్యాప్తులో నిర్ధారణకు వచ్చారు. అదేనివాసంలో మరో చోట పనిమనిషి హేమరాజ్ (45) మృతుడై కనిపించాడు. ఇతని మృతదేహాన్ని రెండురోజుల అనంతరం వైద్యుల ఇంటి టెర్రస్‌పై స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ సీబీఐ కోర్టు తల్వార్ దంపతులను దోషులుగా తేల్చి నవంబర్ 26, 2013లో జీవితఖైదు విధించింది. అయితే సరైన సాక్ష్యాధారాలు లేనికారణంగా వీరిని అలహాబాద్ హైకోర్టు నిర్దోషులుగా 2017, అక్టోబరు 12న తీర్పు ఇవ్వటంతో వీరు జైలునుంచి విడుదలయ్యారు. ఆరుషి హత్యకేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించటంతో అప్పటి యూపీ సీఎం మాయావతి ఈ కేసును సీబీఐకి సిఫార్సు చేయటంతో సీబీఐ దర్యాప్తు చేపట్టిన విషయం విదితమే.

మోడీజీ అచ్చేదిన్, 2 కోట్ల ఉద్యోగాలేవి?

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ప్రధాని మోడీపై మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అచ్చేదిన్, ఉద్యోగాల భర్తీపై మోడీజి ఇచ్చిన హామీలేమయ్యాయని ప్రశ్నించారు. రెండేళ్లుగా తాము చెబుతున్న విషయాలనే నోబెల్ పురస్కార విజేత అయిన పాల్ క్రుగ్‌మన్ నిర్ధారించారని..భారత్ ఎదుర్కొంటున్న అతిపెద్ద ముప్పు నిరుద్యోగమని చెప్పుకొచ్చారు. దురదృష్టవశాత్తు మన ప్రధాని ఆ విషయాలను ఒప్పుకోరని..ఆయన చెప్పిన అచ్చేదిన్ గురించి కూడా మరచిపోయారని అన్నారు. రెండు కోట్ల మంది ఉద్యోగాలు కల్పిస్తామన్న మోడీ ప్రభుత్వ హామీలు హామీలుగానే మిగిలిపోయా యని.. ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందని ఆరోపించారు. ఉద్యోగ కల్పనకు బదులు నోట్లరద్దు, జీఎస్టీలు అమలు చేసి చాలామంది ఉపాధిని దెబ్బతీశారని మండిపడ్డారు.



చిస్తీ దర్గా సాంప్రదాయానికి చిహ్నం



జైపూర్: శాంతి, ఐక్యత, సామరస్యం భారతీయ తత్వశాస్త్రాల సారాంశమని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. రాజస్తాన్‌లోని అజ్మీర్ మొహినుద్దీన్ చిస్తీ దర్గాకు తన తరపున చాదర్ పంపారు. మోడీ తరపున కేంద్ర మంత్రి ముక్తార్ అబ్బాస్ నక్వీ దర్గాను సందర్శించి చాదర్‌ను అక్కడి మతపెద్దలకు అందజేశారు. చిస్తీ దర్గా 806 వార్షికోత్సవ ఉర్సూ సందర్భంగా దేశ, విదేశీ యాత్రికులకు ప్రధాని శుభాకాంక్షలతో పాటు తన సందేశాన్ని తెలియజేశారు. చిస్తీ దర్గా ఆధ్యాత్మిక సాంప్రదాయానికి చిహ్నంగా నిలుస్తోందని ప్రధాని కొనియాడారు. ముక్తార్ అబ్బాస్ నక్వీ మాట్లాడుతూ ఉగ్రవాదం ఇస్లాంకు, మానవత్వానికి శత్రువని.. ఖాజామొయినుద్దీన్ బోధనల ద్వారా శాంతిపై జరుగుతున్న దాడులను కలిసికట్టుగా ఎదుర్కోవాలని సూచించారు.

ఆర్మీ దాడిలో 36 మంది ఉగ్రవాదుల హతం




కైరో: ఈజిప్టు ఉత్తర, సెంట్రల్ సినియాలో గత ఐదు రోజులుగా ఆర్మీ దాడుల్లో 36 మంది ఉగ్రవాదులు హతమయినట్లు అధికారులు పేర్కొన్నారు. వాస్తవానికి ఈజిప్టు ఉత్తర ప్రాంతం, సెంట్రల్ సినియాల్లో ఫిబ్రవరి మొదటివారం నుంచి సైన్యం పెద్ద ఎత్తున ఏరివేత కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా దాడులను ముమ్మరం చేసింది. గత ఐదు రోజుల్లో సైన్యం జరిపిన దాడుల్లో 36 మంది తీవ్రవాదులను మట్టికరిపించింది. ఇప్పటికే 345 మంది అనుమానిక తీవ్రవాదులను అదుపులోకి తీసుకున్నామని, ఇంకా చాలామంది ఉగ్రవాదులు హిట్‌లిస్టులో ఉన్నారని ఈజిప్టియన్ మిలటరీ సైన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ఆ దాడుల్లో ఒక అధికారి, ముగ్గురు నిర్బంధ సైనికులు మృత్యువాత పడ్డారని, అలాగే ఇద్దరు అధికారులకు, ఐదుగురు నిర్బంధ సైనికులు, నాన్-కమిషనర్ అధికారి తీవ్ర గాయాలకు గురయ్యారు. అయితే, తీవ్రవాదులు పెట్టిన 386 మందుపాతరలను ధ్వంసం చేసినట్టు, దాచిఉంచిన కొన్ని ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్టు ఆర్మీ సైన్యం వెల్లడించింది. ధ్వంసమైన ప్రదేశంలో 17 వాహనాలు, 67 లైసెన్స్‌లేని మోటార్ బైక్‌లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్టు తెలిపారు.

సుప్రీంలో నితీష్‌కు ఊరట



న్యూఢిల్లీ: బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. తనపై హత్య కేసు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని నితీష్ ఉద్దేశపూర్వకంగానే దాచిపెట్టారని, ఇందువల్ల తక్షణమే ఎమ్మెల్సీ సభ్యత్వానికి ఆయనను అనర్హుడుగా ప్రకటించాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజనాల వ్యాజ్యాన్ని అత్యున్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. క్రిమినల్ కేసు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని 2012లో ఎన్నికల సంఘానికి నితీస్ తెలియజేసినట్లు ఆయన తరపు న్యాయవాది కోర్టుకు సమాచారమిచ్చారని, ఆరీత్యా పిల్ విచారణ యోగ్యం కాదని భావించి కొట్టివేస్తున్నట్లు భారత ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా సారథ్యంలో బెంచ్ పేర్కొంది. జస్టిస్ ఎంఎం ఖాన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్ ఈ బెంచ్‌లో ఉన్నారు. అయితే, నితీష్‌పై ఉన్న కేసుపై పాట్నా హైకోర్టు స్టే ఇచ్చిందని, అంతేకాకుండా, నితీష్ ఎలాంటి చట్టవ్యతిరేక విధానాలకు పాల్పడలేదని ఆయన తరపు న్యాయవాది అత్యున్నత న్యాయస్థానానికి విన్నవించారు.

2జీ కేసు... ఢిల్లీ హైకోర్టుకు



న్యూఢిల్లీ: మాజీ టెలికాం మంత్రి ఏ.రాజా, డీఎంకే ఎంపీ కనిమొళిని ప్రత్యేక న్యాయస్థానం 2జీ కేసు సందర్భంగా దాఖలైన హవాలా కేసులో నిర్దోషులుగా ప్రకటించటంపై ఎన్ఫోర్సుమెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేసింది. మాజీ కేంద్రమంత్రి రాజాతోపాటు, కనిమొళిని ప్రత్యేక న్యాయస్థానం గతేడాది 21న నిర్దోషులుగా ప్రకటించింది. ఈ కేసులో వీరితోపాటు మరో 17మంది కూడా నిర్దోషులుగా విడుదలయ్యారు. వీరిలో డీఎంకే అధినేత కరుణానిధి భార్య దయాళు అమ్మాళ్, ఆసిఫ్ బాల్వా, రాజీవ్ అగర్వాల్, సినీ నిర్మాత కరీం మోరానీ, పీ. అమ్రితం, శరద్ కుమార్ (డైరెక్టర్ ఆఫ్ కలైంగర్ టీవీ) తదితరులును కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. ఈ కేసు విషయంపై ఈడీ తన చార్జ్‌షీట్‌లో స్వాన్ టెలికాం ప్రైవేట్ కంపెనీ 200కోట్లు డీఎంకే ఆధ్వర్యంలోని కలైంగర్ టీవీకి చెల్లించిందని ఆరోపించిన విషయం విదితమే. కాగా 2జీ కేసులో అక్రమంగా కేటాయింపులు కారణంగా ప్రభుత్వానికి సుమారు 30,984కోట్లు కోల్పోయిందని ఆరోపించిన సంగతి విదితమే.

కుంభకోణంపై నీరవ్ మోడీ ఛాలెంజ్



న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో జరిగిన 11,000కోట్లకుపైగా కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ పరోక్షంగా మనీలాండరింగ్ కేసుతో పీఎన్బీ కుంభకోణం సంబంధంపై చాలెంజ్ చేస్తున్నారని ఈడీ హైకోర్టుకు తెలిపింది. నీరవ్ తన కంపెనీ ఫైర్‌స్టార్ డైమండ్స్‌ను అడ్డుపెట్టుకుని ఈ చర్యలకు పాల్పడుతున్నారని న్యాయమూర్తుల బెంచ్ మురళీధర్, ఐఎస్ మెహతా ముందు ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు (ఈడీ) వెల్లడించారు. ఈడీ తరఫున వాదిస్తున్నఅడిషనల్ సొలిసిటర్ జనరల్ సందీప్ సేథీ తమ వాదన వినిపిస్తూ దేశం విడిచి పరారైన నీరవ్ మోదీ తన కంపెనీ తరఫున పిటీషన్ వేస్తూ మొత్తం న్యాయవిధానాన్నే నిందించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఫైర్‌స్టార్ డైమండ్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ యజమాని మనీలాండరింగ్ కేసులోనూ నిందితుడని, ఆయన తన కంపెనీ ద్వారా ఈడీ విచారణ నిలిపివేసేలా మధ్యంతర స్టే ఆర్డర్ కోసం ప్రయత్నిస్తున్నారన్నారు. నిందితుడు కంపెనీ తరఫున ఒకవేళ ఉన్నత న్యాయస్థానం స్టేఆర్డర్ మంజూరు చేస్తే కీలకదశలో ఉన్న విచారణ ఆగిపోతుందన్నారు. ఈడీ దర్యాప్తును నిలిపివేయటమే ప్రధాన ఉద్దేశంగా నీరవ్ మోదీ తన కంపెనీ ద్వారా పిటీషన్ వేశారని ఈడీ ఆరోపించింది. కాగా పీఎన్బీ కుంభకోణంలో ప్రాథమిక దర్యాప్తు ఆధారంగా సీబీఐ నీరవ్‌మోదీ, ఆయన కంపెనీలపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయగా, సీబీఐ ఎఫ్ఐఆర్‌ను ఆధారంగా చేసుకుని నీరవ్ మోదీపై ఈడీ మనీలాండరింగ్ కేసు రిజిస్టర్ చేసిన సంగతి విదితమే.

'రోహింగ్యాల వివరాలివ్వండి'

న్యూఢిల్లీ: రోహింగ్యా శరణార్థుల వైద్య, విద్యా సౌకర్యాలపై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్‌మిశ్రా, న్యాయమూర్తులు ఖాన్విల్కర్, చంద్రచూడ్‌తో కూడిన బెంచ్ కేంద్రప్రభుత్వాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానిస్తూ భారతీయులైనా, బయటివారైనా విద్య, వైద్య సౌకర్యాల కల్పనలో వివక్ష చూపడం తగదన్నారు. రోహింగ్యా శరణార్థులకు ఆరోగ్య, విద్యా సౌకర్యాలను కలిపించే విషయంలో ఎటువంటి ఉత్తర్వులు జారీ చేయటం లేదన్నారు. పిటీషనర్లు కేంద్రం వాదనలకు విరుద్ధంగా తగిన ఆధారాలు చూపితే తప్ప తాము కలిపించుకోలేమన్నారు. ఈ సందర్భంగా దేశంలో పలు రాష్ట్రాల్లోని రోహింగ్యా శరణార్థుల శిబిరాల్లోని పరిస్థితుల వివరాలను తెలియజేసేలా సమగ్ర నివేదికను సమర్పించాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. కాగా మయన్మార్‌లోని పశ్చిమ రాఖీన్ రాష్ట్రంలో హింసాకాండ ప్రారంభమైన తరువాత భారతదేశానికి వలస వచ్చిన రోహింగ్యాలు జమ్మూ, హైదరాబాద్, హర్యానా, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, రాజస్థాన్‌లో స్థిరపడ్డారు.

వాట్సాప్‌తో జరభద్రం



న్యూఢిల్లీ: ప్రముఖ మెసెంజర్ యాప్ వాట్సాప్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని భారత ఆర్మీ సైనికులను హెచ్చరించింది. చైనీయులు వాట్సాప్‌ను వాడుతూ భారత సిస్టమ్స్ ను హ్యాక్ చేస్తున్నారని ఆర్మీ ఓ వీడియోను పోస్ట్ చేసింది. నిమిషం నిడివిగల ఈ వీడియోను కేంద్రసమాచార ప్రసారాలశాఖ మంత్రి స్మృతీ ఇరానీ రీపోస్ట్ చేశారు. సైనికులు తమ వాట్సాప్ లోని కాంటాక్ట్ నెంబర్లను తమకు గుర్తుండే విధంగా పేర్లతో సేవ్ చేసుకోవాలని..గ్రూప్ లలో ఉంటే ఆయా గ్రూప్‌లోని సభ్యుల్లో ఎంతమంది తమకు తెలిస్తే వారి నెంబర్లను కూడా సేవ్ చేసుకోవాలని సూచించింది. ఇలా చేయడం ద్వారా అన్‌నోన్ నెంబర్ నుంచి హ్యాక్ జరిగే అవకాశం ఉండకపోవచ్చని తెలిపింది. ఒకవేళ వాట్సాప్ వాడిన సిమ్ కార్డును మార్చాలనుకుంటే.. ఆ సిమ్ ను పూర్తిగా నాశనం చేయాలని సూచించింది. ఇలా చేయడం ద్వారా హ్యాకర్ల ఆటలకు చెక్ పెట్టవచ్చుని పేర్కొంది. గతేడాది చైనా సరిహద్దుల్లో ఉన్న సైనికులు తమ స్మార్ట్ ఫోన్లను ఫార్మాట్ చేసుకోవాలని సూచించిన ఆర్మీ..హ్యాకర్ల ప్రమాదం పొంచిఉన్న 40 యాప్‌లను కూడా అన్‌ఇన్‌స్టాల్ చేయాలను తెలిపింది.

లింగాయత్‌లకు రిజర్వేషన్ హోదా?



బెంగళూరు: కర్నాటక అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కీలక నిర్ణయం తీసుకున్నారు. లింగాయత్ సామాజికవర్గానికి మైనారిటీ హోదాను కల్పించాలన్న నాగమోహన్ దాస్ కమిటీ సిఫార్సులను ఆమోదించాలని నిర్ణయించారు. ఈ మేరకు కర్నాటక కేబినెట్ ఆమోదం తెలిపింది. అంతేకాదు లింగాయత్‌లకు మతపరమైన మైనారిటీ హోదా కల్పించాలంటూ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపించారు. లింగాయత్‌లకు మాత్రమే మతపరమైన మైనారిటీ హోదా కల్పిస్తే తీవ్ర పరిణామాలుంటాయని వీరశైవ లింగాయత్ స్వాములు హెచ్చరించిననేపథ్యంలో కర్నాటక ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది।12వ శతాబ్దానికి చెందిన వీరశైవ మతస్తుడు బసవన్న అనుచరులే లింగాయత్‌లు, వీరశైవలింగాయత్‌లు. కర్నాటక జనాభాలో వీరు 17 శాతం మంది ఉన్నారు. ఈ రెండు వర్గాల మధ్య విభేదాల నేపథ్యంలో ప్రభుత్వం మధ్యేమార్గాన్ని అనుసరిస్తోంది. రెండు వర్గాల ఓటుబ్యాంక్ చీలకుండా సిద్ధరామయ్య సర్కారు వ్యూహాత్మక అడుగులు వేస్తోంది.

లోక్‌సభలో మళ్లీ అదే సీన్

అవిశ్వాసం గాలికి



- వెల్‌లో టీఆర్‌ఎస్, అన్నాడీఎంకే ఎంపీల ఆందోళన
- సభ ఆర్డర్‌లో లేదని అవిశ్వాసం చేపట్టని స్పీకర్
- మద్దతుగా నిలిచిన కాంగ్రెస్, టీఎంసీ, వామపక్షాలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: అవిశ్వాసంపై లోక్‌సభలో మళ్లీ అదే సీన్ పునరావృతమైంది. కేంద్రప్రభుత్వంపై తెలుగుదేశం పార్టీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాలపై సోమవారం కూడా లోక్‌సభలో చర్చ జరగలేదు. పార్లమెంటు సమావేశాలు ఉదయం 11గంటలకు ప్రారంభంకాగానే విపక్షాల ఆందోళనతో లోక్‌సభ మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా పడింది. తిరిగి సభ ప్రారంభం కాగానే స్పీకర్ సుమిత్రా మహాజన్, టీఆర్‌ఎస్, అన్నాడీఎంకె ఎంపీల ఆందోళనల మధ్యనే అవిశ్వాస తీర్మానాలకు సంబంధించిన నోటీసులను లోక్‌సభలో చదివి వినిపించారు. టీడీపీ ఎంపీ తోటనరసింహం, గల్లా జయదేవ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ వైవి.సుబ్బారెడ్డి అవిశ్వాస తీర్మానాలను ఇచ్చారని ఆమె సభకు తెలిపారు. సభ సజావుగా ఉంటే దీనిపై తదుపరి చర్యలు చేపడతామని ఆమె ప్రకటించారు. అవిశ్వాస తీర్మానాన్ని అనుమతించాలా లేదా అనే దానికి మద్దతిస్తున్న 50 మంది ఎంపీలు తమ తమ స్థానాల్లో నిలబడితే లెక్కించాల్సి ఉందన్నారు. అయితే అదే సమయంలో టిఆర్ ఎస్, అన్నాడిఎంకె పార్టీలు వెల్‌లో ఆందోళన కొనసాగించాయి. కావేరి నదీ జలాల బోర్డు ఏర్పాటు చేయాలని అన్నాడిఎంకె ఎంపీలు, రిజర్వేషన్ల కోటా పెంచాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి వ్యవసాయానికి అనుసంధానం చేయాలని నినాదాలుచేశారు. స్పీకర్ సుమిత్రా మహాజన్, వారిని తమ తమ స్థానాలకు వెళ్లి కూర్చోవాలని ఆమె పదే పదే విజ్ఞప్తి చేశారు. తీర్మానానికి మద్దతిస్తున్న ఎంపీలను లెక్కించాల్సి ఉందని, వెల్‌లో ఉన్న సభ్యులు కూర్చోవాలని కోరారు. ఇలా ఉంటే ఎంపీల సంఖ్యను ఎలా లెక్కించాలని నిస్సహాయత వ్యక్తం చేశారు. అయినా వెల్‌లో నిరసన వ్యక్తంచేస్తున్న టిఆర్ఎస్, అన్నాడిఎంకె సభ్యులు పట్టించు కోలేదు. దాంతో సభ కార్యక్రమాలు సజావుగా నడిచే పరిస్థితి లేనందు న అవిశ్వాస తీర్మానాన్ని చేపట్టలేమని స్పీకర్ ప్రకటించారు. అనంతరం సభను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

అవిశ్వాసంపై చర్చకు సిద్ధం: రాజ్‌నాథ్



అవిశ్వాస తీర్మానంపై చర్చించేందుకు తాము హృదయపూర్వకంగా సిద్ధంగా ఉన్నామని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ లోక్‌సభలో స్పష్టం చేశారు. ప్రభుత్వం అన్ని అంశాలపై చర్చకు సిద్ధంగా ఉందని తెలిపారు. విపక్ష సభ్యులు ఆందోళన విరమించి సభ సక్రమంగా జరిగేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పార్లమెంటు సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి సభా కార్యక్రమాలు నడవడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. సభ్యులు లేవనెత్తే అన్ని అంశాలపై పూర్తి చర్చకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

అవిశ్వాసానికి మద్దతుగా కాంగ్రెస్, టీఎంసీ

అవిశ్వాస తీర్మానాలకు మద్దతుగా సభలో కాంగ్రెస్, టీఎంసీ, వామపక్షాలు, ఆర్జేడీ, సమాజ్‌వాదీ, ఎంఐఎం పార్టీల ఎంపీలు లేచి నిల్చున్నారు. ప్రత్యేక హోదా పోరాటానికి మద్దతిస్తామని ముందుగానే ప్రకటించిన కాంగ్రెస్, వామపక్షాలు తమ సంఘీభావాన్ని కొనసాగించాయి.

వైఎస్సార్‌సీపీ నోటీసు

కేంద్ర ప్రభుత్వంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరో అవిశ్వాస తీర్మానానికి సిద్ధమైంది. ఈ మేరకు అవిశ్వాస తీర్మానానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నోటీసు ఇచ్చింది. దీనిపై సభలో మంగళవారం చర్చ చేపట్టాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి నోటీసులో కోరారు. అవిశ్వాస సమయంలో ఎంపీలంతా విధిగా హాజరై మద్దతుగా నిల్చోవాలని విప్ కూడా జారీచేశారు.



కొనసాగుతున్న వాయిదాల పర్వం

- మూడోవారం తుడిచిపెట్టుకుపోతున్న పార్లమెంటు సమావేశాలు
- 23న నిరవధిక వాయిదా వేసే అవకాశం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: పార్లమెంటులో వాయిదాల పర్వం కొనసాగుతోంది. వరుసగా మూడోవారం పార్లమెంటు సమావేశాలు తుడిచిపెట్టుకుపోయే పరిస్థితి నెలకొంది. సోమవారం ఉభయ సభల్లోసభా కార్యక్రమాలు అయిదు నిమిషాలు కూడా నడవడంలేదు. లోక్‌సభ ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభం కాగానే తెరాస, అన్నాడీఎంకే సభ్యులు ఆందోళన చేయడంతో ఒక్క నిమిషంలోనే, 12 గంటలకు వాయిదా పడింది. గంట తర్వాత ప్రారంభమైన తర్వాత కూడా అదే పరిస్థితి నెలకొనడంతో స్పీకర్ సభను మంగళవారానికి వాయిదా వేశారు.ఇటు రాజ్యసభలోనూ ఆందోళనలు కొనసాగాయి. చర్చకు ప్రభుత్వం, ప్రతిపక్షాలు సిద్ధమే అని ప్రకటిస్తున్నా సమస్య ఎక్కడుందని రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్యానాయుడు అన్నారు. వెల్‌లో ఆందోళనలో చేస్తున్న సభ్యులు వెనక్కి వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. చర్చకు సిద్ధమైతే ఆందోళనలు ఎందుకన్నారు. ఎంతకాలం ఇలా కొనసాగిస్తారని ప్రశ్నించారు. ఈ పరిస్థితిపై ఇప్పటికే విమర్శలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. అయినా సభ్యులెవరూ వినే పరిస్థితి లేకపోవడంతో, నిమిషాల వ్యవధిలోనే సభను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు ఛైర్మన్ వెంకయ్యానాయుడు ప్రకటించారు.

పట్టువీడని విపక్షాలు, మెట్టు దిగని ప్రభుత్వం

తమ తమ అంశాలపై విపక్షాలు ఉభయసభలను హోరెత్తిస్తున్నాయి. అధికార, విపక్షాల మధ్య ఏకాభిప్రాయం కుదిర్చేందుకు ఎటువంటి ప్రయత్నాలు జరగడం లేదు. తొలి రెండు వారాలు నీరవ్‌మోడీ అంశంపై ఏ నిబంధన కింద చర్చ జరగాలన్న దానిపై అధికార, విపక్షా ల మంకుపట్టుతో సమావేశాలు తుడిచిపెట్టుకుపోయాయి. మూడో వారంలో ఏపీకి ప్రత్యేక హోదా అంశంపై ఇచ్చిన అవిశ్వాస తీర్మానాల నేపథ్యంలో సభ కార్యక్రమాలు జరగడం లేదు. టిఆర్ఎస్, అన్నాడిఎంకెలు తమ తమ అంశాలపై పట్టువీడకుండా వెల్‌లోకి వెళ్లి నిరసన తెలుపుతుండడంతో ఈ సమావేశాలు జరిగేపరిస్థితి లేదు.

23న నిరవధిక వాయిదా!

రెండువారాలు గడిచినా సభా కార్యక్రమాలు ముందుకు సాగకపోవడంతో పార్లమెంటు సమావేశాలను ముందుగానే కుదించాలని ప్రభుత్వం యోచిస్తోంది. లోక్‌సభలో బడ్జెట్ పాసైన నేపథ్యంలో రాజ్యసభలోనూ దానిని ఆమోదింపజేసుకున్న తర్వాత సభను నిరవధిక వాయిదా వేయాలని భావిస్తున్నారు. వచ్చే శుక్రవారం నాడు నిరవధిక వాయిదా వేసే అవకాశముంది.

పార్లమెంటులో దూకుడు పెంచిన టీఆర్ఎస్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: విభజన హామీలు, రిజర్వేషన్ల అంశాలపై మూడో వారమూ తెరాస మెట్టు దిగలేదు. సోమవారం పార్లమెంట్ ప్రధాన ద్వారం వద్ద ఆ పార్టీ ఎంపీలు ఆందోళన చేపట్టారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన విదేశాంగ శాఖా మంత్రి సుష్మా స్వరాజ్‌తో ఎంపీలు జితేందర్ రెడ్డి, వినోద్‌లు తమ డిమాండ్ల గురించి చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... అజెండా మాది. మా పోరాటం మాది. మేం ఇంకొకరిని ఫాలో అవ్వాల్సిన అవసరం లేదని జితేందర్ రెడ్డి స్పష్టం చేశారు. టీడీపీ నేతల మాటల్లో విభజనను వ్యతిరేకించే స్వరం వినిపిస్తోందని, దీనిపై మా వ్యతిరేకత కచ్చితంగా ఉంటుందని ఎంపీ వినోద్ అన్నారు. ఎవరో గెలిస్తే సంబరాలు చేసుకుంటున్న పార్టీ కాంగ్రెస్ అని ఆయన ఎద్దేవా చేశారు.

ప్రజల ఆకాంక్షలే ముఖ్యం: తెరాస ఎంపీ జితేందర్ రెడ్డి

విభజన హామీలు, రిజర్వేషన్ల అంశంపై చర్చించాలి. మలిదశ బడ్జెట్ సమావేశాలు తొలిరోజు నుంచి మా ఆందోళన కొనసాగుతోంది. అయినా కేంద్రం మా నిరసనపై స్పందించడం లేదు. మేం కేంద్ర ఉద్యోగాలు, విద్యలో రిజర్వేషన్లు కోరడం లేదు. మా రాష్ట్రంలో జనాభా ప్రాతిపాదికన రిజర్వేషన్లు కల్పించుకునే హక్కు ఇవ్వమని కోరుతున్నాం. అయినా కేంద్రం రిజర్వేషన్ల అంశాన్ని తన ఆధీనంలో పెట్టుకోవడం సరికాదు. మా ఎజెండా మాది. మా పోరాటం మాది. ఇంకొకరిని ఫాలో అవ్వాల్సిన అవసరం లేదు. ఆ పార్టీలకు అవిశ్వాసం పెట్టాలన్న ఆలోచన ఇవాళ వచ్చింది. మేం మొదటి రోజు నుంచి పోరాడుతున్నాం. అవిశ్వాస తీర్మానం సమయంలో మేం ఎలా ఉండాలనే విషయం మీరు కాదు డిసైడ్ చేసేది. అవిశ్వాస తీర్మానంపై చర్చకు వస్తే మేం చర్చలో పాల్గొంటాం. రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజల ఆకాంక్ష లే మాకు ముఖ్యం.

టీడీపీ టీఆర్ఎస్‌కి పోటీయే కాదు: ఎంపీ వినోద్

ఉభయ సభల్లో రాజీనామా చేసిన మంత్రులు తెలంగాణ ఏర్పాటే తప్పన్నట్లుగా, విభజన అశాస్త్రీయం, తొందరపాటు అని మాట్లాడారు. మేం వారి మాటల్ని ఖండిస్తున్నాం. ఆందోళనపై కేంద్రం స్పష్టత ఇచ్చే వరకు మా ఆందోళన కొనసాగిస్తాం. కేంద్రం అనేక హామీలను ఇచ్చినా, వాటి అమలుపై మాత్రం స్పందించడం లేదు. మాకు కచ్చితమైన హామీ వచ్చే వరకు పోరాటం కొనసాగిస్తాం. మా రిజర్వేషన్ల చట్టాన్ని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో పొందు పరచాలని మొదటి రోజు నుంచి డిమాండ్ చేస్తున్నాం. అవిశ్వాస తీర్మానం చర్చకొస్తే విభజన చట్టంలో పొందుపర్చిన అంశాలపై మేం కూడా చర్చలో పాల్గొంటాం. మా అభిప్రాయాలు చెబుతాం. ఏపీ హక్కుల కోసం మాట్లాడితే మేం పూర్తిగా మద్ధతిస్తాం. కాంగ్రెస్ గురించి మాట్లాడడం వేస్ట్. యూపీలో రెండు చోట్ల డిపాజిట్లు పోగొట్టుకున్న పార్టీ. ఎవరో గెలిస్తే సంబరాలు చేసుకుంటున్న పార్టీ కాంగ్రెస్. సభ లోపల వెల్‌లోకి వెళ్లి నిరసన కొనసాగిస్తాం. మా నిరసన ఎవరికీ అడ్డు కాదు. నిరసన మధ్యనే స్పీకర్ చాలా బిల్లులు పాస్ చేసింది. టీడీపీటీఆర్ఎస్‌కి పోటీయే కాదు. మా రాష్ట్రంలో వాళ్లు లేరు. వాళ్ల రాష్ట్రంలో మేం లేము.

గిచ్చి కయ్యం పెట్టుకోవడం ఎందుకు: ఎంపీ సీతారాం

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వాలన్నది మా డిమాండ్. పనికి ఆహార పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయమని అడిగాం. మంచి విషయాల్లో మేం కేంద్రానికి సహకరించాం. మాకు కావాల్సినవాటిపై ఒంటికాలిపై నిలిచి పోరాడాం.

ఇది బ్లాక్ డే

- పార్లమెంటు చరిత్రలో చీకటి దినం
- కేంద్రం తీరుపై టీడీపీ ఎంపీలు గరం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: అవిశ్వాస తీర్మానంపై చర్చ జరపకుండా పార్లమెంట్ ఉభయ సభలను వాయిదా వేయడంపై టీడీపీ తీవ్రస్థాయిలో మండిపడింది. తమ డిమాండ్ల సాధనకు పార్లమెంట్ ఆవరణలో నిరసన తెలిపిన ఎంపీలు అనంతరం మీడియాతో తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను చూసి ప్రజాస్వామ్యానికి కొత్త నిర్వచనం ఇవ్వాల్సి వస్తోందని ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి దుయ్యబట్టారు. బీజేపీ తప్పుడు వాగ్దానాలు చేసిందని అర్థమవుతోందని, ప్రజలు అంతా గమనిస్తున్నారని మరో పార్లమెంట్ సభ్యులు రవీంద్ర బాబు అన్నారు. కేంద్రం తీరుకు నిరసనగా స్పీకర్ సుమిత్రా మహాజన్ ఇస్తున్న విందును వారి బహిష్కరించారు. తమ రాష్ట్రానికి న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగిస్తునే ఉంటామని చెప్పుకొచ్చారు.

ముక్కు మూసుకుని ఉండాలి తప్ప చేసేదేముంది: జేసీ దివాకర్ రెడ్డి

స్పీకర్ నిర్ణయం చాలా బాధ కలిగించింది. మేం 10 శాతం సభ్యుల సంతకాలు తీసుకుని అందజేసినా కూడా అవిశ్వాస తీర్మానం స్వీకరించకపోవడం బాధాకరం. సంతకాలతో తీర్మానం ఇస్తే కచ్చితంగా స్వీకరిస్తారు. బీఏసీ కూర్చుని ఎవరికి ఎంత సమయం ఇవ్వాలన్న ప్రయత్నం జరుగుతుంది. ఇంత అప్రజాస్వామికంగా నడుస్తుంటే ఎవరేం చేయాలి. బడ్జెట్ విషయంలో ఆయెస్, ఆయెస్ అన్న స్పీకర్, ఇక్కడ అనడానికి ఏమైంది. సంతకాలు పెట్టిన 53 మంది నిజమా కాదా వెరిఫై చేసుకోవాల్సింది. సోనియా గాంధీ, ఖర్గే స్వయంగా లేచి నిలబడి అడిగారు. కానీ మా స్పీకర్ కి మాత్రం ఏదీ కనిపించడం లేదు. మేం అవిశ్వాస తీర్మానం పెట్టినంత మాత్రాన మోడీ గద్దె దిగుతారని మేం అనుకోవడం లేదు. కానీ మా ఆవేదన చెప్పుకోడానికి అడుగుతున్నాం. తెలంగాణకు వ్యతిరేకమంటే ఈ రాష్ట్రం చీలిపోవడం చాలా బాధాకరం. దురద ష్టకరం. కానీ అది గత చరిత్ర. దాని గురించి బాధపడడం లేదు. కానీ ఇప్పుడు మా రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని చెప్పుకోడానికి ఇదొక వేదిక అనుకున్నాం. ఇప్పుడు డిక్టేటోరియల్ విధానంలో జరుగుతోంది. ప్రజాస్వామ్యానికి కొత్త నిర్వచనం ఇవ్వాల్సి వస్తోంది. ఈ పద్ధతిని చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారు. అవిశ్వాస తీర్మానాన్ని తీసుకోవాల్సిన బాధ్యత ఉంది. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. రాజకీయ కారణాలా.. చంద్రబాబు నాయుడు వ్యూహాలా అన్నది ఇక్కడ సంబంధం లేని విషయం. 53 మంది సంతకాలు ఉన్నప్పుడు అవిశ్వాస తీర్మానం తీసుకోవాలా వద్దా అన్నదే సమస్య.



పార్లమెంట్ సాక్షిగా మరోసారి మోసం చేసిన కేంద్రం: అవంతి శ్రీనివాస్

మళ్ళీ నోటీస్ ఇస్తున్నాం. చర్చకు అనుమతి ఇచ్చేవరకు ఇస్తూనే ఉంటాం. బీజేపీ చర్చకు భయపడి పారిపోతున్నారు. బీజేపీ ఆందోళన చేస్తున్న వారిని కంట్రోల్ ఎందుకు చేయలేకపోతున్నారు.?

ఇదంతా పెద్ద మ్యాచ్ ఫిక్సింగ్: తోట నరసింహం

ఈ రోజు కూడా సభలో అవిశ్వాస తీర్మానం పై చర్చ జరగలేదు. ఆందోళనల కారణంగా అవిశ్వాసాన్ని తిరస్కరించారు. రాజ్ నాథ్ సింగ్ ప్రకటన చేశారు చర్చకు సిద్ధంగా ఉన్నామని. కానీ చర్చ జరిగే పరిస్థితి లేదనే ఈ ప్రకటన చేశారు. కేంద్రం కావాలనే ఈ విధంగా చేస్తోంది. పెద్ద మ్యాచ్ ఫిక్సింగ్‌లా కనిపిస్తోంది. న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తూనే ఉంటాం. ఏపీ ప్రజలకు జరిగిన అన్యాయం, ఆవేదనను తెలియజేయడానికి స్పీకర్ ఇచ్చే విందును బహిష్కరించాము.

వాడి పెంచిన వైసీపీ

విందును బహిష్కరించి నిరసన

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: మూడో వారమూ వైఎస్సార్‌సీపీ తమ ఆందోళన విరమించలేదు. పార్లమెంట్ ప్రాంగణంలో నిరసన తెలిపిన ఆ పార్టీ ఎంపీలు లోక్ సభ వాయిదా పడగానే మరోసారి స్పీకర్ కార్యాలయానికి అవిశ్వాస తీర్మానం లేఖను ఇచ్చారు. ప్రత్యేక హోదా కోసమే సుమిత్రా మహాజన్ ఇచ్చే విందుకు హాజరు కావడం లేదు తప్ప ఆమె మీద వ్యతిరేకం కాదని వారు స్పష్టం చేశారు. ఇది తమ ఆందోళనలో భాగమని అన్నారు. మరోవైపు ఢిల్లీ వచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకురాలు లక్ష్మీ పార్వతి చంద్రబాబు పని అయిపోయిందంటూ జోస్యం చెప్పారు.



బాబు ఇప్పుడు యూటర్న్ ఎందుకు తీసుకున్నారు?... వరప్రసాద్

అవకాశం ఉన్నంత వరకు అవిశ్వాస తీర్మానం పెడుతూనే ఉంటాం. ఏదో ఒక నెపం చూపి లోక్ సభ వాయిదా వేస్తే బీజేపీ తప్పు అవుతుంది, వైఎస్సార్‌సీపీ తప్పు కాదు. బీజేపీకి ధైర్యం ఉంటే చర్చ కు అవకాశం ఇవ్వాలి. ప్రతి రోజు చర్చ కు వస్తుందని ఎంపీలంతా ఎదురు చూస్తున్నాం. వైఎస్సార్‌సీపీ మొదటి నుంచి ప్రత్యేక హోదా కోసం అడుగుతూనే ఉంది. హోదా లేకపోవడం వల్ల రాష్ట్రం ఏ విధంగా నష్టపోయిందో చర్చ కు వస్తే వారికి వివరిస్తాం. పద్ధతి ప్రకారం ఎన్ని రోజులు వరకు అవిశ్వాస తీర్మానం పెట్టాలో అన్ని రోజులు పెడతాం. చంద్రబాబు రోజుకో మాట మాట్లాడడం సబబు కాదు. మూడేళ్లు ప్యాకేజీ అడిగి హోదాని హేళన చేశారు. ఇప్పుడు యూటర్న్ ఎందుకు తీసుకున్నారు? మొదట వైఎస్సార్‌సీపీ అవిశ్వాస తీర్మానానికి మద్దతు తెలిపిన బాబు సొంతంగా అవిశ్వాస తీర్మానానికి ఎందుకు వెళ్లారో అర్థం కావడం లేదు.? ఇప్పుడే ఎంపీలంతా రాజీనామాలు చేస్తే అవిశ్వాస మీద పోరాడలేము. టీఆరెస్ నేతల్లారా వెన్నుపోటు పొడవకండి.

అనుకున్నదే జరిగింది: మేకపాటి

ఎన్డీఏ ప్రభుత్వం అనుకుంటేనే అవిశ్వాసం చర్చకు వచ్చే అవకాశం ఉంది. సభ సజావుగా లేదనుకుంటే ఆందోళన చేస్తున్న వారిని సస్పెండ్ చేసి చేపట్టవచ్చు కానీ అంత సాహసం చేస్తారని అనుకోలేదు. అలాగే జరిగింది. ఇప్పుడు చంద్రబాబు అంతా వారికే మద్దతు ఇస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. మొదటి నుంచి ప్రత్యేక హోదా కోసం పోరాడుతున్నది వైసీపీనే. చంద్రబాబు ఇప్పుడు వచ్చి ప్లకార్డు పట్టుకున్నారు. రేపు పరిస్థితి ఎలా ఉంటుందో తెలీదు.. ఎవరికో ఒకరికి స్పష్టమైన ఆధిక్యం వస్తుందని అనుకోను. ఏపీలో గెలిచిన ఎంపీల అవసరం ఢిల్లీలో వస్తుంది. ఏపీ ప్రజలు వైకాపా ఎంపీలను గెలిపిస్తే అప్పుడు ప్రత్యేక హోదా నినాదంతో ముందుకు వెళతాం. చంద్రబాబు ఎన్నో మాటలు మార్చారు. వారిని నమ్మొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా. సభలో స్పీకర్ ఎంత కోరినా సభ్యులు ఆందోళన విరమించలేదు. ప్రత్యేక హోదా కోసం స్పీకర్ విందుకు హాజరు కావడం లేదు. అంతే కానీ ఆమె మీద వ్యతిరేకం కాదు కేవలం మా ఆందోళనలో భాగమే.

చిత్తశుద్ధి ఉంటే అవిశ్వాసం పెట్టాలి: వైవీ సుబ్బారెడ్డి

గెలుస్తామని అవిశ్వాసం పెట్టలేదు. మన సమస్య దేశవ్యాప్తంగా తెలియాలని పెట్టాం. చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే మా కంటే ముందే అవిశ్వాసం పెట్టాలి కదా. అవిశ్వాసానికి ఎంత మంది మద్దతు ఇస్తారో లెక్క వేసుకుంటామని సభ్యులను అడిగినా ఆందోళన విరమించలేదు. అందుకే సభ వాయిదా పడింది. వాళ్ళ రాష్ట్రాల సమస్యల కోసం కొంతమంది ఆందోళన చేస్తున్నారు వారిని కాదనలేం. ఆందోళన చేస్తున్న వారిని కలిసి సహకరించాలని కోరుతున్నాం. మా అవిశ్వాసానికి మద్దతిచ్చేందుకు కాంగ్రెస్, వామపక్ష ఎంపీలు లేచి నిలబడ్డారు. హోదా వద్దని చంద్రబాబు ప్యాకేజీ తీసుకున్న మళ్ళీ యూ టర్న్ ఎందుకు తీసుకున్నారో ఆయన్నే అడగాలి. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎవరితోనైనా కలిసి వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నామని మొదటి నుంచి చెబుతున్నాం. ఎన్నికల గురించి ఆలోచించట్లేదు. రాష్ట్ర ప్రయోజనాల కోసం మాత్రమే పోరాటం చేస్తున్నారు.

నాకు చంద్రబాబు అనుమతి అవసరం లేదు: విజయసాయిరెడ్డి

నేను ఎవరినైనా కలవాలంటే చంద్రబాబు అనుమతి అవసరం లేదు. ఎవరిని కలిసినా ప్రజల సమస్యలను చర్చించడానికే మా ప్రాధాన్యత. చంద్రబాబు సీఎంగా ఉండటం వల్ల రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలుగుతోంది. 29 సార్లు వచ్చి మోదీని కలిశా అని సీఎం చెబుతున్నారు. కానీ నేను 3 సార్లే కలిసి ఉంటారు. ప్రజా సమస్యలపై, రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి పై కూడా చర్చించా. హవాలా ద్వారా చంద్రబాబు డబ్బులను విదేశాలకు తరలిస్తున్న విషయాన్ని కేంద్రానికి తెలియజేశాం. చిత్తశుద్ధితో వైకాపా అవిశ్వాసం చర్చకు రావాలని కోరుకుంటోంది.

ఇక చంద్రబాబు పని అయిపోయింది: లక్ష్మీపార్వతి

చంద్రబాబు నన్ను బలహీన పరిస్తే రాష్ట్రం బలహీన పడుతుంది అంటున్నాడు. నీకు నువ్వే బాలహీనడువి అయ్యావు. దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ని అవినీతి రాష్ట్రంగా చేసి దగాకోరు రాజకీయాలతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశావు. మోడీ ఎన్డీయే ప్రభుత్వం అబద్దాలు చెప్పి హోదా ఇవ్వకుండా ఏపీకి అన్యాయం చేస్తుంటే చంద్రబాబు అసమర్థ ప్రభుత్వం ఎదుర్కోలేకపోయింది. ప్రత్యేక హోదాపై రోజుకో మాట మారుస్తూ అన్యాయం చేసింది చంద్రబాబు. ఇందులో భాగమే ఈ అవిశ్వాస తీర్మానం. ప్రత్యేక హోదా రావడం బాబుకి ఇష్టం లేనట్లుంది. ప్రత్యేక హోదాపై ఒకే స్టాండ్ మీద వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్ మాత్రమే ఉన్నారు. రాష్ట్రం కోసం కలిసి పని చేద్దామని ఆహ్వానించినా చంద్రబాబు మాతో అవిశ్వాసానికి మద్దతు ఇవ్వకుండా తీర్మానాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవంతో రాష్ట్రానికి ఏం తెచ్చి పెట్టావు.

కేజ్రీ మళ్లీ సారీ..!



- కేంద్ర మంత్రి గడ్కరీ, అమిత్ సిబల్‌కు క్షమాపణ
- పరువునష్టం దావాల నుంచి గట్టెక్కేందుకు యత్నం
- కేజ్రీపై 33 పరువునష్టం దావాలు

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ క్షమాపణ పర్వం కొనసాగుతోంది.33 పరువునష్టం కేసులు ఎదుర్కొంటున్న కేజ్రీ సారీలు చెబుతూ ఒక్కో కేసు నుంచి ఉపశమనం పొందుతున్నారు. మొన్న అకాలీదళ్ నాయకుడు బిక్రం మజిథియాకు బహిరంగంగా క్షమాపణ చెప్పిన కేజ్రీ..తాజా కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ,కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కపిల్ సిబల్ కుమారుడు అమిత్ సిబల్ కు సారీ చెప్పారు. డ్రగ్స్ వ్యాపారంలో మజీతియా ఉన్నారంటూ తన వ్యాఖ్యలతో పెను దుమారం లేపిన కేజ్రీవాల్... ఆయన వేసిన పరువునష్టం దావా నుంచి బయటపడేందుకు సారీ అని బహిరంగానే చెప్పేశారు. ఇక కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పెద్ద అవినీతి పరుడు అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసి ఇరకాటంలో పడిన కేజ్రీవాల్.. ఆకేసు నుంచి గట్టెక్కేందుకు సారీ మంత్రాన్ని జపించారు. వ్యక్తిగతంగా మీతో నాకు ఎలాంటి విరోధం లేదు.. గతంలో మీపై చేసిన అవినీతి ఆరోపణలకు విచారం వ్యక్తం చేస్తున్నాను.. కేసును కోర్టులో ముగించేద్దాం.. అని గడ్కరీకి లేఖ రాశారు. ఆ లేఖపై గడ్కరీ తరఫు న్యాయవాది పింకీ ఆనంద్ స్పందిస్తూ.. దేశ ప్రయోజనాల దృష్ట్యా కేసును ముగించేయండని కేజ్రీ అన్నారు. కానీ పరువునష్టం దావా చాలా తీవ్రమైనది. కేజ్రీవాల్ భవిష్యత్‌లోనైనా ఇలాంటి ఎదుర్కోకుండా జాగ్రత్తగా ఉంటే మంచిదన్నారు.ఇక తన కుమారుడికి కేజ్రీ రాసిన లేఖపై కపిల్ సిబల్ స్పందిస్తూ.. మేం ఎవరితో వైరం కోరుకోవడం లేదు.

కేజ్రీ క్షమాపణను అంగీకరిస్తున్నాం. అని అన్నారు. కేంద్రఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ కూడా కేజ్రీవాల్ పై పరువునష్టం దావా వేశారు. ఢిల్లీ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జైట్లీ ఉన్న కాలంలో అవినీతికి పాల్పడ్డారని కేజ్రీవాల్ ఆరోపించారు. ఈ కేసులో కేజ్రీ తరఫున వాదించిన కపిల్ సిబల్ కూడా ఆయన ద్వంద్వ వైఖరితో వెనక్కి తగ్గారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి రూ. 1767 కోట్లు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: స్వచ్ఛ భారత్ మిషన్ కింద వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం కోసం గడిచిన మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్‌కు రూ. 1767 కోట్ల రూపాయల నిధులను విడుదల చేసినట్టు కేంద్ర పారిశుద్ధ్య శాఖా సహాయ మంత్రి రమేష్ చందప్ప సోమవారం రాజ్యసభకు తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యులు విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు జవాబిస్తూ ఏపీలో ఇంకా 5,94, 702 ఇళ్లకు మరుగుదొడ్డి సౌకర్యం లేదని వివరించారు. అంటే రాష్ట్రంలో ఇంకా 8.37 శాతం ఇళ్లకు మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉందని చెప్పారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద చేపట్టే వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు సమకూర్చాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. 2015-16 నుంచి 2017-18 ఆర్థిక సంవత్సరం వరకు ఈ వార్షిక ప్రణాళికల అమలు కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాదాపు రూ.4470 కోట్ల రూపాయల నిధుల మంజూరు కోసం అభ్యర్థించగా, ఈ ఏడాది మార్చి 15 నాటికి మూడేళ్లలో తమ మంత్రిత్వ శాఖకు అందుబాటులో ఉన్న నిధుల నుంచి రూ.1767 కోట్ల రూపాయల నిధులను మరుగుదొడ్ల నిర్మాణం కోసం విడుదల చేసినట్లు, ఏ ఏడాది ఎన్ని నిధులు విడుదల చేసిందీ రమేష్ చందప్ప గణాంకాలతో సహా వెల్లడించారు.

కేంద్ర పరిశీలనలో ఐఎన్ఎస్ విరాట్‌పై డీపీఆర్

భారత నౌకాదళ సేవల నుంచి విశ్రమించిన యుద్ధ విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విరాట్‌ను హోటల్ కమ్ కన్వెన్షన్ సెంటర్‌గా రూపుదిద్దాలన్న ప్రతిపా దనతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంపిన డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) ప్రస్తు తం తమ పరిశీలనలో ఉన్టు రక్షణ శాఖ సహాయ మంత్రి డాక్టర్ సుభాష్ భామ్రే వెల్లడించారు.

క్రీడాప్రభ

ఫెదరర్‌కు డెల్ షాక్



ఇండియన్ వెల్స్: ఎట్టకేలకు ఫెదరర్ దూకుడుకు బ్రేక్ పడింది. సీజన్‌లో వరసగా 18వ విజయంతో పాటూ ఇండియన్ వెల్స్‌ను 6వ సారి నెగ్గాలన్న స్విస్ స్టార్ కల చెదిరింది.వరుస విజయాలతో దూసుకుపోతున్న ఫెదరర్‌కు ఇండియన్ వెల్స్ ఫైనల్‌లో డెల్‌పోట్రో 6-4,6-7(8-10)చ 7-6తో కళ్లెం వేశాడు. అయితే డెల్‌పోట్రోకి విజయం ఆషామాషీగా దక్కలేదు. మూడు ఛాంపియన్‌షిప్‌లను కాపాడుకుని మరీ పోరాడాల్సివచ్చింది. మూడో సెట్‌లో 4-5 వద్ద వెనకబడిన దశలో... మూడు సెట్ పాయంట్లను కాచుకోవడమే గాక.. టైబ్రేక్‌లో టైటిల్ కైవసం చేసుకున్నాడు. అంతకుముందు రెండో సెట్ టైబ్రేక్‌లో ఫెదరర్‌కు పెద్దగా పోటీ ఇవ్వలేకపోయిన డెల్.. ఆఖరి సెట్ టైబ్రేక్‌లో సీన్ రివర్స్ చేశాడు. తొలి సెట్‌లో అద్భుతంగా ఆడుతూ కనీసం ఫెదరర్‌కు బ్రేక్ పాయింట్ అవకాశాన్ని కూడా ఇవ్వని అర్జెంటీనా స్టార్.. రెండో సెట్ నుంచీ కాస్త గాడి తప్పాడు. ప్రేక్షకుల నుంచీ వచ్చిన మద్దతుతో ఫెదరర్ రెచ్చిపోయిన మ్యాచ్‌ను మూడో సెట్‌కు తీసుకెళ్లగలిగాడు.

బెరెన్‌డార్ఫ్ స్థానంలో మెక్ క్లెనాగన్

ముంబై: ముంబై ఇండియన్స్ జట్టులో చిన్న మార్పు చేసుకుంది. గాయం కారణంగా అందుబాటులో వుండబోని బెరెన్‌డార్ఫ్ స్థానంలో న్యూజీలాండ్ బౌలర్ మెక్‌క్లెనాగన్‌ను జట్టులోకి తీసుకుంది. ఐపీఎల్ నిబంధనల ప్రకారం వేలంలో అమ్ముడుపోకుండా అందుబాటులో వున్న ఆటగాళ్లను అందుబాటులో లేని ఆటగాళ్ల స్థానంలో తీసుకోవచ్చు. మెక్ బేస్ ప్రైస్ కోటిరూపాయలు చెల్లించి ముంబై జట్టు అతన్ని తిరిగి జట్టులోకి ఆహ్వానించింది. మెక్ ఇదివరకే ముంబై ఇండియన్స్ జట్టుకు ప్రాతినిథ్యం వహించిన సంగతి విదితమే.

కార్పొరేట్ క్రీడ



ఈ రోజు ప్రభుత్వాలు క్రీడాకారులకు అకాడెమీలు స్థాపించుకోవడానికి స్థలాలు ఇస్తున్నాయి. మంచిదే. కానీ ఆ అకాడెమీల్లో ఎవరికి కోచింగ్ దక్కుతుంది అనేది విషయం. ప్రజల సొమ్ముతో ఒక స్టార్ ఆటగాడు అకాడెమీ మొదలు పెడుతున్నాడు. అందులో కోచింగ్ దక్కుతున్నది ఎగువ తరగతికి వారికి మాత్రమే. అకాడెమీలు కనీసం మధ్యతరగతి వారికి అందుబాటులో కూడా లేకుండా పోయాయి అనేది ఆందోళన కలిగించే విషయం. మరి బడుగు, బలహీన వర్గాల పరిస్థితి ఏంటి అనేదానికి సమాధానం లేదు

ముప్పై ఏళ్ల కిందటి విషయం. తల్లిదండ్రుల్లో తమ పిల్లల్ని బాగా చదివించాలనే ఆశ. ఎంత ఖర్చైనా పర్వాలేదు మంచి చదువులు చెప్పించాలి. చదివితే పిల్లలు బాగుపడతారు అనే ఆలోచన వుండేది. ఆ ఆలోచనా విధానమే ఈరోజు దేశంలో అక్షరాస్యత పెరిగేందుకు దోహదపడింది. దాంతో పాటే ఎంత ఖర్చైనా వెనకాడకుండా పిల్లలకు మంచి చదువులు అందించాలనే ఆరాటం కార్పొరేట్ విద్యకు ప్రాణం పోసింది.

ముప్పయ్యేళ్ల తర్వాత అలాంటి పరిస్థితులే క్రీడల్లో కనిపిస్తున్నాయి. నిన్న చదువుకున్న వాళ్లు చదువొక్కటే పరమార్థం కాదు అని అర్థం చేసుకున్నారు. ఆ కావాల్సిన చాలా వాటిల్లో ముఖ్యమైనవి ఆటలు అనితెలుసుకున్నారు. పిల్లల్ని ఆడించడం అంటే ఒకప్పటి లాగా ఇంటిముందో, వెనకో ఆడించడం కాదు, ఒక ప్రొఫెషనల్ స్థాయిలో ఆడించాలి అనుకుంటున్నారు. ఎంత ఖర్చైనా పెట్టి మంచి క్రీడాకారుడిని తయారు చేయాలనుకుంటున్నారు. ఆరోజు పెద్దలు చదువును రుద్దితే ఈరోజు పెద్దలు క్రీడల్ని రుద్దుతున్నారు. ఒక మెడల్ సాధిస్తే వస్తే వచ్చే పేరు ప్రఖ్యాతుల మీదే వారి దృష్టంతా వుంది. దానికోసం ఎంత ఖర్చైనా ఒకే అంటున్నారు. ఇదే ఆలోచన క్రీడల్ని కార్పొరేటీకరణ చేసేందుకు అవకాశం కల్పిస్తోంది.

అన్నిటికీ మించి ప్రభుత్వ విధానాలు అందుకు మరింత దోహదపడుతున్నాయి. ఈ రోజు ప్రభుత్వాలు క్రీడాకారులకు అకాడెమీలు స్థాపించుకోడానికి స్థలాలు ఇస్తున్నాయి. మంచిదే. కానీ ఆ అకాడెమీల్లో ఎవరికి కోచింగ్ దక్కుతోంది అనేది విషయం. ప్రజల సొమ్ముతో ఒక స్టార్ ఆటగాడు అకాడెమీ మొదలు పెడుతున్నాడు. అందులో కోచింగ్ దక్కుతున్నది ఎగువతరగతి వారికి మాత్రమే. అకాడెమీలు కనీసం మధ్యతరగతి వారికి అందుబాటులో కూడా లేకుండా పోయాయి అనేది ఆందోళన కలిగించే విషయం. మరి బడుగు, బలహీన వర్గాల పరిస్థితి ఏంటి అనేదానికి సమాధానం లేదు.

క్రీడాకారులే వ్యాపారవేత్తలు

డబ్బులున్న వాళ్లకు మాత్రమే అన్నట్టు అకాడెమీలు తయారయినాయి. ఏ రకంగా అయితే టాప్ ర్యాంకులు చూపించి పుట్టగొడుగుల్లా కార్పొరేట్ స్కూళ్లు వెలిసినాయో, అదే విధంగా ఈరోజు సైనా, సానియా, సింధులను చూపించి అకాడెమీలు వస్తున్నాయి. విచిత్రమేమంటే ఆ అకాడెమీలకు ఈ సింధు, సైనాలాంటి వారే అధిపతులు. నిన్నటి ఆటగాళ్లు నేటి వ్యాపారవేత్తలు అవుతున్నారు. వారి బ్రాండ్, గత విజయాలను చూపించి ఖరీదైన స్థలాలను ప్రభుత్వం నుంచీ పొందుతూ వాటితో క్రీడాభివృద్ధి చేస్తున్నారు. కాకపోతే ఆ క్రీడాభివృద్ధి అన్ని రకాల అభివృద్ధిలాగే పేదవారికి దూరంగా వుంటోంది.

ఒక మారుమూల ప్రాంతం నుంచి వచ్చిన నిరుపేద కుటుంబీకుడు ఈ అకాడెమీల్లో కోచింగ్ తీసుకోగలుగుతున్నాడా? ప్రభుత్వం ప్రజల సొమ్మును ఖర్చుపెట్టి అకాడెమీలను ప్రోత్సహిస్తోన్నది క్రీడల అభివృద్ధి కోసమా, లేక డబ్బులున్న వాళ్ల పిల్లలకు మెడల్స్ తెప్పించేందుకా?. ఎవరికైతే పెద్ద పెద్ద అకాడెమీల్లో చేరే స్తోమత వుందో వారికే అత్యున్నత కోచింగ్ అందుతోంది. వారికే పతకాలూ వస్తున్నాయి. వారికే మళ్లీ అకాడెమీలు స్థాపించేందుకు స్థలాలు దక్కుతున్నాయి. ప్రజల సొమ్ము కోట్లకు కోట్లూ దక్కుతున్నాయి. వీటికి తోడు అవార్డులు, ప్రభుత్వ ఉద్యోగాలు. ఇదో ఛట్రం. ఈ ఛట్రంలో సామాన్యులకు చోటేదీ?

ప్రభుత్వాలు అకాడెమీలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రోత్సాహకాలు మాత్రమే ఇచ్చి వదిలేయడం కాకుండా వాటిని అందరికీ అందుబాటులో వుండేలా చర్యలు తీసుకోవాలి.

అకాడెమీ కూడా ఓ స్కూలే కదా?

ఇప్పుడు ఒక కార్పొరేట్ స్కూల్ వుంది. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం 25 శాతం సీట్లను బడుగు బలహీన వర్గాలకు కేటాయించాలి. ఇక్కడ కార్పొరేట్ స్కూల్‌కు ప్రభుత్వం స్థలం ఇవ్వడం లేదు, ఆర్థిక సాయం అసలే చేయట్లేదు. ఎవరో ఒక ప్రైవేటు వ్యక్తి తన డబ్బులతో, తన స్థలంలో.. లేదా లీజుకు తీసుకున్న స్థలంలో స్కూల్ నడుపుకుంటుంటే అందులో బడుగు, బలహీన వర్గాలకి చోటుండాలని సుప్రీంకోర్టు తీర్పు చెబుతోంది. మరి ప్రభుత్వం ఇచ్చిన భూముల్లో ఏర్పాటు చేసిన అకాడెమీల్లో బడుగు, బలహీన వర్గాలకు చోటుందా? ఉండకపోతే అది న్యాయమేనా? ఈ ప్రశ్నకు సమాధానం వెతుక్కోవడం పక్కనపెడితే... కనీసం ప్రశ్న అడిగే స్థితిలో సమాజం లేకపోవడం దురదృష్టకరం.

ఆఖరి బంతి మ్యాజిక్కులు

దినేశ్ కార్తీక్ బంగ్లాదేశ్‌తో ఆఖరి బంతికి విజయాన్ని అందించాడు. ఈ సందర్భంగా చరిత్రలో ఫైనల్ బాల్ సిక్స్‌తో విజయాన్ని అందించిన మ్యాచ్‌లు ఒక్కసారి పరిశీలిద్దాం.



లాన్స్ క్లూసెనర్ (సౌతాఫ్రికా-న్యూజీలాండ్)- నేపియర్, 1999

పర్యాటక జట్టు సౌతాఫ్రికా విజయానికి మిగిలిన ఓవర్‌లో 11 పరుగులు కావాలి. చేతిలో మూడు వికెట్లు వున్నాయి. రెండో బంతికే మార్క్ బౌచర్ ఔటయ్యాడు. ఒక్క బంతికి ఫోర్ కావాలి. నాన్ స్ట్రైక్ ఎండ్ నుంచీ స్ట్రైకింగ్‌లోకి వచ్చాడు ఆల్‌రౌండర్ క్లూసెనర్. డయాన్ నాష్ బంతి వేయడం లాంగ్ ఆన్ మీదుగా క్లూసెనర్ బంతిని సిక్స్ బాదడం, అదే ఏడాది జరిగబోయే ప్రపంచకప్పులో పాల్గొనే జట్లకు ఓ వార్నింగ్ ఇవ్వడం అలా జరిగిపోయాయి. 99 ప్రపంచకప్‌లో క్లూసెనర్ మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా ఎంపికవ్వడం విశేషం.

బ్రెండన్ టేలర్ (జింబాబ్వే-బంగ్లాదేశ్) - హరారే, 2006

కార్తీక్ కంటే ముందు మరో ఆటగాడు బంగ్లాదేశ్‌కు ఆఖరి బంతి సిక్స్ ఎంతటి నొప్పి కలిగిస్తుందో రుచి చూపించాడు. అతడే జింబాబ్వే గ్రేట్ బ్రెండన్ టేలర్. 6 బంతులకు 17 పరుగులు కావాలి. రెండో బంతిని టేలర్ సిక్స్‌గా మలిచాడు. ఐదో బంతికి టేలర్ పార్ట్‌నర్ ముపారివా రనౌట్ అవ్వడంతో ఇంకో ఐదు పరుగులు చేయాల్సి వచ్చింది. సేమ్ ట్రైసిరీస్ ఫైనల్ లాగానే. అయితే కార్తీక్ కవర్ డ్రైవ్ ఎంచుకుంటే టేలర్ మిడ్ వికెట్ ఎంచుకున్నాడు. రిజల్ట్ మాత్రం అదే. సిక్స్.

చందర్‌పాల్ (వెస్టిండీస్ - శ్రీలంక) - ట్రినిడాడ్, 2008



మిగతా మ్యాచులతో పోలిస్తే ఈ మ్యాచ్ భిన్నం. ఎందుకంటే ఇక్కడ స్ట్రైకింగ్‌లో వున్నది లెజెండరీ టెస్టు క్రికెటర్ చందర్‌పాల్. బంతేమో మరో ఛాంపియన్ చమిందా వాస్ చేతిలో వుంది. ఓవర్ మొదలయ్యేటప్పటికి వెస్టిండీస్ 9 వికెట్లు కోల్పోయి వుంది. వెస్టిండీస్‌కేమో రెండు బంతుల్లో 10 పరుగులు కావాలి. దాదాపు అసాధ్యంలాంటి పరిస్థితి. ఆ సమయంలో చందర్‌పాల్ తన క్లాస్ చూపించాడు. 5వ బంతిని మిడ్ ఆఫ్ మీదుగా బౌండరీ వైపు పరుగులు పెట్టించాడు. అయినా ఆట అయిపోలేదు. ఇంకో బంతికి 6 పరుగులు కావాలి. అప్పటికి ఎవరికీ నమ్మకం లేదు. మరోసారి పాల్ అసాధ్యాన్ని సుసాధ్యం చేశాడు. వాస్ వేసిన ఫుల్ టాస్ బంతిని మిడ్ వికెట్ మీదుగా బౌండరీ ఆవలకు చేర్చాడు. ఒత్తిడి ఎంతటి అనుభవజ్ఞుడి చేతనైనా తప్పులు చేయిస్తుందని వాస్ మరోసారి నిరూపించాడు.

ర్యాన్ మెక్‌లారెన్ (సౌతాఫ్రికా-న్యూజీలాండ్) పోచెఫ్ స్ట్రూమ్, 2013


ఆతిథ్య దక్షిణాఫ్రికా జట్టు మూడు వన్డేల సిరీస్‌లో అప్పటికే 2-0తో కోల్పోయింది. ఇక మిగిలింది వైట్‌వాష్ కాకుండా పరువు నిలుపుకోవడమే. అది కూడా కుదిరేలా లేదు. చేతిలో రెండే వికెట్లు. కావాల్సిందేమో 6 బంతుల్లో 8 పరుగులు. స్టెయిన్ మూడు బంతులు వృథా చేసి మరో బంతికి ఔట్ అవ్వడంతో.. చివరి బంతికి మెక్‌లారెన్‌కు స్ట్రైక్ దక్కేటప్పటికి ఇంకో మూడు పరుగులు వెనకబడివుందా జట్టు. అప్పటికే సిరీస్ న్యూజీలాండ్ గెలవడంతో.. పోయేదేమీ లేదన్నట్టు ఫ్రాంక్లిన్ షార్ట్‌పిచ్ బంతి వేశాడు. అదే అదనుగా లారెన్ లెగ్ సైడ్ పుల్ చేశాడు. దక్షిణాఫ్రికాకు ఓదార్పు విజయాన్ని అందించాడు.

ఆ ఒక్కటీ మినహాయింపు

ఆసిఫ్ ముజ్‌తబా (పాకిస్తాన్-ఆస్ట్రేలియా) - హోబర్ట్, 1992

అన్ని సిక్స్‌లూ ఒక ఎత్తు ఈ ఒక్కటీ మరో ఎత్తు. ఎందుకంటే ఆసిఫ్ ముజ్‌తబా ఆఖరి బంతికి సిక్స్ కొట్టాడు. కానీ విజయం దక్కలేదు. పోనీ ప్రత్యర్థి జట్టైనా గెలిచిందా అంటే అదీ లేదు. మ్యాచ్ టైగా ముగిసింది. కాకపోతే ఆస్ట్రేలియాకు ఓటమిలాంటి టై. పాకిస్తాన్‌కు గెలుపుకంటే ఎక్కువ. 6 బంతుల్లో 17 పరుగులు చేయాలి. పాకిస్తాన్‌కు ఏరకమైన ఆశలూ లేవు. డెత్ ఓవర్లలో పరుగులు నియంత్రించగల బౌలర్‌గా పేరు తెచ్చుకున్న స్టీవ్‌వా చేతిలో బంతి వుంది. కాకపోతే స్టీవ్‌వా పప్పులేమీ పాకిస్తానీ మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ ఆసిఫ్ ముందు పనిచేయలేదు. ఫైనల్ బాల్ సిక్స్‌తో ఆస్ట్రేలియా ఓడిపోలేదు కానీ ఓడిపోయినంత పనైంది.

జావేద్ మియాందాద్ (పాకిస్తాన్-ఇండియా) షార్జా, 1986



ఆస్ట్రలేసియా కప్ ఫైనల్‌లో చిరకాల ప్రత్యర్థులు పాకిస్తాన్, ఇండియాలు తలబడ్డాయి. 246 పరుగులను చేజింగ్ చేసే క్రమంలో పాకిస్తాన్ అప్పటికే 9 వికెట్లు కోల్పోయింది. చివరి బంతికి 4 పరుగులు కావాలి. జావేద్ మియాందాద్ క్రీజులో వున్నాడు. పాకిస్తాన్ గెలవలేదన్న ధీమాతో స్పిన్నర్ చేతన్ శర్మ అలా సరదాగా వచ్చి ఫుల్‌టాస్ బాల్ వేశాడు. అంతే లడ్డూ లాంటి బాల్ దొరకిన ఆనందంలో మియాందాద్ స్క్వేర్ లెగ్ మీదుగా సిక్స్ బాదాడు. ఆ సిక్స్‌తో భారత అభిమానుల గుండెలు బద్దలయ్యాయి. ఎంతగా అంటే దశాబ్దం కాలం పాటూ ఇండియా, పాకిస్తాన్ మ్యాచ్ అంటే ఆ సిక్స్ గురించి మాట్లాడుకునేంతగా.

కార్తీక్ అలక

కొలంబో : బంగ్లాదేశ్‌తో జరిగిన ట్రైసిరీస్ ఫైనల్‌లో ఆరవస్థానంలో పంపించనందుకు దినేశ్ కార్తీక్ అలకవహించాడని కెప్టెన్ రోహిత్ శర్మ పేర్కొన్నాడు. 14వ ఓవర్‌లో రోహిత్ శర్మ ఔట్ అయిన తర్వాత తన బదులుగా ఆల్‌రౌండర్ విజయ్ శంకర్‌ను పంపించడంపై కార్తీక్ నొచ్చుకున్నట్టు రోహిత్ తెలిపాడు. చివర్లో మ్యాచ్ గెలిపించిన తర్వాత అతని సంతోషంగా వుండివుంటాడని రోహిత్ అభిప్రాయపడ్డాడు. కార్తీక్ ఏమో గానీ భారత అభిమానులు మాత్రం శంకర్‌ను ముందు పంపించడంతో చాలా నొచ్చుకున్నారు. ముఖ్యంగా 18వ ఓవర్‌లో వరుసగా నాలుగు బంతుల్ని వృథా చేయడంతో మ్యాచ్ చేజారినంతపనైంది.

అదే ఓవర్ ఆఖరి బంతికి పాండే ఔట్ అవ్వడం ద్వారా క్రీజులోకి వచ్చిన కార్తీక్.. ఎట్టి పరిస్థితుల్లోనూ గెలిపించాలనే పట్టుదలతో కనిపించాడే కానీ.. గెలిపించగలడని సగటు అభిమాని ఊహించలేదు.

ఏడ్చినా లాభం లేదు

● షకిబుల్ హసన్

కొలంబో: ఓటమిలో వున్నపుడే జనుల మాటల్లో వేదాంతం దొర్లుతుంది. బంగ్లాదేశ్ షకిబుల్ మాటలు ఆ విషయాన్నే ధృవీకరిస్తున్నాయి. ట్రైసిరీస్ ఫైనల్‌లో ఓడిన తర్వాత ఏడ్చి లాభం లేదని వాపోతున్నాడు షకిబుల్. భావోద్వేగాలు వున్నా చేసేదేమీ లేదుకదా, కాలాన్నెతే వెనక్కి తిప్పలేంగా అని ఎదురు ప్రశ్నిస్తున్నాడు. భారత్‌ను గెలిపించిన దినేశ్ కార్తీక్ బ్యాటింగ్ గురించి మాట్లాడుతూ.. అలాంటి ఇన్నింగ్స్‌లో చరిత్రలో ఎప్పుడో కానీ రాదన్నాడు. అయితే కార్తీక్ ఇన్నింగ్స్‌లో అత్యధిక పరుగులు సమర్పించుకున్న రూబెల్ హుసేన్‌కు మరోసారి బంతి ఇచ్చేదుకు వెనకాడనని షకిబ్ పేర్కొన్నాడు. రూబెల్ ప్లాన్ ప్రకారమే బంతులు వేశాడనీ.. ఆ సమయంలో ఏ కొద్దిమందో మాత్రమే వరుస బంతుల్లో ఫోర్, సిక్స్ మళ్లీ ఫోర్ బాదగలరనీ చెప్పాడు. 19వ ఓవర్‌లో రూబెల్ మొత్తం 22 పరుగులు సమర్పించుకున్న సంగతి తెలిసిందే.

ఇక గత ఐదు మ్యాచుల నుంచీ భారత్‌తో మ్యాచులు హోరాహోరీగా జరుగుతున్న విషయాన్ని గుర్తుచేసుకున్నాడు. ఏసియా కప్‌లో కూడా బంగ్లా ఓడిందనీ.. లంకలో విజయానికి మరీ దగ్గరగా వచ్చి ఓడిందనీ.. అంటే జట్టుగా బంగ్లా మెరుగవుతోందనీ.. భవిష్యత్తులో ఫలితాన్ని మారుస్తామనీ ఆశాభావం వ్యక్తం చేశాడు.



మమ్మల్ని క్షమించండి : రూబెల్ హుసేన్



విజయానికి ఇంత దగ్గరగా వచ్చి ఓడిపోతామని కలలో కూడా ఊహించలేదు. అందరినీ క్షమాపణ కోరుతున్నా. మమ్మల్ని క్షమించండి ప్లీజ్..

ట్విట్టర్‌లో రూబెల్

ఆటగాళ్లు రోబోట్‌లు కాదు: బ్రెట్‌లీ



కొలంబో: మైదానంలో ఆటగాళ్ల దురుసు ప్రవర్తనపై కఠిన చర్యలపై ప్రముఖ మాజీ పేస్ బౌలర్ బ్రెట్‌లీ అసహనం వ్యక్తం చేశాడు. మ్యాచ్ జరుగుతున్న సందర్భంలో నోరు కట్టేసుకుని వుండడానికి ఆటగాళ్లేం రోబోట్‌లు కాదని వ్యాఖ్యానించాడు. రబాడాపై రెండు మ్యాచుల నిషేధంపై స్పందించిన లీ.. ఆటగాళ్లు మ్యాచ్ జరుగుతున్న సందర్భంలో ఒకరి మొహాలు ఒకరు చూసుకోకూడదు అనేంత కఠినంగా నిబంధనలు వుంటే ఎలా అని ప్రశ్నించాడు. జాతి వివక్షలాంటి వాటిని అరికట్టేందుకు నిబంధలుండాలే గానీ ప్రతిచిన్న విషయానికీ ఆటగాళ్లకు ఫైన్లు, నిషేధాలు సరైన విధానం కాదనే అభిప్రాయం వ్యక్తం చేశాడు. ఇక రబాడా రెండు మ్యాచుల నిషేధం మీద అప్పీలుపై నిర్ణణం వెలువడేందుకు మరింత సమయం పట్టనుంది. సౌతాఫ్రికా జట్టు మాత్రం తమ యువ పేస్ బౌలర్ మూడో టెస్టులో ఆడాలని ఆశిస్తోంది.

జింబాబ్వేపై వెస్టిండీస్ గెలుపు

హరారే: ప్రపంచకప్ క్వాలిఫయింగ్ పోటీల్లో జింబాబ్వేపై వెస్టిండీస్ నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో 2019 ప్రపంచకప్‌కు క్వాలిఫై అయ్యేందుకు అవకాశాలు మరింత మెరుగయ్యాయి. స్కాట్లాండ్‌తో జరగనున్న తర్వాతి మ్యాచ్‌లో ఓడిపోని పక్షంలో వెస్టిండీస్ ప్రపంచ కప్‌లో ఆడేందుకు అర్హత సాధిస్తుంది.

290 పరుగుల లక్ష్యాన్ని మరో ఆరు పరుగులు ఉండగానే విండీస్ జట్టు ఛేదించింది. సామ్యూల్స్(86), హోప్(76), లూయిస్(64)లు అర్థసెంచరీలు సాధించారు. జింబాబ్వే తరఫున ఆ జట్టు కెప్టెన్ బ్రెండన్ టేలర్(138) సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఓడినప్పటికీ జింబాబ్వేకు కూడా క్వాలిఫై అయ్యేందుకు అవకాశాలు మిగిలేవున్నాయి.

షమీకి డబ్బులివ్వలేదే..

న్యూఢిల్లీ: భారత పేస్ బౌలర్‌కు, తనకూ మధ్య ఎలాంటి లావాదేవీలు చోటుచేసుకోలేదని పాకిస్తానీ మహిళ అలీష్‌బా తెలిపింది. అయితే షమిని దుబాయ్‌లో కలుసుకున్నది నిజమేనని అలీష్‌బా అంగీకరించింది. అయితే అది అనుకోకుండా జరిగిందని చెప్పడం విశేషం. భారత్‌ను పాకిస్తాన్ ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ నుంచి షమితో పరిచయం వుందని చెప్పింది. షమి దుబాయ్‌లో పాకిస్తానీ మహిళను కలుసుకున్నట్టు, ఆ మహిళ నుంచీ డబ్బులు తీసుకున్నట్టు.. అది ఫిక్సింగ్ కోసమే అయివుండొచ్చని అతని భార్య హసీన్ ఆరోపిస్తూ వస్తోంది. ఆరోపణలపై స్పందించిన అలీష్‌బా.. తను కేవలం షమి అభిమానిని మాత్రమే అని, ఆ అభిమానుల్లాగే తాను కూడా మెసేజ్‌లు చేసినట్టు పేర్కొంది.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

గత ఏడాది ఏప్రిల్‌లో ఆకస్మాత్తుగా ఇండియన్ యూజర్లు తమ ఫోన్ నుంచి స్నాప్ డీల్ యాప్‌ను తొలగించి నిరసన తెలిపారు. అమెజాన్ ఫ్లిప్ కార్ట్‌లతో పోటీ ఎదుర్కోలేక అమ్మకానికి సిద్ధంగా ఉన్న స్నాప్‌డీల్‌కు ఈ పరిస్థితి మరింత కష్టాలని తెచ్చిపెట్టింది. ఇంతకీ జరిగిందేంటని ఆరా తీయగా తెలిసింది ఏమిటంటే .. “మేము ఆవిష్కరించిన చాటింగ్ యాప్ భారతదేశం లాంటి పేద దేశం ప్రజలకోసం కాదు” అని స్నాప్ చాట్ అనే యాప్ వ్యవస్థాపకులు పేలిన ప్రేలాపనలు. ఇంతకీ అతను ఏమన్నాడో... అసలు ఇలా అన్నాడో లేదో... ఎందుచేత అన్నాడో కూడా తెలుసుకోకుండా, కోపంతో ఉన్న మన వాళ్లు స్నాప్‌చాట్‌కు బదులు స్నాప్ డీల్ యాప్‌ను తొలగించి యాప్ స్టోర్/గూగుల్ ప్లేలో రేటింగ్ కూడా డౌన్ గ్రేడ్ చేశారు. తప్పు తెలుసుకొన్నాక నాలిక కొరుక్కొన్నారో, లెంపలేసుకొన్నారో ఊహకు వదిలేసి అసలు విషయంలోకి వద్దాం...!



చాట్... భలే స్మార్ట్!

యూత్‌ను ఆకట్టుకుంటున్న స్నాప్‌చాట్ | సెల్ఫ్ డిస్ట్రక్ట్ ఫీచర్‌తో బహుళ ప్రజాదరణ

ప్రతి సామాజిక నెట్‌వర్క్ ఒక ముఖ్యమైన ఉద్దేశ్యంతో ప్రారంభమవుతుంది. ఒక సొంత బాణీ మరియు ప్రత్యేకత సంతరించుకుంటుంది. స్నాప్ చాట్ అనే యాప్ ఫోటోలు, వీడియోలు, టెక్ట్స్ మరియు డ్రాయింగ్‌లను పంచుకోవడానికి ఉపయోగించే మొబైల్ మెసేజింగ్ యాప్. ఇది ఉచితంగా యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. స్నాప్ చాట్ చాలా స్వల్ప కాలంలో యూత్ మూలంగా చాలా ప్రాచుర్యం పొందింది. స్నాప్ చాట్‌లోని ఒక ఫీచర్ కారణంగా ఇతర చాటింగ్, టెక్స్టింగ్ మరియు ఫోటో షేరింగ్ సామాజిక మాధ్యమాలకు భిన్నంగా ఉండేటట్లు చేసింది. స్నాప్ చాట్‌లో పెట్టిన సందేశాలు కొన్ని సెకన్ల తరువాత గ్రహీత ఫోన్ నుండి అదృశ్యమవుతాయి. దీనినే సెల్ఫ్ డిస్ట్రక్ట్ అంటారు. స్నాప్ చాట్‌ను ఉపయోగించడానికి చాలా సులభం మరియు మన మెసేజ్‌లు అవతల వ్యక్తి ఫోన్లో నుంచి డిలీట్ అయిపోయే విధంగా ఉండడం వలన కుర్రకారు స్నాప్ చాట్‌ని అక్కున చేర్చుకున్నారు.

రిజిష్టర్ చేసుకోవాలి

స్నాప్ చాట్ యాప్‌ని స్టోర్ లేదా గూగుల్ ప్లే నుంచి డౌన్లోడ్ చేసి ఒక యూజర్ నేమ్, ఈ మెయిల్, మొబైల్ నంబర్ ఇచ్చి రిజిస్టర్ చేసుకోవాలి. ఒకసారి ఎంచుకున్న యూజర్ ఐడి మార్చడానికి వీలులేదు. అకౌంట్ క్రియేట్ అయ్యాక.. ఫోన్‌లో ఉన్న నెంబర్లు, మెయిల్ ఐడీలలో ఎవరైన అప్పటికే స్నాప్ చాట్‌లో ఉంటే మీరు స్నాప్ చాట్‌లోకి వచ్చినట్టు వాళ్ళకు సంకేతం అందుతుంది. ఇతర సామాజిక మాధ్యమాల మాదిరిగా స్నాప్ చాట్‌లో టైమ్ లైన్, న్యూస్ ఫీడ్, హోమ్ పేజీ ఉండవు. స్నాప్ చాట్ వ్యవహారమంతా కెమెరా స్క్రీన్ నుంచి నడిపిస్తుంది. మీరు మీ కెమెరా స్క్రీన్ ఉపయోగించి చిత్రాన్ని, వీడియోని, మీ స్నాప్ చాట్ కాంటాక్ట్‌లో ఎవరికి పంపాలో ఎంచుకుని, వారు ఆ సందేశాన్ని ఎన్ని సెకన్లు వరకు చూడగలరో నిర్ణయించి (మ్యాగ్జిమమ్ టైం లిమిట్ 10 సెకన్లు)సెండ్ బటన్ క్లిక్ చేయడమే. మీరు పెట్టిన గడువు అయ్యాక గ్రహీత ఫోన్లోని స్నాప్ చాట్ నుంచి సందేశం అదృశ్యమవుతుంది పంపిన వారి వివరాలు మరియు సమయం మాత్రమే వారు చూడగలరు. స్నాప్ చాట్ యూజర్లు వారి ఫోన్లో కాంటాక్ట్ జాబితాల నుండి స్నేహితులను యాడ్ చేయవచ్చు. అంతే కాకుండా ఫోన్ లొకేషన్ ఆధారంగా యూజర్లకు వారి సమీపంలోని ఉన్న వారిని కూడా ఫ్రెండ్‌గా యాడ్ చేయవచ్చు. ముఖ్యంగా యూజర్లు ఏదైనా ఫంక్షన్‌కో, కాన్ఫరెన్స్ కో, రైలు ప్రయాణంలో ఉన్నప్పుడో తోటి స్నాప్ చాట్ యూజర్లను గుర్తించి యాడ్ చేసుకుని సులభంగా కనెక్ట్ అయ్యేందుకు వీలుంది. తద్వారా వారితో స్నేహ బంధం పెంచుకోవచ్చు. ఇక స్నాప్‌చాట్‌లోని కొన్ని ఫీచర్ల గురించి చూద్దాం.

డూడుల్ ...!

స్నాప్ చాట్ ఇంతలా జనాదరణ పొందడానికి దోహదపడిన మరొక అంశం ‘డూడుల్’. ఈ టూల్ ఉపయోగించి యూజర్లు సులువుగా చిత్రాలు గీయవచ్చు, ఫోటోల పైన డ్రా చేసుకోవచ్చు మరియు వాటిని పంపించడానికి ముందు ఫోటోలకు సందేశం జోడించవచ్చు. ఈ ఫీచర్ సామాజిక మాధ్యమాలలో సృజనాత్మకంగా మెసేజ్‌లను పెట్టే యూత్‌ను బాగా ఆకర్షించింది, అందుకే విజయవంతమైంది.

వాయిస్ మరియు వీడియో కాల్స్:

స్నాప్ చాట్‌లో వాయిస్ మరియు వీడియో కాల్స్‌ను చేసుకోవచ్చు. మీరు స్నాప్ చాట్ వాయిస్ లేదా వీడియో కాల్‌లో ఉండగా, ఫోటోలను ఎడిట్ చేయవచ్చు, పంపవచ్చు. మెసెంజర్ ఫీచర్ ఉపయోగించి ఆడియో లేదా వీడియో నోట్స్/మెసేజ్ పంపవచ్చు. వీడియో నోట్స్ వ్యవధి 10 సెకండ్ల మాత్రమే.

సెక్యూరిటీ సెట్టింగ్స్

మీరు స్నాప్ చాట్ అకౌంట్‌ను సెటప్ చేసుకున్న తర్వాత, మీ యూజర్ పేరు లేదా ఫోన్ నంబర్ తెలిసిన ఎవరైనా మీకు సందేశాన్ని పంపగలరు. ఏదేమైనప్పటికీ, సెట్టింగ్స్ మెనూలో మీ ఫ్రెండ్స్ జాబితాలోని యూజర్ల సందేశాలను మాత్రమే అంగీకరించడానికి మీరు సెట్ చేయవచ్చు. దీనికోసం ఎవరు మీకు స్నాప్ చాట్ మెసేజ్ పంపగలరు అనే ఆప్షన్‌లోకి వెళ్ళి.. ఎవ్రీబడీకి బదులుగా మై ఫ్రెండ్స్‌ను ఎంచుకోవాలి. మీరు యూజర్‌ను ఫ్రెండ్స్ జాబితాలో యాడ్ చేయకపోయినా మీకు ఎవరైనా మెసేజ్ పంపితే ఆటోమేటిక్‌గా ఫ్రెండ్ జాబితాలోకొస్తారు. కాబట్టి ఎప్పటికప్పుడు మీకు తెలియనివారిని ఫ్రెండ్స్ జాబితా నుంచి తొలగించాలి.

అలాగే స్నాప్ చాట్‌లో కూడా యూజర్లను బ్లాక్ చేయొచ్చు. అసభ్యకరమైన పోస్ట్, అశ్లీలమైన ఫోటోలను ఫ్లాగ్/రిపోర్ట్ చేయొచ్చు.

స్నాప్:..! : మీ ఫ్రెండ్స్ జాబితాలో ఒకరికి లేదా ఎక్కువ మందికి స్నాప్ చాట్ ద్వారా పంపే ఫోటో లేదా వీడియోనే ‘స్నాప్’ అంటారు. వీడియో స్నాప్ గరిష్టంగా 10 సెకన్లు పొడవు ఉండొచ్చు. మీరు పంపిన మెసేజ్ లేదా స్నాప్ అందరు గ్రహీతలు వీక్షించిన తర్వాత మీ స్నాప్ చాట్ నుండి తొలగించబడతాయి. మీరు వాటిని మీ ‘స్టోరీస్’ లో జోడిస్తే అవి 24 గంటల తర్వాత డిలీట్ అయిపోతాయి. అన్ రెడ్ లేదా అన్ ఓపెన్డ్ స్నాప్స్ 30 రోజుల తర్వాత తొలగించబడతాయి.





స్టోరీస్: స్నాప్ చాట్ యొక్క మరొక ప్రముఖ ఫీచర్ స్నాప్ చాట్ స్టోరీస్. యూజర్లు వారి ఫోటోలను, వీడియోలను వారి స్నేహితులు వీక్షించడానికి స్టోరీస్‌లో యాడ్ చేయొచ్చు. సాధారణ పోస్టులు లేదా స్నాప్స్‌లా కాకుండా, స్నాప్ చాట్ స్టోరీస్ 24 గంటల పాటు ఉంటాయి. ఒకసారి కంటే ఎక్కువసార్లు చూడవచ్చు. టీనేజర్లు గడిచిన 24 గంటలలో తాము ఏమి చేశారో.. శని ఆదివారాల్లో ఎక్కడ తిరిగారో స్నేహితులందరితో పంచుకోవడానికి వీలు కల్పిస్తుంది స్టోరీస్ ఫీచర్. వారి స్టోరీ పబ్లిక్‌గా పంచుకునే అవకాశం కూడా ఉంది. ప్రముఖ సెలబ్రిటీల స్నాప్ చాట్ స్టోరీలను యూజర్లు అందరూ తిలకించవచ్చు.

స్నాప్ చాట్ లెన్స్:

టీనేజర్లకు బాగా నచ్చేది, అత్యంత ప్రజాదరణ పొందిన ఫీచర్లలో స్నాప్ చాట్ లెన్స్ ఒకటి. యూజర్లు దీనిని ద్వారా ప్రత్యేక సౌండ్ ఎఫెక్ట్ జోడించవచ్చు. వీడియోల్లో వారి వాయిస్‌ను మార్చడం, స్నేహితుల ముఖాలు తమ ప్రొఫైల్ ఫోటోలుగా మార్చుకోవడం, ఫోటో గ్యాలరీలో సెలబ్రిటీల ఫోటోలు సూపర్ ఇంపోస్ చేయడం లాంటి గమ్మత్తైనవి చేయొచ్చు.

స్నాప్ చాట్ మెమోరీస్:

స్నాప్ చాట్ యూజర్లు తమ ఫోన్లోని ఫోటో ఆల్బమ్‌ల నుండి ఫోటోలను అప్‌లోడ్ చేసి స్నాప్ చాట్‌లో సేవ్ చేసుకోవచ్చు. మెమోరీస్‌లో ఫోటోలను ‘ఫర్ మీ ఐస్ ఓన్లీ’ ఫోల్డర్‌కి తరలించడం ద్వారా వాటినిపై వాళ్లకు కనిపించకుండా చేయొచ్చు.

గ్రూప్ చాట్ : స్నాప్ చాట్ గ్రూపులు లేదా సమూహ చాట్‌కు యూజర్లను అనుమతిస్తుంది. గ్రూప్‌లో యూజర్ల పేరుపై క్లిక్ చేసి విడిగా కూడా చాట్ చేయొచ్చు. గ్రూప్ చాట్లో పంపిన సందేశాలు 24 గంటల తర్వాత తొలగించబడతాయి. ఒక గ్రూప్‌లో పంపిన సందేశం, స్నాప్‌లను ప్రతి గ్రహీత ఒక్కసారి మాత్రమే ఓపెన్ చేసేందుకు ఛాన్స్ ఉంటుంది.

స్నాప్ మ్యాప్: స్నాప్ చాట్ నుండి తాజా నవీకరణ ఈ ఫీచర్. ఇది లొకేషన్ షేరింగ్ ఫీచర్. స్నాప్ మ్యాప్‌ను ఉపయోగించి మన స్నాప్ చాట్ ఫ్రెండ్స్ ఎక్కడ ఉన్నారో తెలుసుకోవచ్చును. మీ ప్రస్తుత స్థానాన్ని కూడా వాళ్ళతో పంచుకోవచ్చు. స్నాప్ చాట్‌లో ఫ్రెండ్స్ ప్రపంచంలో ఎక్కడున్నా ఇట్టే వాళ్ళ లొకేషన్ తెలుసుకోవచ్చు. మీ జిగిరీ దోస్తు బుక్ ఫెయిర్ లో ఉంటే మీకు కావాల్సిన పుస్తకం తెప్పించుకోవచ్చు. మీ ఆఫీసు కొలీగ్ ఏదో టూర్ మీద మీ అత్తారి ఊరు వెళ్లినట్లు స్నాప్‌చాట్ మ్యాప్ తెలియచేస్తే ..మీ అత్తారింటికి దారి చెప్పి కొత్త ఆవకాయ కూడా తెప్పించుకోవచ్చన్న మాట!



- సునీల్ ధవళ
మాజీ వైస్ ప్రెసిడెంట్
నేషనల్ జియోగ్రాఫిక్ అండ్ ఫ్యాక్స్



ఏప్రిల్ లో ..హువావే పీ20లైట్ స్మార్ట్ ఫోన్

ప్రముఖ మొబైల్ ఫోన్ల తయారీ సంస్థ హువావే తన కొత్త స్మార్ట్ ఫోన్ హువావే పీ20లైట్‌ను ఏప్రిల్ మొదటి వారంలో భారత మార్కెట్లోకి విడుదల చేయనుంది. ప్రస్తుతం ఈ కొత్త స్మార్ట్ ఫోన్ పోలెండ్ మార్కెట్లో విడుదలైంది. దీని ధర 28,355 రూపాయలు. సరికొత్త ఫీచర్లతో విడుదలైన హువావే పీ20లైట్ స్మార్ట్ ఫోన్ చూసేందుకు కూడా ఆకర్షణీయంగా ఉంది. బ్లాక్, బ్లూ,రోజ్ గోల్డ్ రంగుల్లో లభించనుంది.

హువావే పీ20లైట్ స్మార్ట్ ఫోన్ ఫీచర్లు

-5.84అంగుళాల ఫుల్ వ్యూ డిస్ ప్లే
-1080×2280 పిక్సెల్ స్క్రీన్ రిజల్యూషన్
-ఆక్టాకోర్ కైరిన్ 659 ప్రాసెసర్
-4జీబీ ర్యామ్,
-64జీబీ ఇంటర్నల్ స్టోరేజీ
-16 మెగా పిక్సెల్ బ్యాక్ కెమెరా
-16మెగా పిక్సెల్ ఫ్రంట్ కెమెరా
-3000 ఎంఏ హెచ్ బ్యాటరీ
-145 గ్రాముల బరువు
-ఆండ్రాయిడ్ 8.0 ఓరియో

యాసర్ షిఫ్ట్5 ల్యాప్‌టాప్ రూ.. 79,999

హార్డ్ వేర్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీ సంస్థ యాసర్ ..తన షిఫ్ట్ సీరీస్‌లో కొత్త ల్యాప్‌టాప్‌ను విడుదల చేసింది. షిఫ్ట్ 5 పేరుతో విడుదలైన ఈ ల్యాప్ టాప్ ధర 79,999 రూపాయలు. యూజర్లు ల్యాప్‌టాప్‌ను తమ వెంట తీసుకెళ్లడానికి వీలుగా తక్కువ బరువు ఉండేలా షిఫ్ట్ 5ను రూపొందించారు.



ప్రస్తుతం ఇది యాసర్ ఎక్స్‌క్లూజివ్ స్టోర్స్, ఇతర రిటైల్ స్టోర్స్‌లలో అందుబాటులో ఉంది.

షిఫ్ట్5 ఫీచర్లు

- 970 గ్రాముల బరువు,
-14.9 మిల్లీమీటర్ల మందం
-14 అంగుళాల హెచ్‌డీ డిస్‌ప్లే
-8 గంటల బ్యాటరీ బ్యాకప్
-8GB DDR4 RAM, 512 GB SDD స్టోరేజ్ సౌకర్యం
-డాల్బీ ఆడియో ప్రీమియం టెక్నాలజీ

టెలి కమ్యూనికేషన్ రంగంలో పోటీ తత్వం పెరిగిపోయింది. ఈ పోటీ మూలంగా యూజర్లకు మేలే జరుగుతుంది. జియో దెబ్బకు నెట్వర్కింగ్ సంస్థలు పోటీ పడి కస్టమర్లను ఆకర్షించేందుకు

వొడాఫోన్ ఇంటర్‌నెట్ ప్యాకేజ్ ఆఫర్

కొత్త కొత్త రీచార్జ్ ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. ఈ క్రమంలోనే వొడాఫోన్ అన్‌లిమిట్ ఇంటర్ నెట్ ప్యాకేజీ ఆఫర్‌ను ప్రకటించింది. 21 రూపాయలతో రీచార్జ్ చేసుకుంటే ..ఒక గంటసేపు అన్ లిమిటెడ్ త్రీజీ లేదా 4జీ డాటాను వినియోగించుకోవచ్చు. ఈ కొత్త ఆఫర్ ..ఇంటర్ నెట్‌ను ఎక్కువగా వినియోగించే వారిని ఆకట్టుకునే ఛాన్స్ ఉంది. అయితే గంట అనేది ఒక్కరోజులోనే వాడుకోవాలి. మరుసటి రోజుకు కావాలంటే మళ్లీ 21 రూపాయలతో రీచార్జ్ చేసుకోవాల్సిందే. అంటే.. కొత్త ప్యాకేజీ ప్రకారం ..21 రూపాయలతో రీచార్జ్ చేసుకుంటే.. ఒక్కరోజులో ఒక గంటసేపు అన్‌లిమిటెడ్ డాటాను వినియోగించుకోచ్చు. గతంలో జియో ప్రకటించిన వన్‌డే ప్రీపెయిడ్ ప్రకారం 19 రూపాయలతో రీచార్జ్ చేయించుకుంటే..150 ఎంబీ 4జీడాటాను మాత్రమే వినియోగించుకునే ఛాన్స్ ఉంది. కాకపోతే జియో 19 రూపాయల ప్యాకేజీ కింద రీచార్జ్ చేయించుకుంటే.... ఆ రోజంతా అన్ లిమిటెడ్ కాల్స్ సౌకర్యంతో పాటు..20ఎస్ఎంఎస్‌లు వాడుకోవచ్చు.



వీవో వి9 స్మార్ట్ ఫోన్ వచ్చేస్తోంది!

చైనాకు చెందిన స్మార్ట్ ఫోన్ తయారీ సంస్థ వీవో మరో సరికొత్త ఫోన్‌ను భారత మార్కెట్లోకి విడుదల చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. వీవో వి-9 పేరుతో ఈ కొత్త స్మార్ట్ ఫోన్ ఈనెల 26న మార్కెట్లోకి రానుంది. ఇక కలర్ విషయానికి వస్తే.. పియర్ల్ బ్లాక్, గోల్డ్ కలర్‌లో లభించనుంది.



వీవో వి-9 ఫీచర్లు

-6.3 అంగుళాల నాచ్ స్క్రీన్
-క్వాల్‌కమ్ స్నాప్డ్రాగన్ 626 ప్రాసెసర్
-4జీబీ ర్యాం,
-64జీబీ ఇంటర్నల్ స్టోరేజీ సౌకర్యం
-24 మెగా పిక్సెల్ ఫ్రంట్ కెమెరా
-16/5 మెగాపిక్సెల్ బ్యాక్ కెమెరా
-కేవలం 150 గ్రాముల బరువు
-3,260 ఎంఏహెచ్ బ్యాటరీ

శాంసంగ్ గెలాక్సీ ఎస్9 ప్లస్ ఫోన్‌లపై జియో 70శాతం బై బ్యాక్ ఆఫర్

గతవారం భారత మార్కెట్లోకి శాంసంగ్ విడుదల చేసిన గెలాక్సీ ఎస్9 ప్లస్ ..256 జీబీ వేరియంట్ స్మార్ట్ ఫోన్‌లపై జియో 70 శాతం బై బ్యాక్ ఆఫర్‌ను అందిస్తోంది. ప్రస్తుతం గెలాక్సీ ఎస్9 ప్లస్... స్మార్ట్ ఫోన్లు రిలయన్స్ డిజిటల్, శాంసంగ్ ఆన్ లైన్ షాపింగ్, జియో స్టోర్లలో లభిస్తున్నాయి. బై బ్యాక్ ఆఫర్ పొందాలనుకునే వారు.. ఈ ఫోన్‌ను కొనుగోలు చేసిన తర్వాత జియో సిమ్ వేసుకోవాలి. అలాగే జియో అందిస్తున్న ఏదో ఒక ప్లాన్‌లో 12నెలల కాలంలో మొత్తం 2500 రూపాయలు విలువైన లేదా ఆపైన రీచార్జ్‌చేసుకోవాలి. అలా చేస్తే ఆటోమేటిక్‌గా వినియోగదారులు జియో 70శాతం బై బ్యాక్ ఆఫర్‌కు అర్హులు అవుతారు. ఈ ఆఫర్ పరిధిలోకి వచ్చిన వినియోగదారులు 12 నెలల తర్వాత గెలాక్సీ ఎస్9 ప్లస్ స్మార్ట్ ఫోన్‌ను అమ్మాలి అనుకుంటే..ఎంఆర్‌పీ ధరలో 70శాతానికి అమ్ముకోవచ్చు. అదే విధంగా రిలయన్స్ డిజిటల్ స్టోర్‌లలో గెలాక్సీ ఎస్9 ప్లస్ ..256 జీబీ వేరియంట్ స్మార్ట్ ఫోన్‌లపై 6000 రూపాయల క్యాష్ బ్యాక్‌ను ఆఫర్ చేస్తోంది.



అధర్మపక్షంలోని మహాయోధుడు



అశ్వత్థామ

మహాభారతంలో ఎందరో విశిష్ట వ్యక్తులు ఉన్నారు. ఒక్కొక్కరు ఒక్కో ప్రత్యేకత కలవారు. అయితే వారిలో అందరి దృష్టిని ఆకర్షించినా జనసామాన్యంలో అంతగా వివరాలు తెలియని యోధుడు అశ్వత్థామ. అశ్వత్థామ పాండవ, కౌరవుల గురువైన ద్రోణాచార్యుని పుత్రుడు. ద్రోణాచార్యునికి, కృపికి జన్మించినవాడు. పుట్టగానే అశ్వత్థామ గుర్రం మాదిరి సకలించాడు. గుర్రం మాదిరి సకిలించినందున అశ్వత్థామ అని అతనికి పేరు పెట్టారు. అతను చిరంజీవి. పుట్టుకతోనే అతను ఫాలభాగంలో ఒక మణితో పుట్టాడు. అది అతనికి ఆకలిదప్పుల నుంచి, ఆయుధాల నుంచి గాయాల నుంచి రక్షణనిచ్చేది.

ఆ రోజుల్లో విలువిద్యలో మేటి అయిన తన తండ్రి వద్దే అశ్వత్థామ విలువిద్య నేర్చుకున్నాడు. ద్రోణుడు ఆ సమయంలో పరశురాముని వద్ద కొంత విలువిద్య నేర్చుకుంటున్నాడు. అది పూర్తవగానే మిగతా విలువిద్యను ఆయన కౌరవ, పాండవులతో బాటు అశ్వత్థామకు కూడా నేర్పాడు. ద్రోణుడు తన కుమారునికి ప్రత్యేక పాఠాలు నేర్పాలని భావించేవాడు. అయితే తన పక్షపాతాన్ని బయటకు కనబడనివ్వకుండా శిష్యులనందరినీ నదికి వెళ్లి నీరు తెమ్మనేవాడు. ముందుగా వచ్చిన వారికి కొత్త మెలకువలు నేర్పుతాననేవాడు. ఆయన అశ్వత్థామకు వెడల్పు మూతి గల కుండను ఇచ్చి మిగతా వారికి సన్నమూత గల కుండలు ఇచ్చేవాడు. తద్వారా అశ్వత్థామ ముందుగా నీరు నింపి తెచ్చి కొత్త మెలకువలు నేర్చుకునేవాడు. ద్రోణుడు చేసిన చర్య తెలిసిన అర్జునుడు వారుణాస్త్రంతో తన కుండను నింపి అశ్వత్థామతో సమానంగా ఆ సమయానికి నీరు తెచ్చి విలువిద్యలో మెలకువలు నేర్చుకునేవాడు.

అశ్వత్థామ యుద్ధంలోనూ ప్రముఖ పాత్ర వహించాడు. అతను చిరంజీవి అవడం వల్ల యుద్ధంలో మరణించలేదు. యుద్ధంలో ఒకసారి అతను నారాయణాస్త్ర ప్రయోగం చేశాడు. దానితో పలు రకాల దివ్యాయుధాలు పాండవ సేనను చుట్టుముట్టాయి. అప్పుడు శ్రీకృష్ణ పరమాత్మ ఆదేశం మేరకు పాండవ సైన్యం, రథాలు దిగి, ఆయుధాలు పడవేసి నమస్కారం చేస్తూ నిలుచున్నారు. అటువంటి వారిని నారాయణాస్త్రం ఏమీ చేయదనే రహస్యం తెలిసినందున మహాభయంకరమైన ఆగ్నేయాస్త్రం నుంచి పాండవ సేనను కృష్ణుడు కాపాడాడు.

అశ్వత్థామ యుద్ధం చివరలో తన తండ్రిని చంపిన పాండవ సేనాని ధ్రుష్టద్యుమ్నుడిని, ఉప పాండవులను వారి శిబిరంలో రాత్రి వేళ ప్రవేశించి చంపాడు. ఆ తర్వాత పాండవ వంశం లేకుండా నిర్మూలించేందుకు అపాండవం అగు గాక అని మంత్రించి బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని ప్రయోగించాడు. దానిని అర్జునుడు అదే అస్త్రంతో ఎదుర్కొన్నాడు. రెండు మహాస్త్రాలు ఒకదానిని ఒకటి ఎదుర్కొనడంతో వినాశకరమని భావించి వ్యాసుడు, నారదుడు వంటివారు ఆ ఆయుధాలను ఉపసంహరించుకోమని అశ్వత్థామ, అర్జునులను కోరారు. అర్జునుడు ఉపసంహరించాడు. అయితే అశ్వత్థామకు ఉపసంహారం తెలియదు. ఆ మంత్రాన్ని అతను ఉపదేశం పొందలేదు. దానితో దానిని పాండవ వంశాంకురం అయిన ఉత్తర గర్భం దిశగా మరల్చమన్నాడు కృష్ణుడు. దాని ప్రభావం వల్ల పరీక్షిత్తు మరణించడం, అతనిని కృష్ణుడు బతికించడం తెలిసిందే. ఈ సందర్భంగా కృష్ణుడు అశ్వత్థామ క్రౌర్యాన్ని చూసి అతనిని మూడు వేల సంవత్సరాలపాటు అనామకుడిగా, వ్యాధులు బాధలతో దేశదిమ్మరివి కమ్మని శపించాడు. వ్యాసుల వారు కూడా కృష్ణుని శాపాన్ని బలపరిచారు. దానితో అహం అణిగిన అశ్వత్థామ తన శక్తికి కారణమైన తన శిఖలోని మణిని పాండవులకిచ్చి తపస్సుకై వ్యాసుల వారి వెంట అడవులకు వెళ్ళాడు.

అశ్వత్థామ ప్రస్తావన మరో చోట కూడా వస్తుంది. ఒక సమయంలో పరీక్షిత్తు కుమారుడు జనమేజయుడు వ్యాసుల వారితో 'మీ అంతటి శక్తివంతులు ఉండి కూడా భారత యుద్ధాన్ని ఎందుకు ఆపలేదని అడిగినపుడు ఆయన సమాధానమిస్తూ, విధి బలీయమని. దానిని ఎవరూ ఆపలేరని చెబుతారు. ఆ సందర్భంగా అతనికి విధి ఎంత బలీయమో కొన్ని దృష్టాంతాల ద్వారా తెలియపరుస్తాడు. ఆ సందర్భంగా అశ్వత్థామ శరీరం అర్జునుని బాణాలకు తూట్లు పడి జల్లెడ మాదిరి మారిందని, అయినా చిరంజీవి కనుక ఆయన జీవించే ఉన్నాడని చెబుతారు. దానిని జనమేజయుడు నమ్మక రుజువు చూపమంటాడు. అప్పుడు వ్యాసుడు జనమేజయుని తన మంత్ర శక్తితో హిమాలయాలకు తీసుకువెళ్లి అక్కడ ఒకానొక ప్రాంతంలో జల్లెడ మాదిరి తూట్లు పడిన శరీరంతో తపస్సు చేసుకుంటున్న అశ్వత్థామను చూపాడు. అక్కడ సూర్యుని వైపు తిరిగి ఉన్న అశ్వత్థామ శరీరంలోని రంధ్రాలలో ఒక వైపు నుంచి మరో వైపునకు సూర్యకిరణాలు పడుతుండటాన్ని జనమేజయుడు చూశాడు.

వ్యాపారాభివృద్ధి మంత్రం

ధర్మం-మర్మం

వ్యాపారాభివృద్ధికి, ఇంటర్వ్యూలలో సఫలం కావడానికి పఠించవలసిన మంత్రము

ఓం వషట్కారాయ నమః

మంత్ర జప విధానము

ప్రాతఃకాలమునే లేచి స్నానాదులు ముగించుకుని పరిశుద్ధమైన వస్త్రాలు ధరించి నుదుటన తిలకాన్ని దిద్దుకుని పూజామందిరంలో దీపారాధన చేసి తమ నిత్యకృత్యములైన సంధ్యా వందనాది కార్యక్రమాలను ముగించుకుని నిశ్చలమైన, పరిశుద్ధమైన మనస్సుతో తమ శక్తికి అనుగుణంగా మంత్రాన్ని జపించాలి.




- డా॥ కందాడై రామానుజాచార్య

చింతన

వరద దత్త క్షేత్రం వార్షికోత్సవం


22న వరంగల్ కు శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ



అవధూత దత్త పీఠాధిపతి జగద్గురు పరమపూజ్య శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ ఈ నెల 22వ తేదిన వరంగల్ మహానగరానికి విచ్చేస్తున్నట్లు వరంగల్ ఆశ్రమ ట్రస్టు వర్గాలు తెలి పాయి. స్వామీజీ రాక సందర్భంగా ఓరుగల్లు నగరం స్వాగత తోరణాలతో ముస్తాబయింది. తెలంగాణ రాష్ట్రంలోనే ఏకైక దేవాలయమైన శ్రీ అనఘ మహాలక్ష్మీ ఆలయం, శ్రీ గణపతి సచ్చిదానంద వరద దత్త క్షేత్రం నిత్యం భక్తులతో కిటకిట లాడుతూ విరాజిల్లుతోంది. శ్రీ వరద దత్త క్షేత్రం ఏర్పాటై 12 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా వరంగల్ ఆశ్రమ ట్రస్టు శాఖ వారు ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఈ నెల 22న పరమపూజ్య శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ పాల్గొనున్నారు. వార్షికోత్సవ కార్యక్రమంలో భాగంగా ఈనెల 22న మధ్యాహ్నం 12 గంటలకు స్వామీజీ వరంగల్‌కు చేరుకుంటారు. స్వామీజీ రాక సందర్భంగా 22వ తేది గురువారం ఉదయం వరద దత్త క్షేత్రం వార్షికోత్సవానికి అనుగుణంగా లోక కల్యాణార్థం విశేష హోమాన్ని నిర్వహిస్తున్నారు.ఈ హోమ పూర్ణాహుతిని మధ్యాహ్నం స్వామీజీ నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు జగద్గురువులు శ్రీ చక్రార్చన ప్రత్యేక పూజను నిర్వహించి భక్తుల కోరిక మేరకు అనుగ్రహ భాషణం చేస్తారు. రెండు తెలుగు రాష్ట్రాల నుండి భక్తులు వరంగల్‌కు తరలి రానున్నారు. ఈ సందర్భంగా భక్తులందరికి అన్న ప్రసాద వితరణ ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఏర్పాట్లను ఆశ్రమ ట్రస్టు శాఖ పూర్తి చేసింది.

- వరంగల్ కల్చరల్

దేవాలయాలకు దానం విశేష ఫలదాయకం



సనాతన ధర్మంలో దానానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. రకరకాల దానాలు వాటికి ఫలితాలు కూడా పురాణాలలో ఉన్నాయి. ధర్మకార్యాలకు దానం చేయాలని చాలా మంది భావిస్తుంటారు. ఆలయ నిర్మాణం కూడా ధర్మ కార్యం కిందకే వస్తుంది కనుక కొందరు కొత్తగా ఆలయాలు నిర్మిస్తుంటే దానికి ఆర్థికసాయం చేయడం పరిపాటి. అలాగే రకరకాలుగా ధ్వజస్తంభం ఒకరు, మకర తోరణం మరొకరు బయట మండప నిర్మాణానికి ఇంకొకరు సాయం చేయడం కూడా కనిపిస్తుంటుంది. అయితే దేవాలయానికి ఎటువంటి దానం చేస్తే ఎటువంటి పుణ్య ఫలం లభిస్తుందో విష్ణు ధర్మోత్తర పురాణంలో ఉందని పెద్దలు చెబుతారు. మన ఆలయాలలో దేవునికి పవిత్రంగా అర్చనాదులు చేయడం కని పిస్తుందిగాని ఆలయాలు శుభ్రంగా ఉంచడంలో కొంత అశ్రద్ధ కనిపిస్తుంటుంది. ఆలయ గోడలకు వెల వేయించడం, ప్రాంగణాన్ని శుభ్రం చేసి ముగ్గులతో అలంకరించడం వంటివి చేస్తే విష్ణులోక ప్రాప్తి వంటివి లభిస్తాయని పురాణాలు చెబుతున్నాయి. ఆలయాలకు వివిధ వస్తువులు దానం చేయడం వల్ల వేర్వేరు ఫలితాలు ఉన్నాయి.

ఏ దానం వల్ల ఏ ఫలం

* శంఖ దానం వల్ల విష్ణులోక ప్రాప్తి
* గంట దానం చేస్తే గొప్ప కీర్తి
* గజ్జలను, మువ్వలను ఇస్తే సౌభాగ్యం
* ఆలయం ప్రాంగణంలో పందిళ్ళు నిర్మిస్తే కీర్తి. ధర్మబుద్ధి కలగటానికి దోహదం.
* పతాకాలను ఇస్తే సకలపాపాల నుండి విముక్తుడై వాయులోకాన్ని పొందుతాడు. (పతాకాలు గాలిలో ఎగురుతాయి కనుక ఆ లోకానికి వెళతారు). ఆ పతాకాల వల్ల ఆలయానికి ఎంత శోభ వస్తుందో అంత కీర్తిని పొందుతారు.
* ఆలయంలో వేదికను నిర్మించి ఇచ్చినవాడు భూస్వామి అవుతాడు.
* కుండను ఇచ్చినవాడు వరుణలోకాన్ని పొందుతాడు (కుండలు నీటికి ఆవాసాలు అవుతాయి కనుక వరుణ లోకాన్ని పొందుతాడు). నాలుగు కలశాలను దానం ఇచ్చినవాడు సుఖాన్ని అనుభవిస్తాడు.
* కమండలాన్ని దానం చేస్తే గోదాన ఫలితం
* వట్టివేళ్ళతో తయారు చేసిన చాపలు వంటివి ఇస్తే సర్వపాపాలు నశిస్తాయి.
* ఆలయంలో గోవులను మేపటానికి గోపాలకుడిని ఇస్తే పాప విముక్తి
* దేవుడికి ఆసనాన్ని సమకూరిస్తే సర్వత్రా ఉత్తమ స్థానం (దేవునికి ఇచ్చే ఆసనం మనకు ఉన్న స్థానాన్ని ఇస్తుంది)
* పాదపీఠ దానం ఉత్తమగతికి దారితీస్తుంది
* ధ్వజ సమర్పణంతో కీర్తికి అవకాశం
* దేవుడికి ముఖానికి అలంకరించే సుగంధ ద్రవ్యాలను ఇస్తే ఉత్తమరూపం పొందుతాడు.
* దర్పణం (అద్దం) దానం కూడా మంచి రూపం లభిస్తుంది.
* చిన్న చిన్న పాత్రలను ఇస్తే యజ్ఞం చేసినంత ఫలం
* ధాన్యం, సస్యాలు, బీజాలు, బంగారం, వెండి, ఇతర లోహాలు ఇస్తే పుణ్య ఫలితాన్ని పొందుతారు. వెండి మంచి రూపానికి కూడా కారణమవుతుంది.
* బంగారం వల్ల సర్వకామ్య సిద్ధి.
* పాడి ఆవును ఇస్తే గోలోకప్రాప్తి.



దినఫలాలు

మేష రాశి: ఆర్థిక లావాదేవీలు అనుకూలం. దూరప్రయాణాలు, విద్యా ప్రయత్నాలు అనుకూలం. మంచికార్యాలలో పేరు, ప్రఖ్యాతులు లభిస్తాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ప్రభుత్వ వ్యవహారాల్లో వ్యతిరేకత ఉంటుంది. ఆదాయమార్గాలు సులభతరమవుతాయి.

వృషభ రాశి: ఆర్థిక ప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విక్రయాలు వంటివి ఉపకరిస్తాయి. విద్యా విషయాల్లో ప్రాధాన్యత లభిస్తుంది. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ పనికిరాదు. ఆర్థిక విషయాల్లో విస్మయాలు ఉంటాయి. ఆదాయ వృద్ధిలో ఆటంకాలు కొనసాగుతాయి.

మిథున రాశి: సాహస నిర్ణయాలు ఊరట కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాలలో ఉపశమనం ఉంటుంది. ఆర్థిక వ్యవహారాల్లో అనుకూలత ఉంటుంది. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. పనులలో వేగం పెరుగుతుంది. ఆదాయంలో గట్టి ప్రయత్నాలు లాభిస్తాయి.

కర్కాటక రాశి: విదేశీ లావాదేవీలు కలసి వస్తాయి. శుభవార్తలు వింటారు. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. శత్రుభీతి పోతుంది. మానసిక ధైర్యం పెరుగుతుంది. ఆదాయమార్గాలు అనుకూలం.

సింహ రాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. ఆర్థిక క్రమశిక్షణ తప్పనిసరి. పెట్టుబడుల ప్రతిబంధకాలు ప్రబలమవుతాయి. ఆరోగ్యం అనుకూలత పెరుగుతుంది. వ్యాపార మోసాలను గ్రహించలేకపోతారు. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి: ఆధ్యాత్మిక కార్యాలు, కార్యక్రమాలు లాభిస్తాయి. ఆహ్లాద పరిస్థితులు గృహరీత్యా ఉంటాయి. వ్యాపార విజయాలు కొనసాగుతాయి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు పరిష్కరింపబడతాయి. ఆదాయ మార్గాలు సులభతర మవుతాయి.

తులా రాశి: విదేశీ లావాదేవీలు/సంభాషణలు కలసి వస్తాయి. కోర్టు వ్యవహారాలు లాభిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి. మెరుగైన పరిస్థితులు ఆరోగ్య రీత్యా ఆనందాన్ని కలిగిస్తాయి. అతి తొందర ద్వారా కార్యక్రమాల్లో పొరపాట్లు దొర్లుతాయి. ఆదాయంలో మంచి లాభాలను కూడగట్టుకొనే ప్రయత్నాలు అనుకూలిస్తాయి.


వృశ్చిక రాశి: స్థిరాస్తి కొనుగోళ్లు అనుకూలం. ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. ప్రయాణాలు, ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటించాలి. అసహన పరిస్థితులు వ్యాపార పరంగా ఉంటాయి. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన స్నేహాల ద్వారా లబ్ధి చేకూరుతుంది. వ్యాపార ప్రతిబంధకాలను ఎదుర్కోగలుగుతారు. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. గతంలోని తప్పులు సరిదిద్దుకొనే అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.


మకర రాశి: విదేశీ సంభాషణలు ఉపకరిస్తాయి.. కోర్టు వ్యవహారాలు ఊరట కలిగిస్తాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు తప్పని సరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. బాధ్యతలు పెరుగుతాయి. ఆదాయం గట్టి ప్రయత్నాలతో మాత్రమే సాధ్యం.

కుంభ రాశి: నూతన వాహన కొనుగోళ్లు వంటివి ఆనందాన్ని కలిగిస్తాయి. విద్యా ప్రయత్నాలు లాభిస్తాయి. శుభవార్తలు వింటారు. ఆకస్మిక వ్యయం లేకపోలేదు. ఆరోగ్య విషయంలో ప్రతికూలత ఉంటుంది. ప్రత్యర్థుల ద్వారా చిరు సమస్యలు ఉంటాయి. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు మాత్రం ఆనందాన్ని కలిగిస్తాయి.

మీన రాశి: రుణ ప్రయత్నాలు, వాహన కొనుగోళ్ళు లాభిస్తాయి. కోర్టు వ్యవహారాల్లో ఉపశమనం ఉంటుంది. ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. ఆరోగ్య రీత్యా శ్రద్ధ పాటించాలి. ముఖ్యమైన పనుల విషయంలో ఏకాగ్రత తప్పనిసరి. ఆదాయంలో జాగ్రత్తతో కూడిన నిర్ణయాలు ఉపకరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com



భగవద్గీత

శుభ సమయంలో శరీరం విడిస్తే పరబ్రహ్మ ప్రాప్తి

అధ్యాయం 8
శ్లోకం 24

అగ్నిర్జ్యోతిరహః శుక్లః
షణ్మాసా ఉత్తరాయణమ్।
తత్ర ప్రయాతా గచ్ఛంతి
బ్రహ్మ బ్రహ్మవిదో జనాః॥

తాత్పర్యం

పరబ్రహ్మమునెరిగిన బ్రహ్మవిదులు అగ్ని దేవుని ప్రభావమునందు, కాంతి యందు, పగటి యందలి ఏదేని శుభఘడియ యందు, శుక్లపక్షము నందు లేక సూర్యుడు ఉత్తరంగా ప్రయాణించు ఉత్తరాయణ పుణ్యకాలము నందు ఈ జగమును వీడుట ద్వారా ఆ పరబ్రహ్మాన్ని పొందుతారు.

భాష్యం

ఎప్పుడైతే అగ్ని, జ్యోతి, పగలు, పక్షము అని చెప్పబడినవో అవి వాటిని నిర్వహించు దేవతలను సూచిస్తాయి. ఆ దేవతలు, జీవుడు ఒక దేహమును వదలి మరొక ప్రదేశమునకు ప్రయాణించు ఏర్పాట్లను చేస్తారు. సహజంగా మృత్యు సమయంలో ఆ వ్యక్తి యొక్క మనస్సు నూతన గమ్యానికి తీసుకొనిపోతుంది. సిద్ధిని సాధించిన యోగి, కాలాన్ని, ప్రదేశాన్ని నిర్ధారించుకోగలడు గాని, అంత పరిణితి చెందని యోగి అకస్మాత్తుగా శరీరాన్ని వదలివేయవచ్చును. ఆ సమయం పైన చెప్పబడినదైతే తిరిగి ఈ ప్రపంచానికి రాడు. లేనిపక్షంలో మరలా ఇక్కడ జన్మించాల్సి ఉంటుంది. కాబట్టి పైన చెప్పబడిన పరిస్థితుల్లో సహజ సిద్ధంగానైనా లేక ఏర్పాటు ప్రకారమైనా శరీరాన్ని చాలించినట్లయితే నిరాకార బ్రహ్మజ్యోతిని చేరుకుంటాడు. అయితే శుద్ధభక్తుడికి ఇటువంటి భయాలు ఉండవు. అతడు ఏ సమయములో ఏ ప్రదేశములో శరీరాన్ని వదలినా తిరిగి ఇక్కడకు వచ్చే ప్రసక్తే లేదు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యథాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

కులాసా

చేయి, పాదం, నోటి వ్యాధి (హెచ్‌ఎఫ్‌ఎండి) అంటే ఏమిటి?

చేయి, పాదం, నోటి వ్యాధి పిల్లల్లో సర్వసాధారణంగా కనిపిస్తుంది. ఇది అంటు వ్యాధి అని చెప్పొచ్చు. దీని లక్షణాల్లో జ్వరం, నోటిలో నొప్పితో కూడిన పుండ్లు ఏర్పడతాయి. చేతుల మీద బొబ్బలు, దద్దుర్లు ఏర్పడతాయి. పిరుదుల మీద కూడా ఇవి కనబడతాయి. ఇవి అంటువ్యాధుల్లో ఎక్కువగా కనిపించే వ్యాధి. అదే జంతువుల్లో పాదం, నోటి వ్యాధితో పోలిస్తే తేడా కనిపిస్తుంది.

ఈ వ్యాధి రావడానికి కారణాలు?

ఈ వ్యాధి రావడానికి కాక్ససాకివైరస్ ఎ 16 అని చెప్పొచ్చు. సాధారణంగా కొన్ని అవలక్షణాలు కనిపిస్తాయి. అయినప్పటికీ హెచ్‌ఎఫ్‌ఎండి రావడానికి ఎంటరో వైరస్‌లతో బాటు ఎంటరో వైరస్ 71 (ఈవీ71) కారణంగా నిలిచింది. తీవ్ర దుష్పరిణామాలు కలగడమే కాకుండా ప్రాణాంతకం కూడా.

హెచ్‌ఎఫ్‌ఎండి ఎంతవరకు ప్రమాదకరం?

చాలామంది ఈ వ్యాధి వల్ల అనారోగ్యానికి గురయినప్పటికీ పూర్తిగా కోలుకోవచ్చు.

- ☆ హెచ్‌ఎఫ్‌ఎండి స్వల్పకాలికమైన వ్యాధి. దాదాపు అందరు రోగులు ఏడు నుంచి 10 రోజులలోపు ఎలాంటి వైద్య చికిత్స లేకుండానే కోలుకోవచ్చు. హెచ్‌ఎఫ్‌ఎండి ఇన్‌ఫెక్షన్ వల్ల డీహైడ్రేషన్ ఎక్కువగా కనిపిస్తుంది. నోటిలో ఉండే పుళ్లు వల్ల ద్రవపదార్థాలను కూడా పరిమితంగానే తీసుకోవాల్సి వస్తుంది.
- ☆ హెచ్‌ఎఫ్‌ఎండి కారణం వల్ల ఈవీ71 వల్ల మెనింజైటిస్(మేథో మజ్జా వ్యాధి), ఎన్‌సెఫలిటీస్ (మెదడువాపు వ్యాధి), వంటి దద్దుర్లు కనిపిస్తాయి. పిరుదులు, మర్మాంగాల మీద కూడా కనిపిస్తుంటాయి.
- ☆ హెచ్‌ఎఫ్‌ఎండి ఉన్న వ్యక్తికి పెద్దగా లక్షణాలు కనిపించవు. చర్మం మీద దద్దుర్లు ఏర్పడతాయి. నోటి పుండ్లు ఏర్పడతాయి.
- ☆ కొన్ని కేసుల్లో మాత్రం పిల్లలు కొద్దిగా అనారోగ్యానికి గురవుతారు. నరాల సంబంధిత వ్యాధులకు గురవుతుంటారు. శ్వాసకోశ సమస్యలు ఏర్పడతాయి.

హెచ్‌ఎఫ్‌ఎండి ఎలా సంక్రమిస్తుంది?

హెచ్‌ఎఫ్‌ఎండి అనేది ఒకరి నుంచి ఇంకొకరికి సంక్రమిస్తుంది. ముక్కు ,గొంతు నుంచి స్రావాలు కారుతున్న వ్యక్తిని తాకినప్పుడు, లాలాజలం, బొబ్బల నుంచి వస్తున్న సొన (ద్రావాల)వల్ల ఇది వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకిన వ్యక్తి మలం ద్వారా కూడా వ్యాధి వ్యాపిస్తుంది. ఈ వ్యాధికి ప్రభావితం చెందిన వ్యక్తి మొదటి వారం అనారోగ్యానికి గురయినప్పుడు మాత్రం ఎక్కువగా వ్యాపిస్తుంది.

హెచ్‌ఎఫ్‌ఎండి అనేది పెంపుడు జంతువుల నుంచి లేదా ఇతర జంతువుల నుంచి సంక్రమించదు.

హెచ్‌ఎఫ్‌ఎండి వల్ల ఎవరికి ముప్పువాటిల్లుతుంది?

ఇంతకుమునుపు ఈ వ్యాధి సోకిన ప్రతీ ఒక్కరికి ఇన్‌ఫెక్షన్ ముప్పు పొంచి ఉంది. అయితే వ్యాధి వచ్చిన ప్రతీ వ్యక్తి ఇన్‌ఫెక్షన్ సోకుతుంది అన్న నియమావళిలేదు.

పిల్లలు ఎక్కువగా ఈ ఇన్‌ఫెక్షన్ వల్ల అనారోగ్యానికి గురవుతారు. పెద్దల్లో తక్కువగా వస్తుంది. ఎందుకంటే పెద్దల్లో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుంది. కౌమారదశలో, పెద్దల్లో ఈ వ్యాధి సోకే అవకాశాలు తక్కువగా ఉన్నాయి.



చికిత్స, వ్యాక్సిన్లు లేని వ్యాధి

పిల్లల్లో వ్యాపించే హెచ్‌ఎఫ్‌ఎండి



అవలక్షణాలు వాటిల్లుతాయి. నరాలు, హృదయ, శ్వాస సంబంధిత వ్యాధులు కూడా కలుగుతాయి. ఈవీ71 ఎన్‌సెఫలిటీస్ ప్రాణాంతకం కావచ్చు.

ఈ వ్యాధి వచ్చిన తర్వాత ఎటువంటి లక్షణాలు కనిపిస్తాయి?

- ☆ సాధారణంగా ఇన్‌ఫెక్షన్ వచ్చిన తర్వాత మూడు నుంచి ఏడు రోజులలోపు లక్షణాలు కనిపిస్తాయి.
- ☆ ఈ వ్యాధి ఆరంభంలో జ్వరం 24 గంటల నుంచి 48 గంటల వరకు ఉయుంది.

ఎటువంటి లక్షణాలు కనిపిస్తాయి?

ఈ వ్యాధి వచ్చిన తర్వాత జ్వరం, ఆకలి మందగించడం, ఆయాసం, గొంతులో మంట ఉంటుంది.

- ☆ ఒకటి రెండు రోజులపాటు జ్వరం వచ్చిన తర్వాత నోటిలో నొప్పితో కూడుకున్న పుళ్లు ఎక్కువవుతాయి. ప్రారంభంలో ఎర్రని మచ్చలు కనిపిస్తాయి. అవి కూడా బొబ్బల మాదిరిగా కనిపిస్తాయి. తర్వాతి దశలో అల్సర్‌లుగా మారతాయి. అవి ఎక్కువగా నాలుక, చిగుళ్లు, దవడలోపలి భాగాల మీద కనిపిస్తాయి.
- ☆ దురదలేని చర్మ దద్దుర్లు మాత్రం ఒకరోజునుంచి రెండురోజుల వరకు వృద్ధి చెందుతాయి. ఇవి ఎర్రగా ఉంటాయి. కొన్ని బొబ్బలు కడతాయి. అరచేతుల మీద ఈ

హెచ్‌ఎఫ్‌ఎండి ఒక వైరస్ కుటే ఎక్కువ వైరస్‌ల వల్ల కలుగుతుందా?

అవును ఒకరకం ప్రత్యేక వైరస్ వల్ల ఈ వ్యాధి సంక్రమిస్తుంది. తర్వాతి దశల్లో మాత్రం వేర్వేరు రకాల వైరస్‌లు దాడి చేస్తుంటాయి.

గర్భిణీ మహిళ పరిస్థితి ఏమిటి?

గర్భిణీ మహిళ హెచ్‌ఎఫ్‌ఎండి ఉన్న ఏ వ్యక్తితో దగ్గరి సంబంధాలు పెట్టుకోకూడదు. ఎంటరోవైరస్ ఇన్‌ఫెక్షన్స్ వల్ల గర్భిణీ మహిళ తరచుగా హెచ్‌ఎఫ్‌ఎండికి గురయ్యే అవకాశం ఉంది. మెటర్నల్ ఎంటరోవైరస్ ఇన్‌ఫెక్షన్ వల్ల గర్భస్రావాలు, పుట్టుకలోపాలు కలగవచ్చు. గర్భంలోనే శిశువు మరణించవచ్చు. గర్భిణీగా ఉన్న సమయంలో ఈ వైరస్ సోకితే మాత్రం పుట్టబోయే బిడ్డకు కూడా ఈ వైరస్ సోకే ప్రమాదముంది. ఫలితంగా ప్రసవ సమయంలో ఇలాంటి వైపరీత్యాలు కలుగుతాయి.

హెచ్‌ఎఫ్‌ఎండికి ఏ విధంగా చికిత్స చేయాలి?

ప్రస్తుతానికి హెచ్‌ఎఫ్ ఎండికి ప్రత్యేక చికిత్స అందుబాటులో లేదు. రోగులు ఎక్కువమోతాదులో మంచినీటిని త్రాగాలి. జ్వరం, పుండ్లు తగ్గడానికి చికిత్స తీసుకోవాలి.

హెచ్‌ఎఫ్‌ఎండిని నిరోధించవచ్చా?


హెచ్‌ఎఫ్‌ఎండి రావడానికి నాన్ పోలియో ఎంటరోవైరస్లు కారణాలుగా నిలిచాయి. వీటిని నిరోధించడానికి వాక్సిన్లు అందుబాటులో లేవు. మంచి ఆహారపుఅలవాట్ల వల్ల, సరైన మందుల వాడకం వల్ల ఈ వ్యాధి ముప్పు నుంచి తప్పించుకోవచ్చు.

తీసుకోవాల్సిన చర్యలు

- ☆ సబ్బుద్వారా చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. ఈ పుండ్లు, బొబ్బలు తాకిన తర్వాత సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. వంట చేసే ముందు, భోజనం చేసే ముందు కూడా కడుక్కోవాలి. పిల్లలకు తినిపించేముందు కూడా ఈ అలవాటు మంచిది. విసర్జన తర్వాత కాళ్లు, చేతులను శుభ్రంగా కడుక్కోవాలి.
- ☆ కలుషితమైన వస్తువులను శుభ్రం చేయాలి. పిల్లలు ఆడుకునే బొమ్మలు పరిశుభ్రంగా ఉండాలి. సబ్బునీటితో శుభ్రంగా కడుక్కోవాలి. డైలూట్ సొలూషన్ అయిన క్లోరిన్ కంటేయినింగ్ బ్లీచ్ ద్వారా శుభ్రం చేయాలి.
- ☆ దగ్గరి సంబంధాలకు (చుంబనం, ఆలింగనం) దూరంగా ఉండాలి.
- ☆ ఆరు సంవత్సరాలలోపు పిల్లలకు ఉద్దేశించిన కిండర్‌గార్డెన్ పాఠశాలలో అనారోగ్యానికి గురయిన పిల్లలను పంపించకూడదు. పూర్తిగా ఆరోగ్యం కుదుటపడిన తర్వాతే వారినికిండర్‌గార్డెన్ పాఠశాలకు పంపించాలి.
- ☆ అనారోగ్యానికి గురయిన పిల్లల ఆరోగ్యానికి వైద్యపరంగా దృష్టిసారించాలి. జ్వరం ఎక్కువగా ఉంటే మాత్రం జాగ్రత్తగా ఉండాలి.
- ☆ తుమ్ములు, దగ్గే సమయంలో ముక్కుకి, నోటికి అడ్డంగా చేతిరుమాలు పెట్టుకోవాలి.
- ☆ టిష్యూపేపర్లను వేస్ట్ బిన్‌లో వేసి మూసివేయాలి. దీనివల్ల ఈ వైరస్ ప్రబలదు.
- ☆ ఇళ్లు శుభ్రంగా పెట్టుకోవాలి. పిల్లల సంరక్షణా కేంద్రాలు, కిండర్ గార్డెన్ పాఠశాలలు కూడా శుభ్రంగా ఉంటేనే ఈ వ్యాధి ప్రబలదు.



డాక్టర్ శ్రీకాంత్ కోనా
కన్సల్టెంట్ నియోనాటొలాజిస్ట్ అండ్ పీడియాట్రిషియన్ , కాంటినెంటల్ హాస్పిటల్స్



జన్యులోపం వల్లే డౌన్ సిండ్రోమ్

ఈనెల 21న ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినోత్సవం

డౌన్ సిండ్రోమ్ అనేది చాలా సాధారణమైనటువంటి సమస్య. ఎంతోమంది ఈ సమస్యతో బాధపడుతున్నారు. చాలామందికి ఈ డౌన్ సిండ్రోమ్ అంటే ఏమిటో తెలియదు. డౌన్ సిండ్రోమ్ అంటే జన్యుపరమైన సమస్యల వలన వస్తుంటాయి. ఇది పిల్లల్లో మానసిక వికాస లోపాలను కలుగజేసేటువంటి అంశం. డౌన్ సిండ్రోమ్ వున్న పిల్లల్లో అనేక లక్షణాలు ఉంటాయి. ఇది జన్యుపరమైన కారణాల వలన కలుగుతుంటుంది. ఆలస్య గర్భధారణ వలన ఈ డౌన్ సిండ్రోమ్ అనేది చాలా ఎక్కువ. డౌన్ సిండ్రోమ్ అరికట్టే మార్గం ఏమిటి అంటే సరైన వయస్సులో వివాహం చేసుకోవాలి. పిల్లల కోసం తగినటువంటి సమయంలో ప్లాన్ చేసుకోవాలి. చాలా మంది తమ వృత్తిలో స్థిరపడిన తర్వాత ప్రెగ్నెన్సీ అనేది ప్లాన్ చేసుకుంటూ ఉంటారు. అలాంటి వాళ్లు శిశు జననాల్లో ఈ డౌన్ సిండ్రోమ్ అనేది ఎక్కువగా వస్తుంటుంది. 35 సంవత్సరాలు దాటిన తర్వాత వివాహం చేసుకునే వారికి పుట్టే పిల్లలకి జన్యుపరమైనటువంటి ఇతర లోపాలు కూడా తలెత్తే అవకాశాలు చాలా వరకు వున్నాయి.



లక్షణాలు

కండరాలు వదులుగా ఉంటాయి. కళ్లు పైపైపు ఉండటం, చప్పిడి, ముక్కు, చెవులు క్రిందకి ఉంటాయి. అరిచేతులకి, అరికాళ్లకి గీతలు తక్కువగా ఉంటాయి. ఎముకల సంబంధిత వ్యాధులు,థైరాయిడ్ సమస్యలు, నోరు చిన్నగా, నాలుక పెద్దగా వుంటుంది. చేతులు, కాళ్లు పొట్టిగా లావుగా ఉంటాయి. పుట్టుకతోనే గుండె సంబంధిత వ్యాధులు, వినికిడి లోపం వుంటుంది. అలాగే ఈ పిల్లల్లో తెలివితేటలు తక్కువ. నడక, మాటలు చాలా ఆలస్యంగా వస్తాయి. కంటిలోపాలు, రోగనిరోధక శక్తి సమస్యలు వస్తుంటాయి.

నివారణ

తగిన వయసులోనే గర్భం దాల్చడం అనేది ఇక్కడ చాలా ముఖ్యం. గర్భవతులు తగిన పరీక్షలు చేయించుకుంటూ జాగ్రత్తగా ఉండాలి.

ఆయుర్వేద చికిత్స విధానం

రోగ నిరోధక శక్తి పెంచేందుకు స్వర్ణ ప్రశం చికిత్సలు చేయాలి. ప్రత్యేకంగా పంచకర్మ చికిత్సలు, రసాయన చికిత్సలు వుంటాయి. ఇలాగ డౌన్ సిండ్రోమ్‌తో బాధపడే వాళ్లు ముందుగా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ అలాగే ఆయుర్వేద చికిత్సలు తీసుకుంటే సమస్య తీవ్రతను తగ్గించే అవకాశం ఉంది.



డాక్టర్ జి. క్రాంతికుమార్
కేరళ ఆయుర్వేద పంచకర్మ సెంటర్
హైదరాబాద్
సెల్ : 9494675168

హార్ట్ ఫెయిల్యూర్ నివారించాలంటే...

హార్ట్ ఫెయిల్యూర్ ఉన్నవారు రోగనిరోధకశక్తిపెంచుకోవడం చాలా అవసరం. పీచుపదార్థం బాడీఫ్యాట్‌ని, బ్లడ్ ఫ్యాట్‌ని నార్మల్‌గా ఉంచడానికి ఉపయోగపడుతుంది. తొక్క ఉన్న గింజలు ఉదా: శెనగలు, రాజ్మా, అలసందలు, బొబ్బర్లు, పెసలు మొదలైనవాటిలో పీచు పదార్థం సమృద్ధిగా ఉంటుంది. కాబట్టి వాటిని కూరల్లో కలిపి తినాలి. అలాగే కాయగూరలు, పళ్లలో కూడా పీచుపదార్థం అధికం. రోజుకు రెండు కప్పుల కాయగూరలు, రెండు కప్పుల పళ్లు తప్పనిసరిగా తీసుకోవాలి. పళ్లు, కాయగూరలు పీచుపదార్థం ఇవ్వడమే కాకుండా ఆరోగ్యాన్ని బాగు చేసే యాంటాక్సైడ్‌ని ఇస్తాయి. రోజుకు ఐదు గ్రాముల ఉప్పుకంటే ఎక్కువ వాడకూడదు. ఒక టీస్పూన్ ఉప్పులో 2300 మిల్లీగ్రాముల సోడియం ఉంటుంది. ఇది నార్మల్‌గా అందరూ వాడవచ్చు. హార్ట్ ఫెయిల్యూర్ ఉన్నవారు ముప్పావు టీస్పూన్ (1725 మిల్లీగ్రాములు) ఉప్పువాడితే మంచిది. హార్ట్ ఫెయిల్యూర్ తీవ్రతను బట్టి ఉప్పు తగ్గించాలి. పొటాషియం ఎక్కువగా ఉన్న ఉప్పు మార్కెట్‌లో దొరుకుతుంది. అది వాడటం మంచిది. సోడియంని పొటాషియం బ్యాలెన్స్ చేస్తుంటుంది. కాబట్టి పొటాషియం అధికంగా ఉన్న పళ్లు, కూరగాయలు ఆహారంలో ఎక్కువ తీసుకోవాలి. ఆకుకూరలు, దానిమ్మ, నిమ్మకాయల్లో పొటాషియం సమృద్ధిగా ఉంటుంది. భోజనంలో నిమ్మరసం పిండు కుంటే రుచితో పాటు సోడియంని బ్యాలెన్స్ చేస్తుంది.

అధికంగా ఉప్పు ఆహారంలో చేరకుండా ఉండాలంటే భోజనంలో ఉప్పు చల్లుకోవడం మానేయాలి. ఇడ్లీ, దోసె చపాతీ పిండిలలో ఉప్పు కలపడం మానేయాలి. నిలువ పచ్చళ్లకు దూరంగా ఉండాలి. బేకరిఫుడ్స్‌లో సోడియం ఇతర రసాయనాలు ఉపయోగిస్తారు. అందుకే వాటిని కూడా దూరం పెట్టాలి. బయటి ఆహారం, సాఫ్ట్‌డ్రింక్స్, నిల్వ ఉండే పదార్థాలు బాగా తగ్గించాలి.

రోజు కి 8 కప్పులు లేక 2 లీటర్ల నీల్లు తాగాలి. మందులు వేసుకునేందుకు తాగే నీళ్లు కూడా లెక్కలోకి వస్తాయి. కొందరికి డాక్టర్ ఫ్లూయిడ్ రిక్విస్ట్ చేస్తారు. అటువంటివారు కొలత ప్రకారంగా నీళ్లు తాగాలి.

ఆహారంలో ఎప్పుడూ ఒకే రకం పదార్థాలు కాకుండా వేరు వేరు పదార్థాలు తినాలి. పళ్లు, కాయగూరలు సీజన్లో దొరికేవి తప్పక తీసుకోవాలి. మితంగా, సులువుగా జీర్ణమయ్యేలా టైం ప్రకారం ఆహారం తీసుకోవాలి. తొక్కతో ఉన్న ముప్పావు కప్పు గింజలు మూ డు సమభాగాలుగా చేసి ఒక్కొక్క భాగాన్ని ఒక్కో పూట తీసుకోవాలి. నట్స్, సీడ్స్ రోజు కి ఒక గుప్పెడు తినొచ్చు. వీటిని స్నాక్స్‌లా తీసుకుంటే మంచిది. పంచదార 4 టీస్పూన్‌ల కంటే ఎక్కువ తీసుకోకూడదు. నూనె కూడా 4 టీస్పూన్లు వాడాలి.

చేపలు వారానికి రెండుసార్లు తింటే మంచిది. శాఖాహారులు సోయా తీసు కోవాలి. రోజుకి ఒక గుడ్డు (పచ్చసొనతో పాటు) తీసుకోవచ్చు. మద్యం ఇతర మత్తు పదార్థాలు తీసు కోవడం పూర్తిగా మానేయాలి. ఎనర్జీ డ్రింక్స్ జోలికి వెళ్లొ ద్దు. వ్యాయామం చాలా అవసరం. అయితే ఇది కూడా క్రమపద్ధతిలో, ఎంత అవసరమో అంతే చేయాలి.

రైస్ బ్రాన్ ఆరోగ్య ప్రయోజనాలు

మంచి రుచి కలిగిన ఆహారం ఆరోగ్యవంతమైన రైస్ బ్రాన్ ఆయిల్ అనేది గుండె ఆరోగ్యానికి విన్నూత్నమైన మార్గం. శాఖాహార నూనె, యాంటి ఆక్సిడెంట్లు అధికంగా కలిగిన ఈ నూనెను పట్టించుకునే వారెవరు? మంచి వంటనూనె కేవలం సాధారణ ఆహారానికి రుచిని అందించడమే కాదు మీ గుండె ఆరోగ్యపరంగా అత్యంత కీలకమైన పాత్రను పోషిస్తుంది. మీ కొలస్ట్రాల్ స్థాయిలో గణనీయమైన మార్పులను వంటనూనె తీసుకువస్తుంది. మీ జీర్ణప్రక్రియపై ప్రభావం చూపుతుంది. ఈ కారణం చేతనే మార్కెట్‌లో అందుబాటులో ఉన్న వంటనూనెలలో అత్యుత్తమ వంటనూనె ఎంచుకోవడం తప్పనిసరి. రైస్ పాలిషింగ్ ప్రాసెస్‌లో ఊక నుంచి తయారు చేస్తారు. అంతర్జాతీయంగా చేసిన అధ్యయనాల్లో ఈ ఆయిల్‌లో కొలెస్ట్రాల్ తగ్గించే గుణాలు ఉన్నాయని నిరూపితమయ్యింది. దీనిలో ఉన్న ఒరిజినాల్, టోకోఫెరాల్, టోకోట్రినాల్స్, స్క్వాలేన్ వల్లనే ఇది సాధ్యమవుతుంది. ఫిజికల్‌గా రిఫైన్ చేసిన రైస్ బ్రాయిల్ సాధారణంగా గోల్డెన్ ఎల్లో రంగుల్లో ఉంటుంది. దీనిని స్టీమ్ డిస్టిలేషన్ విధానంలో రిఫైన్డ్ చేస్తారు. దీనివల్ల పోషకాలన్నీ నిలిచి ఉంటాయి. ఈ నూనెలో 1000 ప్లస్ పీపీఎం ఒరిజినాల్ ఉంది. ఇది చెడు కొలస్ట్రాల్ (ఎల్‌డిఎల్) తగ్గించడంతో పాటుగా మంచి కొలెస్ట్రాల్(హెచ్‌డిఎల్) సరైన ప్రమాణాలలో ఉంచి ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది.

యుఎస్‌ఏకి చెందిన డాక్టర్ షాలిని పీ రెడ్డి మాట్లాడుతూ '' వంటనూనెల విభాగంలో సరికొత్త ప్రవేశం రైస్ బ్రాన్‌ఆయిల్. వాస్తవానికి పూర్తిగా ఆరోగ్యవంతమైంది. ఇందుకు ఎన్నో కారణాలున్నాయి.

సమతుల్యమైన రీతిలో పాలీ అన్‌శాచురేటెడ్ ఫాట్స్, మోనో అన్‌శాచురేటెడ్ ఫాట్స్‌ను అందిస్తుంది. సాధారణంగా వంటనూనెలో పాలి అన్‌శాచురేటెడ్ ఫాట్స్ అధికంగా ఉంటుంది. ఇప్పుడు పాలీ అన్‌శాచురేటెడ్ మోనో అన్‌శాచురేటెడ్ ఫాట్స్ నడుమ సమతుల్యత సృష్టించడం కోసం చూస్తున్నారు. రైస్ బ్రాన్ ఆయిల్‌ను అమెరికన్ హార్ట్ అసోసియేషన్, ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫారసు చేస్తున్నాయి. దీనిలో ఎంయుఎఫ్ఏ, పీయుఎఫ్ఏల ఆదర్శనిష్పత్తి ఉండటం వల్ల ఇది గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది.

ఫ్రీడం రైస్ బ్రాన్ ఆయిల్ సేల్స్, మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ పి. చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ నేడు వినియోగదారులు చాలా స్మార్ట్‌గా ఆలోచిస్తున్నారు. అందువల్లనే వారు పీయుఎఫ్ఏ, మోనో అన్‌శాచురేటెడ్ ఫాట్స్ రైస్ బ్రాన్ ఆయిల్ యొక్క ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. అన్ని బ్రాండెడ్ రైస్ బ్రాన్ ఆయిల్స్‌లో ఒకే తరహా ఒరిజనాల్ ఉండకపోవచ్చు. ఫ్రీడం ఫిజికల్లీ రిఫైన్డ్ రైస్ బ్రాన్ ఆయిల్‌లో సరిఅయిన ప్రమాణాల్లో ఒరిజినాల్ అంటే 10000 పీపీఎం కలిగి ఉంది. ఈ కారణం చేతనే ఫ్రీడం రైస్ బ్రాన్ ఆయిల్ అమ్మకాలు వేగంగా వృద్ధి చెందుతున్నాయి అని అన్నారు.





మే 18 టాక్సీవాలా వస్తాడు

విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తున్న చిత్రం టాక్సీవాలా. జిఏ2 మరియు యువీ పిక్చర్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఎస్‌కెఎన్ నిర్మాత. రాహుల్ సంకృత్యాన్ దర్శకుడుగా పరిచయం అవుతున్నారు. విజయ్ సినిమా అంటే ప్రేక్షకుల్లో ఉండే అంచనాలకు తగినట్టుగా టాక్సీవాలా సినిమా ఉంటుంది. ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. మే 18న ఈ చిత్రాన్ని విడుదల చేస్తారు. మార్చి 23న మొదటి లుక్ విడుదల చేస్తారు.

నిర్మాత మాట్లాడుతూ విజయ్ దేవరకొండకు ఉన్న క్రేజ్, పాపులారిటీని దృష్టిలో పెట్టుకుని ఈ కథని దర్శకుడు తయారుచేశారు. దానికి తగినట్టుగానే అన్ని వర్గాలకు వినోదం అందించేలా ఉంటుంది. విజయ్ మేనరిజమ్స్, బాడీ లాంగ్వేజ్ ఆకట్టుకుంటుంది మే 18న టాక్సీవాలా ప్రేక్షకుల ముందుకువస్తాడు అని తెలిపారు.

విజయ్ దేవరకొండ, ప్రియాంక జువాల్కర్, మాళవికా నాయర్, కల్యాణి, మధునందన్, రవిప్రకాష్, రవివర్మ, ఉత్తేజ్ ఇతర తారాగణం. సంగీతం జేక్స్ బిజాయ్, ఛాయాగ్రహణం సుజిత్ సారంగ్, స్క్రీన్‌ప్లే, మాటలు సాయికుమార్ రెడ్డి.



కీర్తి సురేష్



అంజలి

నీది నాది ఒకే కథ చిత్రం సహజత్వానికి చాలా దగ్గరగా రూపొందింది. ఇందులో నన్ను చూస్తే...అధికశాతం కుర్రాళ్లు వాళ్లను వాళ్లు చూసుకున్నట్లుగా అనిపిస్తుంది అని హీరో శ్రీవిష్ణు పేర్కొన్నారు. శ్రీవిష్ణు, సాట్నాటైటస్ (బిచ్చగాడు ఫేమ్) నాయకానాయికలుగా వేణు ఊడుగుల దర్శకత్వంలో అరాన్

నన్ను చూస్తే... వాళ్లను వాళ్లు చూసుకున్నట్లే

- శ్రీవిష్ణు



మీడియా వర్క్స్, శ్రీ వైష్ణవి క్రియేషన్స్ పతాకాలపై రూపుదిద్దుకున్న ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా శ్రీవిష్ణు సోమవారం హైదరాబాద్‌లోని పాత్రికేయులతో కొద్దిసేపు ముచ్చటించారు.

విద్యార్థి పాత్ర

ఈ చిత్రంలో విద్యార్థి పాత్రను పోషించాను. చదువు సరిగా వంటపట్టని కుర్రాడి జీవితంలో చదువు పూర్తయిన తర్వాత నుంచి అతను స్థిరపడేవరకు ఏం జరిగింది? అన్న ఇతివృత్తంతో సాగే చిత్రమిది. హీరో పాత్రతో పాటు తండ్రి పాత్ర కూడా చిత్రంలో ఎంతో ముఖ్యమైంది. దర్శకుడు దేవీప్రసాద్‌గారు ఆ పాత్రను పోషించారు. నా పాత్ర నేటితరం కుర్రాళ్లకు దగ్గరగా ఉంటే..తండ్రి పాత్రకు పెద్దవాళ్లు కనెక్ట్ అవుతారు. ఇక వ్యక్తిగతంగా కమర్షియల్ సినిమాలు కాకుండా విభిన్నమైన కథాచిత్రాలు చేయాలన్నదే నా కోరిక. అధికభాగం అలాంటి చిత్రాలకే మొగ్గుచూపుతాను.

ఆ టెక్నిక్‌తో తీసిన తొలి సినిమా

ఈ చిత్రం కోసం డోగ్మే 1995 టెక్నిక్ (సాంకేతికత)ను ఉపయోగించడం జరిగింది. పెద్ద పెద్ద సెట్స్, రకరకాల సామగ్రి లాంటివి వాడకుండా చాలా తక్కువలో తీసేందుకు ఈ టెక్నిక్ వల్ల వీలవుతుంది. తెలుగులో ఆ టెక్నిక్‌తో తీసిన తొలి సినిమా ఇదే.

ఆలస్యానికి కారణం అదీ

ఒకటిన్నర సంవత్సరం క్రితమే సినిమాను మొదలుపెట్టాం. మధ్యలో మెంటల్ మదిలో పనుల్లో బిజీగా ఉండటం వల్ల కొంత ఆలస్యమైంది.

తదుపరి సినిమాలు

ప్రస్తుతం వీరభోగ వసంతరాయలు సినిమా చేస్తున్నాను. దాని తర్వాత అసుర దర్శకుడితో తిప్పరా మీసం చిత్రం చేయబోతున్నాను. అటుపిమ్మట నూతన దర్శకుడితో పోలీస్ కథాచిత్రం చేస్తాను అంటూ ముగించారు.

మహానటి అందించే వినోదం

నటి సావిత్రి జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రం మహానటి. వైజయంతీ మూవీస్, స్వప్న సినిమా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సావిత్రి పాత్రలో కీర్తి సురేష్ నటిస్తోంది. నాగ్ అశ్విన్ దర్శకుడు. ప్రయాంక దత్ నిర్మాత. ఈ చిత్రం పోస్ట్‌ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. మే 9న ఈ సినిమాను విడుదల చేయడానికి ప్లాన్ చేశారు. ఈ విషయాన్ని నిర్మాత వెల్లడించారు. 1990 మే 9న వైజయంతీ మూవీస్ నిర్మించిన జగదేక వీరుడు అతిలోక సుందరి చిత్రం విడుదలైంది. సరిగ్గా అదే తేదీన మహానటి విడుదలకు ప్లాన్ చేశారు. తెలుగు చిత్ర ప్రముఖులు కీలక పాత్రల్లో కనిపిస్తున్న సావిత్రి చిత్రం తెలుగు ప్రేక్షకులకు ఇదివరకు చూడని వినోదాన్ని పంచివ్వనుంది. మహానటి కథని వెండితెరపై దర్శకుడు ఆవిష్కరించిన తీరు ఆకట్టుకుంటుందని చిత్రబృందం తెలిపింది.

ఈ చిత్రానికి సంగీతం మిక్కీ జె.మేయర్, ఛాయాగ్రహణం ధని, ఆర్ట్ తోట తరణి.

గ్యాప్ తర్వాత మళ్లీ

తెలుగమ్మాయి అంజలికి తెలుగు సినీరంగంలో ఎట్టకేలకు ఓ అవకాశం లభించింది. చిత్రాంగద చిత్రం తర్వాత తెలుగులో ఆమెకు సినిమాలు లేకుండా పోయాయి. గీతాంజలి చిత్రం కోవలో హారర్ థ్రిల్లర్‌గా ఆమె ప్రధాన పాత్రలో తెరకెక్కిన చిత్రాంగద చిత్రం అనుకున్నంతగా ఆడలేదు. ఆ తర్వాత తెలుగులో సినిమాలు సన్నగిల్లడంతో ఆమె తమిళ సినీరంగంపై దృష్టి నిలిపింది. అక్కడ ఏడాదికి సరాసరి నాలుగైదు చిత్రాలు చేస్తూ కెరీర్‌ను నెట్టుకొస్తోంది. ప్రస్తుతం పెరంబు, కాళి, నాడోడిగళ్-2 వంటి తమిళ సినిమాలు ఆమె చేతిలో ఉన్నాయని తెలిసింది. ఓ వైపు తమిళ సినిమాలు చేస్తున్నప్పటికీ తెలుగులో ఎప్పుడు అవకాశాలొచ్చినా చేసేందుకు ఆమె సంసిద్ధంగా ఉందట. ఈ నేపథ్యంలో కాస్త ఆలస్యంగానైనా తెలుగులో ఆమెకు అవకాశం లభించినట్లు సమాచారం. గతంలో వచ్చిన గీతాంజలి విజయం సాధించిన నేపథ్యంలో దానికి కొనసాగింపు (సీక్వెల్)ను నిర్మించేందుకు ఆ చిత్ర నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నట్లు పరిశ్రమలో వినిపిస్తోంది. ఈ సీక్వెల్‌లోని టైటిల్ పాత్రకు అంజలిని సంప్రదించగా, ఆమె అంగీకరించినట్లు తెలిసింది. అయితే దర్శకుడు, మిగతా టీమ్‌కు సంబంధించిన వివరాలు తెలియరాలేదు. ఈ చిత్రానికి సంబంధించిన స్క్రిప్ట్ సిద్ధమైందని, ఏప్రిల్‌లో చిత్రం సెట్స్‌పైకి వస్తుందని అంటున్నారు. దీంతో అంజలి టాలీవుడ్‌ను మళ్లీ ఆకట్టుకుని, మరికొన్ని అవకాశాలను చేజిక్కించుకుంటుందేమో వేచిచూడాలి.

బృందావనమది అందరిది



హర్షవర్ధన్ రానె, రిచా పణయ్

రచయిత శ్రీధర్ సీపాన దర్శకత్వం వహిస్తున్న చిత్రం బందావనమిది అందరిది. జస్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ క్రియేషన్స్ పతాకంపై శ్రీనివాస్ వంగల, ప్రభాకర రెడ్డి కూతురు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం తొలి షెడ్యూల్ పూర్తిచేసుకుంది. ఈ సందర్భంగా మేకింగ్ వీడియో విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ వైజాగ్ సాగరతీరంలో వేసిన హీరోయిన్ ఇంటి సెట్‌లో సన్నివేశాలు, ఆ పరిసర ప్రాంతాల్లో రిచా పణయ్, హర్షవర్ధన్ రానే, శివప్రసాద్, హీరా పాహిలి, బెనర్జీ, తాగుబోతు రమేష్‌లపై కీలకసన్నివేశాలు చిత్రీకరించాం. దర్శకత్వం చేయడం ఇదే ప్రథమం అయినప్పటికీ ఎలాంటి ఇబ్బంది లేదు. అందరూ సహకరిస్తున్నారు. తొలి షెడ్యూల్ మేకింగ్ వీడియో టీజర్ విడదల చేశాం. మంచి స్పందన వచ్చింది అని చెప్పారు.

రిచా పణయ్, హర్షవర్ధన్ రానే, లగడపాటి విక్రమ్, పృథ్వీ, శివప్రసాద్, హీరా సాహిలి, బెనర్జి, తాగుబోతు రమేష్, భద్రం, అదుర్స్ రఘు, బొడ్డ నారాయణ, సత్యం రాజేష్, రజిత తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం మణిశర్మ, ఛాయాగ్రహణం తమ్మ శ్యామ్, పాటలు సిరివెన్నెల.

ఫిలిం ఎడిటర్ అనిల్ మల్నాడ్ మృతి



సీనియర్ ఫిలిం ఎడిటర్ అనిల్ మల్నాడ్ (61) అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. 12 అక్టోబర్ 1957లో చిక్‌మగుళూర్‌లో జన్మించిన ఆయన దాదాపు 200 సినిమాలకు ఎడిటర్‌గా పనిచేశారు. అందులో అనేక విజయవంతమైన చిత్రాలతో పాటు చక్కటి కథాంశంతో ప్రేక్షకులను అలరించిన చిత్రాలు అధికంగా ఉన్నాయి. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, బెంగాలీ, ఒరియా, ఇంగ్లీష్ వంటి తొమ్మిది భాషల చిత్రాలకు ఆయన ఎడిటర్‌గా పనిచేశారు. అనిల్ అసలు పేరు జి.ఆర్.దత్తాత్రేయ. సులువుగా ఉండటం కోసం అనిల్ దత్ అని పిలిచేవారు. ఆయన పుట్టిన ప్రాంతం మల్నాడు కావడంతో దానిని కలుపుకుని అనిల్ మల్నాడ్ పేరుతో స్థిరపడ్డారు.తెలుగులో అప్పట్లో బాపు, వంశీ దర్శకత్వంలో రూపొందిన పలు చిత్రాలకు ఎడిటర్‌గా అనిల్ మల్నాడ్ తనదైన పనితనం చూపారు. మనవూరి పాండవులు, తూర్పువెళ్లే రైలు, వంశవృక్షం, సితార, అన్వేషణ, ఆలాపన వంటి చిత్రాలకు ఆయన ఎడిటింగ్‌తో రూపుదిద్దుకున్నవే. ముఖ్యంగా వంశీ దర్శకత్వంలో భానుప్రియ, సుమన్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన సితార చిత్రానికి ఉత్తమ ఎడిటర్‌గా జాతీయ అవార్డును ఆయన అందుకున్నారు. వృత్తిపట్ల అంకితభావం మెండుగా కలిగిన ఆయన తాను వివిధ భాషలలో సినిమాలు చేయడానికి కారణం చదువుకునే రోజుల్లోనే కన్నడ, తుళు, కొంకిణి, తమిళం, తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషలు నేర్చుకోవడమేనని కొన్ని సందర్భాలలో ఆయన చెప్పేవారు. నేర్చుకున్న విద్య వృథాగా పోదని పెద్దలు చెప్పినట్లుగా అన్ని భాషలు తెలిసి ఉండటం వృత్తిపరంగా నాకెంతగానో కలిసొచ్చిందని ఆయన అంటుండేవారు. బాపు దగ్గర ఒక్క సినిమాకు పనిచేసినా ఆస్కార్ అవార్డు వచ్చినట్లే అని అనిల్ మనసువిప్పి చెప్పేవారు.

ఎవరికైనా ఒకటే లైఫ్

సూపర్‌గుడ్ ఫిలింస్ అధినేత ఆర్.బి.చౌదరి తనయుడు జితన్ రమేష్ హీరోగా రూపొందుతున్న చిత్రం ఒకటే లైఫ్. లార్డ్ వెంకటేశ్వర ఫిలింస్ పతాకంపై నారాయణ్ రామ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి హ్యాండిల్ విత్ కేర్ అనేది ఉప శీర్షిక. ఎం.వెంకట్ దర్శకుడు. శృతి యుగల్ నాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో సుమన్ ప్రధాన పాత్రలో నటించున్నారు. విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్ మరియు మోషన్ పోస్టర్‌ను యువనటుడు జీవా సూపర్‌గుడ్ ఫిలింస్ కార్యాలయంలో విడుదల చేశారు.

ఈ సందర్భంగా జీవా మాట్లాడుతూ ఒకటే లైఫ్ మోషన్ పోస్టర్ చాలా ఆసక్తికరంగా ఉంది. సరికొత్త కథాకథనాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది అన్నారు.

దర్శకుడు వెంకట్ మాట్లాడుతూ టెక్నాలజీ పేరుతో పరుగులెడుతున్న నేటి తరం మానవ సంబంధాలకు ప్రాధాన్యత ఇవ్వాలనే అంశంతో ఈ చిత్రాన్ని తీయడం జరిగింది. జితన్ రమేష్ హీరోగా నటిస్తున్నారు. మంచి సినిమా చూశామన్న సంతృప్తి ప్రేక్షకులకు మా సినిమా కలిగిస్తుందని అన్నారు. నిర్మాత మాట్లాడుతూ ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. టీమ్ అందరికీ మంచి పేరు తెచ్చే సినిమా అవుతుంది అన్నారు. ఇతర పాత్రల్లో నల్ల వేణు, రామ్, బాబీ, రిషి, శ్యామ్, దిశ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం అమ్రీష్, ఛాయాగ్రహణం వై.గిరి, రచన సతీష్ బండోజి.



దెయ్యం చెప్పిన కథేంటి



శివ, సుప్రియ

శివ, సుప్రియ, సురేష్ జెండా, సునీల్, పద్మ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం దెయ్యం చెప్పిన కథ. బేబీ చైత్ర సమర్పణలో ఆరాధ్య ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ప్రదీప్ రాజ్ దర్శకత్వం వహించారు. పెనాక దయాకర్ రెడ్డి నిర్మాత. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న దెయ్యం చెప్పిన కథ చిత్రం త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది.

ఈ సందర్భంగా హైదరాబాద్ ఫిలింఛాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులు సినిమా విశేషాలు తెలిపారు. నిర్మాత పెనాక దయాకర్ రెడ్డి మాట్లాడుతూ..ఇప్పటిదాకా వచ్చిన హారర్ చిత్రాలకు భిన్నంగా దెయ్యం చెపి్పన కథ సినిమా ఉంటుంది. మూస ధోరణిలో కాకుండా కొత్త కథనంతో ప్రయత్నించాం. నటీనటులతో కాకుండా కేవలం కథా ప్రభావంతోనే సినిమా సాగుతుంది. ఈ చిత్రం ద్వారా దాదాపు 29 మంది కొత్త నటీనటులను తెరకు పరిచయం చేస్తున్నాం. అన్నారు.

ఈ చిత్రానికి సంగీతం - నవీన్, సాహిత్యం - ప్రదీప్, ఎడిటింగ్ - క్షేత్ర క్రియేటివ్ వర్క్, స్టంట్స్ - దాసరి రాజు